# విషయ సూచిక

# మన మాట

# తెలుగు కళా సమితి - తెలుగుజ్యోతి

- డా. వైదేహీ శశిధర్

"ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం" అని మహాకవి శ్రీశ్రీ పెదవి విరిచినా, మన మనుగడ. వ్యక్తిత్వ వికాసం, సంస్కృతి అన్నిటినీ మించి ఐడింటిటీ మన చరిత్ర తోనే ముడిబడి ఉంది. తిలక్ అన్నట్లు "నిరంతర పరిణామ పరిణాహ జగత్కటాహంలో" మనది అని చెప్పుకోగలిగేది బహుశా మన చరిత్రే నేమో! తెలుగు కళాసమితి, మన తెలుగు జ్యోతి పాతికేళ్ళ ప్రాయంలోకి అడుగిడిన ఈ సందర్భంలో కొద్దిగా తెలుగు కళాసమితి గురించి తెలుసుకుందాం.

**ఆవిర్భావం**

1984లో న్యూజెర్సీ నాన్ ప్రాఫిట్ ఏక్ట్ క్రింద తెలుగుకళా సమితి సంస్థగా ఏర్పడింది.

**ప్రధాన ఆశయాలు**

1. ఆంధ్రప్రదేశ్‌లో ఎనభైమిలియన్ల ప్రజలు మాట్లాడే మన తెలుగు భాషని, మన తెలుగు భాషలోని సాహిత్యాన్ని పెంచి, ప్రోత్సాహించి, పోషించటం.

2. తెలుగువారి కళలని, సాంస్కృతిక కార్యక్రమాలని ప్రోత్సహించటం.

3. అమెరికా, ఇతర దేశాల మధ్య సాంస్కృతిక రాయబారుల ద్వారా వారధులు కట్టి రాబోయే తరాలలో కూడా తెలుగు సంస్కృతిని పరిరక్షించి పరివ్యాప్తం చేయటం.

**కార్యవర్గం**

ఈ ఆశయాల్ని సాధించటానికి మన తెలుగు కళా సమితి సభ్యులు ప్రతి రెండు సంవత్సరాలకు తొమ్మిది మంది ట్రస్టీలను ఎన్నుకుంటారు. ఈట్రస్టీలు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారితో పాటు 5 గురు కమిటి నిర్వాహకులని కూడా ఎన్నుకుంటారు. ఈ కార్యవర్గ సంఘం సమితి వ్యవహారాలకి సంబంధించిన కీలకమైన నిర్ణయాలు చేస్తారు. ఈ పాతిక సంవత్సరాలు గా తెలుగు కళా సమితికి తమ సేవలందించిన అధ్యక్షులకు ఇతర కార్యవర్గ సభ్యులకు మా కృతజ్ఞతాభినందనలు!

ఆశయాలు, ఆశలు ఎప్పుడూ పగడాలపూతలతో అందంగా ఉన్నంతగానే ఉంటాయి. ఈ ఆశయాల్ని సాధించటంలో తెలుగు కళాసమితి విజయం పొందిందా అన్నదే ఈప్రశ్న. అయితే, ఈ ఆశయసాధన వైపు మన ప్రయాణం నిరంతరమైనది. కొంతవరకూ దీనిలో విజయం సాధించామనే చెప్పవచ్చు. మన తెలుగు కళాసమితి సభ్యులు ఎంతోమంది విరామమెరుగక పరిశ్రమించే (కార్మికవీరులు కాదు ) ప్రొఫెషనల్స్ వారివారి వృత్తులలో బాధ్యతాయుతమైన స్థానాలలో ఉంటూ ఇటు సంఘానికి, అటు కుటుంబానికీ నిబద్ధత కలవారు. అయినప్పటికీ తెలుగు కళాసమితిలో కార్యవర్గ సభ్యులుగ, స్వచ్ఛంద సేవకులుగా, ఔత్సాహిక సభ్యులుగా ఎంతో ఆసక్తితో పనిచేస్తున్నవారు.కార్యక్రమాల ప్రణాళిక, నిర్వాహణ, ప్రచారం మొదలైన పనులలో పాల్గొనటమే కాకుండా, తెలుగు జ్యోతికి తమ సృజనాత్మక, నిర్మాణాత్మక సహాయాన్ని అందించటం వంటి ఎన్నో విధులను సంతోషంగా చేస్తున్నవారు.

అయితే, తెలుగు కళా సమితి నిజమైన విజయం సభ్యుల నిబద్ధత లోనే కాక మన పిల్లలు, ముందు తరాలు ఈ ద్వారా ఏమి నేర్చుకుంటున్నారు అన్న విషయంలో దాగిఉంది. మన పిల్లలు మన సాంస్కృతిక రాయబారులై పాఠశాలలలో, విశ్వవిద్యాలయాల్లో మన సాంస్కృతిక కార్యక్రమాలని చురుకుగా నిర్వహించటం, మన సంస్కృతి తదితర విషయాల గురించి తెలుగు జ్యోతి తదితర పత్రికలో వ్యాసాలు రాయటం చేస్తున్నారు. మన పద్ధతులని అర్ధంచేసుకొని, గౌరవించి మన సంప్రదాయ రీతులలో వివాహాలు చేసుకుంటున్నారు. ఇండియా వెళ్ళినపుడు అందరితో కలిసి ఆనందంగా మన దేశాన్ని సంస్కృతిని ఆదరించ గలుగుతున్నారు. నిరూపించలేని విషయమైనప్పటికీ, మన రెండవ తరం పిల్లలలో ఈ అవగాహన మన తెలుగు సంఘం తోటీ, తెలుగు కళా సమితితో మన ఇన్వాల్వ్‌మెంట్ తోటీ ముడివడి ఉందనడానికి సందేహం లేదు.

**తెలుగు కళా సమితి కార్యక్రమాలు**

**సాంఘిక కార్యక్రమాలు**

1. ప్రతి సంవత్సరం ఆగస్టులో తెలుగు కళాసమితి ఫామిలీ పిక్నిక్ నిర్వహిస్తుంది. సాధారణంగా పచ్చని పార్కులలో అందరూ కలిసి ఇష్టాగోష్టి జరపటం, ఆటపాటలతో పాటు తోటి తెలుగువార్ని కలుసుకునే చక్కని అవకాశం.

2. సంవత్సరానికి ఒకటి రెండు సార్లు కొత్త తెలుగు వారితో పరిచయం పేరున ఒక గెట్ టు గెదర్ ఏర్పాటు చేయటం జరిగింది. ఇటువంటి చోట సాహిత్యం, సాంస్కృతిక రంగాలలో అభినివేశం ఉన్న కొత్త సభ్యులను కలిసే అవకాశం తెలుగు కళా సమితికి మన తెలుగు కమ్యూనిటికీ కూడా చాలా మంచిది.

3. తెలుగు జ్యోతిలో పెళ్ళిపందిరి అనే కాలం ద్వారా తమ వివరాలను ఆసక్తి ఉన్నవారు ప్రకటించుకునే అవకాశం ఉంది.

4. ఇండియా నుంచి వచ్చే ప్రముఖ వ్యక్తుల్ని, కళ, సాహిత్యం, సైన్స్, సమాజసేవ, విద్య మొదలైన వివిధ రంగాలలో నిష్ణాతుల్ని, గౌరవించటం తెలుగు కళాసమితి ప్రధాన సంప్రదాయాలలో ఒకటి. ఇప్పటి వరకూ వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి తెలుగు కళా సమితి ఇచ్చిన పురస్కారాలు అవార్డుల పట్టిక మరొక పేజీలో చూడవచ్చు.

5. కమ్యూనిటీకి గొప్పసేవ చేసిన వ్యక్తుల్ని కూడా తెలుగు కళా సమితి గుర్తించి గౌరవిస్తుంది.

6. సునామీ విపత్తు సంభవించినపుడు చురుకుగా విరాళాలు ప్రోగుచేసి సునామీ సహాయ నిధికి అందజేయటం, హెల్ప్ ఫౌండేషన్ ద్వారా అనాథ బాలుల సహాయం, అమెరికా వచ్చి ప్రాణాపాయాలకు లోనైన విద్యార్థులకు, వారి కుటుంబాలకు సహాయం చేయటం వంటి సాంఘిక కార్యక్రమాలలో తెలుగు కళా సమితి పాల్గొనటం జరిగింది.

**సాహిత్య కార్యక్రమాలు**

**1.తెలుగుజ్యోతి**

తెలుగుజ్యోతి తెలుగు కళాసమితి ముద్దుబిడ్డ. ప్రతి రెండు నెలలకీ ప్రచురింపబడి అమెరికా, కెనడా, ఇండియాలో సభ్యులకి అందచేయబడే సారస్వత పత్రిక. ఈ పత్రిక సభ్యులకి తెలుగు కళాసమితి కార్యవర్గ సంఘానికీ మధ్య సమాచార వారధి కూడా. తెలుగు జ్యోతి సంస్థాపక సంపాదకులు స్వర్గీయ శ్రీ కిడాంబి రఘునాథ్. ఆయనకు జ్యోతి పట్ల ఉన్న అంకిత భావం, నిర్వాహణా సామర్థ్యం శ్లాఘనీయం. ఎన్నో సంవత్సరాలు తెలుగు జ్యోతిని నిరాటంకంగా నడిపి ప్రవాసాంధ్రుల, నివాసాంధ్రుల రచనల్ని, మన్ననలని, మెప్పుని విశేషంగా పొందారు. ఆయన ఆధ్వర్యంలో ఈ పత్రిక 1991 లో కంప్యూటరైజ్డ్ తెలుగు స్క్రిప్ట్‌తో మరింత అందంగా రూపుదిద్దుకుంది. తెలుగుజ్యోతిలో యూత్ సెక్షన్ కూడా 1993-94 మధ్యలో పెట్టడం జరిగింది. వీరి ఆధ్వర్యంలోనే 100వ సంచిక 1992లో వెలువడింది. అందర్నీ విషాదంలో ముంచిన కిడాంబిగారి ఆకస్మిక మరణం తర్వాత 2003 నవంబర్ నుంచి భావరాజు మూర్తి గారు ప్రధాన సంపాదక బాధ్యతలు స్వీకరించి, కథల విభాగానికి శ్యామలదేవి దశిక, వ్యాసాలకు కాశీనాథుని రాధ, కవితల విభాగానికి డా.వైదేహీ శశిధర్, సాంకేతిక విభాగానికి అనంత సుధాకర్ గార్లతో కొత్త సంపాదక వర్గాన్ని 2004లో ఏర్పాటు చేసారు.

ఈ సంపాదక వర్గం 2004 నుంచీ ఇప్పటివరకూ తెలుగు జ్యోతిని మీ సహాయ సహకారాలతో వెలిగిస్తూ ఉన్నారు.తెలుగుజ్యోతి రచయితలను ప్రోత్సాహించటానికి వివిధ పోటీలు గతంలోనూ, ప్రస్తుత సంచికలోనూ పెట్టడం జరిగింది. ఈ పోటీలకు అవసరమైన నిధులు సహృదయులైన సభ్యుల విరాళాలే. ప్రవాసాంధ్రుల జీవితాల్ని ప్రతిబింబించే కవితలకు, వ్యాసాలకే కాదు, కలలకు, ఆశయాలకు, ఆలోచనలకు కూడా వేదికగా ఉండాలని తెలుగుజ్యోతి ఆకాంక్ష. మరల యూత్ సెక్షన్ ప్రారంభించి మన భావితరాల వాళ్ళ ఆలోచనలకు వేదికగా కూడా తెలుగుజ్యోతిని పునర్నిర్మించాలని మా కోరిక. దాని సాఫల్యం మీ చేతుల్లో, మనందరి చేతుల్లో ఉంది. తెలుగుజ్యోతి పై నిర్మాణాత్మక విమర్శలు, మీ సూచనలు, మా కార్యక్రమాల నిర్వహణ పై మీ అభిప్రాయాలు అందజేయండి.

**2. సాహితీ సదస్సు**

చాలా సంవత్సరాలుగా (1996) తెలుగు కళా సమితి రచయిత, కవి శ్రీ వేమూరి రామనాథం గారి నిర్వహణ లో సుమారు రెండు నెలలకొకసారి చక్కని సాహితీ సదస్సులు నిర్వహించటం జరిగింది. ఇటువంటి సదస్సులకి వచ్చిన సాహితీ మిత్రులందరికి సహృదయం తో ఆతిథ్యం ఇచ్చిన ఔత్సాహిక సభ్యులు ఎందరో! కొన్నాళ్ళుగా అంతతరచుగా ఈ సదస్సులు జరగక పోవటం సభ్యులందరూ ఆలోచించ వలసిన విషయం మరలా న్యూజెర్సీలో సాహితీ వెన్నెలలు కురిపించాల్సిన బాధ్యత మనందరిదీ.

**సాంస్కృతిక కార్యక్రమాలు**

**1.ఉగాదిఉత్సవాలు**

ప్రతి సంవత్సరం తెలుగుకళాసమితి, వసంతాన్ని తన వెంటబెట్టుకువచ్చే ఉగాది ఉత్సవాలను ఏప్రిల్ నెలలో

జరుపుకుంటుంది. స్థానిక కళాకారులు సమర్పించే వీనులవిందైన పాటకచ్చేరీలు, నాటకాలు, ప్రత్యేక అతిథుల సన్మానం ఉగాది కార్యక్రమాల్లో భాగాలు. అంతేకాదు, ప్రతిరెండు సంవత్సరాలకొకమారు సభ్యులు ఎన్నుకునే నూతన కార్యవర్గం ఉగాది ఉత్సవాలలోనే మొదటిసారిగా వారి బాధ్యతలు స్వీకరిస్తారు.

**౨.దీపావళి ఉత్సవాలు**

ప్రతి సంవత్సరం తెలుగు కళా సమితి, దేదీప్య మానమైన దీపావళి సంబరాలని నవంబర్ నెలలో కన్నుల పండువగా జరుపుకుంటుంది. ఇండియా నుంచి వచ్చిన స్థానికంగా ఉన్న నృత్య, నాట్య కళాకారుల రూపకాలు, ప్రత్యేక అతిథులను ఆహ్వానించి సన్మానం చేయటం, లలిత సంగీత విభావరి, నాటకాలు దీపావళి కార్యక్రమంలో భాగాలు.

**౩.సంక్రాంతి సంబరాలు**

ప్రతి సంవత్సరం తెలుగు కళా సమితి, న్యూజెర్సీని గడగడ వణికించే శీతాకాలంలో సంక్రాంతిసంబరాలను జనవరి నెలలో జరుపుకుంటుంది. ముచ్చటైన బొమ్మల కొలువులనీ, బాల గంధర్వులనీ, కూచిపూడి వారి సత్యభామలనీ, అలరుల కురియగ నాడె కుందనపు బొమ్మలనీ, కమ్మని తెలుగులో గేయాలు, పద్యాలు గడగడ చదివే అల్లరి పిడుగుల్నీ, రకరకాల కళా రూపాలలో రంగవల్లులు దిద్దే మనచిన్నారులని చూసి మీరందరూ ఆనందించటానికి సంక్రాంతి పండుగని పూర్తిగా పిల్లలూ, యూత్ పాల్గొనే కార్యక్రమాలుగా చెయ్యటం తెలుగు కళాసమితి ఆనవాయితీ, ప్రత్యేకత.

**4.త్రిమూర్తి డే**

వాగ్గేయకారులైన త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తు స్వామి దీక్షితార్‌లను స్మరించుకుంటూ పిల్లలు, పెద్దలు, సంగీతకారులూ కలిసి తమ సంగీతపుష్పాంజలులతో ప్రతిసంవత్సరమూ మార్చిలో త్రిమూర్తిడే జరుపుకుంటారు. అంతమంది సంగీతకారులు ఒకచోట చేరి తదాత్మ్యంతో వారి గానామృతాన్ని శ్రోతలకు అందించటం గొప్ప అనుభవం

ఇదీ స్థూలంగా తెలుగు కళాసమితి కథ, చరిత్ర. ఆ చరిత్ర పుటలని అందమైన జ్ఞాపకాల పుష్పగుచ్ఛంగా ఈ సందర్భంలో మీ కందివ్వాలని మా కోరిక.

తెలుగు కళా సమితి గురించిన మరిన్ని వివరాలు అంతర్జాలంపై tfasnj.org వద్ద చూడవచ్చు.

మరొక ముఖ్యమైన విషయం, మన సంస్కృతి మీద, భాష మీద అభిమానాన్ని ,గౌరవాన్ని పెంచటం మా ఉద్దేశ్యం కానీ వేరే భాషలమీద, సంస్కృతి మీద చిన్న చూపుని విముఖత్వాన్ని పెంచటం కాదు.తెలుగు భాషని, వేషభాషలని, కట్టుబాట్లని మన ముందుతరాలకు పరిచయం చేసి వారిలో మన సంస్కృతి పైన సహజమైన మమకారాన్ని కలిగించటం మన లక్ష్యం అవ్వాలి కానీ నిరంధ శిక్షణ మన అభిమతం కాకూడదు. సంస్కృతి నిరంతరం మారుతూ ఉండే జీవ వాహిని. మన సంస్కృతిలోని మంచి విలువల్ని కాపాడు కోవటం,ఇతర సంస్కృతులలోని సుగుణాలని అలవరచు కోవటం మన ముందుతరాలకి మనందరం నేర్పవలసిన తియ్యని బాధ్యత. ఆ బాధ్యతని మనం నిర్వర్తించి గొప్ప విలువలని మన ముందుతరాలకి అందించినరోజు మన సంస్కృతి అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది.

తెలుగు కళాసమితి గురించి, తెలుగుజ్యోతి గురించి మౌలికమైన సమాచారాన్ని, ముఖ్య వివరాలను అందించటం ద్వారా ఈ వ్యాస రచనకు ఎంతగానో తోడ్పడిన శ్రీ భావరాజు మూర్తిగారికి గౌరవపూర్వక ధన్యవాదాలు.

(ఈ వ్యాసం సర్వధారి ప్రత్యేక సంచికలో మొదట ప్రచురితమైనా, తెలుగు కళాసమితి రజతోత్సవాలు పురస్కరించుకుని ఈ వ్యాసాన్ని పునఃప్రచురిస్తున్నాం.)

# 'తెలుగు జ్యోతి' ప్రగతి 1984-2009

- *భావరాజు భారతి*

జనవరి 1984 సంవత్సరములో తెలుగుకళా సమితి, తెలుగుజ్యోతి జంటగా పుట్టి, జంటగా పెరిగాయి. ఈ జంట 2009వ సంవత్సరములో రజతోత్సవము జరుపుకుంటున్నాయి. తెలుగుకళాసమితి సమావేశాలలో తెలుగుజ్యోతి గురించి మాట్లాడటము, తెలుగుజ్యోతిలో మన తెలుగుకళాసమితి వేడుకల గురించి రాయటము పరిపాటు. అమెరికా, కెనడా, ఇండియా, ఇంగ్లండ్, జర్మని, ఆస్ట్రేలియా దేశాలలో మన పత్రిక మన్ననలందుకుంది. 1984లో కొందరు ప్రవాసాంధ్రులు "తెలుగుకళా సమితి" స్థాపించి, శ్రీ జొన్నాడ రామకృష్ణ గారిని మొదటి అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. అదే సమయంలో "తెలుగుజ్యోతి" మాస పత్రికకు శ్రీ కిడాంబి రఘునాథ్ గారిని సంపాదకులుగా ఎన్నుకొన్నారు. శ్రీ రఘునాథ్‌గారి సంపాదకీయంలో తెలుగుజ్యోతి 100వ సంచిక ఏప్రిల్ 1992లో ప్రత్యేక సంచికగా వెలసింది. ఆసందర్భంలో, మరొక ఆకర్షణ తెలుగుజ్యోతి 100 ముఖచిత్రాల ప్రదర్శన.

యావజ్జీవ సంపాదుకులుగా శ్రీ రఘునాథ్‌గారు జనవరి 1984 నుండి అక్టోబర్ 2003 దాకా తెలుగుజ్యోతిని అత్యంత శ్రద్ధతో ప్రచురించారు. అక్టోబరు 25, 2003న శ్రీ రఘునాథ్‌గారి అకాల అస్తమయ వార్త తెలుగు వారందరికీ అత్యంత విషాద కరమయిన వార్త. తరువాత కొద్దిరోజులలోనే, నవంబర్ 2003 నుంచి శ్రీ భావరాజు (పరబ్రహ్మ మూర్తిగారు సంపాదకులుగా తెలుగుజ్యోతి ప్రచురణ బాధ్యతను తీసుకున్నారు.

జనవరి 1984లో మొదటి తెలుగు జ్యోతి సగం సైజ్ (5 1/2" X 8 1/2") లో రఘునాథ్‌గారి చేతి వ్రాతలో వెలువడింది. ఫిబ్రవరి నెలనుండి పూర్తి సైజ్ (8 1/2" X 11" ) లో ప్రచురించబడుతోంది. మాస పత్రికగా తెలుగుజ్యోతి జనవరి 1984 నుండి జూలై 1998 దాకా రఘునాథ్‌గారు సభ్యులందరికి అందించారు. ఆర్థిక ఇబ్బందులవల్ల ఆగస్ట్/సెప్టెంబర్ 1998 నుండి ద్వైమాస పత్రికగా మారింది తెలుగు జ్యోతి.

కథలు, పద్యాలు, గేయాలు, వ్యాసాలు, నాటకాలు, జోక్స్, కార్టునులు, మరెన్నో శీర్షికలు మాత్రమే కాకుండా తెలుగు కళా సమితి సభ్యులు వారికుటుంబ వార్తలు, సమితి కార్యక్రమాల ఆహ్వాన పత్రికలు, కార్యక్రమం జరిగాక సమీక్ష, ఇవన్నీ ప్రతి నెలా పాఠకులకి అందేవి పత్రిక ద్వారా. "మా మాట"లో కి.ర. ప్రతి నెల ముఖ్యాంశాలని పరిచయం చేసేవారు.

1984నుండి నవంబర్ 1991 దాకా తెలుగుజ్యోతి సంపాదకవర్గంతో బాటు, తంగిరాల లక్ష్మీనారాయణ, కె.వి.ర్.చారి, మహేష్ సలాది, గుత్తికొండ రవీంద్రనాథ్, అమ్మనమంచి రామమోహన్, భావరాజు పరబ్రహ్మమూర్తి మరెందరో కలంతో వ్రాసి పత్రిక ప్రచురించేవారు. ఇవేకాక కొన్ని ప్రత్యేక కథలు, జోక్స్, కార్టూన్స్ పునర్ముద్రితమయ్యేవి. ఇవి "ఆంధ్రజ్యోతి" సౌజన్యంతో, మన తెలుగుకళాసమితి ఆధ్వర్యంలో పోటీలలో గెలిచిన కథలు, జోక్స్, కార్టూన్స్. ఈవిధంగా ఇండియా రచనలు ప్రవాసాంధ్రులకి మన తెలుగు జ్యోతి ద్వారా చదివే అవకాశం కల్పించడమయింది.

జనవరి 1984లో చేతివ్రాతతో 16 పేజీలతో మొదలయిన మన తెలుగుజ్యోతి, ఆగస్ట్ 1989కి, 40 పేజీలుకి పెరిగి, నవంబర్ 1991లో కంప్యూటర్ యుగానికి మారడమే కాకుండా మరిన్ని మలుపులు తిరిగింది, ఎన్నో ఉల్లాసపరచే శీర్షికలతో మరింత మనోరంజకంగా తయారయింది.

**తెలుగుజ్యోతి ప్రత్యేక సంచికలు:**

**ఏప్రిల్ 1992** తెలుగుజ్యోతి **నూరవ సంచికగా** వెలువడింది. శ్రీకిడాంబి రఘునాథ్ గారి సంపాదకీయం లో 70పేజీల పత్రిక శ్రీబాపుగారు వేసిన ముఖచిత్రం తో పాటు, ప్రత్యేక వ్యాసాలు, కథలు, పద్యాలతో పలువురి శుభాకాంక్షలు, ప్రశంసలను అందుకుంది. మనం గర్వించదగ్గ పత్రికనిపించింది.

**నవంబర్ 1992** తెలుగుజ్యోతి **మహాకవి గురజాడ అప్పారావు** వర్ధంతి సందర్భములో ప్రత్యేక సంచికగా వచ్చింది. ఈ పత్రికలో యుగకర్త గురజాడ గురించి, వారి రచనల గురించి రాసిన వ్యాఖ్యలు, వ్యాసాలు చెప్పుకోదగ్గవి.

**జనవరి 1995** తెలుగుజ్యోతి 'ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఒక ఉజ్వల ప్రయోగమార్గాన్ని నడిపించిన చలం' అనే వాక్యంతో **శ్రీగుడిపాటి వెంకటచలం** స్కెచ్

అట్టమీద బొమ్మగా ఈ సంచిక ప్రచురించారు. సగం పత్రిక చలంగారి గురించి, వారి రచనలగురించిన వ్యాసాలతో నిండింది.

**అక్టోబర్ ౧౯౯౫** తెలుగుజ్యోతి **కీ.శే. అడవి బాపిరాజుగారి శతజయంతి** ప్రత్యేక సంచిక. శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావుగారు అడవి బాపిరాజుగారి గురించి, వారి రచనలు శశికళ, లచ్చిమి, కొన్ని గేయాలను చర్చించారు. బుధ్ధవరపు కామరాజుగారు, బాపిరాజుగారి మరికొన్ని రచనలే కాకుండా, వారి చిత్రకళని వర్ణించారు.

**ఫిబ్రవరి ౧౯౯౬** తెలుగుజ్యోతి వైణిక సార్వ భౌముడు **చిట్టిబాబు**కి అంకితమయింది. వారి అకాల మరణవార్త అంతకుముందే తెలిసింది. సంగీతమూర్తికి నివాళిగా ఈ సంచికలో కొన్ని రచనలున్నాయి.

**ఫిబ్రవరి - మార్చ్ ౨౦౦౧** తెలుగుజ్యోతి, పద్మశ్రీ గ్రహీత, **శ్రీ యస్. వి. రామారావుగారి**ని అభినందిస్తూ వెలువడిన ప్రత్యేక సంచిక. వీరి గురించి శ్రీమతి శారదాపూర్ణ శొంఠి "చిత్రశిల్పి - పద్మశ్రీ యస్.వి. రామారావు"అన్న వ్యాసంలో రామారావుగారిని ప్రముఖ చిత్రకళాకారుడుగానే కాకుండా గొప్ప రచయితగా కూడా శ్లాఘించారు.

**డిశెంబర్ ౨౦౦౩లో శ్రీ కిడాంబి రఘునాథ్‌గారి** స్మృతి చిహ్నంగా ప్రత్యేక సంచిక ప్రచురించారు తెలుగు కళాసమితి కార్యవర్గం. రఘునాథ్‌గారిని తలుచుకుంటూ మిత్రులు రాసిన వ్యాసాలు,మాటలు,ఫొటోలు, ఒక ప్రక్క సంతాపాన్ని వెలిబుచ్చుతున్నా, మరొకప్రక్క రఘునాథ్ గారి గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం.

**నవంబర్-డిశెంబర్ ౨౦౦౪** తెలుగుజ్యోతి మన తెలుగు కళాసమితి మొదటి అధ్యక్షులు, మన సమితి పురోగతికి శ్రమ పడిన **డా. జొన్నాడ రామకృష్ణగారికి** అంకితం చేశారు. వారి కుటుంబం, స్నేహితుల జ్ఞా పకాలు, ఫొటోలు ఈ సంచిక ప్రత్యేకత.

**ఏప్రిల్ ౨౦౦౮ "సర్వధారి" ఉగాదికి ప్రత్యేక తెలుగుజ్యోతి** సంచిక. ౧౨౨ పేజీల పత్రిక. **"ప్రేమ"** అనే శీర్షిక నిచ్చి, పద్యాలు, గేయాలు, వ్యాసాలు, కథలలో పోటీలు జరిపారు. పోటీలో నెగ్గిన రచనలతో ఎంతో మనోరంజకంగా తయారు చేశారు ఈ పత్రికని సంపాదకవర్గం. శ్రీబాపుగారి సత్యభామ-కృష్ణుల రంగు రంగుల బొమ్మతో సంచిక మరింత అందంగా తయారయింది.

**నవంబర్-డిశెంబర్ ౨౦౦౮** తెలుగుజ్యోతి "పద కవితాపితామహుడు"గా పేరు మోసిన **శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుని** ౬౦౦వ జన్మదిన సందర్భంగా ప్రత్యేక సంచిక. అన్నమయ్య చరిత్ర, సంకీర్తనల గురించిన వ్యాసాలు చదువగలరు.

**తెలుగు జ్యోతి ౧౯౮౪-౨౦౦౯ వరకు తరచు వచ్చిన శీర్షికలు:**

**ఈక్రింద పేర్కొన్నవారిలో కొందరు ఏ జాబితాలో ఉన్నా, ఇతర శీర్షికలలో (పద్యాలు, గేయాలు, వ్యాసాలు, కథలు) కూడా మనకు పరిచితులే.**

**In English:**

**20 Questions and Answers:** June 1984 - December 1998, K.V. Rao, Lakshmi Rao, Prabha Maruvada and Bharati Kalasapudi compiled 20 general knowledge questions with answers posted on a different page in the same issue.

**Health**: Venkateswara Rao Vemuri wrote a series of articles that had facts, concerns and advice for better health.

**Raja Lakshmi Foundation awards:** Telugu Jyoti covered the awards and the biographies of the award recipients.

**Matrimonial Service** for TFAS members and their families.

**Religion:** A series of articles on Hindu religion by Venkat Kanumalla.

**Financial advice:** By Dama Venkaiah with sound advise for financial stability.

**Youth:** Articles were written by, Ushasree Kidambi, Rajita Bhavaraju,Vasudha Bhavaraju, Sailaja Sastry, Anupama Kattoju, Lalitha Kattoju, Sagarika Koka, Vivek Angara to name a few...

**Word puzzles:** Anupama Kattoju

**Step in the Right Direction:** During April 1993 - October 1994 the center four pages of Telugu Jyoti in color were handled by the youth about their issues growing up in America.

**Food for Thought:** In 1997 Murty Bhavaraju wrote articles dealing with issues of our community.

**English Writers:** Bulusu Lakshman, Sai Sivananda Tunuguntla, Aruna Dasika, K. Markandeswara Rao, P.S.Rao, Siva Jonnada, Madhavi Bhavaraju to name a few...

**తెలుగుజ్యోతిలో కొంతకాలం ప్రతి సంచికలో వచ్చిన శీర్షికలు - రచయితలు** :

**సంగీతము**: రాణీ అంబారావు, ద్వారం వి.జె. లక్ష్మి తెలుగులో రాసిన వ్యాసాలు.

**వంటా-వార్పూ:** అలివేలుమంగాశాస్త్రి, బంగారు సరోజినీదేవి, సుబ్బలక్ష్మి, పరిణం లక్ష్మి ఎస్. రావు, కృష్ణవేణి పెంటా మొదలగువారు.

**గళ్ళనుడికట్టు:** బంగారు సరోజినిదేవి, బాబు ఎస్. బంగారు.

**హైదరాబాదు లేఖ:** జూన్ 1992 - డిసెంబర్ 1999 వరకు ప్రతి నెల హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ వార్తలు, డా. ముదిగొండ శివప్రసాద్.

**అమెరికా ఇల్లాలి ముచ్చట్లు:** కిరణ్మయి... ఈ రచయిత మరెవరోకాదు, కిడాంబి రఘునాథ్‌గారు. జనవరి 2005 నుంచి, ఇదే శీర్షికతో దశిక శ్యామలాదేవి కూడా రాస్తున్నారు.

**అమెరికాలో...:** ప్రవాసాంధ్రుల జీవితం, సమస్యలు, సలహాలు, డా. పరిణం శ్రీనివాసరావు గారు రాసిన వ్యాసాలు.

**మెఱుపులు:** గత 12 సంవత్సరాలుగా వేమూరి వెంకటరామనాధంగారి వ్యాసాలు చదువుతున్నాము.

**అనువాదాలు:** పెమ్మరాజు వేణుగోపాలరావుగారు (పి.వి.జి.) మన తెలుగు మహాకవుల పద్యాలు, కవితలని ఇంగ్లీషులో అనువదించారు.

**ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు కవులు:** జనవరి 1997 - జూన్ 1998, కల్లూరి శ్యామల 15మంది కవుల గురించిన వ్యాసాలు.

**ఆరుద్ర:** డిశెంబర్1991-అక్టోబర్1992, "ఆరుద్ర, సాహిత్యమే జీవితము-జీవెతమే సాహిత్యము..." 5 ప్రత్యేక వ్యాసాలు. రాసినది పార్వతి పొన్నలూరి.

**అమెరికాలో తెలుగువారు, తెలుగుతనం, తెలుగుభాష:** వేమూరి వేంకటేశ్వరరావు, గవరసాన సత్యనారాయణ, కిడాంబి రఘునాథ్, జి. వి. ర్. కె. శర్మ.

**కుంటిప్రశ్నలు - కొంటెసమాధానాలు:** మల్లాది వేంకటకృష్ణమూర్తి.

**ముఖాముఖీ:** కొందరు ప్రముఖాంధ్రులతో పరిచయం... చలనచిత్ర నటులు - కైకాల సత్య నారాయణ, మురళీమోహన్, జమున, చలనచిత్ర కవి - శ్రీ వేటూరి సుందరరామమూర్తి, గాయని - పి.సుశీల, ఫెమినిస్ట్ కార్యకర్త - మల్లాదిసుబ్బమ్మ, న్యూజెర్సీ ఎసెంబ్లీమన్ - ఉపేంద్ర చివుకుల.

ఇవేకాక.......

**తెలుగుజ్యోతికి తరచు రచనలు పంపిన రచయితలు**

**పద్యాలు:** దూశి ధర్మారావు, ఆచార్య తిరుమల రామచంద్ర, శేషం సుప్రసన్నాచార్యులు, ఈశ్వర వేణు గోపాల్, అట్లూరి అన్నపూర్ణ, వేమూరి వేంకటరామనాధం, సీయస్సీ మురళి, కనకారావ్ సలాది, శ్రీనగేష్, మల్లాది రామచంద్రశాస్త్రి, ఇందిర, పి.వి.జి. (పెమ్మరాజు వేణు గోపాలరావు, కల్పన చామర్తి, చలపతి మానికొండ, పిప్పళ్ళ సూర్యప్రకాశరావు, అధికార్ల రామలింగస్వామి, మంత్రవాది శ్రీరామమూర్తి, నాగలక్ష్మి కొంకపాక, జి.వి. ఆర్. కె. శర్మ, శైలజ సోమయాజుల, టి.వి.ఎస్.ఆర్. క్షీర సాగర్, ప్రసాద్ దొండపాటి, శొంఠి శారదా పూర్ణ, తమ్మినేని యదుకులభూషణ్, కాశీనాధుని మహేశ్వర ప్రసాద్, వైదేహి శశిధర్, విన్నకోట రవిశంకర్, చిలుముల శాంతికుమార్, గుళ్ళపల్లి లక్ష్మీకమలమ్మ, గురజాడ సత్యకుమారి, ఉప్పల అప్పలరాజు, టి.ఎస్. లక్ష్మీ మోహన్, సుదర్శన్ రాజ్, ఎన్.ఎస్.ఎన్. మూర్తి, ప్రసాద్ తుములూరి, వకుళాభరణం లలిత, డొక్కా రామభద్ర రావు, సాయిలక్ష్మి, మోహన్ వల్లభజోస్యుల, వేణు దశిగి, దివాకర్ పేరి, శోభ చెరుకూరి, రమ్య, విస్సావజ్జల ప్రభాకర్, సుప్రభ, నారాయణస్వామి, ఏడెం మస్తాన్ రెడ్డి, చల్లా సత్యవతి, సత్యం మందపాటి, రాచకొండ నరసింహశర్మ, సూర్యప్రకాశరావు కొలగొట్ల, కనుమూరి రాజ్యలక్ష్మి, లక్ష్మి కటికలపూడి, దోర్నాదుల సుబ్బమ్మ, మార్తి రామకృష్ణశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరి, బొల్లోజు బాబా, తదితరులు...

**నాటకాలు:** మరువాడ రాజేశ్వరరావు, దశిక శ్యామల, సాయిలక్షి, తమ్మర శేషగిరిరావు, ఓగేటి ఇందిరాదేవి.

**వ్యాసాలు:** రాధికాశాస్త్రి, గుత్తికొండ రవీంద్రనాథ్, నందివాడ పుతలీబాయి, మదన్రావ్, వేమూరి వేంకట రామనాధం, కూనపులి వెంకటచలపతి శర్మ, పార్వతి పొన్నలూరి, రత్నం చిత్తూరి, వేమూరి వేంకటేశ్వరరావు, కామేశ్వర పావనరాం, భావరాజు పరబ్రహ్మమూర్తి, కనక ప్రసాద్, వేమూరి వేంకటేశ్వరరావు, విశ్వనాధ అచ్యుత దేవరాయలు, కలశపూడి శ్రీనివాసరావు, జనని కృష్ణ, జి. గురునాధం, రామారావు పులవర్తి, ఎం.ఎస్. ప్రకాశరావు, కృష్ణకిషోర్ ధారా, ఖండేహాల్ వేంకటరావు, యేలూరి పాటి ఆంజనేయులు, తోటకూర అప్పారాయవర్మ, అపర్ణ యేలూరిపాటి, ఎన్.నారాయణస్వామి, సాయిబ్రహ్మానందం గొర్తి, మెదలగువారు...

**కథలు:** కొమరవోలు సరోజ, నందివాడ పుతలీ

బాయి, బంగారు సరోజినిదేవి, వంగూరి చిట్టెన్‌రాజు, అలివేలుమంగాశాస్త్రి, రాధికాశాస్త్రి, తాడికొండ శివ కుమారశర్మ, గొర్తి ఉమాదేవి, లీల, పూడిపెద్ది శేషుశర్మ, రావిపూడి, విజయశ్రీ, కొవ్వలి జ్యోతి, సుదర్శన్ రాజ్, పార్వతి పొన్నలూరి, బేతనపల్లి బోస్, వసుంధరాదేవి కలశపూడి, ప్రభ అత్రేయ, ఎం.ఎస్. ప్రకాశరావు, తెన్నేటి సుధ, విజయలక్ష్మి రామకృష్ణన్, పాలకూర సీతాలత, యర్రగుంట్ల రఘునాథరావు, సత్యవాడ (ఓగేటి ) ఇందిరాదేవి, ఆచార్య కోటా సుందరరామశర్మ, పిప్పళ్ళ సూర్యప్రకాశరావు, నందం రామారావు, చాగంటి సోమయాజులు, వఝ్లమాని పద్మావతి, దేవరకొండ శ్రీనివాసరావు, శశి, రాధిక నోరి, చలసాని ప్రసాద్, సాయికార్తీక్, సుధేష్ణరెడ్డి, శ్రీనివాస్ ఫణికుమార్ డొక్కా, శ్రీనాథ్ జొన్నవిత్తుల, నిడదవోలు మాలతి, సత్యం మందపాటి, కె. సర్వమంగళదేవి, ఉప్పల అనంతసుధాకర్, ఎస్.ఆర్. కొల్లూరి, ఇందిర మాలెంపాటి, కాశీనాధుని రాధ, చింతపల్లి గిరిజాశంకర్, మంగళ కందూర్ ... ఎందరో మరెందరో

**చిత్రకారులు:** బాపు, తురగా చలం, కృష్ణ వేమూరి, నాని, తాడికొండ శివకుమారశర్మ, గంగాధరం, మహేష్ సలాది, భారతి భావరాజు, రమ్య, మాధవి కాశీనాధుని, కిరణ్ జవ్వాజి, భమిడిపాటి కామేశ్వరి, ఇత్యాదులు...

**ఇండియా రచయితలు:** ఆరుద్ర, డా. సి.నారాయణ రెడ్డి, ప్రయాగ రామకృష్ణ, వి.ఎ.కె. రంగారావు, కె. రామలక్ష్మి, బి.వి.పట్టాభిరాం, మాడుగుల నాగఫణిశర్మ, తెన్నేటి సుధ, పప్పు వేణుగోపాలరావు, పాలగుమ్మి పద్మరాజు, తిరుమల రామచంద్ర, శ్రీహర్ష, పురాణం సీత, రాచకొండ విశ్వనాథశాస్త్రి, మల్లాది రామచంద్రశాస్త్రి, వక్కలంక పద్మావతి, మల్లాది సుబ్బమ్మ, సద్గురు శివానందమూర్తి,ముక్తేవి భారతి, ధనికొండ వేంకటేశ్వరి, రాజ్యలక్ష్మి రంగారావు, రావి కొండలరావు, మల్లాది మంగతాయారు, మాడుగుల భాస్కరశర్మ, శేషం సుప్రసన్నాచార్యులు, దూపాటి శేషుకుమారాచార్యులు, వాణిశ్రీ, కొండేపూడి సుబ్బారావు, ఓల్గా, కల్వకుంట రఘునాథాచార్యులు, ఇలా మరెందరో ప్రముఖ రచయితల రచనలు చదివాము ఈ25 సంవత్సరాలలో.

**చివరగా...**

నాకు తెలుగు టైప్ చెయ్యడం నేర్పినది రఘునాథ్ గారు. సెప్టెంబర్ 1992 తెలుగుజ్యోతికి మొదటి సారిగా కొవ్వలి జ్యోతిగారు రాసిన కథ "హేపీ బర్త్ డే", వినాయకచవితి కథ పూర్తిగా టైప్ చేశాను. ఆనెల తెలుగుజ్యోతి చేతికందగానే నాకెంతో సంతోషమేసింది నాటైపింగ్ చూడగానే. తరువాత కొన్ని స్ంవత్సరాలు హైదరాబాదు లేఖ, మెఱుపులు, కొన్ని కథలు, పద్యాలు, వ్యాసాలు కంప్యూటర్ ద్వారా తెలుగుజ్యోతి ప్రచురణకి సహాయం చేశానన్న తృప్తి ఎప్పటికీ వుంది. ఇంత విలువైన అవకాశమిచ్చిన రఘునాథ్‌గారిని ఎప్పటికీ మరువలేను.

(జనవరి 1984 నుంచి జనవరి 2009 దాకా వచ్చిన సుమారు 225 తెలుగుజ్యోతి పత్రికలని చదివి చిన్న వ్యాసంగా రాయడం బహు క్లిష్టమైన పని. ఎంతో మెళకువతో ఈ వ్యాసంలో రచయితలని, వారి రచనలని గుర్తించడానికి ప్రయత్నించాను. నా వలన ఈ వ్యాసంలో కొందరు తెలుగుజ్యోతి రచయితుల పేర్లు మరచిన క్షమించండి.) .

# పాతికేళ్ళ ప్రగతి

- కాశీనాధుని రాధ

పాతికేళ్ళనాడు పవిత్ర భారతదేశంలోని తెలుగునేల నుంచి ఇక్కడికి వలసొచ్చిన తెలుగువాళ్ళు, మహితశక్తి, ముందుచూపు కలవాళ్ళు అయిన కొంతమంది మహానుభావులు కలిసి ఈ తెలుగు కళా సమితిని స్థాపించారు, దాని వాయిస్సూ, పేసూ అయిన తెలుగు జ్యోతిని వెలిగించారు. అంతటితో చేతులు దులిపేసు కోకుండా శంకరాభరణంలో చెప్పినట్టు తమ చేతులడ్డుపెట్టి కాపాడేరు, భద్రంగా తరువాతి వాళ్ళ చేతుల్లో పెట్టారు. తరువాత వచ్చిన కార్యనిర్వాహకులు కూడా వాళ్ళ సాయాశక్తుల వీటిని పోషించారు, నిలబెట్టారు. ఎందరిదో కష్టఫలం అయిన తెలుగు కళాసమితి రజితోత్సవాన్ని ఈనాడు మనం అందరం కలిసి గొప్పగా జరుపుకుంటున్నాము.

పెళ్ళి చేసుకుని అత్తారింటికెళ్ళిన అమ్మాయి, పుట్టింటిపేరు ప్రతిష్టలని నిలబెట్టి, తనదైన కుటుంబానికి సంఘంలో ఉనికిని గుర్తింపుని కలిగిస్తుంది. ఈ అమ్మాయి ఫలానా వారి అమ్మాయి అనిపించు కుంటుంది. ఇలాంటి సంస్థలు పుట్టడానికి పెరగడానికి వెనుక వున్న సిద్ధాంతం అదే మరి. సొంత వూరొదిలి పరదేశం వచ్చాం... మనతో తెచ్చుకున్న వాటిల్లో అతి విలువైనవి, అపురూపమైనవి, మన భాషా సంప్రదాయం, సంస్కృతి, వీటిని ఈనాడు మనం ఉంటున్న సమాజంలో పదిలపరుచుకోవాలని అనుకోవడమే తెలుగు కళా సమితిలాంటి సంస్థలు పుట్టటానికి, తెలుగుజ్యోతి లాంటి పుస్తకాలు అచ్చువేసుకోవటటానికి మూల కారణం. మన తెలుగు కళా సమితి ఇంత వరకు మన తెలుగు సాహిత్యాభిమానానికి జోతలు పెడుతూ రచయితలని, పండితులని, అవధానులని, ఆదరించి సత్కరించింది. తెలుగుజ్యోతి పత్రిక ద్వారా మన పుట్టింటి నుంచి, మెట్టినిల్లైన ఈ అమెరికాఖండం నుంచి రచయితలని ఆహ్వానించింది, ప్రోత్సహించింది. సంప్రదాయ సిద్ధమైన మన కూచిపూడి, భరతనాట్యాలలో మహామహులైన కళాకారులతో బాటు, మన చిన్నారుల కళా కౌశల్య ప్రదర్శనకి రంగస్థలాన్ని అలంకరించింది. బహువిధ ప్రజ్ఞా శాలులైన సంగీతవేత్తలతో పాటు మన ఇంటి పంటలైన ముద్దు బిడ్డలకి ఆసనాలు వేసింది. రంగుల తోరణాలతో, పసందైన విందుభోజనాలతో, వేడుకలు, వినోదాలతో మన పండుగలని సందడిగా చేసింది. ఇంతవరకు మన కథ సాఫీగా నడిచినట్టు కనిపిస్తోంది. ఇంతేనా మనం చెయ్యాల్సింది?

ఒక సంస్థ అయినా, దేశం అయినా కాలగతిలో విజయవంతంగా నడుస్తూ ముందుకెళ్ళిందంటే - దాన్ని సాధారణంగా ప్రగతి, పురోగతి లాంటి మాటల్తో వర్ణించడం పరిపాటి. ఈ moving forward లో మొదట ఉన్నదానికి ఏదో కొంత add చెయ్యడమో, కొంత మార్పు చెయ్యడమో జరిగిందనే అర్థం కూడా ఉంది మరి. "పదండి పోదాం, పదండి ముందుకు, పదండి పోదాం వడివడిగా" వంటి మాటలు విన్నప్పుడు ఇప్పుడున్న దానికంటే బాగుండే స్థితికి వెళ్ళడం అనే మామూలుగా అనుకుంటాం. నిజానికి ముందుకెళ్ళడం అనేది సరైన మాటా? లేకపోతే మనసొత్తుని భద్రంగా కాపాడు కోవడం అంటే 'preservation' అనేది సరైన మాటా? నిజానికీ రెండు కలిస్తేనే అది నిజమైన పురోగమనం. కాలగమనంలో మార్పు అనేది అతి సహజమైనది. మనతో మూటకట్టి తెచ్చుకున్న ఈ సంస్కృతి, సంప్రదాయం, భాషా వీటన్నిటి లక్షణం కూడా కాలాన్ననుసరించి మారటమే. అయితే ఇందులో మనం ఊడబొడిచేదేమిటి? అంటే.... పారుతున్న పంటకాలువని గట్టు తెగిపోకుండా చూసుకోవడం. ప్రక్కన కలుపు మొక్కలో, ముళ్ళమొక్కలో మొలిస్తే వాటిని తొలగించడం. అలాగే పక్కనో పూలమొక్కో, కూరమొక్కో మొలిస్తే దాన్ని చూసుకోక పొరపాటున పెల్లగించ కుండా జాగ్రత్త పడటమూనూ.

"ఊహ తెలియంగల లేఖకకోత్తముల్" కలిగిన కాలంనుంచి డెస్కుటాపు పబ్లిషింగ్‌వరకు, వాడికేం మగమహారాజు అనే కుటుంబాల్లో పుట్టి, పురిటిగదిలో భార్య ప్రసవవేదనలో పాలుపంచుకునే మేనల్లుడిదాకా, ఉమ్మడి కుటుంబ వ్యవస్థనుంచి ఇన్‌డివిడ్యుయల్ పర్స్యూట్ ఆఫ్ హాపీనెస్‌ని కొలబద్దపుచ్చుకు కొలిచే రోజులదాకా లాక్కొచ్చింది కాలం మనని. తరానికి తరానికి ఆలోచనల్లో ఔట్‌లుక్కులో లెక్కలేనన్ని తేడాలు, వ్యత్యాసాలు. బోలెడన్ని సార్లు వీటి తలొగ్గుతున్నామని తెలియకుండానే సర్దుకుపోతున్నాం. నన్నయనాటి నుండి భాషలో మార్పే లేకపోతే మనకి తెలుగు లిపి ఉండేది

కాదు, ఇంకా "కంపు"ని "ఇంప"నుకుంటూ వుండేవాళ్ళం. రోడ్డు, కారు, రైల్వేస్టేషను, సబ్బులాంటి రోజూ వాడుకునే మాటలకి భాషలో చోటే లేక పోయేది. అంతవర కెందుకు, మనకీ కంప్యూటరులు, వెబ్బులూ, బ్లాగులు ఈమైల్సు ఉండేవి కాదు. ఇవన్నీ లేకుండా జీవితాన్ని ఊహించుకోండి. సరిగ్గా ఇప్పుడు మీ కాళ్ళకింద భూమి కదులుతూ వుండాలి మరి.

కాని మనలోనే (అంటే అందులో నేను కూడా ఉన్నా మరి ) 'ఏవిటో బొత్తిగా సినిమావాళ్ళని పిలిపించేస్తునారు' అని (జమున, భానుమతి, శంకరాభరణం సోమయాజులుగార్లని పిలిచిన సంగతి మర్చిపోయి ) అనుకునే వాళ్ళూ, 'చిటపట చినుకులు పడుతూ ఉంటే..' లాంటి పాటలంటే పడిచచ్చిన సంగతి మర్చిపోయి, 'ఏవిటో ఈ వెధవ సినిమాపాటలు' వంటి కామెంట్లతో బాటు, **మరో పక్క** 'ఎప్పుడు చూసినా భరతనాట్యాలు, కూచిపూడులూ అంటూ బోరుకొట్టించి చంపుతున్నారు' 'ఈ పాతచింతకాయ పచ్చడి మాకొద్దు' అనీ, 'బోలెడంత ఉత్సాహంగా గాయకుడో, గాయనో స్టేజి మీద పాడుతుంటే, కాస్త లేచి డాన్స్ చేస్తే తప్పన్నట్టు ముక్కున వేలేసుకుంటారు' అన్న విసుగులు. మనం విననివీ, అననివీ కాదంటే అతిశయోక్తి ఏమీ కాదుగా.

సంవత్సరం తరవాత సంవత్సరంగా కొత్త కొత్త ఏళ్ళు వస్తున్నాయి. వాటితో బాటు కొత్తగా వచ్చిన వాళ్ళు, ఇక్కడ పుట్టి పెరిగిన వాళ్ళు, వీళ్ళంతా తెలుగు కళాసమితిలో సభ్యత్వం తీసుకున్నా లేక పోయినా మన సమాజంలో కొత్త సభ్యులే మరి. ప్రజాస్వామ్యం అంటే అన్ని వర్గాల వాళ్ళకి ప్రాతినిధ్యం వుండాలి. వాళ్ళ ఆలోచనలకీ, అభిరుచులకి కూడా మన రంగస్థలం మీద చోటు కల్పించాలి. అవి తక్కిన వాళ్ళందరికీ మహబాగా నచ్చక పోయినా ఫరవాలేదు. మార్పు మరుపురాని మలుపు అవుతుందో కాదో కాలమే నిర్ణయిస్తుంది. దాని గురించిన బెంగ, భయం మనకి అనవసరం. అంటే ఇందాక మాట్లాడుకున్న పక్కన కొత్తగా మొలిచిన వన్నీ కలుపుమొక్కలేనని కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. పాతని ఆదరించినంత ఆప్యాయతతోనే కొత్తని ఆహ్వానించాలి. అలాగే కొత్త తరం వాళ్ళు పునాదిరాళ్ళలాంటి ముందు తరం వాళ్ళ సాహిత్యం, సంగీతం, నాట్యం లేకుండానే భవిష్యత్తు నిర్మించాలను కోవడం పొరపాటైన మాట. పాత మెట్లెక్కడమే కొత్తకి దారి. మనం ఉండబోయే ఇంటిని మనకి నచ్చినట్టు సర్దుకోవడం ముస్తాబు చెయ్యడం మన బాధ్యత. దాని తీరు నచ్చలేదని ఇంటి తలుపులు మూసెయ్యడం సబబు కాదుకదా!

మన భాషా సంప్రదాయం,సంస్కృతులని పదిలంగా వుంచుకోవడం అంటే వాటి చుట్టు కంచుకోటకట్టి కందకం తవ్వడంకాదు. పందిరి మీదున్న సాంప్రదాయపు మల్లెలని నేలమీదున్న మార్పుల మరువాలతోకలిపి దండ కట్టడం లాంటిది. మన మూలధనాన్ని భద్రంగా కాపాడు కోవడంతో బాటు దానికి వృద్ధి, సమృద్ధులు సమకూర్చడం కూడా ఈ ప్రగతిలోని ముఖ్య భాగం.

# మెఱుపులు : తెలుగు కళా సమితిలో తెలుగు

*- వేమూరి వేంకట రామనాథం*

నన్ను ఈ వ్యాసం వ్రాయమని కోరిన శ్రీ భావరాజుతో జరిగిన సంభాషణను పురస్కరించుకొని ఇది సంక్షిప్తంగా, ప్రధానంగా తెలుగు కళా సమితి వారి "తెలుగు"కు సంబంధించిన కార్యక్రమాలపైన ఒక సింహావలోకనం గాను ముందుకు పనికి వచ్చే సూచన గాను ఏర్పఱచవలెనని నిశ్చయించాను.

తొలుదల్త మన రఘునాథ్ వాత్సల్యంతో నడుపుతూ వచ్చిన తెలుగు జ్యోతిని గూర్చి ఒక మాట చెబుతాను. నేను అమెరికాలో వివిధ ప్రదేశాలకు వెళ్ళినపుడు గాని టెలిఫోనులో దూర మిత్రులతో మట్లాడినప్పుడు గాని మన "తెలుగు జ్యోతి" యెద ఎందరు ఎంత ప్రియంగా స్పందిస్తున్నారో గ్రహించి,. ఆనందిస్తూఉంటాను.ఇది నెలా నెలా కాక రెండు నెలల కొకసారిగా ఆర్థిక కారణాల వలన మారినపుడు రఘునాథ్ ఎంత ఖిన్న వదనుడై నాడో నాకింక గురుతే. కాని సమర్థత గల సంపాద కత్వంలో చక్కగా వస్తున్నదన్న తృప్తితో ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

౧. తొలి మెఱుపుగా నా "మెఱుపుల"తో ప్రారంభిస్తాను. ఇవి రఘునాథ్‌తో ఒక నాటి సంభాషణలో యాదృచ్ఛికం గా తళుక్కు మన్న ఊహ. "ఏ మండీ, ప్రతి నెలా ఏదైనా వ్రాయరాదండీ" అన్న వారి ప్రశ్నకు తక్షణ స్పందనగా నా "మెఱుపులు" మొదలైనాయి. ఇవి సారసత్వ విషయాల మీదనె కాక, సాంఘిక,రాజకీయ,అంతర్జాతీయ విషయాల మీద కూడా - ఇప్పటికి సుమారు ౧౫౦ శీర్షికల క్రింద వచ్చినాయి. మొదటి రెండు పుస్తకాలు కూడ అచ్చు అయినాయి. వ్యాసరచనలో అభిలాష వున్న వారికి ముఖ్యంగా పిన్న వారికి, వీటిలోని సమర్థత గల సంపాదకత్వంలో చక్కగా వస్తున్న దన్న తృప్తితో ఈ వ్యాసం వ్రాస్తున్నాను. ప్రధానాంశాంలు కొన్ని మనవి చేస్తాను. వ్యాసం సంక్షిప్తంగా వుండాలి - నిజానికి ఇది అతి దీర్ఘ వ్యాసం కన్న కష్టతరం. ఒక విషయంపై ప్రధాన కేంద్రీకరణతో రెండు ప్రక్కల "అభిప్రాయాలను గమనిస్తూ, వర్ణనలో కౌశలం ప్రకటిత మవుతూ వ్రాయాలి. ఎంత చిన్న కథా వస్తువయినా-ఉదా: " రాగి నాణెము", "అయిదునిముషాలు", "క్యూ", "వ్యవధి లేదు" - వ్యాస విధానం, రచనా ధ్యేయం ప్రయోజకంగా ఉండాలి. చేయి తిరిగిన రచయితలకిది చెప్పనక్కర లేదు కాని, తెలుగు కళా సమితికి సాధారణ వ్యాసకర్తలకు హితం చెప్పవలసిన భాధ్యత వున్నది కనుక ఉన్నదని నేననుకుంటున్నాను, కనుక ఈ అలతి సందేశం ఇస్తున్నాను.

మఱొక సూచన "తెలుగుజ్యోతి"లో వైదేహి పుణ్యమా అని యేమో కొలదిగా పద్యాలు పాడటం మొదలయిందికాని, రెండు రెండు క్షమార్హమైన సూచనలు: ఒకటి, ఛందోబద్ధమైన మైన కవిత -మనం మామూలుగా పద్యాలు అనుకునేవి - మచ్చుకైనా ఉంటే బాగుంటుంది. రెండు, ఆ పద్య కవిత కూడా కవిత యే కాని దానిలోని కవిత్వతత్త్వం కొంచం "బిరుసు" చేయబడాలి. - అంటే సంస్కృత పదాలతో అని కాదు."

తెలుగు జ్యోతి వ్యాసాలలో శ్రీ భావరాజు వారి సున్నితమైన హాస్యరసం- ఉదా. ఏప్రిల్ ౨౦౦౮ సంచిక లోని "డు యు లవ్ మి"? - ప్రత్యేకంగా ప్రశంశనీయం. అలాగే జనవరి-ఫిబ్రవరి ౨౦౦౯ సంచికలోని శ్రీ కాశీ నాధుని మహేశ్వరప్రసాద్ యొక్క "మాఘ"కవి వైశిష్ట్యం.

౨. తెలుగుకళాసమితి వారి "సారస్వత సమాహం" అన్న కార్యక్రమం చాలా రోజులు(గా) జరిగింది. నేను స్వయంగా ఆక్రమించు కొన్న అధ్యక్షత్వంతో, నా కోరికపై వ్యవహరించిన శ్రీ కలశపూడి శ్రీనివాసరావు కార్య దర్శకత్వంతో హాజరు అంటే సభ్యుల సంఖ్య తక్కువే; అది తప్పదు కాని మొక్కకు వేరు వలె అది ఫలవంతంగా ఉండేది. స్వరచనలు చదువుతూ ఉన్నవారి లో వైదేహి, జననీకృష్ణ, సుప్రభ, భావరాజు, వసుంధర, శ్రీనివాసరావు, బండ్లమూడి లక్ష్మి, శాంతి కుమార్, విస్సావఝ్ఝల, చోడవరపు ప్రసాద్, మస్తాన్ రెడ్డి, భావరాజు భారతి, వేణు గోపాల్, కిడాంబి రఘునాథ్ , ప్రభ, కొల్లి ఇందిర, అప్పాజోస్యుల మొదలైన వారు ఉన్నారు. సుప్రభ పద్యబాహుళ్యం, విస్సావఝ్ఝల అనర్గళ ఉపన్యాసం (అలంకారలమీద) నాకింకా గుఱుతే.

ఈ సభలు సాధారణంగా ఎవరి ఇంటిలోనో జరిగేవి, సభికులకు రుచికరమైన భోజనం దొరికేది కూడ. ఈ సభానిర్వహణలో ఒక చిన్ని విషయ మేమంటే మధ్యలో ఒక అరగంట విశ్రాంతి - ఉపాహారం సంగతి అటుంచి, ఆ సమయంలో రచయితలు తమ రచనలను గూర్చి నాతోను, ఒకరితో నొకరు, సంప్రదించుకొనేవారు.

ఇది "సమూహం": యొక్క నిక్కమైన ప్రయోజనాలలో ఒకటి. అవకాశం ఉంది. ఉపయోగం మనవంతు !

ఈ సమూహం కార్యక్రమం కుంటు పడి ఇప్పటికే సుమారు నాలుగైదేండ్లయింది. తెలుగుకళాసమితి వారికి నా హృదయ పూర్వక నివేదన యేమంటే, దీనికి పునర్జీవనం కలిగించండి. ప్రయోజనం అద్రుశ్యంగా వృద్ధి చెందుతుంది. ఇండియాలో వలె విరివిగా సారసత్వ ప్రతిస్పందనకు అవకాశంలేని యీ ఖండంలో మన రచయితలకు కొంతగానైన పరస్పర చర్చలకు అవకాశం కలుగుతుంది. ఎందుకు వస్తారు, అన్నది కాదు ప్రశ్న; వచ్చిన వారికి నాకింక ఎంత మేలు కలుగుతుందో అన్న ఆశ ప్రధానం. తెలుగు కళా సమితి వారు చేయదగిన కార్యక్రమాలలో ఇదొకటి అని కార్యకర్తలు విశ్వసించ వలెనని నా కోరిక.

ఈ సంధర్భంలో ఇటీవలి (ఏప్రిల్ ౨౦౦౮ ) సంచికను పురస్కరించుకుని ఒక మాట నివేదిస్తాను. అంత చక్కగా, కోణనిర్దేశంతో నిండిన సంచిక రెండు ఏండ్ల కొక మారైనా ప్రచురిస్తే బాగుంటుంది. న్యూజెర్సీ తెలుగు వారి స్వతంత్రరచనా కౌశలం అమెరికాలో నలు దిక్కులలోనే కాక ఇండియాకు కూడ విస్తరిస్తుంది.

ఒక చిన్న మాట. తెలుగు జ్యోతి సంచికలు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్ళేట్లు గట్టి ప్రయత్నం చేయాలి. ఇక్కడి రచయితలను గూర్చి, వీరిని అదలించే సమస్యలను గుఱించి, అక్కడ మన మిత్రులుకు విదితం అవుతుంది. వారి నుండి యీ పత్రికకు మధ్యమధ్య వ్యాసాలు వచ్చే అవకాశం కూడ ఉంటుంది. ఇక్కడి రచయితలను గుఱించి ఏ కొద్దిగా నైనా అక్కడి వారికి తెలుస్తుంది. (పోస్టు ఖర్చులు తప్పవు.)

౩. మఱొక విషయానికి వస్తాను. ఇక్కడ తెలుగులో మాట్లాడే వారు ముఖ్యంగా, వయసులో పెద్ద వారు, క్రొత్తగా ఇండియా నుండి వచ్చిన వారు. తరువాతి తరాలకు తెలుగులో ఏ స్వల్పంగా నైనా పరిచయం కలిగించ గలిగితే - దీర్ఘకాల ద్రుష్ట్యా - మంచిది అనుకుంటాను. ఈ విజ్ఞానరంగంలో అక్కడక్కడ కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నయి. తెలుగు సమితి - సంస్థా ముఖంగా- ఈ విషయంలో ఏ స్వల్పంగా నైనా ఫలవంత మైన కార్యక్రమం ఏర్పరచి చిన్న పిల్లలకు తెలుగులో విరివిగా మాట్లాడే కౌశలము, ధైర్యము కలిగించగ గలిగితే మంచిది. ఇలాంటి ప్రయత్నాల ఫలితాలు ధీర్ఘ కాలంలోగాని విదితం కావు. అందువలననే ఈ సంస్థ వంటి ప్రజా కూటమి వలసిన ఉత్సాహం చూపాలి అని, దాని ఫలం మెల్ల మెల్లగా విదితం అవుతుందని నా ఉద్దేశం. ఆదాయవ్యయ దృక్పధానికి మించిన ఆశయ స్వగతతో ఇలాంటి కార్య కలాపాలు రూపొందాలి.

ఈ మధ్య కొంతకాలంగా నడిపిన తెలుగు విద్యా బోధనప్రయత్నాలను ఈ సందర్భంలో తెలియ పరుస్తాను. స్థలాభావం మొదలగు కారణాల వలన వాటిలో కొన్ని ఇటీవల ఆగిపోయినవని తెలిసికొన్నాను. నిజానికి మన సమితి వంటి సంస్థ పూనకొన వలసిన ఉత్తమ కార్యక్రమమిది.

4. తెలుగు కళా సమితి వంటి సంఘము యొక్క కృషి వలననే సాధ్యమయ్యే మఱొక వాంఛనీయ కార్యక్రమం ఉంది. తెలుగు నేలకు చెందిన ఎందరో ప్రఖాత పురుషులను, స్త్రీలను గుఱించి ఇక్కడి తెలుగు వారికి ముఖ్యంగా పిన్నలకు - కొంత కనీస సమాచార మైనా లభించేందుకు అనువైన వసతి కలుగ జేయాలి. నా ఉద్దేశ్యంలో, మనకు తెలుగుజ్యోతి వాహికగా ఉండ గలదు గదా, అందులో ప్రతి సంచిక లోను ఒకరిపై (లేక ఇరువురు పైన) సంక్షిప్త వ్యాసం అర్ధమయ్యేటట్లు చూడాలి. ఇది చెప్పినంత తేలిక కాదు, ఆచరణలో. ఎందుకనగా ఏ రాధా కృష్ణన్, గిరి, సంజీవ రెడ్డి వంటి వారి గురించియో మించి మిగతా ఎందరో మహాను భావుల చరిత్రలు చాలా మంది (పెద్దలకే) నిశ్చయంగా సవ్యంగా సమగ్రంగా తెలియవు. వారు చరిత్ర పుటల మధ్య ఇఱుక్కు పోవటం కాక, మనకు మన పిల్లలకు ఉత్తేజకర వ్యక్తులుగా ప్రజ్వలించ వలెనంటే, వారిని, వారి కార్యకలాపాలను, వారి విజయాలను తెలియపరచే నిష్పాక్షిక వ్యాసాలు కావాలి. (ఇటీవలి ఒక సంచికలో శ్రీ ప్రకాశం పంతులు మీద చక్కని వ్యాసం వచ్చింది.) . మనం వర్ణంచవలసిన మహామహులు సారస్వత రంగానికి, కళలరంగాలకు, రాజకీయాలకు, ఆర్ధిక వ్యాసంగానికి, ప్రభుత్వ కార్యాలకు (డాకర్ సి.ఆర్.రెడ్డి వలె ) విద్యా రంగానికి, మహిళోద్యమాలకు, సాంఘిక చైతన్య కార్యక్రమాలకు, చెంది - ఇలా ఎన్నో రీతుల ప్రజ్ఞ గడించిన వారున్నారు. ఇది సమితి కర్తవ్యం, తెలుగుజ్యోతి అనుకూలమైన సాధనము.

ముగింపులో ఒక మనవి. నా వ్యాసం ఇతర రచయితల వ్యాసాల విషయాలలోనికి పోనట్లు సాధ్య మయినంత జాగ్రత్త తీసుకున్నాను. నన్ను వ్రాయమని శ్రీభావరాజు కోరిన పరిధిలోనే ఇముడ్ప ప్రయత్నించాను.

# పాతికేళ్ళ జీవితంలో

-పెమ్మరాజు వేణుగోపాలరావు

మనిషికి మరుపు అవసరం. ప్రతి విషయం జ్ఞాపకం, ఉంచుకుంటే మన పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోండి ఒక సారి. బాధాకరమైన ప్రతి విషయం గుర్తుకి వస్తూంటే ఎంతచికాకుగా ఉంటుందో ఊహించుకోండి. పూర్వ జన్మలలో జరిగినవన్నీ గుర్తుకి వస్తే ఎన్ని జన్మల విశేషాలు మనలని కలవర పెట్టగలవో ఆలోచించండి. కాని జీవితం సాగటానికి జ్ఞాపకం కూడా అత్యవసరమే. మనకి కావలసినవి గుర్తు పెట్టుకోలేకపోతే కలిగే ఇబ్బందులు విడిగా వర్ణించ నక్కరలేదు. జ్ఞాపక శక్తిని వృద్ధి చేసుకోవటానికి అనేక సాధనలు, సాధనాలు కనిపెడతాం. మరొక ప్రకృతి రహస్యం ఏమంటే భవిష్యత్తుని ఊహించుకోవాలంటే మనభూతకాల వ్యవస్థలని జ్ఞాపకం తెచ్చుకోగలగాలి. ఆశక్తి కోల్పోయిన నాడు 'ముందు' గురించి ఆలోచనలు చెయ్యడం కష్టం.

పాతానుభవాలని స్మృతిపథంలోంచి బయటకులాగి భవిష్యత్తులో మార్గదర్శకులుగా మార్చు కోవటం మానవ సహజం - మానవ ధర్మం కూడాను. పాతికేళ్ల జీవితంలో జ్ఞాపకం ఉంచుకోదగిన విశేషాలు అనేకం ఉంటాయి. ప్రతివారి జ్ఞాపకాలు అందరికీ అక్కర్లేదు. పదిమంది జీవితాలని కలిపి, ఉద్ధరించి వాటి మధ్య వారధులు కట్టిన విశేషాలు మాత్రమే సంఘం జ్ఞాపకముంచు కుంటుంది. వ్యక్తి తన జ్ఞాపకశక్తిని పదిలపరుచు కుంటున్నట్లే సంఘం కూడా అనేక రకాల సాధనాలని ఉపయోగిస్తుంది. చరిత్ర సంఘపు జ్ఞాపకాల కట్ట. కొంత చిలవలు పలవులు పెట్టి జరిగిన సంగతులలో అవసరమైనవి చేకూర్చి, విశ్లేషించి మనముందు పెడుతుంది. అందుకనే చరిత్రకారులు మనకి ఉపయోగపడే వ్యక్తులు, అవసరమైన వ్యక్తులు.

నేను చరిత్రకారుడిని కాను. కాని నాకు జ్ఞాపకం ఉన్న కొన్ని విశేషాలు ఇతరులతో పంచుకోదగ్గవి. తెలుగు సంస్కృతి, సాహిత్యం, సంగీతాలని అనుభవిస్తూ, పోషించి ఉద్ధరిద్దామనుకునే జీవులు ఉత్తర అమెరికాలో చాలా మంది ఉన్నారు. న్యూజెర్సీ తెలుగు కళాసమితి అటువంటి సభ్యులతో కూడిన ఒక సంఘం అని నాకు తెలియటానికి కారణం కిడాంబి రఘునాథ్ గారితో ఉన్న పరిచయ స్నేహాలు. ఆయనతో పరిచయం ఎలా అయిందీ, ఆ స్నేహం ఎలా పెరిగింది గుర్తుకు తెచ్చుకొని ఇతరులతో పంచుకోదగిన విశేషమని నా అభిప్రాయం.

హ్యూస్టన్‌లో తానా సభలు జరుగుతున్న సమయం అది ౧౯౮౭. అట్లాంటానుంచి వచ్చిన మా బృందం గిరిజాకళ్యాణం నృత్యనాటిక ప్రదర్శించిన రోజు. ప్రోగ్రాము బాగా జరిగిందని అందరం సంతోషంతో ఉన్నాం. పాత్రధారులు ఒకరినొకరు అభినందన చేసుకుంటున్నారు స్టేజివెనకాల. స్టేజి ఎంట్రన్సులో ఒక కుర్చీలో కూర్చుని తమాషా అంతా చూస్తున్నారు ఒకాయన. ఎవరీయన, ఇలా కూర్చున్నారు ఒంటరిగా ఇంత హడావుడిలో అని ఒక క్షణం ఆలోచించి ఆయన్ని సమీపించాను. ఆయన వెంటనే లేచి "నమస్కారమండీ. మీతో రెండు నిముషాలు మాట్లాడాలని వెయిట్ చేస్తున్నాను. మీరు చాలా బిజీగా ఉన్నారు గదా అని ఇక్కడ కూర్చున్నాను మళ్ళీ దొరకరేమోనని." "చెప్పండి ఏమిటి విశేషం?" అన్నాను. "నాపేరు కిడాంబి రఘునాథ్, న్యూజెర్సీ తెలుగు కళాసమితి వారి తెలుగు జ్యోతి ఎడిటరుని" అని తనని పరిచయం చేసుకున్నారు. అదే మా ఇద్దరి స్నేహబాంధవ్యానికి పునాది పడిన ప్రథమ ఘట్టం అనుకోవచ్చు.

ఆనాటి స్టేజి వెనకాల సంభాషణ అంతా తెలుగుజ్యోతి గురించే. ప్రతి సంచికలో కాకపోయినా వీలయినంతవరకూ నేను రచనలు తెలుగుజ్యోతికి పంపిస్తానని వాగ్దానం చేశాను. అంతకు పూర్వం నాలుగునెలల క్రితం నుంచే మాకు తెలుగుజ్యోతి రెగ్యులరుగా వస్తోంది. చాలవరకు చేతితో వ్రాసిన పత్రిక, ఆంధ్రదేశంలో వెలువడుతున్న పత్రికలనుంచి జిరాక్సు చేసిన రచనలు కొన్ని కూడా ఉంటున్నాయి. హ్యూస్టనునుంచి తిరిగి అట్లాంటా వచ్చాక ఒక రోజున నేను అది వరకు వ్రాసిన "శ్రీ వెంకటేశ్వరుని పశ్చిమ దేశయాత్ర" అనే కవిత ఒకటి ఒక పేజీకి సరిపడ చేత్తో వ్రాసి పోష్టుచేశాను. అది అందిన వెంటనే ఆయన ఫోనులో కేకేసి "చాలా బాగుంది ఇది వచ్చే సెప్టెంబరు ఇష్యూలో వేస్తాను." అని, "మీరు ప్రతినెలా ఒక రచన తప్పకుండా పంపించాలి, ఏమయినా సరే" అంటూ బలవంతపెడుతూ సంభాషణ సాగించారు. వెంటనే నేను మర్యాదగా చెప్పాను, "నేను ప్రతి నెలా వ్రాయగలిగేటంత

సమయంగాని నమ్మకం గాని నాకు లేదండి. కాని ప్రస్తుతానికి నా 'కాస్మిక్ కవిత'లో వచ్చిన కవితలు మీకు కావలిసినవి ఎన్నుకుని వేసుకోండి" అన్నాను. "అహ అల్లాకాదు. మీరు కొత్తవి పూనుకుని వ్రాయాలి తెలుగుజ్యోతి కోసం" అన్నారు. ఆ సంభాషణలోనే ఆయనకి తను చేస్తున్న పనిలో ఉన్న పట్టుదల, ఉత్సాహాలు నాకు కనిపించాయి. నా అభిప్రాయలకి, ఆశయాలకి అనుగుణంగా ఈ వ్యక్తి చేస్తున్న కృషికి సాధ్యమయినంతవరకూ అండగా నిలబడి సమర్ధతతో సహకరించాలి అని మనస్సులో అనుకున్నాను.

కిడాంబి రఘునాధ్, తెలుగుజ్యోతులతో సంబంధం వల్ల జరిగిన నాలో ముఖ్యమైన మార్పు ఒకటి నేను చెప్పకోగలను. తెలుగులో మళ్ళీ రెగ్యులరుగా వ్రాయటం ప్రారంభించాను. అంతకు పూర్వం నాకు తోచినప్పడు మాత్రమే అప్పడప్పడు కవితలు వ్రాస్తూండేవాణ్ణి. ఈ కనక్షను ఏర్పడ్డాక తెలుగులో వ్రాయటం ఎక్కువయింది అని ఖచ్చితంగా చెప్పగలను. లెక్క పెడితే షుమారు డెభై తెలుగు జ్యోతులలో నా రచనలు పడ్డాయి. ఈయనతో పరిచయం అయ్యాక నేను రాసిన కవితలన్నీ ముందుగా తెలుగుజ్యోతిలోనే ప్రచురింపబడ్డాయి. ఎవరయినా నన్ను పలకరించి "ఈమధ్య ఏమయినా కొత్త కవితలు రాశారా?" అని అడిగితే, "మీరు తెలుగు జ్యోతి తెప్పించుకోండి. నేను వ్రాసినవన్నీ ఆపత్రికలో పడతాయి" అని సమాధానం ఇవ్వటం నాకలవాటయిపోయింది. అప్పటినుంచి ఇప్పటి దాకా వచ్చిన తెలుగుజ్యోతుల కాపీలన్నీ మా బేసిమెంటులో లైబ్రరీలో పదిలపర్చి ఉంచాను. తెలుగు జ్యోతి వచ్చిన వెంటనే మా ఆవిడ లక్ష్మి చేతిలోకి వెళ్ళిపోయేది ముందు. రఘునాధ్ గారి ఎడిటోరియల్ ముందు చదివి తర్వాత మిగతావాటికేసి చూసేది.

తెలుగుజ్యోతితో సంబంధానికి దారితీసిన పూర్వ చరిత్ర ఒకటి ఉంది. 1970 నుంచి 1976 వరకు నేనూ మా మిత్రులు గవరసాన సత్యనారాయణ, పరిమి కృష్ణయ్య, రావిపూడి సుబ్బారావుగార్లు కలిసి తెలుగు భాషాపత్రిక నడిపాం. అది వ్రాతపత్రికగా ప్రారంభమై తరువాత ఇండియాలో అచ్చువేయించి తెప్పించేవాళ్ళం. ఇక్కడ స్థిరపడిన తెలుగువారిలో తెలుగులో రచన చేద్దామనే కుతూహలం ఉన్న వారిచేత సైన్సు సంబంధమైన విషయాలపై రచనలు వ్రాయించి ప్రచురించటానికి ఉద్దేశించిన పత్రిక అది. ఆప్రాజెక్టు విలువ గ్రహించిన వారిలో కిడాంబి రఘునాధ్ గారు ఒకరు.

పత్రికానిర్వహణలో ఉన్న సాధకబాధకాలు చాలా ఉన్నాయి. షుమారు రెండు దశాబ్దాల పాటు కిడాంబి గారు, వారి స్నేహితులు తెలుగు జ్యోతిని నడిపి అమెరికాలో ప్రవాసాంధ్రుల రచనా కుతూహలానికి, సృజనాత్మక శక్తికి నీరు పోసి పోషించారు. వారి సంపాదకవర్గంలో చేరి కొన్నాళ్ళు చేయూత నిచ్చాను కూడా. అమెరికాలో తెలుగు డైస్పోరిక్ సాహిత్యాన్ని గౌరవించి అది నిలబడటానికి ఒక చోటు చూపించిన మొదటి తెలుగు సంఘం న్యూజెర్సీ తెలుగు కళాసమితి అనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు జ్యోతితో నాకున్న సంబంధం నా కథలో మరువలేని ఘట్టం. నాలాంటి వారు చాలా మంది ఉండటం వల్లనే ఈ సంస్థపై పదిమందికి వాత్సల్యం, అభిమానం, గౌరవం..

# స్నేహ స్వర్శ

*- శారదా పూర్ణ శొంఠి*

మళ్ళీ ఇంకోసారి కిడాంబిని తలుచుకునే రోజు వచ్చింది. ప్రతీసారి కొత్తగా వస్తుంది. స్ఫూర్తి కలుగుతూ ఉంటుంది. ఈమధ్య ఈ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా గొంతు బొంగురు పోతోంది. మిగిల్చిన తరగని ఆస్తి కళ్ళ ముందుంది. ఎవరికి కావలసిందైనా ఇదే! తీపి గుర్తులు! కాకపోతే అవి మనుష్యులకు సంబంధించినవి కాదు. వారి పుట్టుకకి కారణాలవి కావచ్చు! అవే గోముగా ధైర్యం చెప్పగలవు. గిర్రున తిరిగి పోతున్నాయి సంవత్సరాలు.

ఆరోజు మిత్రుడు భావరాజు న్యూజెర్సి నుంచి పిలిచారు. వెళ్ళిపోయిన కిడాంబిని వెనక్కి తెస్తూ! భావరాజు పలకరింపు ఆయన విశాఖపట్టణం వెళ్ళడం, నాన్నగారు గోపాలశ్రాస్త్రిగారిని కలవడం, వివరాలు చెప్పడం అన్నీ కళ్ళముందుకి తెచ్చి జీవితం మీద బాధ్యతని పెంచినట్టయింది. ఆలోచనలని చెదలు పట్టనివ్వని నిజమైన స్నేహాలు. ప్రతీదీ ఒక సరి క్రొత్త ప్రేరణ. భావరాజుగారితో సారస్వత సంబంధం చాలా చిక్కన! కలిసి నప్పుడల్లా ఒక ఉల్లాసం, ఉత్తేజం. కిడాంబి నాకిచ్చిన వైదేహి పరిచయం ఆకోవలోదే! ఎన్నెన్నో గంటలు సాగాయి సంభాషణలు! ఆ ఊసులన్నీ బాగా గుర్తున్నాయి. ఒకేసారి చూసాను. తను అపురూపం. తన కవితలు మరీని! అమెరికానుంచి కుదరలేదు కానీ నవంబరులో లిబియానుంచి మాట్లాడగలిగాను తనతో! ఆ ఎడారి దేశంలో హాయనిపించింది. అది తన ఉపజ్ఞ!

అమెరికాలో సీజన్లు కాలానికే కాదు, అనుభూతులకీ ఉంటాయి. కిడాంబిని వేసవి రోజుల్లో కలిసేను. ఎముకలు కొరికే మంచు రోజుల్లో కలిసేను. స్నో కుప్పలై కొండలైనప్పుడు ఇంకోసారి. ట్యూలిప్పులూ, డాఫొడిల్సు విరగ బూసేటప్పుడు మరోసారి! ప్రపంచం పండుగచేసుకునే క్రిస్మస్ వేడుకల్లో, హిందువులు జరుపుకునే గోడలమధ్య పండుగల్లో! ఆరాటాల తెలుగు సమావేశాల్లో, నృత్యసంగీత ఉత్తేజ సమయాల్లో! కిడాంబితో గడిపిన రోజులు చాలా విచిత్రం. పలకరింపులు చెరుకు పానకం! సవరింపులు తెగ పదును. అపరోక్షానుభూతి

పరోక్షంకన్నా బలం. టెలిఫోను సంభాషణలు మనుషుల మధ్య దూరాన్ని పూర్తిగా చెరిపేస్తాయి. ఆరేళ్ళ టెలిఫోను పరిచయం! "మీ విషయంలో అంతుపట్టనిదేదో ఉంది. తెలుసుకోవాలని వచ్చానన్నారు"వినయం నేర్పుతూ! మొదటిసారి కలిసేటప్పటికి పూర్వ జన్మ గడిచి తెల్లారినట్లయింది. నోబెలు బహుమానం తిరస్కరించిన తాత్వికుడు ఎ్రజాపౌండు తత్వంలా! కామాలతో ముగిసే కవితలా!

ఈ ఏడాది నాన్నగారు గోపాలశాస్త్రిగారు తన ఎనభై ఆరవ ఏట విశాఖపట్నం ఆంధ్రాయువర్సిటీ నుంచి Environmental Engineering PHD పట్టా అందుకున్నారని తెలిస్తే ఎంత సంతోషించేవారో కిడాంబి! తరచు - ఆయన దీక్షకి అబ్బుర పడేవారు. వాడికీ వేడికీ ముచ్చటపడేవారు. నాన్నగారి సాధన, క్రమశిక్షణ తనకెప్పుడూ దోవ చూపిస్తాయని పదేపదే అనడం జ్ఞాపకం వస్తుంది. మనుష్య జన్మ ఆంతర్యం ఆతరం వాళ్ళకే బాగా తెలుసని కిడాంబి విశ్వాసం. వాళ్ళ జీవితాలే మనకి సంప్రదాయాలనేవారు. వెళ్ళిపోయిన కిడాంబిని వెనక్కి పిలిచి చెప్పాలని ఉంది! ఒకటే తబ్బిబ్బు!

అమెరికా తెలుగు వాళ్ళ జీవితాలు గాడిలో పడుతున్నాయనిపిస్తోంది. కాలం గడుస్తోంది. చూపు పాకాన పడుతోంది. ఎంతోమందివో ప్రయత్నాలు పరసీమలో తెలుగుతనం వేళ్ళూనడం. దానికి నిదర్శనం.

౨౦౦౧ వచ్చింది. మామూలుగా రాలేదు. కిడాంబి గారినీ, హైదాబాదు తెలుగు యునివర్సిటీ ఉపాధ్యక్షులు డా.గోపీగారినీ మరింత దగ్గర చేసింది. గోపీగారు పరమ భావుకుడు. వర్షానికి తడిసిన నేల వాసనో, పచ్చ గడ్డి వాసనో ఇదీ అని చెప్పలేనిదేదో తోస్తుంది. ఆయనలో ఒక ఉద్రేకం ఉంది.

అమాయకత్వం తోడుగా, అమెరికాలో తెలుగు పిల్లల కోసం ప్రత్యేకమైన కోర్సులు ప్రవేశ పెట్టే ప్రయత్నం ప్రారంభం చేసింది ఈయనే! చాలామందికి ఆలోచనల్లో ఉండి ఉండచ్చు. చరిత్రలో ఒక కొత్త మలుపు అది. ఆ తర్వాతి వారంతా ఊపందుకున్నారు. గోపీ నార్త్ అమెరికా అంతర్జాతీయ నాట్య సదస్సుకి వచ్చారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు నాలుగేళ్ళ పదవినీ, సంగీతం, కూచిపూడి నాట్యం అభ్యున్నతి పథకాల సమన్వయ కర్త బాధ్యతనీ నాకిచ్చిన మీదట గోపీగారితో ఆరేడు రాష్ట్రాలు తిరిగాను. ఎందరివో పరిచయాలు,

ఉపన్యాసాల పరంపర, పనుల ఒత్తిడికి కేలండరులో అంకెలు మారేవి. గడియారంలో తెల్లారేది. క్రిక్కిరిసిన కార్యక్రమాలు దృఢ విశ్వాసం పోటీపడి వెంట వచ్చేవి. భారతదేశం పెరిగే ప్రయత్నం చేస్తోంది. తెలుగు యూనివర్శిటీవి పదహారేళ్ళ లేతరెక్కలు. అమెరికాతో సాంస్కృతిక సంబంధాల కోసం ప్రయత్నిస్తోంది. ఆశయం గొప్పది. ఐదేళ్ళ శ్రమ. చిన్నచిన్న సమావేశాలు. మొదట్లో ఫలితం పల్చన. ఎంతమందిని కలిస్తే పనికానూ! ఉడతా భక్తి ఆశని పెంచింది. కిడాంబి కొంత కారణం. ఎగసం త్రోసారాయన. "మూడు వారాల్లో అమెరికా ఇండియాల మధ్య సాంస్కృతిక వంతెన కడతారా"అనేవారు. కోరిక పంతం పుంజుకుంది. అవసరాన్ని మించి జీవశక్తి ఖర్చయింది. జనాన్నుంచి ఎగతాళి చప్పుళ్ళు వినిపించేవి అయినా పనులు ఉధృతంగా సాగేయి. అమెరికా వారి ఆర్తి, విద్యావేత్తల యత్నం సమాంతరంగా ముందుకెళ్ళాయి. వలస వచ్చిన వారికి కళ ఒక తెడ్డు! కావలసిన పునాదులు పడ్డాయి. తెలుగు ఇళ్ళు కట్టేవాళ్ళదే అదృష్టం. ఈ మధ్య అమెరికాలో చాలా రాష్ట్రాల్లో తెలుగు భవనాలు వెలుస్తున్నాయి. సంతోషించ దగ్గ విషయం.

ప్రయాణంలో ఆఖరి మజిలీ న్యూయార్కు. 2001 సెప్టెంబరు 7న బయలుదేరాం. మూడురోజులపాటు సమావేశాల ఉక్కిరిబిక్కిరి. కాలాన్ని ఎంత సాగతీయ వచ్చో అంతా సాగగొట్టాం. చెప్పొద్దూ గర్వంగా ఉండేది. లోతెరగడమే కారణం. మొదటి ఘట్టం ఓ కొలిక్కి వచ్చింది. ఆశ పెరిగింది. పథకాల సంఖ్య పెరిగింది. చేరవలసిన గమ్యం ఎక్కువ దూరం లేదనిపించేది. బండి గాడిలో పడింది. మా ముగ్గురికీ ఓపిక అవసరం వెయ్యింతలైంది. అన్ని సమావేశాల్లో వాడుక భాష గురించి ప్రశ్నలు గుప్పించారు. కళలు నేర్పడంలో వస్తున్న సంప్రదాయపు మార్పుల మీద మరిన్ని వాదనలు, అభిప్రాయ బేధాలు హాయిగా వ్యక్తమయ్యాయి. మారుతున్న విలువల మీద పెరుగుతున్న అభద్రతా భావం పైకి తేలింది. నిరాశా వాదం మాత్రం ఏకోశానా లేదు. కిడాంబి చూపు అన్ని విషయాల్లోనూ చాలా తీక్షణం. అన్నిటినీ లక్ష్యం వైపు తిప్పేవారు.. కిడాంబిగారి శ్రీమతి ప్రభరఘునాథ్ సంస్కార పరిణితికి తార్కాణం, మాటలకందని సుఖం, ప్రసన్నత ఉంటాయి ఆమె దగ్గర. కిడాంబిగారి ఇంట్లో అన్నిటిమీదా అభిలాష పెంచే వాతావరణం ఉంది. మూడు రోజులు గడిచాయి.. జరగవలసిన పనులకి రూపకల్పన అయింది. ఆ ఊళ్ళో Fraklin Township Board of Education Secretary ని కలవడం మంచి ఫలితాన్నిచ్చింది. న్యూయార్కు, న్యూజెర్సీల మధ్య తిరిగాం.

సంభాషణల్లో చాలా దూరం వచ్చాం. ఈ మూడు రోజుల్లో కలిసిన తెలుగు మిత్రులందరూ పేరుపేరునా మాటల్లో మాతో తిరిగేరు. పనుల్లోనూ! హైవేలమీదా, ఫ్రీవేల మీదా మాటలు. వేగ నియంత్రణల గురించి చర్చ. శుల్కాల గురించి వాదన. Stevens Instittute of Tecnhology లో కాస్సేపు, East River ఒడ్డున మరికొంతసేపు కాలం గడిచింది. న్యూయార్కు చిరునామా World Trade Center భవనాలని చూసి అబ్బురపడి పోయాం. ఆరుమైళ్ళ పొడువున విస్తరించి ఉన్న ఆకాశ హర్మ్యాలకి అవాక్కు సమాధానం అయింది. అన్నిటినీ గోపీగారి కళ్ళలోంచి చూస్తున్నాను. Stony Brook University లో Center for Telugu Studies శాఖాధిపతి డా. శ్రీధర్ గారితో సమావేశం. నిశితంగా విన్నారు. ప్రతిపాదనలెన్నో వచ్చాయి. పట్టుదలకి హర్షించారాయన. మళ్ళీ మర్నాడే కలవడానికి ప్లాను వేసుకొని బయటకు వచ్చాం. కారు వదిలి తూర్పునదికిందున్న 28 మైళ్ళ సొరంగాల మార్గం పట్టాం. పైకి వచ్చేసరికి ఈ నగరానికి చిరునామా! మబ్బుల్ని కౌగిలించుకున్నట్లు కనిపించే ఆకాశ హర్మ్యాలు. అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు జరిగే Wall Street, Stock Exchange భవనాలు చూడ్డం పూర్తయింది. Saks V Avenue అతి ఖరీదైన షాపింగ్ కాంప్లెక్స్. మానవ స్వభావంలో ఒక విడ్డూరాన్ని చెప్తుంది. ఇది అగ్రరాజ్యం. కిడాంబితో గోపిగారితో ఈ ప్రయాణం అమెరికాకి వేరే అర్థం చెప్తోంది.

St. Peter's Catherdral నిర్మాణం అద్భుతంగా ఉంది. అక్కడినుంచి తెచ్చుకున్న Rosery ప్రాణ భద్రతతో దాచుకున్నాను. ఇది పదహారవది. ప్రపంచంలో నే తిరిగిన క్రైస్తవ దేవాలయాల్లో, నాకన్నీ రుద్రాక్ష మాలలే! అమెరికన్ల గర్వ కారణం, ప్రతిష్టకి నమూనా నూట పది అంతస్థుల World Trade Center దగ్గరికి వచ్చాం. కాళ్ళు పీకే దాకా తిరిగాం. విశ్వస్థాయి కంపెనీలని చూస్తుంటే చాలా విషయాలు జ్ఞానాన్ని పెంచాయి. ఎంతోమంది తెలుగు వాళ్ళు. మన దేశీయుల్ని చూస్తే అహమేదో పొంగింది. మా ముగ్గిరి మధ్య ఉద్వేగం, ఉత్తేజం. అంతర్జాతీయ సమితి ఆవరణలో వివిధ దేశాల జెండాల

రెపరెపలు స్ఫూర్తి నిచ్చాయి. రాక్ ఫెల్లర్ బిల్డింగు దగ్గర వారి ఉపకార వేతనాల సహకారం గురించి చాలా విశేషాలు చెప్పారు కిడాంబి. మాటలకలసట లేదు. మూలమూలా తిరిగాం. వీధి మారినప్పుడల్లా ఆ-లోచనలతోపాటు సంభాషణ కూడా తెలుగులోకి మళ్ళేది. Edison Township స్కూళ్ళలో గుజరాతీ భాష చేరింది. మన తెలుగు కూడా అమెరికా విద్యా వ్యవస్థలో స్థానం పొందకపోతే ఉనికి గల్లంతౌతుందనే భయం. నిర్ధారణకొచ్చాం. ఇదే జరిగితే తెలుగు పేగు సంబంధానికి దెబ్బ. నిష్కామంగా పని చెయ్యాలని మనస్సుల్లో ఒట్టేసుకున్నాం ముగ్గురం. జన్మ రహస్య కారణమేదో బయటపడ్డభావన!! మళ్ళీ తూర్పునది ఒడ్డుకొచ్చాం. సాయంకాలమైంది. ఓపిక తగ్గింది. అదృష్టవశాత్తు మిగిలిన అతి ముఖ్యమైన మీటింగులు వాయిదా పడ్డట్టు ఫోను వార్త! మళ్ళీ World Trade Center కి వచ్చి మేయరు చివుకుల ఉపేంద్రగారిని, డా. గుజువర్తి కృష్ణారెడ్డి గారినీ మర్నాడు కలవాలని! రాత్రంతా తెలుగు చర్చలు, భవిష్యత్తుకి ఏర్పాట్లు, జీవితాన్ని అరగదీసేస్తూ తాపత్రయం. సినారే గారితో, నాన్నగారితో, వాషింగ్టన్ విదేశాంగ శాఖలో ఉన్న మా అమ్మాయి సీతతో మాటాలారాత్రి.

As I lay in bed that night, I wondered why I was so miserable with my in-laws. Was it their obvious contempt for me, never even asking how my day was or acknowledging my presence? Was it my American-accent laden Telugu which I strived to improve? It is true, I made a lot more money than Ashok – to me, money came and money went. Although my parents were well-off, that was in recent times, following years of struggling and taking care of familial obligations in India. By the time I got to high school, my parents had settled down and were more stable. I remembered the times that we were poor – we had very little money, shopped at bargain stores, but were happy. However, I rationalized in my mind that if I made more money than Ashok, was a professional, and basically a good person with a heart, then why I was allowing myself to be treated in this way? Or was there something lacking in me – was I too impatient (a definite flaw that I was aware of), was I too set in my ways, what was it? I realized through my analysis of myself that I was very American. I had core Indian values that my parents instilled in me, such as treating guests well, always having good food to entertain, helping others, and creating stability for contentment which is what attracted me to Ashok. I knew he had my parents' Indian values, yet brought me into the current Indian scene, something my parents were unable to do as their Indian time was frozen in the 1960's, the time they left India for here. My American side shaped my independence, my strong sense of self, and my desire to give of myself and follow my dreams, courage to look beyond the ordinary, a deep feeling of gratitude for what life had to offer, and, most importantly, a sense of compassion for others. That compassion was not reserved for my immediate family, it extended beyond that, for others whom I did not know anything of, but was willing to extend my heart and helping hand. I lay there thinking of how I opened my hearts to Ashok's parents, how I tried to learn and change by painstakingly learning Telugu, embracing the opportunity to offer something more to my son, making wholehearted attempts to cook Andhra dishes, and most of all, opening up my home to allow perfect strangers to live with us. I wondered in deep earnest what I received in return – contempt? Lack of understanding of the things important to me? "Passive-aggressive "behavior saved for me? Through this analysis, I finally realized what was lacking in my relationship with my in-laws, I realized that my compassion was one-sided, and it would never change. I realized that I was but a mere annoyance to them – a price they had to pay to be close to their son. Beyond this, it was a lack of empathy for me and my existence. Perhaps, it was not personal, I don't know. All I knew was that I still felt compassion for them; I knew that even if my in-laws left the very same day, as happy as I would be that I won my life back, that I would still worry about them and would still make sure that they were okay and do whatever was necessary to make them comfortable. I would still visit them and would not harbor negative feelings. However, I was not so sure that this compassion was mutual.

Tomorrow was another day, another feeling of nauseating anticipation, another feeling of defeat, or was it? What could I do to break this cycle? What could I do to lift myself from these doldrums to feel what I felt before – invigorated, excited, and happy? I was not sure what I would do, but I knew I had to take matters into my own hands.

# ఇన్విటేషన్

-శ్యామలాదేవి దశిక




ఆఫీసునుంచి ఇంటికి వెళ్తున్న సంధ్య అలవాటైన రోడ్డు మీద యాంత్రికంగా డ్రైవ్ చేస్తూ వివేక్, పిల్లలూ వచ్చేలోపు ఎన్నిపనులు చెయ్యొచ్చో ఆలోచిస్తున్నది. పిల్లలు ఇద్దరూ చిచింద్రీలు అంటే వివేక్ వాళ్ళను మించిన చిచింద్రీ! ఇంట్లో వుంటే చాలు ఏదో వంకతో సంధ్య చుట్టూ తిరుగుతూ సంధ్యను పని చేసుకోనివ్వడు. ఏమన్నా అంటే "ఎప్పుడూ నీ పక్కనే వుంటూ అన్నింట్లో సాయం చెయ్యాలని మా అమ్మ చెప్పింది" అంటూ అల్లరి మొదలుపెడతాడు! ముత్యాల్లాంటి పిల్లల్ని బంగారం లాంటి భర్తను తలచుకుంటూ సంధ్య తనలో తాను నవ్వుకుంది.

ఇంటికి రాగానే మైల్ మెయిల్ బాక్స్‌లో వున్న మెయిల్ తీసుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన సంధ్య అర్జంటుగా ఓ కప్పు టీ తాగి పనులు మొదలు పెట్టాలనుకుంది. వేడివేడి టీ తాగుతూ రిలాక్స్ అవుతున్న సంధ్య దృష్టి టేబుల్ మీద తను పెట్టిన మెయిల్‌లో 'ఇన్విటేషన్' అని ప్రింట్ చేసిన కవరు మీద పడింది. వెంటనే జాగ్రత్తగా ఓపెన్ చేసి చూసింది. అది న్యూజెర్సీ తెలుగు కళాసమితి రజితోత్సవ ఆహ్వాన పత్రిక. నీలిరంగు కార్డు మీద మిలమిల మెరిసిపోతున్న వెండి అక్షరాలతో చక్కని డిజైన్‌తో చూడముచ్చటగా వుంది. కార్డుపైన సంధ్యకు ఎంతో పరిచయమైన కళా సమితివారి ముద్ర నీళ్ళపై తేలుతున్న వేయిరేకుల పద్మం, దాన్ని అంటి పెట్టుకుని వున్న విరిసీవిరయని మొగ్గ ఆ కార్డుకు మరింత అందాన్నిచ్చింది. ఈ ఇన్విటేషన్‌తో పాటు సంధ్యకు కళాసమితివారు ప్రత్యేకంగా రాసిన లెటరు కూడా అందులో వుంది. గబగబ తెరిచి చూసింది సంధ్య. ఆ లెటరు చదువుతున్న సంధ్య తన పనుల మాటే మర్చిపోయింది.

ఆ రోజు రాత్రి పక్క గదిలో పిల్లలు, పక్కన వివేక్ ఆదమరచి నిద్ర పోతుంటే, సంధ్య మాత్రం ఆ రోజు వచ్చిన ఇన్విటేషన్ గురించి, కళాసమితివారు తనకు రాసిన ఉత్తరం గురించి ఆలోచిస్తున్నది. సాయంకాలం నుంచి సంధ్య మనసంతా ఆ సంస్థ చుట్టే తిరుగు తోంది. తెలుగు కళా సమితి సిల్వర్ జుబ్లి సెలబ్రేషన్స్‌కు వివేక్, పిల్లలతో వెళ్ళి ఆ సంబరాల్ని అమ్మా నాన్నలతో, ఫ్రెండ్స్‌తో కలిసి పంచుకోవడానికి సంధ్య మనసు ఉవ్విళ్ళూరుతున్నది!

ఆ తెలుగు సంస్థతో తనకు వున్న అనుబంధాన్ని తలచు కుంటున్న సంధ్య మనసులో తియ్యటి జ్ఞాపకాలు పరుచు కుంటున్నాయి -----------

పట్టుపరికిణీ వేసుకుని తోటిపిల్లలతో హాలులో పరిగెడుతుంటే కాళ్ళకు అమ్మ పెట్టిన పట్టాల మువ్వల చప్పుడు, గాజుల గలగలలు, జడగంటల గణగణలు సంధ్య తలపుల తలుపుని తెరవమంటున్నాయి.

స్టేజి మీద హడావిడిగా అటు ఇటు తిరిగే అంకుల్స్, టెస్టింగ్..వన్..టూ..త్రీ... అంటూ మైకులో వినిపించే తండ్రి గొంతు, స్టేజికి ఒక పక్కగా అమర్చిన దేముడి ముందు వెలిగించిన దీపాలు, అగరువత్తులు, ఆ పొగకు తనకు వచ్చే దగ్గు, చెప్పిన క్వాంటిటీలో అందరి దగ్గరనుంచి అన్నీ వచ్చాయో లేదో అని కంగారు పడుతూ, ఫుడ్డు దగ్గర ఫుట్ బాల్‌తో కూడొద్దని అరిచే అపర్ణా ఆంటీ గొంతు సంధ్య జ్ఞాపకాల కిటికీలను తెరవమంటున్నాయి--------

పదేళ్ళవయసునుంచీ తను పాడిన ప్రార్ధనా గీతాలు, చదివిన పద్యాలు, వేసిన కోలాటాలు, చేసిన

నృత్యాలు, పెద్దవాళ్ళచేత ఎలాగో ఔననిపించి నిర్వహించిన నాటకాలు, ఫాషన్ పెరేడులు ఒక్కొక్కటే సంధ్య మనసుని తాకి సన్నని గిలిగింతలు పెడుతున్నాయి-----

తల్లి ప్రతిభ, తండ్రి తెలివి పుణికిపుచ్చుకున్న సంధ్య పాటైనా, పద్యమైనా, నాట్యమైనా ఇట్టే నేర్చుకునేది! ప్రాక్టీసు టైములో తనవంతు ఠకీమని చేసి తుర్రున పారిపోయేది. 'నువ్వు నేర్చుకుంటే చాలా? నువ్వు ఇలా కబుర్లాడుతుంటే వాళ్ళు ఎలా నేర్చుకుంటారు?' అని తల్లి కోప్పడగానే బయటకు వెళ్ళి మగపిల్లలతో కలిసి బాస్కెట్ బాల్ ఆడేది. రవి, సంధ్య మాట్లాడుకుంటూనే, ఓ పక్క కూడుకుంటూనే అస్తమానం దెబ్బలాడుకునేవారు. ప్రాక్టీసుకోసం సంధ్య వేసుకునే జడ చూస్తే రవికి తగని చిరాకు. రవి ఎప్పుడూ పెట్టుకునే క్యాప్ అంటే సంధ్యకు ఒళ్ళుమంట! ఎవరూ చూడకుండా రవి సంధ్య జడలాగితే, రవికి తెలియకుండా అతని క్యాప్ దాచేసేది సంధ్య. ప్రతి ఫంక్షనుకు ముందు ప్రాక్టీసు పేరుతో పెద్దవాళ్ళు హైరాన పడుతూంటే, పిల్లలు మాత్రం పార్టీకి వెళ్ళినట్టు హాయిగా గడిపేవారు.

సంధ్య చురుకుతనం గమనించి, తను నేర్చుకున్నవి మిగతా పిల్లలకు నేర్పే బాధ్యత తల్లి సంధ్యకు ఇవ్వడం మొదలుపెట్టింది. ఆ తరువాత నెమ్మదిగా పోగ్రాము టైములో స్టేజి వెనకాలవుండి తండ్రికి సాయం చేసేది. ఒకసారి అంతకు ముందు ఫంక్షనులో ఎమ్ సీ గా చేసిన సుబ్బారావు అంకుల్ తెలుగు ఇంగ్లీష్ కలిపి ఎలా మాట్లాడాడో ఇమిటేట్ చేసి అచ్చు ఆయన మాట్లాడినట్టే ఇండియన్ యాక్సెంటుతో మాట్లాడి మిగిలిన పిల్లలందర్నీ నవ్వించింది. ఆ తర్వాత సంధ్య తల్లిదండ్రులు "ఈ సారి ఫంక్షనులో నువ్వు ఎమ్.సి.గా ఉండి ఎలా చెయ్యాలో చూపించు" అంటూ తను చేసిన తప్పుకు పనిష్మెంటు ఇచ్చారు. అమ్మా, నాన్నల ముందు ఓడిపోవడం ఇష్టంలేని సంధ్య దాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని ప్రతి వాక్యాన్ని ఎలా పలకాలో నేర్చుకుని కంఠతాపట్టి చక్కని తెలుగులో మాట్లాడి అందరిని ఆశ్చర్యపరిచి సెభాష్ అనిపించుకుంది!

అలా సంధ్యకు తెలియకుండానే కళాసమితితో అనుబంధం పెరుగుతూ వచ్చింది. హైస్కూలు అయిపోయి కొలంబియాలో చదువుతూ కూడా సంధ్య తెలుగు కళాసమితి కార్యక్రమాల్లో పాల్గొంటూనేవుంది. వివేక్‌ని పెళ్ళిచేసుకున్న తర్వాత ఉద్యోగరిత్యా సంధ్య న్యూజెర్సీ వదలి బోస్టను వెళ్ళిపోయింది.

నిద్రలో ఇటు తిరిగిన వివేక్ ముఖం రూములో అలుముకున్న సన్నని వెలుగులో ఎంతో అందంగా కనిపించింది సంధ్యకు. ఈ వివేక్‌ని పెళ్ళిచేసుకోడానికి ఆనాడు తను సందేహించడం గుర్తొచ్చి సంధ్య నవ్వుకుంది. తోటి పిల్లల్లాగే తనకి తానుగా చూసుకుని పెళ్ళి చేసుకోవాలని వున్నా అప్పట్లో అలాంటి అవకాశాలు లేవని, వున్నా చాలా తక్కువ అని సంధ్యకు తెలుసు. అయినా ఎవడో ముక్కు మొహం తెలియని వాడిని చేసుకోనని సంధ్య మొండికేసింది. ఇండియాలో వున్న వివేక్‌ను వెళ్ళి కలవమంటే ఇక్కడవున్న వాళ్ళకు అక్కడవున్న వాళ్ళకు పొత్తుకుదరదని తల్లితండ్రులతో వాదించింది.

ఈ దేశానికి విజిటర్‌గా వచ్చిన వివేక్ తల్లి అనుకోకుండా తెలుగు కళాసమితి వారి ఫంక్షనుకు వచ్చి అక్కడ సంధ్యను చూసి ముచ్చట పడింది. సంధ్య సందేహాలు, భయాలు తెలుసుకున్న వివేక్ తల్లి సంధ్యకు తన కుటుంబం గురించి అన్ని వివరాలు చెప్పి 'మా అబ్బాయి మంచి చదువు, సంస్కారము, సరదా వున్నవాడే. కానీ మన పద్ధతులు సంప్రదాయాలు వంటివి వంటబట్టాలంటే మా వివేక్‌కు నీ లాంటి అమ్మాయి రావాలి. అందుకే ప్రత్యకంగా అడుగు తున్నాను" అంటూ సంధ్య బుజం తట్టి వెళ్ళారు. తల్లి సంధ్యతో "మన రాజ్యం పిన్ని వాళ్ళు అక్కడే రెండిళ్ళవతల వుంటారు. ఓ రెండు నెలలు వుండి చూడు. అతను నీకు నచ్చకపోతే బలవంతం ఏమీలేదు" అంటూ నచ్చచెప్పి పంపించారు. ఆరు నెలలు తిరగకుండానే సంధ్య పెళ్ళి వివేక్‌తో జరిగిపోయింది!

వృత్తిపరంగా సంధ్యకు ఇన్విటేషన్లు, లెటర్లూ వస్తూనే వుంటాయి కానీ కళాసమితివారు పంపిన ఇన్విటేషను, ఉత్తరం సంధ్యకు ఓ ప్రత్యేక అనుభూతిని కలిగించాయి. ఇక్కడ పుట్టి పెరిగిన యువతరానికి ప్రతినిధిగా, కీనోట్ స్పీకర్‌గా తెలుగు కళాసమితి సంధ్యను ఆహ్వానించింది. కళాసమితి రజతోత్సవ సందర్భంగా సంస్థ స్థాపనకు, అభివృద్ధికి కారకులైన పెద్దవారిని గుర్తించడమే కాకుండా, సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రభావితులైన యువతరాన్ని కూడా గుర్తించాలని ఉత్సాహపడుతోంది. వారికోసం ప్రత్యేకంగా విజ్ఞాన వినోద కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సంస్థతో పెరిగి పెద్దయి తమ జీవితాలను చక్కగా మలచుకొని ఎక్కడెక్కడో వున్న

యువతీ యువకులందరిని ఆ రోజు వేదిక మీదకు తీసుకు రావాలని తెలుగు కళాసమితి ఉబలాట పడుతోంది. వారి అభిప్రాయాలను, అనుభవాలను, వారి సూచనలతో పాటు భావితరానికి వారిచ్చే సందేశాలను వినాలని కళాసమితికి కుతూహలంగా వుంది!

ఆ ఉత్తరంలోని ప్రతి వాక్యము సంధ్య పదేపదే మననం చేసుకుంటున్నది. ఈదేశంలో ప్రవాసాంధ్రులు ఏ ఆశయాల్ని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి సంస్థలు స్థాపించారో ఆ ఆశయాల ఫలితమే సంధ్యలాంటివారు అని తెలుగు కళాసమితి వారు ఆ ఉత్తరంలో అన్నారు. సంధ్యలాంటి యువత తెలుగు కళాసమితి కలలకు చిహ్నమని, వారి పాతికేళ్ళ పురోగతికి ప్రతిబింబాలని అంటూ తమ సంతోషాన్ని ప్రకటించారు. ఎన్నో విజయాలను సాధిస్తున్న ఈ యువతీయువకుల్ని చూసి సంస్థ గర్వపడుతోందన్నారు.

కళాసమితికి తన తరం పట్లవున్న అభిమానానికి, గౌరవానికి వుప్పొంగిపోయినా, సంధ్యకు తెలుసు ఈ విజయం పూర్తిగా తమది కాదని. తమని పెంచి పెద్ద చేసిన అమ్మా నాన్నలతో పాటు ఈ సంస్థకు కూడా తమ విజయంలో భాగం వుంది. మనిషి జీవితం సాఫీగా నడవడానికి కావలిసిన మంచి లక్షణాలను ఎన్నో ఈ సంస్థ ద్వారా నేర్చుకున్నారు, సంధ్యలాంటి పిల్లలు. పక్కవారికి సాయపడటం, నలుగురితో కలసి పని చేయడం, పరిస్థితులకనుగుణంగా సర్దుకు పోగలగడం, జీవితంలో వచ్చే మార్పుల్ని ఒడిదుడుకుల్ని తట్టుకుని ముందుకు వెళ్ళగలగటం ------- ఇలా ఎన్నో ఈ సంస్థ నేర్పింది. తను ఎక్కడినుంచి వచ్చిందో చెప్పి, తన భాషా సంస్కృతిని నేర్పి తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. సంఘంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి చేయూత నిచ్చింది. ఎదిగే వయసులో పక్కదోవలు పట్టకుండా ఈ సంస్థ తనను కాపాడింది.తను ఒక చక్కని యువతిగా, భార్యగా, తల్లిగా, ఉద్యోగస్తురాలిగా, గృహిణిగా రాణించడానికి వెనుక తెలుగుకళాసమితి పేరుతో ఏంతోమంది వున్నారని 'It takes a village to raise a child'లో అర్థాన్ని సంధ్య పెద్దైన తర్వాత తెలుసుకుంది.

కళ్ళమీదకు నెమ్మదిగా నిద్ర వస్తున్న సంధ్య ఈ దేశంలో మా తరం ఇంత అందంగా ఆరోగ్యంగా వుండటానికి కారణం ఇలాంటి సంస్థలే, నిజానికి మేమే ఈ సంస్థలకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి అనుకుంటూ హాయిగా నిద్రలోకి జారుకుంది.

## నువ్వు




- డా. వైదేహీ శశిధర్

ఇంకాస్సేపట్లో నిద్రలోకి జారిపోయే లోపు
మరో సౌగంధికా పుష్పాన్ని
నా జడలో తురుముతావు!

బాధల, భయాల ముళ్ళచెట్లక్రింద విశ్రమించిన
రోగుల గాయాలపై ఆరోగ్యపు లేపనాన్ని అద్దటంలో
రోజంతా అలసిపోయి కొంచంసేపు నిద్రాసౌఖ్యాన్ని
దుప్పటిలా కప్పుకుందామనేసరికి
నిండుగా పూచిన మరో పారిజాతపు పాదని
నాముంగిట్లో నాటుతావు!

బాధకీ, ఉపశాంతికీ, ఆశకీ, నిరాశకీ
మధ్య ఊగిసలాడే నా పేషంట్లని
ఆరోగ్యపు తీరానికి చేర్చటానికి
సాయంత్రం వరకూ సరంగునై తిరిగి తిరిగి

కొంచంసేపు కలలు కూడా లేని నిద్రను
మేలిముసుగులా కప్పుకుందామంటే
నిద్రించిన నా స్వప్నాలన్నింటినీ
పున్నాగ పూలగుత్తులుగా మేల్కొల్పి
ఓ గాఢమైన పరిమళ ప్రవాహంలో
నన్ను ముంచివేస్తావు ! !

# హాలికులై నేమి...

**- నిడదవోలు మాలతి**

అర్ధరాత్రి దాటింది. మనోరమా, ఇద్దరు పిల్లలూ పడకెక్కేసి మూడున్నర గంటలైయింది. చంద్రం కంప్యూటరుకి అంటుకు పోయి ఉద్యోగాలవేటలో వేసారి, రంగుబుడగలు షూట్ చెయ్యడం మొదలుపెట్టేడు. చుంయ్ చుంయ్ మంటూ పెనంమీద పెసరట్లలా స్క్రీనుమీద బుడగలు చితికిపోతున్నాయి.

“బుర్రతో పనిలేని ఆట ఆడుతున్నాను“ చంద్రం గొణుక్కుంటున్నాడు చితికిపడుతున్న బుడగలు చూస్తూ.

“బుర్రతో పనిలేనిఆట.“ బుర్రతో పనిలేని ఆటే అయినా వదలబుద్ధి పుట్టడంలేదు. అలాగని మనశ్శాంతీ లేదు. ఈ పనికిమాలిన ఆట నేనెందుకు ఆడుతున్నాను“ అనిపిస్తోంది కానీ సమాధానం తోచడంలేదు. తనప్రమేయం లేకుండానే బుర్రో చెయ్యో ప్రోగ్రాము అయిపోయినట్టు, అసంకల్పిత ప్రతీకార చర్యలాగ ఆట సాగిపోతోంది. తాను “బుర్ర అక్కర్లేని ఆట ఆడుతున్నాన“ ని చెప్పుకోడం మాత్రం మానలేకుండా వున్నాడు.



నాలుగేళ్ళయింది వుద్యోగంలో చేరి.

మూడునెలలయింది ఉద్యోగం పోయి.

చేరినప్పుడు ఇలా అవుతుందని అనుకోలేదు. అప్పట్లో ఆ కంపెనీ శుక్లపక్ష చంద్రునిమాడ్కి దినదిన ప్రవర్ధమానంగా పెరిగి పోతోందని విని చేరాడు. దేశంలో ఆర్థికపరిస్థితి ఎలా వుందో పింకుస్లిప్పు పుచ్చుకున్న రోజున గాని గ్రహింపుకి రాలేదు. కళ్ళెదుట కొండచిలువలా కనిపిస్తున్న సమస్యలు కూడా “తన దాకా వస్తేగానీ“ తెలీవని ఇప్పుడే తెలిసింది.

“బోడి వుద్యోగం. అదే దొరుకుతుంది ఇది కాకపోతే దీని తాతలాటిది“ అని తనకి తనే చెప్పుకోడమే కాక, మనోరమకి కూడా మాటిచ్చాడు. మొదట్లో కొన్నాళ్ళు కులాసాగా గడిపేడు unearned holidays అనుకుంటూ. ఆ తరవాత తనకి తెలిసినవాళ్ళనీ, ఉద్యోగాల్లో వున్న వాళ్ళనీ కదిపి చూసేడు.

వాళ్ళు యథాశక్తి సానుభూతులు చెప్పి, ప్రస్తుతం తమకి తెలిసినవేమీ లేవనీ, తెలిస్తే మాత్రం తప్పకుండా చెప్తాం అనీ నొక్కి చెప్పేరు. ఏదైనా అవసరమయితే ఏ మాత్రమూ సంకోచించకుండా అడగమని కూడా చెప్పారు.

చంద్రం నెట్లోనూ, పేపర్లలోనూ కనిపించిన ఉద్యోగాలన్నిటికీ అర్జీలు పెట్టుకొస్తున్నాడు. రోజులూ, వారాలూ, దొర్లుకుపోతున్నయి నిస్సారంగా. monster లో కూడా తనపేరూ, అర్హతలూ, నమోదు చేసాడు. ఎన్ని సార్లు చూసినా ఏదో కంపెనీలో బుక్క్ కీపింగ్ పని చూపిస్తోందే కానీ తన ఇంజనీరింగుచదువుకి తగిన పని కనపించడంలేదు. బుక్క్ కీపింగ్ చెయ్యగలనన్న నమ్మకంలేదు.

మనోరమ పిల్లలు చదువుతున్న ఎలిమెంటరీ స్కూల్లో substitute teaching చేస్తూ వుంటుంది. అంచేత చెప్పుకోదగ్గ ఆదాయం కాకపోయినా, కొంతలో కొంత నయం.

ఓరోజు జగదీశ్ బజారులో కనిపించాడు. ఆయనతో చంద్రానికి అట్టే పరిచయంలేదు.వూళ్ళోవున్న వందమంది భారతీయుల్లో అతనొకడని తెలుసంతే. కాస్త జంకు తూనే హలో అన్నాడు చిరునవ్వు మొహాన మెత్తుకుని.

జగదీశ్ మెకానికల్ ఇంజనీరు, వ్యవసాయపరికరాలు తయారు చేసే గ్రీన్ మెటల్ కంపెనీలో ఛీఫ్ ఇంజనీరు. అంచేత తను అతన్ని పలకరిస్తే, ఉద్యోగంకోసమేనని అతను అనుకుంటాడేమోనని చంద్రం బాధ. ఆమాట నిజమే అయినా ...

జగదీశ్ కూడా సంకోచిస్తూనే తిరుగు హలో చెప్పాడు. అతని సంకోచానికి కారణం చంద్రం ఆలోచనకి అటువైపున్నది. “వీడికి ఉద్యోగం వుంది, నాకు లేదు“ అని చంద్రం చిన్నబుచ్చుకుంటాడేమోనని జగదీశ్ బాధ. ఇలా ఇద్దరికిద్దరూ సంకోచిస్తూనే, సగం సగం

మొహాల్తో హలోలు చెప్పుకుని, మీరెలా వున్నారంటే మీరెలా వున్నరాని అడుగుకొంటూ చిరు సంభాషనకి నాంది పలికేరు. ఆతరవాత చంద్రం ఉద్యోగం మాట రాక తప్పలేదు.

జగదీశ్ నెమ్మదిగా, "సారీ. మీకంపెనీలో జాబ్‌కట్సు గురించి విన్నాను" అన్నాడు.

చంద్రం "ఫ్" అన్నాడు భుజాలు కుదించి. "ఇంతదాకా రానేవచ్చింది, ఇహనెందుకు మొహమాటం" అనుకుని, "మీ కంపెనీలో ఏవైనా అవకాశాలుంటే చెప్పండి. నాకు వూరికే కూర్చోవడం చాలా కష్టంగా వుంది" అన్నాడు ఆయనతో.

జగదీశ్ "అలాగే తప్పకుండాను. నేను మా హెచ్.ఆర్ ని కనుక్కుని చెప్తాను. మీసెల్లివ్వండి" అని నెంబరు తీసుకుని, శుభాకాంక్షలు చెప్పి వెళ్ళిపోయాడు.

చంద్రం ఆశలు మేస్తూ ఇల్లు చేరుకున్నాడు ఆపూటకి చాంద్రాయణం ముగించి.

నాలుగు రోజులయింది. జగదీశ్ కంపనీనుండి చంద్రానికి పిలుపు వచ్చింది.

"హలో. చంద్రంతో మాటాడాలి. వున్నారా?"

"యస్సస్. నేనే. చంద్రమే మాటాడుతున్నది"

"మీ విషయం జగదీశ్గారు చెప్పేరు. ఇంటర్వ్యూకి సోమవారం పదిన్నరకి వీలవుతుందా? లేక రెండు గంటలకా?"

ఆలస్యం అమృతం విషమని కదా నానుడి. "పదిన్నరకి రాగలను."

"సరే. మా హ్యూమన్ రిసోర్సెస్ డైరెక్టరుతో సోమవారం పదిన్నరకి మీ ఇంటర్వ్యూ నిర్ణయమయినది. మీకు ఎక్కడికి రావలెనో తెలుసా?"

తెలుసు, తెలుసు. సోమవారం పదిన్నరకి మీ హ్యూమన్-రిసోర్సెస్ డైరెక్టరుని కలుసుకోడానికి వస్తాను." అని వివరాలు వల్లెవేసి, తనకి అర్థం అయినట్టు తెలియ జేసి, సెల్లు మూసి చంద్రం నెట్టూర్చేడు. తరవాత మనోరమతో చెప్పేడు తనకి రాబోయే వుద్యోగం సంగతి. ఆవిడ కూడా అతని ఆనందంలో పాలు పంచుకుంది.

సోమవారం, ఫలానాకంపెనీలో హెచ్.ఆర్ డైరెక్టరు థాంసన్‌ని కలుసుకున్నాడు. డైరెక్టరుగారు సాదరంగా మాట్లాడేరు. కంపెనీ అంతా చూపించేరు. అతని డ్యూటీ వివరించేరు. వేరే ఇంజినీర్లు వేసిన బ్లూప్రింటులు కంప్యూటరులోంచి తీసి, ప్రింటుచేసి, నీటుగా మడత పెట్టి వర్కర్లకి ఇవ్వడం.

"మీకు ఇష్టమయితే రేపే చేరొచ్చు" అన్నాడు థాంసన్, పక్కా వ్యాపారసరళిలో.

"గంటకి ఆరు డాలర్ల ఇరవై అయిదు సెంట్లు. రోజుకి ఎనిమిది గంటలు పని." అని కూడా చెప్పేడు.

చంద్రానికి ఛెళ్ళున మొహమ్మీద కొట్టినట్టుంది తాను చెయ్యబోయే పని తలుచుకుంటే. వెంటనే నాలుగు నెలలుగా తను పడుతున్న అవస్థలు మనసులో మెదిలేయి. "బుర్రతో పనిలేని పని నాకలవాటే" అని తనకి తనే, అక్కడికక్కడ నచ్చచెప్పుకుని, "సరే, రేపు వస్తాను" అని థాంసన్‌కి చెప్పి బయల్దేరేడు. కుంజర యాధంబు దోము కుత్తుకసొచ్చినట్టు గొంతులో వెగటు. తిన్నగా ఇంటికి వెళ్ళాలనిపించలేదు. దారిలో స్టార్ బక్స్‌లో ఆగి ఓ మూల కూర్చున్నాడు. బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకని తాను అమ్మకోవడంలేదు ... కానీ ...ఆ తల్లి పెట్టిన భిక్షే తన ఇంజినీరింగు చదువు. ఆ విద్యమూలంగానే తనకి, మనోరమకీ, పిల్లలిద్దరికీ కూడు. తన జన్మలో అనుకోలేదు ఆవిద్య విలువ ఇంతగా పడిపోతుందని.. మనోరమకి ఏమని చెప్పడం... రెండు గంటలసేపు ఆలోచించి, నెమ్మదిగా ఇల్లు చేరుకున్నాడు.

మనోరమ ఇంట్లోనే వుంది.

"రేపు చేరుతున్నా గ్రీన్ మెటల్‌లో" అన్నాడు మనోరమ మొహంలోకి చూడకుండా.

"నిజంగానే! పోన్లెండి. ఈరోజుల్లో ఇంత త్వరగా ఉద్యోగం దొరకడం గొప్పే" అంది మనోరమ.

"అవును" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు చంద్రం.

ఈ పనికి ఇంజినీరింగు చదవక్కర్లేదు. హైస్కూలు చదువు చాలు.ఆమాట ప్రతిక్షణం ముల్లయి తాకుతోంది చంద్రం ఎదలో. రోజూ రాత్రి రంగుల బుడగలు చితగ్గొడుతున్నడు "బుర్రలేని పని" "బుర్రలేని పని" అని గొణుక్కుంటూ.

రెండు మాసముల తర్వాత రెవ్యూకి పిలిచాడు థాంసన్.

ఆ సమయంలో చంద్రం తన హృదయబాధ వెళ్ళబోసుకున్నడు, "నేను ఇంజినీరుని. నాలుగేళ్ళ అనుభవం వుంది నాకు. అంచేత నాకు తగిన పని ఇవ్వండి" అని.

"మీరు చేరినరోజే చెప్పేం కదా ఈ పనిలో మీ విధ్యుక్తధర్మాలు. మీరు ఇష్టపడే చేరేరు."

"అవుననుకోండి. కానీ మీరూ గ్రహించే వుంటారు నా విద్యని మీరు అండర్‌యుటిలైజు చేసుకుంటున్నారని. గ్రోసరీ స్టోరులో సంచీలో కూరలు పెట్టేవాళ్ళకి గంటకి పన్నెండు డాలర్లు ఇస్తున్నారు.ఆపాటి చెయ్యనా ఇక్కడ?"

"ఎక్కడిపద్ధతులు అక్కడే. జేన్స్‌విల్లో కార్ల ఎసంబ్లీ చూసారా మీరు? కన్వేయర్ బెల్టుమీద కారు భాగాలు ఒకొకటే వస్తుంటాయి. ఒకడు తలుపు తగిలిస్తాడు. మరొకడు మేకు తగిలిస్తాడు. రోజంతా వారిపని అదే. రోజుకి ఎనిమిదిగంటలు అలా మేకులు తగిలించడమే. వాడికి గంటకి ముప్ఫై డాలర్లు." అన్నాడు థాంసన్. "మీరు చేయగలరా ఆపని?" అన్న ప్రశ్న ఆయన అడక్కపోయినా చంద్రానికి వినిపించింది.

ఉసూరుమంటూ వచ్చి తనసీటులో కూర్చున్నాడు. పక్కనున్న టేమీ జాలిగా అతనివేపు చూసింది.

"నీకు ఈపని చూపించింది ఎవరు?" అని అడిగింది.

"జగదీశ్. ఏం?"

"ఆయనకిచ్చే వందా నీకే ఇవ్వొచ్చు కదా."

"అదేమిటి?"

"ఈచెత్తపనికి ఎవరూ రారు. వచ్చినవాళ్ళు ఆర్నెల్ల కంటే వుండరు. అంచేత మనలాటివాళ్ళని తీసుకొచ్చి వీరికి అప్పచెప్పినవాళ్ళకి వంద డాలర్లు బోనస్ ఇస్తారు. పెద్దలకయితే వందా, పిన్నలకయితే యాభై."

చంద్రనికి బాధపడే ఓపిక లేదు. "ఓ" అనేసి వూరుకున్నాడు.

నాలుగు రోజుల తరవాత ఒకరోజు థాంసన్ కాఫీ షాపులో కనిపించేడు. చంద్రం మర్యాదకి హలోఅన్నాడు.

ఆయన తన పక్కన సీటు చూపించి అన్నాడు, "రండీ, చందారా! నాకో ఆలోచన వచ్చింది. మీరు వింటానంటే చెప్తాను."

"చెప్పండి."

"నేను రిటైరవుదాం అనుకుంటున్నాను. ఇప్పుడే కాదులెండి, మరో రెండేళ్ళకో మూడేళ్ళకో. అయోవాలో వంద యకరాలు మొక్కజొన్నతోట కొన్నాను. ఇప్పుడు ఎథెనాల్‌కి మంచి గిరాకీ వుందికదా. నేను ఇప్పుడప్పుడే ఆపని చేపట్టలేను. ప్రస్తుతానికి మానాన్న అక్కడ వున్నారు కానీ ఆయనకి మెషినరీ ఆపరేట్ చెయ్యడం చేతకాదు. అంచేత మీరు సాయం చేస్తానంటే చెప్పండి. మీది స్వెట్ ఎక్విటీ. లాభం ఇద్దరం పంచుకుందాం. వ్యాపారం అందుకునేవరకూ మీకు భుక్తికి లోపం లేకుండా చూస్తాను."

ఆయన ప్లాను అర్థం చేసుకోడానికి చంద్రానికి చాలాసేపు పట్టింది. ఆయన మాత్రం మామూలుగానే లోకరీతిన వ్యవహారదక్షతతో చెప్పుకుపోతున్నారు. మూడు చుట్లు కాఫీలయేయి.

చంద్రానికి ఇంతవరకూ గ్రీన్ మెటల్‌లో జరుగుతున్న నాటకం మనసులో మెదులుతోంది. "మంచి ప్లానులాగే వుంది" అన్నాడు సంధిగ్ధంగా.

"మంచి ప్లానే కానీ ఇంకా ప్రారంభదశలోనే వుంది. ఆలోచించుకోవలసిన విషయాలు చాలా వున్నాయి. మీకు ఆసక్తి వుంటే మాట్లాడుకుందాం." అన్నాడు బల్లమీద పది డాలర్లు పెట్టి.

చంద్రం వాలెట్ తీసేడు. "నో, నో. నేనిచ్చేశాను. మీరివ్వక్కర్లేదు." అని థాంసన్ వారించేడు.

చంద్రం ఇంటికొచ్చి రాత్రంతా ఆలోచించేడు. నిజంగా తనచదువుకు తగిన వుద్యోగం కాదు కానీ బుడగలు చితక్కొట్టడం కంటే మెరుగే.

పడగ్గదిలోకి వచ్చి చూస్తే, మనోరమచేతిలో పుస్తకం, కళ్ళు సీలింగుమీదా వున్నాయి.

థాంసన్ సలహాని మనోరమకి చెప్పేడు.

"మీరేం అనుకుంటున్నారు?"

"ఏమో, నాకేం పాలుపోడంలేదు. ఇప్పుడు చేస్తున్న పని కంటే మెరుగే. ఏదో పల్లెలో పడుంటాం." అని మంచంమీద వాలి, "హాలికులైననేమి... నిజదార సుతోదర పోషణార్థమై ..." అన్నాడు.

మనోరమకి కళ్ళలో నీళ్ళు తిరిగేయి.. భర్తకి కనిపించకుండా అటుతిరిగింది. తరవాత అతికష్టంమీద, గొంతు సవరించుకుని, "అంతేలెండి" అంది.

"అయినా ప్లాను ప్రారంభదశలోనే కదా వుంది. ఆలోచించుకోడానికి చాలా టైముంది" అన్నాడు చంద్రం తనని తనే నమ్మించుకోడానికి తంటాలు పడుతూ.

# నిష్క్రమణ

*- విన్నకోట రవిశంకర్*

అంతా ఆగిపోతుంది.

పంచభూతాలు సంగమించి
శ్రమించి సృష్టించిన ఒక కల
నాకనురెప్పలు మూతపడగానే
కరిగిపోతుంది

తాను నిరంతరం
అదే పనిగా వీక్షించే
నాటకం నుంచి
నేను నిష్క్రమించగానే
ఆకాశపు తెర అలవోకగా తెరుచుకుంటుంది

పసిపాప కళ్ళలోకి
నిద్ర చేరినంత నిశ్శబ్దంగా
ఫలదీకృత కణంలోనికి
జీవం ప్రవేశించినంత రహస్యంగా




శరీరప్రాంగణానికావలి ప్రపంచంలోకి
అడుగుపెడతాను

పగలు రాత్రిగానో
రాత్రి పగలుగానో
మారుతూంటుంది

అప్పుడే విచ్చుకోబోతున్న పూలరెక్కలు
ఒంటికి సెంటు పూసుకోవటం ఆపి
ఒకసారి తల పంకిస్తాయి

ఎక్కడికో ఎగిరిపోతున్న పక్షులు ఆగి
తమ రంగురంగుల రెక్కల్ని
చప్పట్లుకొడుతున్నట్టుగా టపటపలాడిస్తాయి

ఒక లిప్తకాలం పాటు ఏదో ఆసక్తి

అటు పిమ్మట, తిరిగి అంతా
ఎప్పట్లాగే సాగిపోతుంది.

## "తెలుగు కథ శతవార్షికోత్సవాలు" - ౨౦వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక"

*- వంగూరి చిట్టెన్ రాజు*

కథ అనగానే మనకి భారతం, రామాయణం, కాశీమజిలీ కథలు, భేతాళ కథలు, బామ్మ, లేదా తాతయ్య మన చిన్నప్పుడు చెప్పిన పాడుపు కథలు, హరి కథ, బుర్ర కథ, ఆఖరికి సినిమా కథలు, ఇలా ఎన్నెన్నో గుర్తుకు రావచ్చు. కానీ తెలుగు కథ అనగానే మన సాహిత్యంలో గత వంద సంవత్సరాలకి పైగా నిలదొక్కుకుని ప్రపంచస్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్న సాహిత్య ప్రక్రియ మన "ఆధునిక కథ" అని మనందరికీ అనుకోకుండానే అనిపిస్తుంది. ఈ రోజుల్లో నవలా సాహిత్యం మరుగున పడిపోయింది. కవితా సంకలనాలు చెప్పుకో దగ్గ సంఖ్యలో వెలువడుతున్నప్పటికీ, పౌరాణి కేతర, సృజనాత్మక సాహిత్యం పుస్తకాల కొనుగోలు విషయంలో కథా సంకలనాలదే అగ్ర తాంబూలం. కథా రచయితలు అనేక మంది, అనేక విషయాలను స్పృశిస్తూ, అన్ని మాండలికాలలోనూ మంచి కథలు వ్రాస్తున్నారు. అందుకే ఆధునిక కథకి ప్రస్తుతం "స్వర్ణయుగం" నడుస్తోంది అని సాహితీవేత్తల అభిప్రాయం.

గమనించదగ్గ విషయం ఏమిటంటే, మొత్తం భారత దేశంలోనే ఆధునిక కథ ౧౮౯౭లో బెంగాలీలో గంగోపాధ్యాయ వ్రాసిన "మధుమతి" అనే కథ. తెలుగులో ఈ ఆధునిక ఎప్పుడు "పుట్టింది" అనే విషయంలో కనీసం ఏడు అభిప్రాయాలు మన సాహితీ ప్రపంచంలో ఉన్నాయి. ఈ విషయాన్ని పరిశోధించి, - ఆధారాలు చూపించి, తర్కించిన వారిలో కొండవీటి సత్యవతి (భూమిక), భార్గవీ రావు (నూరేళ్ళ పంట - కథా సంకలనం ), పురిపండ అప్పల స్వామి, గిడుగు సీతాపతి, ఆరుద్ర, నిడదవోలు వెంకట్రావు, అక్కిరాజు రమాపతిరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, శెట్టి ఈశ్వరరావు, సుజాత, ఆదిరాజు వీరభద్రరావు మొదలైన వారు ప్రముఖులు. ఈ వాదనలన్నింటినీ క్లుప్తంగా క్రోడీ కరించి, ఎంతో శ్రమ పడి తెలుగులో ప్రచురించబడిన మొదటి ఏడు కథలనూ శ్రీ కాళీపట్నం రామారావు గారు (కథానిలయం-శ్రీకాకుళం ) ఫిబ్రవరి, ౨౦౦౬లో ప్రచురించి మన సాహిత్య చరిత్రకి ఎనలేని సేవ చేశారు.

తొలి తెలుగు కథలు - ప్రచురణాక్రమం. (కథా నిలయం వారి ప్రచురణ ఆధారంగా)

౧. "ధన త్రయోదశి" - భండారు అచ్చమాంబ- హిందూ సుందరి , ౧౯౦౨ నవంబరు సంపుటము ౧: సంచిక ౭ (గ్రాంథిక భాష)

౨. "స్త్రీ విద్య "(భార్యాభర్తల సంవాదము ) - హిందూ సుందరి , ౧౯౦౨ నవంబరు సంపుటము ౧: సంచిక ౭ (గ్రాంథిక భాష)

౩. "లలిత - ఆచంట సాంఖ్యాయన శర్మ , "కల్పలత" - ౧౯౦౩ నవంబరు సంపుటం: ౧, సంచిక: ౩. (గ్రాంథిక భాష)

4. "విశాఖ" - ఆచంట సాంఖ్యాయన శర్మ , "కల్పలత" - ౧౯౦4 అక్టోబర్- నవంబరు సంచికలు. (గ్రాంథిక భాష)

5. "అపూర్వోపన్యాసము" - ఆచంట సాంఖ్యాయన శర్మ, "కల్పలత" - ౧౯౦౩ నవంబరు సంచిక: 4. (గ్రాంథిక భాష)

౬. "దిద్దుబాటు" - గురజాడ అప్పారావు - "ఆంధ్రభారతి" ఫిబ్రవరి ౧౦,౧౯౧౦. వ్యావహారిక భాష

౭. "హృదయ శల్యము" - మాడపాటి హనుమంత రావు. - "ఆంధ్రభారతి" ౧౯౧౨ (గ్రాంథిక భాష)

ఈ పట్టికని బట్టి, ఇతర ప్రముఖుల అభిప్రాయాలని ఆమోదిస్తూ, ఈ సంవత్సరం (౨౦౦౯) తెలుగు నాట, వ్యావహారిక భాషలో గురజాడ వారి కథని తొలి - ఆధునికకథగా గుర్తించి "తెలుగుకథ శతవార్షికోత్సవాలు" జరుపుకుంటున్నారు. చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే గురజాడ గారు మొదట ఇదే కథని "కమలిని" అనే పేరుతో గ్రాంధిక భాషలో వ్రాసినప్పటికీ, ఆప్త మిత్రుడు, సాహిత్యం అందరికీ అర్థమయ్యే వ్యావహారిక భాషలో ఉండాలని వాదించిన సాహితోద్యమకారులైన గిడుగు రామమూర్తి గారి పట్టుదల వలన అదే కథను వ్యావహారిక భాషలో తిరగ వ్రాసి, ప్రచురించారు. మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, "దిద్దు బాటు" ప్రచురించబడిన సంచికలోనే, వ్యావహారిక భాషలోనే గురజాడ వారి రెండో కథ "మీ పేరేమిటి?" కూడా ప్రచురించబడింది. కానీ "కథానిలయం" వారు ఈ కథని తొలి కథలలో ఒకటిగా గుర్తించ లేదు. అయినా, శ్రీ కేతు విశ్వనాథ రెడ్డి గారు ప్రధాన సంపాదకులుగా విశాలాంధ్ర వారు ౨౦౦౬లో

ప్రచురించిన "తెలుగు కథ"లో ఈ కథని గుర్తించి ప్రచురించారు. సుప్రసిద్ధ కథకులు కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్‌లే కాక, మహాకవి శ్రీశ్రీ గారి శతజయంతి కూడా ఈ సంవత్సరమే కావడం గమనించదగ్గది.

ఇంచుమించు 20వ శతాబ్దం తొలి దశకం నుంచి 1925 వరకూ తెలుగు కథ తప్పటడుగులు వేస్తూ వచ్చింది. ఎందుకంటే ఈ నాటి కథా లక్షణాలు, వాటి అవగాహన (శిల్పం, శైలి, వస్తువు, గమనం, రంభం, ముగింపు, క్లుప్తత మొదలైనవి.) పూర్తిగా పరిణితి చెందక ఆ రచనలని నవలిక, చిన్న కథ, కథకము, కథనకము, మొదలైన పేర్లుపెట్టేవారు. 1936లో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు ఈ లక్షణాలని క్రోడీకరించి, ఈ ప్రక్రియకు "కథానిక" అనే పేరుని నిర్ధారించారు. ఇప్పుడు పేజీలు ఎక్కువ ఉంటే కథ, రెండు, మూడు పేజీలు మాత్రమే ఉంటే కథానిక అని వాడుకలో ఉన్న అర్థాలు.

అమెరికాలో తెలుగుకథ: చారిత్రాత్మక ప్రాముఖ్యత:

మామూలుగా కథాప్రక్రియ గురించి కానీ, ఏ కథారచయిత ప్రత్యేకత గురించి కానీ మాట్లాడుకునేటప్పుడు కథా బలమూ, చదివించే శక్తీ మొదలైన సాహిత్య పరమైన విషయాలకే తప్ప చారిత్రాత్మక ప్రాముఖ్యత ఎక్కువగా ప్రస్తావనలోకి రాదు. కానీ, అమెరికా తెలుగు కథ అనగానే, నా దృష్టిలో తెలుగు కథ శతచార్షికోత్సవాల నేపథ్యంలోనే కాకుండా, విదేశాలకు వలస వెళ్ళి, భిన్న సంస్కృతుల మధ్య తెలుగు వారి జీవన విధానాల అవగాహనకి అమెరికా కథకుల ప్రయత్నాలు, ప్రచురించిన కథలూ ఎంతో విశిష్టమైన, అంతకు పూర్వం ఎన్నడూ కనీ వినీ ఎరగని చారిత్మ్రాకత ప్రాముఖ్యతని సంతరించుకుంటాయి.

ఎందుకంటే తరతరాలుగా ఎందరో తెలుగు వారు మన మాతృదేశాన్ని వదిలిపెట్టి ఇతర దేశాలకు తరలి వెళ్ళారు, వెడుతున్నారు, ఇక ముందు కూడా వెళ్తారు. బర్మా, మలేషియా, ఫిజీ, ఇండోనేషియా, దక్షిణ ఆఫ్రికా, మారిషస్, సింగపూర్, ఇంగ్లండ్.. ఒకటేమిటి.... ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకీ విస్తరించిన మన తెలుగు వారి అనుభవాలు, మొదటి తరం వారి కష్టనష్టాలూ, తరవాతి తరం వారి సమస్యలూ, సుఖాలూ, దు:ఖాలూ నా బోటి సామాన్యులకి అందుబాటులో లేవు. నా వ్యక్తిగతమైన అభిప్రాయంలో అందుకు ముఖ్య కారణం ఆయా దేశాలలో స్థిరపడిన తెలుగు వారు తమ అనుభవాలను, చరిత్రనూ సాహిత్యరూపంలో పదిల పరచక పోవడమే. ఎందుకంటే సాహిత్యం కలకాలం నిలబడుతుంది. పైగా "రవి గాంచనిచో కవి గాంచును" కాబట్టి తమదే అయిన పద్ధతిలో రచయితలు వాస్తవికతకి తమ ఊహజనితమైన ఆలోచనలు కూడా జోడించి జరుగుతున్న చరిత్రని రసవత్తరంగా మన కళ్ళ ముందు ఉంచగలరు.

ఉదాహరణకి, చారిత్రాత్మకంగానూ, శాస్త్రీయపరంగానూ ఖచ్చితంగా తెలియకపోయినా మొత్తం, భారత దేశ చరిత్ర ఈ నాడు ఏ మాత్రమైనా తెలుస్తున్నదీ అంటే అందు కారణం కేవలం సాహిత్యమే అని నా వ్యక్తిగత అభిప్రాయం. ఉదాహరణకి, భారత, భాగవత, రామాయణాలే అదుతమైన సృజనాత్మకతతో వ్యాసుడు, వాల్మీకి వ్రాయకపోతే, ఆ కథలు ఇప్పటికీ నిలబడేవే కావు. రాముడు, కృష్ణుడు మొదలైన వారు దేముళ్ళని మనకీనాడు తెలిసేదే కాదు. భారత దేశ చరిత్ర రచించిన ప్రతీ చరిత్రకారుడూ, దొరికిన శిథిలాలు, శాసనాలతో పాటు, వేదాలనీ, పురాణాలనీ, ఇతిహాసాలనీ మథించి, అందులోంచి చారిత్రాత్మక సత్యాలని వెలికి తీసి అనుసంధానం చేశారు.

ఉత్తర అమెరికాకి తెలుగు వారు రావడం 1960 లలో మొదలు పెట్టినా, పెద్ద ఎత్తున వలస వచ్చి ఇక్కడే స్థిరపడిపోవడం 1970లలో ప్రారంభం అయిందని చెప్పవచ్చు. మొదటితరం అమెరికా ఆంధ్రులు తెలుగు భాషమీదా, సంస్కృతి మీదా మమకారం ఏ మాత్రం తగ్గించుకోలేదు. అందువలనే అమెరికాలో అన్ని నగరాలలోనూ తెలుగు రచయితలు తమ అనుభవాలనీ, మాతృదేశం జ్ఞాపకాలనీ, భిన్న సంస్కృతుల మధ్య తమ జీవన విధానాలనీ ప్రతిబింబిస్తూ ఎవరికి తోచిన శైలిలో వారు రచనలు సాగిస్తూ వచ్చారు. వారిలో చాలా మంది అమెరికా వచ్చాకే రచనావ్యాసంగం చేపట్టారు. వారంతా తెలుగు డైస్పోరా రచయితలు. ముఖ్యంగా మొదటి తరం రచయితల రచనలకి విశేషమైన చారిత్రాత్మక ప్రాముఖ్యత ఉంటుంది. మొదటితరం అనుభవాలు మరింకెవరికీ అందుబాటులో ఉండవు. ఇవన్నీ బహుశా పదేళ్ళనుంచీ, పాతికేళ్ళలోపుగా అంతరించి పోయి, రెండో తరం పుట్టుకొస్తుంది. రెండో తరం వారి కథలూ, కమామీషులూ వేరు. ఏ తరం వారైనా, సాహిత్య రూపంగా ఆయా రచనలని ప్రచురించి, పదిల పరిచినప్పుడే వాటికి శాశ్వత రూపం కలుగుతుంది.

"20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంధం" ప్రచురణ.

తమ సృజనాత్మకరచనల ద్వారా, అంటే తాము రచించిన కథలూ, కవితలద్వారా చరిత్రని సృష్టిస్తున్నట్టు గానీ, చరిత్రని పదిలపరుస్తున్నట్టుగానీ తెలుగు రచయితలకి ముఖ్యంగా ఉత్తర అమెరికా తెలుగు రచయితలకి తెలియజేయడం, వారి రచనలని పదిల పరచడం నా దృష్టిలో చాలా ముఖ్యమైన విషయం. అటువంటి శాశ్వత రూపం నాకున్న పరిధులలో ఎలా కలిగించాలా అనేది నన్ను చాలా వేధించిన సమస్య. ఈ సమస్యకి నాకు తోచిన పద్ధతిలో పరిష్కరించే అవకాశం ఇప్పుడు వచ్చింది. ఈ అవకాశం పేరు "తెలుగు కథ శతవార్షికోత్సవాలు". దేశమంతటా వంద సంవత్సరాల తెలుగుకథని నెమరు వేసుకునే ఈ చారిత్రాత్మక వాతావరణంలో అమెరికా ఖండంలో ఇంచుమించు ఆరుదశాబ్దాల సంవత్సరాల తెలుగు కథ, తెలుగు సాహిత్యాల పెంపుదలకి కారకులైన నిస్వార్థ సేవకులని గుర్తించి, గౌరవించడం సమంజసంగా భావించాం. ఆ భావనకి మేము కల్పించిన రూపు "20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంధం" ప్రచురణ. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు ప్రచురించిన 'ఈ బృహత్ గ్రంధాన్ని (సుమారు ఆరు వందల పెద్ద పేజీలు, 116 అమెరికా కథలు, 125 అమెరికా సాహితీవేత్తల జీవిత విశేషాలు) శ్రీ కాళీపట్నం రామారావు గారే మార్చి 11, 2009 నాడు హైదరాబాదులో ఆవిష్కరించి తెలుగుకథ శతవార్షి కోత్సవాల నేపధ్యంలో ఈ పుస్తక ప్రాముఖ్యతను విశదీకరించడం మా అదృష్టంగా భావిస్తున్నాం.

ఆధునిక తెలుగు కథ వయసు వంద సంవత్సరాలు అయితే, అందులో ఇంచుమించు యాభై సంవత్సరాల నుంచి అమెరికా తెలుగు కథకులు భిన్న సంస్కృతుల మధ్య తెలుగు వారి జీవితానుభవాలని ...అంటే డైస్పోరా జీవితాలని కథా వస్తువుగా రచించిన కథలకి ఎంతో ప్రాముఖ్యం ఉంది అనడంలో ఏమీ సందేహం లేదు. విచారకరమైన విషయం ఏమిటంటే తెలుగు నాట సాహితీవేత్తలూ, విమర్శకులూ చాల మంది మన అమెరికా కథని తగిన స్థాయిలో గుర్తించదానికి నిరాకరిస్తున్నారు. గురించిన కొద్ది మంది కూడా "ఏదో, పరాయి దేశంలో ఉన్నారు కదా! వాళ్ళ అవస్థలగురించి బానే రాస్తున్నారు" అనే "పై నుంచి కిందకి దిగి వస్తున్నాట్టుగానే అభిప్రాయాలు వెలిబుచ్చడం కూడా విచారకరమే. అమెరికా తెలుగు కథలు రాసిలో తక్కువే అయినా వాసిలో తెలుగు నాట వెలువడుతున్న కథలకి ఏ మాత్రం తీసిపోవు అని నేను ఖచ్చితంగా చెప్పగలను.

కొన్ని వేల సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రలో విదేశాంధ్రుల సాహిత్యాన్ని, విశిష్టతనూ, చారిత్రాత్మక ప్రాముఖ్యతనూ గుర్తించి, ప్రచురించి, వెలుగులోకి తెచ్చిన ఏకైక ప్రయత్నం ఈ పుస్తక ప్రచురణ. ఈ బృహత్ గ్రంధం విలువ చరిత్రకారులే నిర్ణయిస్తారు.

అమెరికాలో తెలుగు కథ వికాసం, పెంపుదల విషయాలపై మా పరిశోధన ఆధారంగా మేము గమనించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఈ క్రింద పొందుపరిచాం.

1. భారతదేశంలో ప్రచురించబడిన మొట్టమొదటి ఉత్తర అమెరికా తెలుగు కథా రచయిత స్వర్గీయ పులిగండ్ల మల్లికార్జున రావు, (ఎడ్మంటన్, కెనడా). కథ పేరు "వాహిని"- ఆంధ్ర సచిత్ర వారపత్రిక , ఏప్రిల్ 24, 1964 సంచికలో ముద్రించబడింది. రచయిత కలం పేరు "ఆర్ఫియస్". మరో కలం పేరు "విజయ". ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చినది "రచన" సాయి గారు.

2. ఉత్తర అమెరికాలో ప్రచురించబడిన మొట్ట మొదటి తెలుగు కథలు:

"పుట్టిల్లు"-శ్రీమతి చెరుకూరి రమాదేవి(డిట్రాయిట్)

"పిరికి వాడు" - కోమలా దేవి

"యవ్వన కుసుమాలు వాడిపోతే" - కస్తూరి రామకృష్ణా రావు

ప్రచురణ: అమెరికాలో మొట్టమొదటి తెలుగు పత్రిక "తెలుగు భాషా పత్రిక" అట్లాంటా ప్రారంభ సంచిక , ఏప్రిల్ 1970. (సంపాదకులు: పెమ్మరాజు వేణుగోపాలరావు)

3. క్రమం తప్పకుండా రెండు దశాబ్దాలకు పైగా తెలుగు కథలను విస్తృతంగా ప్రచురించి, ప్రోత్సహించిన పత్రిక "తెలుగు జ్యోతి". (తెలుగు కళా సమితి, న్యూ జెర్సీ)

4. అమెరికాలో అత్యధిక సంఖ్యలో కథలు వ్రాసి, ప్రచురించిన కథకులు శ్రీ సత్యం మందపాటి (ఆస్టిన్) .

5. అమెరికాలో ప్రచురించబడిన మొట్టమొదటి కథా సంకలనం: "అమెరికా తెలుగు కథానిక - మొదటి సంకలనం"। ౧౯౯౫,(వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా)

ముక్తాయింపు:

అమెరికా తెలుగు కథకీ, రచయితలకీ తెలుగు సాహిత్య చరిత్రలో సముచితమైన స్థానాన్ని కలిగించి, గుర్తింపు తేవడం నా వ్యక్తిగత జీవిత ధ్యేయాలలో ఒకటి. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ద్వారా, అనేక మంది సహకారంతో, ఆరు సంవత్సరాల కృషి ఫలితంగా "కేవలం ఎనిమిది వేల డాలర్ల వ్యయం" తో తెలుగు కథ శతవార్షికోత్సవాల సందరంగా ఫిబ్రవరి, ౨౦౦౧లో ఈ "౨౦వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా తెలుగు సాహితీవేత్తల పరిచయ గ్రంథం"పుస్తక ప్రచురణ జరగడంతో తెలుగు సాహిత్యం, చరిత్ర ఒక మెట్టు ఎదిగాయి. ఈ బృహత్ గ్రంథం పుస్తకాల షాపులలో దొరకదు. ఇటీవల వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు సంస్థాపించిన "తెలుగు పుస్తక సమాఖ్య" సభ్యులకి అందించబడుతుంది. కావలసిన వారు అటు ఇండియాలోనూ, ఇటు అమెరికా లోనూ వంగూరి ఫౌండేషన్ వారిని సంప్రదించండి. (vangurifoundation@yahoo.com, Phone ౮౩౨ ౫౯౪ ౯౦౫౪)

# కురింజి

- *గొల్లపూడి మారుతీరావు*

ప్రతి సంవత్సరం కొడైకెనాల్ యాత్రలో నన్ను ఆకర్షించే విషయం ఆ నేపాలీ వంటవాడి భోజనం. మా మిత్రుడి గెస్టుహౌస్‌లో తెనాలి వంటలు వండి పెట్టే "వినోద్" విందు ఆ పది రోజులూ పండుగని చేస్తాయి. గుత్తివంకాయకూర, కందిపప్పుపచ్చడి, ఉల్లిపాయపులుసు, పెసరట్టు, మసాలా దోశె, ఆవపెట్టినకూరలూ, ఇంకా వెజిటెబుల్ పులావు, బిసిబిళబాత్, వెజిటెబుల్ మంచూరియా- మీ యిష్టం, ప్రతీ రోజూ ఉదయం వంట రుచులు చూడడానికి లేస్తాను. వెనక తోటలో కాలిఫ్లవర్ నాచేత కోయించి- నా కళ్ళముందే వండి నా మతి పోగొడతాడు. సంవత్సరం పొడువునా - పదిరోజుల కోసం ఎదురుచూస్తాను.

"నువ్వు కాపరాలు చెడగొడతావయ్యా మీ వంట తిన్నవాళ్ళు పెళ్లాల్ని వదిలేసి నీ దగ్గర సెటిలయి పోతారు- తిండికోసం" అంటే వెన్నెల కురిసినట్టు నవ్వుతాడు- నేపాలీ తెలుగులో మురిసిపోతూ.

గెస్టుహౌస్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో మురుగన్ ఆలయం. అన్నీ కొండలు- ఎత్తుపల్లాలు కనక సగం మీదకి నడవాలి, సగం కిందకి దొర్లాలి. - ఆలయం పేరే "కురింజి ఆండవర్" పన్నెండేళ్ళకి ఒకసారి పూచేపువ్వు- కురింజి. అరుదయిన పువ్వు ఆ చెట్టు ఆలయంలో ఉంది. పక్కనే క్రితం సారి పువ్వు పూచిన సంవత్సరం రాసి ఉంచుతారు. నేను పువ్వులు పూసిన సంవత్సరం వెళ్ళాను. చాలా అందమైన పువ్వు అతి సున్నితమైన సువాసన. లేత ఊదారంగు రేకులు- మంచు ఉదయాన పెళ్ళున లేచిన సూర్యరశ్మి లాగ పరిమళిస్తుంది.

నేనిక్కడ ఎవరికీ తెలియదు. లేదా చూచాయగ కొందరికి తెలుసేమో, కాస్త అనుమానంగా, వింతగా చూస్తారు. చార్లెస్ శోభరాజును కోయంబత్తూరులో చూసినట్టు. అప్పుడప్పుడు తెలుగు టూరిస్టుల ముఖాలు, ఒక్కసారి వికసించి గొల్లుమంటాయి. కొడైకి దగ్గరలోనే "పెత్తల గుండు" దగ్గర మా డ్రైవరు ఊరు. నన్ను కొడైలో దింపి కారు అక్కడే వదిలేసి ఇంటికి పొమ్మంటాను. ఇన్నిసార్లుగా వస్తున్న మాకు కొడైలో పెద్దగా చూసేదిఏమీ లేదు. సాయంకాలం మా ఆవిడను బతిమాలి రెండు కిలోమీటర్లు నడిపిస్తాను. ఎత్తు రోడ్డు నడిచినంతసేపు నన్ను తిట్టుకొని, పల్లం దిగినప్పుడల్లా దేవున్ని పొగుడుతూ ఉంటుంది. ఏమైనా తిరిగి వచ్చే సరికి ఇద్దరమలసిపోతాం. తొందరగా కొడైలో చీకట్లు ముసురుకుంటాయి. మళ్ళీ వినోద్ భోజనానికి నిరీక్షణ- నిద్ర.

కురింజి ఆండవర్ ఆలయం దగ్గర,ఓ పూల దుకాణం. నల్లగా తుమ్మమొద్దులాగ వుండే యజమాని. మమ్మల్ని చూడగానే నవ్వుతూ పూల సెజ్జని అందిస్తాడు. అందులో కొబ్బరికాయ, పళ్ళు, పూలు అమరి ఉంటాయి. అయినా మాకోసం స్వచ్ఛమైన పువ్వుల్ని మారుస్తాడు. ఆ "నవ్వు" ప్రత్యేకంగా మాకోసమేనా? లేక వ్యాపారి "నమూనా" నవ్వా? అని మొదట లెక్క చేయలేదు. సరుకులమ్మే ప్రతీ వ్యాపారికి చిన్న ట్రేడ్‌మార్క్ ఉంటుంది. కాగా, ఇతనికి నాపేరూ, నా వేషాలూ తెలిసే అవకాశం లేదు. ఏమైనా తెలుగు బస్సులు ఆగడం, తెలుగు నవ్వులూ, రకరకాల కెమెరాల మెరుపులూ- కాస్త నా గురించి పసిగట్టాడేమో, క్రమంగా అతని నవ్వు విశాలమైంది. నా పరపతి ఎరిగా? లేక పరిచయం పెరిగా?

ఆలయం చేరేసరికి మా ఆవిడ రొప్పుతూ డ్రైవరుని పంపివేసిన నన్ను తిట్టుకుంటూంటుంది. ఈ పూల యజమాని పరుగున మా దగ్గరికి వస్తాడు. చక్కటి తమిళంలో "అమ్మా!వాంగో!" అని ఆహ్వానిస్తాడు నాకు కాస్త ఊరట. అప్పుడే వచ్చిన పూలని అలంకరించి సజ్జని చేతికందిస్తాడు. ఓ మల్లె చెండుని తుంచి, మా ఆవిడ చేతికిచ్చి "ఇది తలలో పెట్టుకొని ఆలయంలోకి అడుగు పెట్టండమ్మా" అంటాడు. అంతే, మా ఆవిడకి "కురింజి అండవర్" అక్కడే ప్రత్యక్షమైనంత సంబరం. ఆవిడ భర్త నైనందుకే నా మీద గౌరవం. లేదా నా భార్య అయినందుకు ఆవిడకి మర్యాదా? ఏమయినా పరపతికి, పూలచెండుకి పొంతన లేదు.

క్రమంగా- ఆలయం సమీపిస్తూనే- ఆ చింతమొద్దు కోసం చూడడం అలవాటయిపోయింది. ఆ శరీరాన్ని మరిపించే మర్యాద, మప్పితం, ఆర్ద్రత ఆ నవ్వులో. చిన్న పూలచెండు- అందరి సంగతియేమోగాని- మా ఆవిడ యిచ్చినంత డబ్బు తీసుకుంటాడు. దాని వేపు చూసినట్టయినా కనిపించడు. నాకే కాస్త యిబ్బంది అనిపించి "మరో అయిదు రూపాయలు ఎక్కువ యియ్యి" అని మా ఆవిడని గోకుతాను.

కురింజి అండవర్, పూల యజమాని- మాకు క్రమంగా ఎదురుచూసే రొటీను అయిపోయింది. ఒక్కోసారి అతని ఉండడు. దుకాణాన్ని తప్పించుకుందా మనుకుంటే అక్కడ వుండే కుంటి కుర్రాడు అడ్డం పడతాడు. అతని పెదాలకు తొర్రి. ఆపరేషన్ చేసి కుట్లు వేశారు. తమిళం సరిగా అర్థం కాదు. కాని అంతే భక్తిగా పూల సెజ్జని అందిస్తాడు.

"మర్యాద" పెద్ద అంటువ్యాధి. అలవాటు పడితే వదిలిపెట్టదు. ఓ రోజు దారిలో వర్షం పట్టుకుంది. తలదాచుకునే చెట్లు లేవు. ఇద్దరం తడిశాం. ఆలయానికి మలుపు తిరిగితే అల్లంత దూరంలో మమ్మల్ని కనిపెట్టి రెండు గొడుగులతో పరుగున వచ్చాడు. భక్తిగా మా ఆవిడకి గొడుగు అందించి నా గొడుగు తను పట్టుకు నా వెంట తనే నడిచాడు. తడిసిన మా బట్టలు చూసి "నాకు చాలా బాధగా వుందయ్యా" అన్నాడు. ముఖం చిన్నబుచ్చుకొని. దర్శనం అయి,వర్షం తగ్గే వరకూ రెండు బల్లలు వేసి కూర్చో పెట్టాడు. అప్పుడు తెలిసింది కుంటికాలు కుర్రాడు అతని తమ్ముడని. ఇద్దరికీ వయస్సులో వార. ఒక్కొక్కప్పుడు ఇద్దరూ దుకాణం దగ్గర వుంటారు. మమ్మల్ని చూసి ఇద్దరూ రెండు వేపులకి పరుగెత్తుతారు.

నా గొప్పతనానికో, పరపతికో ఈ మర్యాద దక్కు తోందనిపించి భుజాలు రహస్యంగా పొంగాయి. ఓసారి ఆపుకోలేక అడిగాను "నా సినిమాలు చూశావా?" అని. ఆ శరీరానికి ఎంత పరిపూర్ణమైన నవ్వుని అతికించాడో దేవుడు! పక్కున నవ్వాడు. ఆ నవ్వుని "చూడలేదు" అని తర్జుమా చేసుకున్నాను. అతని మీద గౌరవం మరింత పెరిగింది.

"వాడు పుణ్యాత్ముడు. వాడికి జన్మలేదు" -ఇది మా ఆవిడ ఎల్లప్పుడూ అతనికిచ్చే కితాబు.

రిబేటు ధరకి- లేదా- ధర ప్రమేయం లేకుండా పూల సెజ్జ అందించి అతనెంత నష్టపోయాడా అని నాకనిపిస్తూంటుంది.

చెన్నై బయలు దేరే రోజు దగ్గరికొచ్చేసింది.

"రేపు ఊరికి బయలు దేరుతున్నాం" అన్నాను.

"ఉండండు"సార్ అని పక్కనే ఉన్న తమ్ముడి చెవులో ఏదో చెప్పాడు. పక్క దుకాణంలో ఎండు ద్రాక్షపళ్ళ పేకెట్ తెచ్చాడు కుంటి తమ్ముడు. రోడ్డు మీదే మా ఇద్దర్నీ పక్కపక్కన నిలబడమని- సాష్టాంగ పడమన్నాడు తమ్ముడిని.

"వీడికి ఆగస్టులో పెళ్ళయ్యా- దీవించండి"అని.

ఇద్దరికీ కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. సంప్రదాయం పట్ల వాడి మక్కువ, పెద్దల మీద గౌరవం, సుమంగళి తలనిండా పువ్వులు పెట్టుకు స్వామి దర్శనానికి వెళ్ళాలనే పట్టింపూ- ఆర్ద్రమైంది. మా ఆవిడ పర్సందుకొని ఓ వంద రూపాయ నోటు చేతిలో పెట్టబోయాను. ససేమిరా వద్దన్నాడు. "మీ దీవెన చాలయ్యా" అదీమాట.

కారెక్కుతుండగా మూడేళ్ళుగా ఓ విషయం తెలుసు కోలేదని గుర్తుకొచ్చింది.

"ఒక్క నిముషం" అని వెనక్కి నడిచాను. మా ఆవిడ ఆశ్చర్యంగా చూస్తోంది.

పూల దుకాణం దగ్గరకెళ్ళి అతన్ని అడిగాను "నీ పేరెన్నప్పా!"

కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతికి ప్రణామం చేసినట్టుగా రెండుచేతులు జోడించి అన్నాడు.

"మీర్ అయ్యా- మహమ్మద్ మీర్ ఆలం"

(ఇది కథ కాదు, కొడైకెనాల్ వెళ్ళినపుడు- కురింజి అండవర్ ఆలయానికి కుడిపక్కన పూల దుకాణం దగ్గర అతన్ని చూడవచ్చు)

## మీ ఇంటి గేటు

*- తమ్మినేని యదుకుల భూషణ్*



తడిసి రాలిన ఆకులు
తడుముతాయి పాదాలను
మీ ఇంటిగేటు మీద నిలిచిన నీరు
చేయిని తడుపుతోంది హాయిగా

వాన వెలిసింది
కానీ, మబ్బులు అలాగే
అడుగుల చప్పుడు వినిపిస్తుందా?
అడగాలని లేదు ఏమీ ...

# గమ్యం

**- తమ్మినేని యదుకుల భూషణ్**

ఈ గుబురుచెట్లలో
ఆగి ఆలోచిస్తాను
బయల్దేరింది ఎక్కడ?
భయపడ్డానా?

పుల్ల విరిగిన చప్పుడు
అల్లరి ఉడుత
పారిపోయింది
మెరిసే నల్లని కన్ను

పక్షుల గుంపు బారుగా
పయనమై  పోతోంది
సాయంత్రం ఎరుపు
సాక్షిగా సమాధాన పడ్డాను



## ఉగాది

*- వారణాసి నాగలక్ష్మి*

ఎన్నేళ్ళయినా ఉగాదిని మర్చిపోలేను. నాలుగేళ్ళక్రితం ఉగాది రోజు........

ఉగాది రోజు... సంధ్యాసమయం... చిన్న టీపాయ్ మీద కావలసిన వస్తువులన్నీ అమర్చుకొని తీరిగ్గా సాయంకాలాన్ని ఆస్వాదించాలని బాల్కనీలో కూర్చున్నా. నా దినచర్య ప్రతిరోజూ దాదాపు ఒకేలాగా వుంటుంది. పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయిపోయి ఎవరిగూళ్ళు వాళ్ళు ఏర్పరచుకున్నారు. ఏమిటో వివరించలేని స్తబ్దత, ఒంటరితనం వరించుకున్నాయి. ఇంతపెద్ద అపార్ట్‌మెంట్లో ఒక గదిలోంచి, మరోగదిలోనికి వెళుతుంటే నువ్వు ఒంటరి దానివి. 'నువ్వు ఏకాకివి' అని గదిగోడలు అరుస్తున్నట్టని పిస్తోంది. ఇదివరకు ఎపుడూరాని ఆలోచనలు మనసుని మెలిపెడుతున్నాయి. రాత్రి పదింటికి గాని ఇల్లు చేరని మనిషి, తెల్లవారకుండానే పనులన్నీ ముగించుకొని ఎనిమిది గంటలకల్లా ఇల్లు విడిచి పోతూంటే ఏ విధంగానూ ఆయనలో మార్పు తేలేని నా నిస్సహాయత మొదట్లో కన్నీళ్ళు తెప్పించేది. అదంతా కొత్తలోనే లెండి. తర్వాత్తర్వాత 'మారేజ్ ఈజ్ మ్యూచువల్ ఎడ్జస్ట్‌మెంట్' అనే ఊహకలవాటు పడిపోయాను.

ఇన్నేళ్ళూ హనీమూన్‌కీ, సైట్‌సీయింగ్‌లకీ తేడా తెలీని వ్యక్తితో ఏ ఒడుదుడుకులూ లేకుండా 'సరళ అదృష్టవంతురాలు' అని నలుగురూ అనుకునేలా, 'రొటీన్'గా గడిచిపోయాయి.. పిల్లల హోంవర్కులు, పరీక్షలూ,సెలవులూ,చిన్నచిన్న అనారోగ్యాలూ వగైరాలతో సంవత్సరాలు గడిచిపోయాయి. పిల్లలు పెద్దవాళ్ళయి ఒకడు స్టేట్స్‌లోనూ, రెండోవాడు బెంగుళూరులోనూ స్థిరపడ్డారు. అపుడపుడు కుటుంబాలతో వాళ్ళు రావడం, కొద్దిరోజులు సరదాగా గడపడం, వాళ్ళు వెళ్ళాక అంతా మామూలు!

చిన్నప్పుడు ఎక్కువ చదువుకోలేదు. ఏ చేతిపని లోనూ ప్రవేశమూ లేదు... శ్రద్ధాలేదు. పాతికేళ్ళ వయసులో చదవాలని అనిపించిన నవలలు ఇపుడు మరీ చప్పగా అనిపించి చదవలేకపోతున్నాను. పక్క అపార్ట్‌మెంట్లో 'మామి'లాగా పూర్తిగా భగవధ్యానంలో గడపనూలేను !

చిన్నబ్బాయి వచ్చినపుడల్లా 'ఏదైనా చెయ్యాలమ్మా నువ్వు.. ఈ అనాసక్తత మంచిది కాదు' అంటాడు. పనిలేక పోవడం వల్లే నాకీ దిగులు అని వాడి భావం!

ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూబెల్ మోగింది. తలుపు తెరిచాను. ముద్దబంతి పూవులా పసుపు పచ్చని చీరలో కళకళలాడుతూ ముప్ఫయ్యేళ్ళ స్త్రీ, ఆమె చెయ్యి పట్టుకొని నాలుగు, అయిదేళ్ళ పాప...!

"నమస్కారమండి!" అందావిడ మొహమాటంగా చూస్తూ.

"రండి లోపలికి" అన్నాను ప్రశ్నార్థకంగా.

ఆవిడ లోపలికి వచ్చి, "కూర్చోండి" అని సోఫా చూపించగానే కూర్చుంది. ప్రక్కనే పాప కూర్చుంది.

'నా పేరు జానకి అండి.... ప్రమీలగారు మీకు బాగా తెలుసుకదా.....' అంది అర్థోక్తిలో.

'.... అవునూ....' అన్నాను.

'ఆవిడా, మేము ఒకే కాంప్లెక్స్‌లో ఉంటామండి. మా పాప ఇక్కడ మీపక్క బిల్డింగ్‌లో స్వీట్ ఏంజిల్స్ స్కూల్ లో యుకెజి చదువుతోంది. మీ పై అపార్ట్‌మెంట్ లో జ్యోతిగారి దగ్గర సంగీతం నేర్పించాలని....'

'హా... ఆవిడ బాగా చెప్తారు' అన్నాను. ఇదంతా దేనికో అర్థంగాక.

'మిమ్మల్ని ఒక సహాయం అడగాలని వచ్చానండి. పాప స్కూల్ అయ్యాక మళ్ళీ ఇంటికి అంతదూరం తీసుకెళ్ళి మళ్ళీ సంగీతానికి తీసుకురావాలి.... పోనీ తిన్నగా సంగీతానికి వెళ్ళిపోవచ్చంటే జ్యోతిగారు మ్యూజిక్ కాలేజి నుంచి ఇంటికొచ్చేసరికి నాలుగు దాటుతోంది. పాప స్కూల్ మూడున్నరకి అయిపోతుంది. నాకేమో ఆఫీసు అయిదుగంటల దాకా వుంటుంది.... వారానికి అయిదురోజులు మా ఆఫీసు. సంగీతం క్లాసులేమో వారానికి మూడు.... సోమ, బుధ, శుక్రవారాలు మిగిలిన రెండురోజులూ మా వారు వచ్చి తీసుకువెళతారు కాని, ఈ మూడు రోజుల్లోనూ, జ్యోతి గారు వచ్చి సంగీతం మొదలు పెట్టేవరకు... మీ ఇంట్లో కొద్దిసేపు....' అంటూ మొహమాటంగా ఆగిందావిడ.

'నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. ఒకరోజా... రెండు రోజులా?... వారానికి మూడు రోజులపాటు ఎన్నాళ్ళో ఇలా?... పాప వైపు చూశాను. బూరె బుగ్గలతో అమాయకంగా చూస్తూ ముద్దుగా కనిపించింది. 'ఇంత చిన్న పాపకి అప్పుడే సంగీతమా'? అన్నాను.

'దానికి చాలా ఇష్టం ఉందండిపాటలంటే. టాలెంట్ కూడా వుంది. ఇపుడు అశ్రద్ధ చేస్తే, మరుగున పడిపోతుంది.... ఏదీ?... శ్రావ్యా! పల్లకీ పాట పాడమ్మా... మామ్మగారు వింటారు' అంది.

'శ్రావ్య!... మంచిపేరు... మంచిగాయని అవుతుందని ముందే ఆ పేరు పెట్టారా? అంటూ నేను కూడా పాడమని అడిగాను. కొంచెం సేపు గారాలు పోయి చివరికి పాడింది. గొంతులో శ్రావ్యత వుంది. గమకాలు పట్టుకునే నేర్పూ కనిపించింది.

చాలా బావుందని మెచ్చుకున్నాను. పాట వింటున్నంతసేపు ఆలోచిస్తూ ఉన్నాను. ఇదొక ఆబ్లిగేషన్ అవుతుందా ఏమిటా అని చివరికి 'ఎపుడు కష్టమనిపిస్తే అపుడే చెపుదాంలే' అనిపించింది. 'బాగా పాడింది మీపాప. స్కూలు నుండి మా ఇంటికి వచ్చేయమని చెప్పండి. క్లాసు అయ్యేసరికి మీ ఆఫీసు అయిపోతుంది. ఇద్దరికీ వీలుగా వుంటే కంటిన్యూ చెయ్యచ్చు'అన్నాను.

చాలా సంతోషపడి "థాంక్స్" చెప్పిందావిడ.

కొద్దిసేపు కూర్చుని వాళ్ళు వెళ్ళిపోయారు. తర్వాత మంచిరోజు చూసుకొని సంగీతం ప్రారంభించారు. వారంలో ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం శ్రావ్య మా ఇంటికి వచ్చేది. సాయంత్రం మూడు ముప్పై అయిదుకల్లా బెల్ మోగేది. తీసేలోపల మూడు సార్లుమోగేది. మొదట్లో విసుకున్నాను మనసులో... నిశ్శబ్దం అలవాటైపోయి అలా విసుగు అనిపించింది కాబోలు... 'వాళ్ళమ్మ చెప్పి వుండదు అలా పదేపదే కొట్టకూడదని....నేనయినా చెప్పాలి' అనుకుంటూ తలుపు తెరిచేసరికి తళుక్కుమనే కళ్ళు, మెరిసే నవ్వుతో.... 'మామ్మగారూ! మామ్మగారూ! మరేం' అంటూ - ఆగలేనట్టు స్కూల్లో ఏమయిందో దారిలో ఏం కనిపించిందో హడావుడిగా చెప్పడం మొదలు పెట్టేది.

కొద్ది రోజుల తర్వాత ముందు రోజు చెప్పినవి కూడా ప్రాక్టీసు చెయ్యటం కూడా మొదలుపెట్టింది. కంఠం శ్రావ్యంగా ఉండడంతో వినడానికి ఇంపుగా ఉండేది. మామ్మగారూ! ఇలాగేనా? అని అడుగుతూ ఉండడంతో నాకు తెలియకుండానే నేనూ శ్రద్ధగా వినడం మొదలు పెట్టాను.

నెలరోజులు దాటేసరికి శ్రావ్యరాక నా దినచర్యలో అత్యంత ప్రధానాంశంగా అయిపోయింది. ఆ మాటల కోసం, ఆతళుకు కళ్ళకోసం ఎంతగా ఎదురు చూడడం మొదలుపెట్టానంటే మంగళవారం, గురువారం ఏమీ తోచేది కాదు.

రానురాను శ్రావ్యతో పాటు నేనూ శ్రావ్యసంగీతం క్లాసు అయ్యేవరకు జ్యోతి ఇంటికి కూడా వెళ్ళడం మొదలుపెట్టాను. కర్ణాటక సంగీతంలో జ్యోతికి మంచి ప్రవేశం ఉంది.. కానీ ఎపుడూ ఇంతగా సంగీతం వినడం, దాని గురించి ఆలోచించడం అలవాటు లేక దానిలోని అందచందాలుతెలియకుండా వుండిపోయాను. ఇపుడు శ్రావ్యతో పాటుగా కూర్చోవడంతో మిగిలిన పెద్దపిల్లలు పాడే కీర్తనలూ, వర్ణాలు, మధ్యమధ్యలో లలితగీతాలూ, జానపదగీతాలూ వినీ వినీ ఇంటికి వచ్చాక కూడా ఆ సంగతులు నోట్లో నానేవి. ఎంత రసహీనమైన వాక్యమైనా రాగం కూర్చి పాడేసరికి ఎంతగా రసాలూరుతుందో అని ఆశ్చర్యపోయేదాన్ని! అందులోనూ నేటీ మోడర్న్ మ్యూజిక్‌తో పోల్చి, భావానికి తగిన రాగం కూర్చి ఒకో గీతాన్ని ఒకో కావ్యంతో సమానంగా తయారుచేసిన సంగీతకారుల ప్రతిభని, సాంప్రదాయ సంగీతాన్ని తలుచుకొని సంభ్రమానికి లోనయ్యేదాన్ని. ఇంట్లో పనులు చేసుకుంటూ నాకు నచ్చిన కృతులు టేప్‌రికార్డర్‌లో వింటుంటే ఒంటరితనం తెలిసేదికాదు. శృంగార భక్తిరసాలు నిండిన కీర్తనలు సముద్రతరంగాల్లా ఎగసెగసి పడడం, తాత్త్విక కీర్తనలు సమతలం మీది నదుల్లా శాంతంగా సాగడం నాకు చాలా నచ్చేది. 'ఎంత మాధుర్యాన్ని కోల్పోయాను ఇన్నాళ్ళూ! పోన్లే ఇప్పటికైనా మేలుకున్నాను' అనుకునేదాన్ని.

మళ్ళీ ఉగాది వచ్చింది.... శ్రావ్య వచ్చింది.... వస్తూనే కొత్తబట్టలతో నాకు నమస్కారం పెట్టింది. వాళ్ళమ్మ, జ్యోతికీ, నాకూ ఉగాది శుభాకాంక్షలు చెప్పి, స్వీట్స్ ఇచ్చిపోవడానికి వచ్చింది. ఇద్దరూ కూర్చున్నారు.

"మామ్మగారూ.... ఇవాళ్టినుంచి నేను సంగీతం టీచర్.... మీరేమో స్టూడెంట్.... నాకొచ్చినవన్నీ మీకు ఊరికే నేర్పిస్తా..... డబ్బులివ్వక్కరలేదు....." అంది నాకు చాలా ముద్దొచ్చింది. ఈ మధ్య శ్రావ్య కోసం ఏవేనా చిన్నచిన్న టిఫిన్లు చేయడం. ఇద్దరు కలిసి తినడం అలవాటైపోయింది. పండగ కోసం చేసిన తీపి పూరీలు రెండు ప్లేట్లలో తెచ్చి, ఇద్దరికీ ఇచ్చాను. చాలా ఇష్టం కాబోలు.... తళతళలాడే కళ్ళతో నావైపు చూసి "ఇలా ఏవైనా పెడుతుంటారు కదా!... అదే ఫీజన్నమాట!" అంది. మళ్ళీ నవ్వువచ్చింది. శ్రావ్య ఏంమాట్లాడినా ఆ వయసు తాలూకు అమాయకత్వం కనిపించి నవ్వొస్తోంది.

ముద్దుగా అనిపిస్తోంది.

"సరే" అన్నాను.

తినేసి, సీరియస్‌గా వాళ్ళ టీచర్‌లా కూర్చుని, "సా....పా....సా.... శృతి పట్టండి మామ్మగారూ" అంది.

"సా....పా....సా..." అన్నాను అప్రయత్నంగా.

"కరెక్ట్.... అలాగే అనాలి"..... "చాలా స్వీట్‌గా అన్నారే మీరు......" అంది.

వాళ్ళమ్మ "నిజంగానే మీగొంతు చాలా బావుందండీ" అంది.

అదే మొదలు...! తర్వాత జ్యోతి దగ్గర సంగీతం పాఠాలకి వెళ్ళడం శ్రావ్యతో పాటుగా...... ఇద్దరం కలిసి పాడుకోవటం మొదలైంది. ఇన్నేళ్ళకి ఓ కొత్త ద్వారం తెరుచుకొని కొత్తలోకాన్ని చూస్తున్న అనుభూతి కలిగింది. అంతే..... జీవితంలో ఎంతమార్పు! ఎన్నేళ్ళయినా ఆ ఉగాదిని మర్చిపోలేను!

# సద్యోవిముక్తి

- జి. వి. ఆర్. కె. శర్మ

ధర్మచక్ర ప్రవర్తనమై (1) ఒక తరమైంది. మహా కశ్యపుని శిక్షణలో, సారిపుత్ర మౌద్గల్యాయనుల (2) సారథ్యంలో శ్రమణసంఘం సుస్థిరమై వర్ధిల్లుతోంది. తథాగతుడు (3) ప్రవచించిన ఆర్యసత్యాలను విని, అష్టాంగమార్గమును అవలంబించి అర్హతులైన శ్రమణులు, దు:ఖోపశమనులైన సాధారణజనులు వందలు, వేలు. బుద్ధుడైన సిద్ధార్థగౌతముని పవిత్రనామం ఆర్యావర్తమంతటా ఒక మహాసంచలనం కలుగజేసింది. జన్మస్థలమైన కపిలవస్తులోను, ధర్మ చక్రప్రవర్తన మొదలైన వారణాసిలోనే కాక, వైశాలిలో, శ్రావస్తిలో, రాజగృహంలో- తూర్పున మగధనుండి పశ్చిమాన మాళ్వదేశం వరకూ- బుద్ధప్రదిపాదిత ధర్మ మార్గమే శిరోధార్యమైంది, అన్ని వర్గాలలో, అన్ని వర్ణాలలో. త్రిశరణాలు ("బుద్ధం శరణం గచ్ఛామి", "ధర్మం శరణం గచ్ఛామి", "సంఘం శరణం గచ్ఛామి" జనులకు నిత్యమూ జపించే మంత్రాలయ్యాయి.

ధర్మచక్రం నిరాఘాటంగా తిరుగుతోంది. చక్రంలోని ఆకులతీరున ఋతువులూ, హాయనములూ దొరలు తున్నవి. తథాగతునికి షష్టిపూర్తి కూడా అయినది. అయినా, ఆయన దినచర్యలో మార్పేమీ లేదు. తెల్లవారుజామున లేవడం,కాలకృత్యాలయ్యాక ధ్యానము, సంఘకార్యావలోకనము, తరువాత చేత భిక్షాపాత్రతో సమీపగ్రామమునకు నడక, ఏ యింట భిక్ష లభిస్తుందో ఆ గృహస్తులకు ధర్మబోధ, నివాస స్థలమునకు మరిలిరాక, అపరాహ్ణమున విశ్రాంతి, సాయంకాలమున పరిసరప్రాంతములనుండి దర్శనార్థమై వచ్చిన వారితో గోష్ఠి, సూర్యాస్తమయం తరువాత పున:స్నానము, శిష్యులతో ధర్మమీమాంసను గురించి చర్చ, వెనుక ధ్యానము, నిద్ర.

ఇరవై ఐదేళ్ళుగా ఇదే ఆయన దినచర్య. సమ్యక్సంబుద్ధునిగా దేశమంతటా ఆరాధ్యుడైనప్పుడు కూడా ఆయన దైనందిన కార్యకలాపాలలో మార్పులేదు. మహారాజులచే సత్కరింపబడినపుడు కూడా ఆయన భిక్షాపాత్రను విడువలేదు; వినయము కోల్పోలేదు. అనతికాలంలోనే అనుచరులూ, దేశాధిపతులూ, అశేష ప్రజానీకమూ ఆయనను సాక్షాత్తు భగవంతునిగా కీర్తించి ప్రతిష్ఠింపబోయినపుడు, ఆయన ప్రయత్నా లన్నింటినీ వారించి, తాను కూడా అందరి వలెనే "సాధారణమానవుడనని", అసాధారణ సాధనచే ఎవరైనా బుద్ధుడయే అవకాశముందనీ, అందుచేత తనను 'ప్రత్యేకంగా పూజించవలసిన అవసరం' లేదని ఎన్నో సార్లు తెలియచేశారు.

ఒకసారి జేతవనంలో సాయంకాలపు సత్సంగంలో భిక్షువు లందరూ సమావిష్టులై ఉండగా తథాగతుడు ప్రపంచవశాత్తూ "సోదరులారా! బహుకాలమై మీరంతా ధర్మమార్గానుగాములుగా సంఘంలో ఉన్నారు. నేను చెప్పినది విన్నారు; నన్ననుసరించారు. నా ప్రవర్తనలో గాని, బోధలలోగాని లోపమేమైనా మీకు తోచినదా?" అని అడగగానే అందరూ ఉలిక్కిపడ్డారు. ఇటువంటి వ్యక్తిగతమైన ప్రశ్న భగవానుని వద్దనుండి ఎన్నడూ రాలేదే! అందులోనూ భగవానుని ప్రవర్తనలోనూ, బోధల లోనూ, లోపమా? ఎవరూ మాట్లాడలేదు. బుద్ధుడందరి వంక సాభిప్రాయంగా చూశాడు అందరూ తలవంచారు. ఆరామమంతా నిశ్శబ్దమావరించింది. దూరంగా ఉన్నా, నెమిళ్ళ క్రేంకారాలు బిగ్గరగా వినవచ్చాయి. సారిపుత్రుడొక్కడే ధైర్యంగా తల ఎత్తాడు. ప్రక్కనున్న పుష్కరిణి మీదుగా ఆరామంలోకి చల్లగాలి వీచింది. సారిపుత్రుని ఒంటిమీద చీవరపు (4) అంచులు రెపరెపలాడాయి.

"భగవాన్! మీ ప్రవర్తనలోను,బోధనలోను, లోపమా? తమవంటి మహాపురుషులు గతంలో లేరు;ఇక ముందు ఉండబోరు; ఇది నా నిశ్చితాభిప్రాయం"

భగవానుడు సారిపుత్రుని వంక చూపు సారించి, "సారిపుత్రా! గతించిన బుద్ధులనందరను నీవెరుగుదువా?"

"లేదు, భగవాన్!"

"పోనీ, రానున్న బుద్ధుల గురించి నీకు తెలియునా?"

"లేదు, భగవాన్!" సారిపుత్రుని మాట కొంచెం తొట్రు పడింది.

"కనీసం తథాగతుని గురించిన సంపూర్ణజ్ఞా నం నీకున్నదా?"

సారిపుత్రుని కంఠం గాద్గదికమై సన్నగిలింది. "అదీ లేదు, భగవాన్!"

"అయితే నువ్వంత ధైర్యంతో తథాగతుని వంటి వారు లేరని ఎలా చెప్పగలవు?"

సారిపుత్రుడు నమ్రతతో తల వంచాడు. అతని కనులు కొలనులయ్యాయి. ఆరామమంతా నిశ్శబ్ద మావరించింది.

చిక్కనవుతూన్న సంజ చీకట్లో కూడా తథాగతుని వదనం తేజస్సుతో వెలిగింది. ఆయనవంటి మహా పురుషులుండడం సాధ్యమా?

ఆయన పవిత్ర దర్శనమే కల్మషహారిణి; కరుణా మయమైన ఆయన చూపే సౌఖ్యప్రదాయిని; ఆయన మృదుభాషణే అమృతవర్షిణి! ఆయన తోడి సహవాసమే స్వర్గతుల్యము!

ఎంతటి పుణ్యమో కదా భగవానుని భిక్షాపాత్రను నింపిన గృహిణిది!

ఎంత సఫలమైనదో కదా ఆయన ఆశీస్సు అభించిన జాతకాలు!

ఎంత చరితార్ధత నందినవో కదా, ఏ చెట్టు నీడనో, ఏ ఇంటి ముంగిటనో ధర్మబోధలు విన్న జీవితాలు! - ఆయనను అనుసరించి సేవించిన శిష్యుల సుకృతమో? సాయం సమయమున భగవానుని సత్సాంగత్య ఫలమో? ఆయనతో ధ్యానావస్థిత మనస్కులైన వారి మహద్భాగ్యమో?

ఇక భగవానుని నిత్యావసరాలకు తోడ్పడి, తోడు నీడగా ఉన్న ఆనందుని అదృష్టమో?చెప్పతరమా!

ఋతుచక్రమణంలో గ్రీష్మ వర్ష శిశిర వసంతాలు పునరావృత్తమవుతున్నవి. తథాగతుని జీవితచర్య యథా తథంగా నడుస్తోంది, కొన్ని చిత్రమైన సంఘటనలతో-

---------------------------

మంత్రపాఠాలు ఏవో వల్లించి భుక్తికి మాత్రం పనికి వచ్చే "నాలుగు ముక్కలు" నేర్చుకున్న మామూలు బ్రాహ్మడు కాడు బాహ్యుడు; శాస్త్రాలు సాంగో పాంగముగా (తె అధ్యయనం చేసి, బోధించగల శక్తి ఉన్నవాడు. యజ్ఞములు చేసినవాడు, చేయించ గలవాడు. విద్య, పాండితీ, జ్ఞానము వంశపారపర్యంగా వచ్చినవి. తనలో పరాకాష్ఠ నందుకున్నవని తన దృఢనిశ్చయం. అయినా, ఎంచేతనో కూలంకషమైన శాస్త్రజ్ఞానం ఉన్నా కుదుటబడే మనశ్శాంతి లేదు; అంతరంగంలో ఏదో అసంతృప్తి, ఆవేదన. ఐదు దశకాలు దాటినప్పటికీ అవి పోలేదు సరికదా ఎక్కువవుతున్నవి.

పశ్చిమసముద్ర తీరాన ఉన్న "సూర్పారక" (తె గ్రామంలో ఆరుబయట పడుక్కొని ఉన్నాడు బాహ్యుడు. వైశాఖమాసం అయినప్పటికీ రెండు జాముల రాత్రి అయిందేమో, కొంచెం చల్లబడింది. నీటి మీదుగా చల్లటిగాలి ఉండీ ఉడిగీ వీస్తున్నది. ఆకాశంలోని శుక్ల ద్వాదశి చంద్రుణ్ణి, ఆచ్ఛాదిస్తూ ఉన్న మేఘశకలాలను తదేకంగా చూస్తున్నాడు బాహ్యుడు. బాహ్యప్రకృతి లోని వెలుగునీడలలాగే మనోగగనంలో ఆలోచనామేఘాలు వస్తూ పోతూ ఉన్నవి.

"యజనజన్యమూ, తపఃఫలమూ అయిన పుణ్యమేనా ధ్యేయం?" 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' ('చేసుకున్న పుణ్యం సన్నగిలితే తిరిగి మనుష్యుల లోకం చేరుకుంటారు'- దేవతలు కూడా) అని కదా ఆర్యోక్తి; ఈ చావు పుట్టుకల జంజాటంలోంచి బయటపడేమార్గం లేదా? జీవన్ముక్తి అంటారే, అది ఎటువంటిది? అది సాధ్యమా? "సోహం" (అదే నేను) అనీ, "తత్త్వమసి " (అదే నీవు ) అని అనడం, మననం చేయడం, బోధించడం తేలికే! కాని, అది అనుభవించడం ఎలా? 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' (దేనినైతే చేరుకోలేక మనస్సుతో పాటు మాటలు కూడ వెనుదిరిగి పోతాయో) అని వేదవాక్కు కదా, మరి ఆ అనిర్వచనీయమైన దాన్ని తెలుసుకోవడమెలా? తెలుసు కున్న వారు ఎలా గ్రహించారు? అసలు అటువంటి వారెవరైనా ఉన్నారా? ఉన్నా, వర్ణించలేని అనుభవం వారైనా ఇతరుల కెలా తెలియజేయగలరు? ఇక దారి ఏది? "సందేహాలన్నీ ఒకదాని వెనుక ఒకటి కెరటాల్లా వచ్చాయి.

కాని అంతలోనే, "ఛీ! ఆలోచనలు తప్పుదారి పడుతున్నవి. అపౌరుషేయములైన వేదవాక్కులనే శంకించటమా?" కలవరపాటుతో బాహ్యుని మనస్సు పరిపరివిధాల పోయింది. చూస్తుండగా ఆకాశంలో మబ్బులు దట్టమయ్యాయి. నిశ్శబ్దంగా ఉన్న రాత్రి వేళ సముద్రపు కెరటాల హోరు మాత్రం బిగ్గరగా వినవస్తోంది. "ఇదేదీ కాదు; తాను సంపూర్ణజ్ఞాని; వేరే జ్ఞానోదయం ఏమున్నది? జ్ఞానమే కాక, నిత్యానుష్ఠానమూ, యమనియమాది షట్కసంపత్తీ, ఎన్నో యాగాదుల సత్ఫలమూ, ఇవన్నీ ఉన్న తాను జ్ఞానికాక వేరెవరు? ఈ పూర్ణజ్ఞానమే మోక్షమో, మోక్షదాయకమో కాకపోతే మరేదీ కాదు!" బాహ్యుని ముఖంపై చిన్ననవ్వు వెలిసింది; సమాధానపడి, నిశ్వసించి కళ్ళు మూశాడు.

నెమ్మదిగా నిద్ర ఆవరించింది. చంద్రాస్తమయం కాబోతున్నది. వీధిలోని మామిడి చెట్టు నీడ దట్టమై ఇంటి ముంగిట పరచుకుంది. గుమ్మం ముందరి మందార మొక్క నీడ కూడా అరుగు మీదికి జరిగింది. సముద్రం మీదుగా పడమటిగాలి చల్లగా సాగింది.

బాహ్యునికి పట్టిన చిక్కని నిద్రలో ఒక చక్కని కల. గాలిలో అనాయాసంగా తేలిపోతున్నట్లు, సాగిపోతున్న మేఘాల మధ్య పయనిస్తున్నట్లు! ఇరుప్రక్కల నిలబడి దేవతలు వేదమంత్రాలు పఠిస్తున్నట్లు! -"తమేవ విదిత్వాతి మృత్యుమేతి,నాన్య: పన్థా విద్యతేయనాయ" (అతనిని తెలియుట వలననే ఎవరైనా మృత్యువును దాటగలరు; వేరే మార్గమేమీ లేదు ). వెంటనే అదే అర్థాన్ని బలపరుస్తున్న వేరొక దివ్యవాణి బిగ్గరగా వినవచ్చింది; "బాహ్యా! నువ్వేదో గొప్ప జ్ఞా నినని అనుకుంటున్నావేమో! పొరపాటు సుమా! నీకా అర్హతలేదు. అసలైన జ్ఞా ని, సమ్యక్ సంబుద్ధుడు శ్రావస్తిలో (వె అన్నాడు. అతడే సంపూర్ణుడైన అర్హతుడు. అతని ధర్మప్రవచనమే మోక్షదాయకము! "

కొట్టినట్లు నిద్రపోయిన బాహ్యునికి ఎవరో తట్టినట్లు తెలివి వచ్చింది. ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు. ఉదయసంధ్యలో ప్రకృతి అప్పుడే మేలుకుంటోంది; సూర్యోదయం ఇంకా కాలేదు. అప్రయత్నంగా ఆకాశం వంక చూశాడు బాహ్యుడు, ఆ దివ్యవాణి మళ్ళీ వినవస్తుందో ఏమో! నిర్మేఘమైన ఆకాశాన్ని చీల్చుకుంటూ ఒక చిలుకలగుంపు మామిడిచెట్టును ఆక్రమించుకుంది. వాటి కలరవాలు బాహ్యుని మనసులోని కలతను రెట్టింపు చేశాయి. వాటి సద్దు మణగకుండానే దూరంగా ఎక్కడో ఒక కోయిలకూత. బాహ్యుని మనస్సు మనస్సులో లేదు. "ఎవరీ సమ్యక్ సంబుద్ధుడు? అతడా సంపూర్ణజ్ఞా ని? అతని ధర్మ ప్రవచనమూ నాకు మార్గదర్శకము? ఇది నిజమేనా?" అని సందేహిస్తూ లేచి నిలుచున్నాడు బాహ్యుడు. కాని "నాన్య:పన్థావిద్యతేజయనాయ" (వేరే మార్గమేమీ లేదు) అన్న కలలోని వాణి చెవులలో గింగురుమంటున్నది. "తెల్లవారు జాము కలలు నిజం అవుతాయంటారు. ఏమో, ఏపుట్టలో ఏ పాముందో! ఇది తేల్చుకోవల్సిన విషయమే!" అది నిశ్చయించి, కాలకృత్యాలు తీర్చుకొని దూరప్రయాణానికి సిద్ధమయ్యాడు బాహ్యుడు.

ఎక్కడి సూర్పారక, ఎక్కడి శ్రావస్తి! బాహ్యుడు శ్రావస్తి పేరు వినడమే కాని, వెళ్ళి ఎఱుగడు. ఇక బుద్ధుని మాటా? ఎవరో పరివ్రాజకుడు సనాతన వైదిక ధర్మాన్ని కాదని, ఏదో అనాత్మవాదాన్ని బోధిస్తున్న వైనం తనవరకు వచ్చింది కాని, అతడే తాను కలలో విన్న సమ్యక్ సంబుద్ధుడని బాహ్యుడు ఎలా అనుకోగలడు? అయినా కాకపోయినా, ఇప్పుడతని చింతనవేరు; అది అతి త్వరగా శ్రావస్తి చేరుకోవాలనే. అందుకు తగినట్లు గానే అతడే మాత్రము ఆలస్యం చేయలేదు. హుటాహుటి పయనమయ్యాడు శ్రావస్తికి. అంతా సవ్యంగా జరిగితే ఒక వారం పది రోజుల ప్రయాణం. ముందుగా గోదావరి ఒడ్డున ప్రతిష్ఠానపురం చేరుకొని, ఆతరువాత నర్మద దాటి, ఉజ్జయిని మీదుగా యమునాతీరాన ఉన్న కోశాంబికి వెళ్ళాలి; అక్కడనుండి గంగపై అయోధ్యా, ఆపైన కోసలదేశంలో అచిరావతి (ఇ నదీ తీరాన శ్రావస్తికి. సులభప్రయాణం కాదు. కాని, బాహ్యుని సంకల్పబలమో, ముహూర్తబలమో, ఇంత ప్రయాణమూ అనుకున్నట్టుగా జరిగింది. అతడు గమ్యం చేరుకునేసరికి తెల్లారింది. శ్రావస్తి నగరం అప్పుడే మేలుకొంటోంది.

నాటి శ్రావస్తి అచిరావతి నది ఇరుప్రక్కల పారుతున్న ఒక మహా నగరం; కోసల దేశపు రాజధాని. మహారాజు ప్రసేనజిత్తు పరిపాలనలో వైభవోపేతంగా వర్ధిల్లుతోంది. రెండు చదరపు మైళ్ళ విస్తీర్ణంతో, ఉత్తర, దక్షిణాపథాల కూడలిగా, ప్రాక్పశ్చిమ ప్రాంతాల వ్యాపార కేంద్రంగా ఉన్న శ్రావస్తి నాటి ఆర్యావర్తపు ముఖ్యనగరం. నది ఒడ్డున అనుష్టానం తీర్చుకొని, సేదతీరి, నగరంలో ప్రవేశించాడు బాహ్యుడు. కాని అంతా అగమ్య గోచరంగా ఉంది. విపణి వీధి చేరుకున్నాడు. సంస్కృతమే కాక పాలి, ప్రాకృతభాషలలో కూడ పరిచయం ఉండడం వలన ఒకరిద్దరి ద్వారా బుద్ధునివాస స్థలం జేతవనం లోని ఆరామమని గ్రహించాడు; జాడ తెలుసుకున్నాడు. జేతవనం చేరుకునేసరికి బాగా ప్రొద్దెక్కింది.

"భగవాన్ భిక్షాటనకై వెళ్ళే సమయం కదా ఇది! తిరిగి వచ్చే వేళ కూడా అయింది; విశ్రమించండి" అన్నారు ఆరామంలోని శ్రమణులు, బాహ్యుని వైనము, దూరప్రయాణ వివరాలు తెలుసుకొని. బుద్ధుని వెంటనే చూడలేకపోయినందుకు నిరుత్సాహం కలుగ లేదు సరికదా, ఆతృత ఎక్కువైంది బాహ్యునికి. 'విశ్రమించే' పరిస్థితిలో లేడతను. బుద్ధుడు భిక్షాటనకై వెళ్ళిన దారి తెలుసుకొని ఆమార్గం పట్టాడు. శ్రమణులతనిని - ఆగమని అర్థిస్తున్నా వినక.

అపరాహ్ణం కాబోతున్నదేమో వైశాఖమాసపు టెండ

తీవ్రమౌతున్నది. అచిరావతి నదీసైకతాల మీదుగా వేడి గాడ్పు తీస్తున్నది. ప్రయాణీకులు చలివేంద్రాలు వెతుక్కుంటున్నారు. బాహ్యుడు మాత్రం ఎండ వేడి గమనించలేదు. అతని తాపం అంతరంగంలోనిది; దానికి ఉపశమనం బుద్ధధర్మనమేనేమో! శ్రమణుల సూచనలనుసరించి శ్రావస్తి వీధులలో త్వరత్వరగా నడచి రాజవీధి చేరుకున్నాడు బాహ్యుడు., బుద్ధుని వెతుక్కుంటూ. అనతి దూరంలో ఒక దృశ్యం అతనిని నిలవేసింది.

భిక్షాటనం ముగించుకున్నట్లున్న శ్రమణుల గుంపొకటి తన వైపే వస్తోంది. వారందరి ముందు తేజస్వి అజానుబాహుడైన మహాశ్రమణుడు చేత భిక్షాపాత్రతో అవనతవదనుడై ధీరమందగమనంతో తనని సమీపిస్తున్నాడు. అతడే బుద్ధుడై ఉండాలని నిశ్చయించుకున్నాడు బాహ్యుడు. పరుగున ముందుకు వెళ్ళి బుద్ధుని పాదాల ముందు మోకరిల్లాడు, "భగవాన్! ముక్తిమార్గం చూపించండి!" అంటూ.

ఆకస్మిక సంఘటనకు ఏమాత్రం తొట్రు పడక భగవానుడు శాంతంగా: "నాయనా! ఇది భిక్షాటన వేళ; ధర్మప్రవచనానికి సమయం కాదు. ఆరామానికి రా!"

బాహ్యుడు పట్టువదలలేదు: "అంతవరకు ఆగలేను, భగవాన్! అనుగ్రహించండి!" బుద్ధుని తోడి శ్రమణులు కూడ 'ఇది వేళ కాదని' బాహ్యునికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు కాని, అతడు వినే స్థితిలో లేడు; మోకరిల్లే ఉన్నాడు

బుద్ధుడు నెమ్మదిగా వంగి, బాహ్యుని తలపై చేయి వేసి, అనునయంతో "ఏమిటి నాయనా! నీ చింత?" అనడంతోనే, బాహ్యుని ఆవేదన పెల్లుబికింది.

"భగవాన్! శాస్త్రాలన్నీ అభ్యసించాను, యజ్ఞాలు చేశాను; వేదాలు తరచి చూశాను, జ్ఞానినను కున్నాను. కాదని గ్రహించి, ముక్తిమార్గం కోసం మీవద్దకు చేరాను. వ్యవధి లేదు అనుగ్రహింప వేడుకుంటున్నాను, మన్నించండి!" అన్నాడు అంజలి ఘటించి.

బుద్ధుడు బాహ్యుని రెండు చేతులతో లేపి, అతనిని తదేకదృష్టితో చూశాడు; "నాయనా! శ్రద్ధగా విను" అని, ఒక్క నిమిషం కళ్ళుమూసుకొని, "చూచిన దానిలో చూచినది తప్ప మరేమీ లేదు. చేసిన దానిలో చేసినది తప్ప వేరేమీ లేదు. విన్న దానిలో విన్నది తప్ప వేరేమీలేదు. ఏ మనోవర్తనమైనా ఆవర్తనం తప్ప వేరేమీ లేదు. ఇదే ధర్మ సూక్ష్మం, ఇదే ముక్తిమార్గం!"

పిపాసార్తునికి మధురాంబువులు బాహ్యునికి భగవానుని సూక్తులు. క్రమంగా అతని ముఖకవలికలు మారాయి. అంతరంగంలోని ఆనందతరంగం మందహాసంగా వెలువడింది. అప్రయత్నంగా "చూచిన దానిలో చూసినది, విన్నదానిలో విన్నది, చేసినదానిలో చేసినది" అని మననం చేస్తూ తల వంచి, "ధన్యోస్మి, భగవాన్! నా జన్మ తరించింది!" అంటూ, మరల పాదాభివందనం చేశాడు బుద్ధునికి. బాహ్యుని - ఆశీర్వదించి, బుద్ధుడు జేతవనం దెసగా నడక సాగించాడు.

దూరమవుతున్న తథాగతుని చూస్తూ స్థాణువులా నిలుచుండి పోయాడు బాహ్యుడు. అతనిలోని ఏదో ఉద్వేగము, అంతలోనే ఒక పెన్నిధి దొరికిన సంతృప్తి, తజ్జనితమైన ప్రశాంతభావన, ఆనందాశ్రువులుగా వెలువడినవి. అతని ముఖంలోని మార్పూ, అలౌకిక వర్చస్సూ వెనుక నున్న శ్రమణులకు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. బౌద్ధసంఘం కనుచూపు దాటేవరకు నిలబడే ఉన్నాడు బాహ్యుడు. కొంతసేపటికి తేరుకొని అటువైపే మంత్రముగ్ధునిలా నడక సాగించాడు. అతని ఒంటిపై స్పృహ ఉన్నట్టులేదు; అతడీ లోకంలేనే ఉన్నట్టు లేదు. మరేదో లోకానికి తీసుకుపోతున్నట్టున్నాయి అతని పాదాలు.

ఎదురుగా వస్తున్న గోవుల మందను అతను చూసినట్టులేదు. తప్పుకోక, వీధి మధ్య నడుస్తున్న తనను ఆలమంద రెండు ప్రక్కలా రాచుకుంటూ పోవడం అతను గమనించలేదు. దుడుకుగా వస్తున్న ఒక ఆవు తలవిసురుతో తనని పడ త్రోయడం కూడ అతనికి పట్టినట్టు లేదు. నేల కొరుగుతున్నా అతని తన్మయత్వ వైఖరి మారినట్టులేదు. అవును మరి, తథాగత దివ్య బోధామృతపానమత్తునికి స్పృహ ఏది? బాధ ఏది? మరణమేదీ?"

గోధూళి మణగి, మంద అంతా దాటిపోయిన తరువాత కాని కానరాలేదు జరిగిన దుర్ఘటన. చూచి, పరుగెట్టి వగర్చుకుంటూ వచ్చిన గొడ్లకాపర్లు, పరిసరజనులు ఆదుకునే వేళకు సమయం మించిపోయింది. వీధి మధ్య కుప్పగా కూలి ఉన్నాడు బాహ్యుడు. శాక్యముని మూడు మాటలతో ముక్తుడైన బాహ్యుడు విగతజీవుడైనా, అతని ముఖకవలికలు మారలేదు; తేజస్సు కోల్పోలేదు. అమోఘధర్మప్రవచనంతో క్షణంలో స్రోతపన్నుడైనా (ఆ ,అర్హతుడై, సద్యోవిముక్తుడైన

బాహ్యునికి నిర్వాణ (౧౦) సుఖం అంతలోనే నిర్యాణ (౧౧) మైంది.

బుద్ధభగవానుని ఆదేశంపై శ్రమణసంఘమూ, ధర్మాత్ములైన కొందరు శ్రావస్తి జనులూ, అనాధప్రేత సంస్కారానికి పూనుకున్నారు. జేతవనం దరిదాపులనే అచిరావతి నది ఒడ్డున చితి పేర్చించారు. దహన సంస్కారం మొదలయ్యేసరికి సూర్యాస్తమయం కాబోతున్నది.

ఆరామంలో సాయంత్రం తథాగతుని ధర్మభోధ ఇది: "బాహ్యుడు ధన్యుడు. అవసానదశ నెఱిగి, జ్ఞానకాంక్షియై, అర్హతుడై, జన్మరాహిత్యమందాడు."

"చూచు చుండెడు నప్పుడు చూచు టొకటె
వినుచు నుండెడు నప్పుడు వినుట యొకటె
మనసు వర్తించు నపుడు వర్తన మొకటియె
చేయునది యెద్ది యైనను చేయు టొకటె
బంధముక్తుని జేయు విపశ్యనమ్ము!
ఇదియె అష్టాంగహృదయ మియ్యదియె పరము
బాహ్యునకు నంత్యకాలాన గ్రాహ్యమైన
ముఖ్యసూత్రమ్మిది యతని పుణ్యఫలము"
"ఇంద్రియ స్పర్శలో నహంవృత్తి లేక
ఎపుడు నీ చేత లందున 'నీవు 'లేవో"
అపుడు కర్మఫలమ్ము నిన్నంటబోదు
ధర్మములలో మహోత్కృష్ట ధర్మ మిదియె
సూక్ష్మమయ్యు పరాయణ సూత్ర మిదియె"

అచిరావతి నది ఒడ్డునే బాహ్యుని చితి దహింపబడుతోంది. సూర్యాస్తమయమైంది. ఎరుపెక్కిన పశ్చిమాకాశమూ, గాడ్పుకి ఎగిసిన చితిపై మంటలూ, మంటలను ప్రతిఫలించిన నదీజలాలూ, బాహ్యుని పంచీకరణ స్థితి (౧౨ ) ని పంచుకున్నాయి. సంధ్యారుణిమలో ఆరామస్తంభాలు జేగురురంగు పూసినట్లున్నాయి. కొద్దిసేపటికి చితి చల్లారింది; చీకట్లు కమ్ముకున్నాయి. అక్కడక్కడ కొన్ని మిణుగురు పురుగులు మాత్రం అనిత్యత్వాన్ని చాటుతున్నట్లుగా వెలుగుతూ ఆ-రుతూ ఉన్నవి.

(పురాతన బౌద్ధ వాఙ్మయపు 'ఉదాన', 'సుత్తనిపాత' గ్రంధాలలోని 'బాహ్యసూత్రం' ఈ కథకు - ఆధారం)

----------------------------

ఈ కథలోని కొన్ని పదాలకు వివరణ:

౷ సద్యోవిముక్తి: తక్షణమే విముక్తి (ఒక విధంగా 'సూక్ష్మంలో మోక్షం')

(౧) ధర్మచక్రప్రవర్తనం: జ్ఞానోదయమైన తరువాత సారనాథ్ లో బుద్ధుని మొట్టమొదటి ధర్మబోధ

(౨) మహాకశ్యపుడు, సారిపుత్ర, మౌద్గల్యాయనులు: బుద్ధుని ముఖ్యశిష్యులు

(౩ ) తథాగతుడు: 'ఈ విధముగా వచ్చి(వెళ్ళి) న వాడు', బుద్ధుడు

(4) చీవరం: శ్రమణుల అంగవస్త్రం

(5) సాంగోపాంగము (స+అంగ+ఉప+అంగము) గా = క్షుణ్ణముగా

(౬) సూర్పారక: నేటి గుజరాత్ లోని సూరత్‌కు దగ్గరగా ఉన్న 'సోపర' అనే గ్రామం

(7) శ్రావస్తి: నేటి 'సాహెత్ మాహెత్' గ్రామం

(౮) అచిరావతి: నేటి 'రాప్తి' నది

(౯) స్రోతపన్నుడు: ధర్మస్రవంతిలో చేరినవాడు

(౧౦) నిర్వాణం: జీవన్ముక్తి

(౧౧) నిర్యాణం: మృత్యువు

(౧౨) పంచీకరణస్థితి:దేహాంతమైన పిదప ప్రాణము పంచభూతము (నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశము) లలో లీనమయే పరిస్థితి.

# సత్యనారాయణపురం రైల్వే గేటు

- *రెంటాల కల్పన*

ఎప్పటిదో ఒక రైలు ప్రయాణపు జ్ఞాపకం ....
చెట్లు , చేమలు, వూళ్ళు, నీళ్ళు, వెనక్కు వెళ్ళిపోతూ
ఎప్పుడు అంతే
జ్ఞాపకం ఒక దాటలేని వంతెన !

ముందూ వెనకల పరిభ్రమణాల మధ్య
చిక్కుకున్న కాలనది
ప్రతి స్మృతి ఒక మజలీనే !

ఈ రైలు ఇప్పుడే ఇక్కడే
ఏదో ఒక మజలీలోనే ఆగిపోవాలి
వెనక్కు పరుగెత్తుకుంటూ

మాటలు రాని పసితనం
ఓనమాలు దిద్దని చిటికినవ్రేళ్ళలా
అమ్మ వొడిలోకి పరుగెత్తాలి

నాన్నతో కలిసి కృష్ణ వొడ్డున నడవాలి
అన్నయ్యలతో తగాదాలాడాలి
అక్కయ్యతో రహస్యాలు చెప్పుకోవాలి
చెల్లెలిపై అజమాయిషి చెయ్యాలి
నాముద్దుల తమ్ముడిని చిటికినవేలు పట్టుకుని
స్కూల్ దగ్గర దించాలి

పిచ్చి కలలే కాని
ఇంకా పచ్చిపచ్చిగా
కాలీకాలని మొక్కజొన్న కండెల్లా
కన్రెప్పల కింద కదలాడుతూనే వున్నాయి

ఈ జ్ఞాపకాలకు ఆల్జైమర్లు, అమ్నీషియాలు తెలియవు
బెజవాడ సత్యనారాయణపురం రైల్వే గేటు
అదే మొదటి చివరి చిరునామా!

# సినీమంత్రికుడు - బహుముఖ ప్రజ్ఞా శాలి సత్యజిత్ రాయ్

*- విష్ణుభొట్ల లక్ష్మన్న*

"కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహా పురుషులవుతారు" అన్న వేటూరి సినీగీతం సత్యజిత్ రాయ్‌కి అచ్చంగా వర్తిస్తుంది. సినిమాలు ఇష్టం ఉన్న వారికి ప్రముఖ ప్రపంచ (బెంగాలి) సినిమా దర్శకుదు సత్యజిత్ రాయ్ గురించి తెలియకుండా ఉండదు. నా కాలేజీ రోజుల్లో రాయ్ సినిమాలు చాలా చూసాను కానీ వాటి గురించి ఎక్కువ పట్టించుకునే వాణ్ణి కాదు. ఈ మధ్య "ఈ మాట" వెబ్ పత్రికలో రాయ్ సినిమాల మీద (ఒక సినిమాపై ఒక వ్యాసం చొప్పున) సమీక్షలు, రాస్తూ, రాయ్ సినిమాలు మళ్ళీ మళ్ళి చూస్తున్నా. చిత్రమైన విషయం ఏమిటంటే రాయ్ సినిమాలపై తెలుగులో వచ్చిన సమీక్షలు, వ్యాసాలు తక్కువే! ప్రపంచ సినిమా రంగంలో గుర్తించబడ్డ తొలి భారతీయుడైన సత్యజిత్ రాయ్ సినిమాలను పరిచయం చేస్తూ తెలుగులో పుస్తకాలు కూడా ఉన్నట్టు లేదు. ఈ నేపథ్యంలో, ౧౯౫౫ సంవత్సరంలో "పథేర్ పాంచాలి" సినిమాతో సినిమారంగేప్రటం చేసి, దాదాపు ౨౯ సినిమాలకి దర్శకత్వం వహించిన సత్యజిత్ రాయ్ సినిమాల మీద ఒక సంగ్రహ సమీక్ష రాసే ప్రయత్నమే ఈ వ్యాసం.

**పరిపూర్ణత్వం**

చాలా మంది చిత్రదర్శకులకి సినిమా తియ్యటంలో ఉన్న ఒకటి,రెండు అంశాలపై సాధికారత ఉంటుందేమో! సత్యజిత్ రాయ్ అలా కాదు. సినిమా నిర్మాణంలో ఉన్న - నటనా దర్శకత్వం, సిన్మాటోగ్రఫీ (కెమేరా పనితనం), ఎడిటింగ్, కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, కళా దర్శకత్వం, కాంతిని దానితో పాటు శబ్దాన్ని ఉపయోగించే తీరు - వంటి విభిన్న అంశాలలో నిష్ణాతుడు కావటంతో రాయ్ సినీప్రపంచంలో ఒక పరిపూర్ణతను సాధించాడనిపిస్తుంది. ఇంత బహుముఖత్వానికి బీజం - సినిమా మధ్యమాన్ని మథించాలి అన్న పట్టుదలే!

**కథా నిర్ణయం**

సినిమా విజయానికి ఒక మూలం "కథ" అనుకున్నట్టయితే దాన్ని వెండి తెరపై చూపించే కథనం కూడా ముఖ్యమైనదే! రాయ్ సినిమాలకి ఎన్నుకున్న కథలన్నీ మూసపోసినట్లు కాకుండా చాలా విభిన్నంగా ఉంటాయి. ఉదాహరణకి, భారతీయ చలనచిత్రాల్లో అంతకు ముందెన్నడూ లేనట్టు 'అపు చిత్రత్రయం' లో చూపించిన గ్రామీణ వాతావరణం, ఆ వాతావరణంలో పెరిగిన పిల్లల జీవిత చిత్రీకరణ వల్ల - భారతీయ సినిమాలో ఏకైక విజయంగా నిలిచిపోయాయి ఈ సినిమాలు. ఇలా ఒక పక్క గ్రామీణ జీవితాన్ని చూపించిన రాయ్ పట్టణ మధ్య తరగతి జీవితాన్ని చూపించిన సినిమాలు కూడా తీసాడు కాంచన జంగ, మహానగర్, నాయక్, అరణ్యర్ దిన్ రాత్రి. అలాగే మరో విలక్షణ చిత్రత్రయం ఠాగోర్కి నివాళిగా తీసిన తీన్ కన్యా, చారులత, ఘరేబైరే. సంప్రదాయంపై తిరుగు బాటుగా తీసిన సినిమాలు - దేవి, సద్గతి కూడా చెప్పుకోతగ్గవే! అలాగే చరిత్రలో జరిగిన సంఘటనలపై చిత్రించిన పత్రంజి కా ఖిలారి, అశని సంకేత్ సినిమాలు గుర్తు పెట్టుకోతగ్గవి. చాలా మంది దర్శకులు విస్మరించిన చిన్న పిల్లలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలు రాయ్ ఎన్నుకుని అమోఘమైన విజయాలని సాధించాడు. గోపీ గాయెనె-భాగా బయెనె, హిరక్ రాజా దేశె, సోనార్ కెల్లా, జై బాబు ఫేలూనాథ్, చిడియా ఖానా సినిమాలు ఈ కోవకు వస్తాయి. ఇవన్నీ ఇక్కడ ఉదాహరించడానికి కారణం రాయ్‌కి ఉన్న బహుముఖ ప్రతిభలోని ఒక కోణాన్ని మీ ముందుంచటమే!

**తూర్పు - పశ్చిమ దేశాల సినిమా ప్రభావం**

రాయ్ సినీ విజయాలకి ఒక కారణం రాయ్‌కి ప్రపంచ సినిమాతో ఉన్న గాఢమైన పరిచయం. ఒక పక్క అకిరా కురొసావా వంటి అతి ప్రతిభావంతుడైన జాపనీయ దర్శకుడు, మరో పక్క రెన్వార్ (ఫ్రెంచ్), బైసికిల్‌థీఫ్ సినిమా తీసిన విక్టోరియడెసికా (ఇటలియన్) వంటి దర్శకుల ప్రభవం రాయ్‌పై బలంగా ఉన్నాయి. సినిమా అన్న మాధ్యమం అర్థం చేసుకోటానికి ఇలాంటి పరిచయాలు ఎంతో ఉపయోగపడ్డాయని రాయ్ స్వయంగా చెప్పుకున్నాడు.ఎంతో మంది దర్శకులకి లేని మరొక ప్రతిభ రాయ్‌కి ఉన్న జర్నలిజం అనుభవం. సినిమాల్లోకి రాక ముందు రాయ్ జర్నలిస్టుగా ౧౩ఏళ్ళు పని చేసాడు. ప్రపంచ సినిమాలపై తన అనుభవాలు "మన సినిమాలు, వాళ్ళ సినిమాలు" అన్న పుస్తకంలో వివరంగా రాస్తాడు. అందువల్ల, రాయ్ ద్వారా సినిమా అన్న మాధ్యం గురించి ఎన్నో వివరాలు తెలుస్తాయి.

1940 దశాబ్దంలో శాంతినికేతన్‌లో లలిత కళలు, గ్రాఫిక్ డిజైనింగ్ అభ్యసించి బయటికి వచ్చిన రాయ్‌ని సినిమాలు ఎంతో ఆకర్షించాయి. కానీ, భారతీయ సినిమాల్లో ఎంతసేపూ తీపి వలపుల ప్రేమ పాటలు, మార్మిక పురాణగాధలు రాజ్యమేలటం రాయ్‌ను చికాకు పెట్టాయి. "సినిమాకు జీవితమే ముడిసరుకు కావాలి. సినిమా వంటి జనమధ్యమానికి స్ఫూర్తి మన జీవితంలో, మన మూలల్లో ఉండాలి. సంగీతం,కవిత్వం, చిత్రలేఖనం వంటి రంగల్లో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన మన దేశం, చిత్ర దర్శకుల్ని కదిలించలేకపోటం విడ్డూరం. వాళ్ళు తమ కళ్ళూ, చెవులూ తెరుచుకుంటే చాలు!" ఈ వేదనే సత్యజిత్ రాయ్‌ను సినిమాల వైపు ధృఢ సంకల్పంతో నడిపించింది.

**ఎడిటింగ్**

చిత్ర నిర్మాణంలో ఎక్కువగా గుర్తింపు లేని ఒక ముఖ్యఅంశం "ఎడిటింగ్". రాయ్ తన మొదటి సినిమా పథేర్ పంచాలి తీస్తున్నప్పుడే జరిగిన ఎడిటింగ్ అనుభవాన్ని రాయ్ ఆసక్తికరంగా ఇలా వివరిస్తాడు. సినిమాలు తీసే దర్శకులు ఎందుకు సినిమా తీయటం లో ఉండే సాధక బాధకాలు గురించి ఎక్కువగా రాయరు? సినిమా తీస్తున్నప్పుడు ఒక్క రోజులో జరిగే పని రాయాలన్నా కూడా కష్టమే! ఈ సినిమా తీసే ప్రక్రియ అతి సంక్లిష్టమైనది. సినిమా తీసేవాడికి, తీస్తున్న యంత్రాలు, (అంటే కెమేరా) తీయబడుతున్న వస్తువులు (అంటే నటీనటులు కాని, ప్రకృతి సంబంధమైన దృశ్యాలు కాని) మధ్య ఉండే త్రికోణ సంబంధం అర్ధం చేసుకోటం కష్టం. ఎంతటి ప్రతిభాశాలి అయిన దర్శకుడైనా, అతని మనసులో మెదిలే భావాలు స్పష్టంగా కాగితం మీద పెట్టటానికి భాష చాలదు. పథేర్ పంచాలి సినిమా తీస్తున్న మొదటి రోజే, కొన్ని పాఠాలు నేర్చుకున్నా. ఉదాహరణకి, దుర్గ తన తమ్ముడు అపుకి తెలియకుండా అపుని చూసే దృశ్యం తియ్యాలి. నేను మీడియం క్లోజప్ ఉండేట్లు ఒక మామూలు లెన్సు కెమేరాకు వాడదామనుకున్నా. ఈ దృశ్యంలో, దుర్గను నడుం నుంచి పైభాగం అంతా చూపిస్తూ తియ్యాలనుకొన్నా. ఆ రోజు షూటింగ్‌లో ఫొటోగ్రఫీ వృత్తిగా ఉన్న ఒక స్నేహితుడు షూటింగ్ లొకేషన్‌లో ఉన్నాడు. ఆ సీన్‌లో దుర్గ ఏం చెయ్యాలో నేను చెపుతున్నప్పుడు, ఆ స్నేహితుడు నా కెమేరాను సవరించడం చూసా. అతను నేను పెట్టిన మీడియం క్లోజప్ లెన్సు తీసేసి లాంగ్ క్లోజప్ లెన్సు పెట్టి, నన్ను కెమేరా నుంచి దుర్గను చూడమన్నాడు.

నాకు అంతకు ముందు స్టిల్ కెమేరాతో చాలా అనుభవం ఉన్నా, ఎప్పుడూ లాంగ్ ఫోకల్ లెంగ్తు ఉన్న లెన్సుతో పని చెయ్యలా. నిజమే! ఈ లెన్సు వల్ల దుర్గ మొహం నిండుగా కనపడింది. మొత్తం మీద ఆ దృశ్యం అలాగే లాంగ్ క్లోజప్ లెన్సుతో పూర్తి చేసాం. దాంతో దుర్గ మొహం అంతా అతి స్పష్టంగా కనపడుతూ, సూర్య కిరణాలు మొహంపై పడటం వల్ల, వింత వెలుగులతో దుర్గ మొహం ప్రేక్షకులకు కనపడుతుంది. ఈ దృశ్యం చూసిన వాళ్ళెవ్వరైనా, ఆ పనితనాన్ని మెచ్చుకు తీరాలి. ఈ సమయానుకూలమైన సలహాకి నా స్నేహితుడ్ని అభినందించి ఆ రోజు కార్యక్రమం పూర్తి చేసాం.

కొన్ని రోజుల తరవాత, ఫిలింని కత్తిరిస్తూ ఎడిట్ చెయ్యబోతూ, ఈ దృశ్యాన్ని చూసి బిగుసుకు పోయా! ఆ చిన్న షాట్ బాగానే వచ్చింది కాని, మిగిలిన షాట్లతో సరిగ్గా ఇమడలా. కొట్టొచ్చినట్టు చాలా తేడాగా ఉంది. ఇది ఎందుకూ పనికి రాదు అన్న విషయం నాకు బోధపడింది. దీన్నుంచి రెండు విషయాలు నేను నేర్చుకున్నా. మొదటిది - ఒక దృశ్యం, సందర్భానికి తగినట్టు ఎంత అందంగా ఉండాలో అంతే అందంగా తియ్యాలి. ఎక్కువా పనికి రాదు. తక్కువా పనికి రాదు. రెండవది - ఏ వ్యక్తి దగ్గర నుంచి అయినా సరే, తియ్యబోతున్న సినిమా లోని అసంపూర్ణమైన అవగాహన ఉంటే తప్ప సలహా తీసుకోకు. దర్శకుడికి సినిమా తియ్యటంలోని అన్ని విషయాలపై ఉన్నంత లోతైన అవగాహన, మరొకరికి ఉండే అవకాశం తక్కువ.

**సంగీతం**

రాయ్ అపు చిత్రత్రయంలోని మూడు సినిమాలకు సంగీతం ప్రఖ్యాత సితార విద్వాంసుడు పండిట్ రవి శంకర్ సమకూర్చాడు. తరవాత సినిమాలకు రాయ్ స్వయంగా సంగీతం అందించటం మొదలెట్టాడు. ప్రత్యేకంగా, రాయ్‌కి అటు పాశ్చాత్య సంగీతం, ఇటు భారతీయ సంగీతం, రెండిటిలో చెప్పులోతగ్గ ప్రవేశం ఉండటమే కాకుండా, సినిమాలకి ఎటువంటి సంగీతం ఉపయోగించాలో కూడా బాగా తెలుసు.

పాశ్చాత్య సంగీతంపై రాయ్ స్పందన సహజంగా ధృఢమైనది. దానికి తోడు ఒకటి, రెండు పుస్తకాలు సినిమాల బాగోగులు మీద చదవటం సహాయపడింది. రాయ్ మాటల్లో,"ఎంత ఆశ్చర్యం! సినిమాకి, సంగీతానికి

ఎన్ని పోలికలు! రెండూ సమయం గడుస్తున్న కొద్దీ వాటిలోని రహస్యాలను విప్పి చెపుతాయి. రెంటికి లయ ప్రధానం. అలాగే రసం - అంటే బాధ, ఆనందం, లోతైన ఆలోచనాత్మకం, సందడిగా ఉందటం, విచారం, ఉల్లాసం - ప్రధానమైనవి. ఇక్కడ సంగీతం అంటే, పాశ్చాత్య సంగీతానికి మాత్రమే పరిమితమైన పోలికలు ఇవి. ఎందుకంటే, భారతీయ సంగీతంలో అప్పటికప్పుడు సృష్టి చేసే అవకాశం ఉంటుంది కాబట్టి ఉన్న వ్యవధిలో బాణీలో వైవిధ్యం తీసుకురావాటానికి అవకాశం ఎక్కువ. పైగా భారతీయ సంగీతం అలంకార ప్రధాన మైనది. ఇందులో నాటకీయత లేదు. అతి నెమ్మదిగా మొదలై వేగమైన ముగింపును ఇస్తుంది. ఈ ప్రయాణం లో అతి సంక్లిష్టమైన లోతుల్ని చూపుతుంది. ఒక రాగంలో ఉన్న స్వరాల ద్వారా అనుభూతుల్ని ప్రేక్షకులకి ఇవ్వటానికి ప్రయత్నిస్తాడు సంగీతకారుడు. అందుకనే, మన సంగీతం గొప్పతనం అత్యుత్తమ స్థాయికి చేరిన విద్వాంసులు మాత్రమే చూపగలరు. ఈ యాత్రలో సంగీతంలోని అందం, బిగి, ఉద్రేకం చూపిస్తూ సంగీతం ఘనత చూపిస్తాడు విద్వాంసుడు. కానీ, ఇందులో నాటకీయత చూపించలేడు. ఎందుకంటే, మన సంగీతంలో ఘర్షణ లేదు!"

**స్క్రిప్ట్**

రాయ్ ఎప్పుడూ రెండు సినిమాలపై ఒకేసారి పనిచేయలేదు. ఒకే రకమైన సినిమాలు వెంట వెంటనే తీయటం రాయ్‌కి పడదు. ఇందుకు కారణం రాయ్‌లోని అశాంతో, దిశారాహిత్యమో, లేక దృక్పథంలోని అస్పష్టతో తెలియదు. ఒక విషయం మాత్రం రాయ్‌కి ఖచ్చితంగా తెలుసు. జీవితం అందించే అనేక అందాలు- ఆనందాలు, అనేక కాలాల్లో జరిగిన చరిత్ర, అన్నిటికన్నా సినిమా చిత్రీకరించటంలో ఉన్న అనేక వైవిధ్యాలు రాయ్‌కి ఇష్టం. రాయ్ సినిమాకి కథ రాస్తున్నప్పుడు తన జీవితంలో పరిచయమున్న పాత్రలను ఉపయోగించు కోవటం చూస్తాం! తనకి ముఖాముఖి పరిచయం లేని పాత్రలను, మరొకరి సహాయంతో అర్థం చేసుకోగలనని రాయ్ స్వయంగా చెప్పుకున్నాడు. మనస్తత్వశాస్త్రం రాయ్ సినిమా నిర్మాణంలో అతి ముఖ్యమైనది అన్న విషయం "చారులత" సినిమాలో స్పష్టంగా తెలుస్తుంది. ఒక పాత్ర మానసిక స్థితి లోని మార్పు - ఆ పాత్ర అంతరంగంలో వచ్చే మానసిక పరిమాణం అత్యంత ప్రతిభతో "చారులత" సినిమాలో చిత్రీకరించాడు.

చిత్ర దర్శకులకి చిత్ర నిర్మాణంలో తగినంత సృజన లేకపోవటంపై రాయ్ తన అసహనం చూపిస్తాడు. "ఒక రచయిత పదాల కోసం వెతుకుతుంటే, నిఘంటువు సాయపడగలదు. కానీ, చిత్ర నిర్మాణానికి నిఘంటువు లేదే! ఎన్ని సినిమాల్లో ఒక పాత్ర చావు చూపించటానికి వెలుగుతూ ఉన్న దీపాన్ని ఆర్పటం చూపించారో! ఈ ఒక్క విషయంలోనే సృజనకి ఎంతో అవకాశముంది" అని రాయ్ అంటాడు."అపరాజితో" సినిమాలో హరిహర్ పాత్ర మరణం నిర్ధారించటానికి రివ్వున గాల్లోకి ఎగిరి వలయాకారంగా తిరిగే పావురాలను చూపటం సృజనకి ఒక ఉదాహరణ.

సినిమాలో సంభాషణలపై రాయ్ ఆలోచనలు ఇలా ఉంటాయి. "సంభాషణలు వింటున్నప్పుడు ఆ రచయితను ఎవ్వరూ స్మరించుకోనివే ఉత్తమ సంభాషణలు!" సంభాషణల పట్ల రాయ్ అభిప్రాయలు చిత్రంగా ఉంటాయి. రాయ్ దృష్టిలో -అతి కీలకమైన సన్నివేశాల్లో సంభాషణలు ఉండకూడదు.

**దర్శకత్వం**

ఏ మాత్రం శ్రమ, అట్టహాసమైన కుదుపులు లేకుండా రాయ్ గీసిన చిత్రం ప్రేక్షకుల్లో అంతులేని అలజడి కలిగిస్తుంది. ఇది ఎలా సాధిస్తాడు? ఇందులో అనవసరమైన, అవకతవకలున్న సినిమాటోగ్రఫీ కిటుకులు ఏమీ లేవు. అందులోనే ఉంది రాయ్ పాండిత్య ప్రకర్ష రహస్యం!

సినిమా నిర్మాణంలో అన్ని అంశాలపై రాయ్ సాధికారతను తెలిపే ఈ క్రింది వాక్యానికి ఎంతో భాష్యం చెప్పుకోవచ్చు!

సినిమా సంబంధించిన ప్రతి విషయం క్లిష్టమైనదే!

(సత్యజిత్ రాయ్‌పై వ్యాసం రాయమని సూచించి అందుకు తగిన వివరాలు అందించిన నా మేనకోడలు శ్రీమతి చామర్తి కల్పనకి అభినందనలతో - రచయిత)

# వానప్రస్థం

- సాయి బ్రహ్మానందం గొర్తి

గేటు తలుపులు తీద్దామనుకొని ఒక్కసారి ఆగిపోయి చుట్టూ చూసాను. ఇంటి గోడల మీద పెల్ల పెచ్చుల్లా ఊడి ఇటుకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంటి పైకప్పుల మీద పెంకులు కొన్నిచోట్ల పగిలిపోయి కొత్త నేతకి సిద్ధంగా ఉన్నాయి. ఈ ఇంటికి వృద్ధాప్యం వచ్చిందన్న సంగతి చూడగానే తెలుస్తోంది. ఇంటి ముందు మెట్ల కటూ ఇటూ ముద్దబంతి పూల మొక్కలున్నాయి. ఇంటి ముందు చిన్నగా ముగ్గేసుంది. ఎడమవైపు మామిడి చెట్టూ, కుడివైపు జామి చెట్టూ ఇవన్నీ నన్ను గుర్తు పట్టాయనిపించేలా బాల్యం గుర్తుకొచ్చింది. చుట్టూ పూల మొక్కలూ పచ్చని చెట్ల మధ్య ఆ పెంకుటిల్లు అందంగా కనిపించింది. ఒక్క క్షణంలో లెక్కలేనన్ని ఆలోచనలు రిక్షాదిగి లోపలికి వెళ్ళకుండా అక్కడే నిలబడి పోవడంతో రిక్షావాడు నాకేసి సంశయంగా చూశాడు. “మూర్తిగారిల్లిదే బాబయ్యా....“ ఇంకా గేటు తీయక పోవటంతో మరోసారన్నాడు.

అవును తెలుసన్నట్టుగా తలూపి గేటు తీసాను. గేటు చిడతకి మువ్వలు కట్టి ఉండడంతో ఘల్లున మ్రోగాయి. నా బ్యాగు తీసుకొని తిరిగి గేటు వేయబోతుండగా మరలా చప్పుడు చేసాయి.

“ఎవరూ?“ అంటూ ఓ స్త్రీ గొంతు వినిపించింది.

గొంతుని గుర్తుపట్టాను. అలా అంటూనే ఆవిడ బయటకొచ్చింది. ఇప్పుడు మనిషినే గుర్తుపట్టాను. ఆవిడే వర్ధనమ్మ. ముఖంలోముడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జుట్టు ముగ్గు బుట్టలా అయిపోయింది. కళ్ళకింద నలు పొచ్చింది. కళ్ళలో కాంతి ఉన్నా మొహంలో మునుపటి నవకం లేదు. నుదుట అర్ధ రూపాయంత ఎర్రని బొట్టు ఆవిడ పెద్దరికాన్ని చెబుతోంది. ఆకుపచ్చ నేత చీరలో ఆ-మె పండుముత్తయిదువలా అనిపించింది. చూసి దాదాపు పాతికేళ్ళు దాటింది. నేనావిణ్ణి గుర్తు పట్టాను కాని ఆవిడ నన్ను గుర్తుపట్టుండకపోవచ్చు. ఎవరో కొత్త వ్యక్తి అన్నట్టుగా నా ముఖంలోకి చూసిందావిడ.

“నేనండీ..రాంబాబుని...“

“రాంబాబా? అంటే?... ఆవిడ గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నస్తోంది.

“అదేనండీ... అమలాపురం రాంబాబుని. మీ అబ్బాయి నందు స్నేహితుణ్ణి....“ వర్ధనమ్మకేసి చూస్తూ నవ్వుతూ అన్నాను.

“ఓరి... నువ్వట్రా... మరలా చెప్పు చిన్నప్పుడెప్పుడో చూసాను. చాలా మారిపోయావు...“అంటూ నా చేతులు సంతోషంగా పట్టుకుంది. లోపలికి చేయి పట్టుకొని తీసుకెళ్ళింది. ఆ కళ్ళ వెలుగులో ఆనందం కనిపించింది.

“ఏవండీ, మన నందు స్నేహితుడు రాంబాబొచ్చాడు....“ అంటూ వాలు కుర్చీలో కునికి పాట్లు పడుతున్న మూర్తిగారిని లేపింది. ఒక్కసారి ఉలిక్కిపడి కళ్ళు నలుపుకుంటూ లేచాడాయన.

“ఎవరే.. వచ్చారు...?“ అంటూ నాకేసి చూసాడు.

“మీకు గుర్తుందా? మన నందు క్లాసుమేటు... అమలాపురం రాంబాబనీ.. మనింటికి వచ్చేవాడు...“ వర్ధనమ్మ గుర్తు చేయడానికి ప్రయత్నించింది.

“ఓర్నీ... నువ్వట్రా రాంబాబూ... ఎన్నాళ్ళయిందో చూసి.. ఎక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు..? ఆయన ప్రశ్నల వర్షం కురిపించాడు.

వర్ధనమ్మ లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తీసుకొచ్చింది. నేను అమెరికా వెళ్ళి పదిహేనేళ్ళయిందని మూర్తిగారికి నాగురించి చెప్పాను. నేనూ నందూ పదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాము. నందూ వాళ్ళది గంగలకుర్రు అగ్రహారం. అమలాపురం జిల్లా పరిషత్ హై స్కూల్ మంచిదని దగ్గరలో స్కూలున్నా మూర్తిగారు నందూని అమలాపురంలోనే చదివించాడు. ఆ రకంగా నాకు నందూ ఎనిమిదో తరగతిలో పరిచయమయ్యాడు.

“బావుందయ్యా మొత్తానికి నువ్వూ అమెరికాలో సెటిల్ అయ్యావన్నమాట. నువ్వు ఇంజనీరింగ్‌కి వైజాగ్ వెళ్ళాక మళ్ళీ చూళ్ళేదు. మీ నాన్నగారికీ కాకినాడ ట్రాన్స్ఫర్ అవడంతో మొత్తానికి తెలీకుండా పోయింది. ఎప్పుడో చిన్నప్పటి పరిచయాన్ని గుర్తుపెట్టుకొని మమ్మల్ని కలవడానికి రావడం నిజంగా చాలా సంతోషంగా వుందయ్యా....“ మూర్తిగారిలో అంత పెద్ద మార్పులేదు. జుట్టు పల్చబడింది. కాస్త బట్టతల పెరిగింది. ఖంగుమనే ఆ కంఠం మాత్రం అలాగే వుంది.

“ఎలా మర్చిపోతానండీ?.. నేనూ, నందూ కంబైండ్ స్టడీ చేయడానికి మీ ఇంటికొచ్చిన రోజులన్నీ నాకిప్పటికీ గుర్తున్నాయి. మీరు మాకు లెక్కలు చెప్పడం కూడా గుర్తుంది. ఇంటరయ్యాక నందూ, నేనూ విడిపోయినా

అప్పుడప్పుడు కలుస్తూనే ఉండేవాళ్ళు. అమెరికా వెళ్ళాక అస్సలు కలవడమే కుదర్లేదు. ఎవరో స్నేహితులు చెబితే తెలిసింది. మీ నందూ ఢిల్లీలో ఉంటున్నాడట కదా?..." నాకూ అన్నీ గుర్తున్నట్లుగా చెప్పాను.

నందూ మిలటరీలో ఆఫీసర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. మూర్తిగారికి అయిదుగురు పిల్లలు నందూ ఆఖరివాడు.

"ఏమిటిలా వచ్చావు? పనిమీదా?" మూర్తిగారే మళ్ళీ ప్రశ్నించారు.

మాకు పాలగుమ్మి దగ్గర పదెకరాల పొలం ఉంది. మానాన్న ఉన్నన్నాళ్ళూ తనే చూసుకునేవాడు. ఆయన పోయాక అమలాపురంలో ఉన్న మా రెండో బావ చూసుకునేవాడు గత నాలుగేళ్ళుగా మా అక్క ఆరోగ్యం బాగోలేక కాకినాడ మకాం మార్చారు. అప్పటినుండి మా పొలం కౌలుకు తీసుకున్న రైతు పంట తాలూకు డబ్బు సరిగ్గా ఇవ్వటం లేదు. మా అక్కలూ, నేను కలిసి ఈ పొలాలు అమ్మేద్దామని నిశ్చయించుకున్నాం. అనుకోకుండా ఆఫీసు పని మీద ఇండియా రావడంతో ఈ పొలం అమ్మకం చేసేద్దామని వచ్చాను. అసలు నాతో మా చిన్న బావ కూడా రావల్సింది. అనుకోకుండా ఆయనకి జ్వరం వచ్చి ప్రయాణం చేయలేక ఆగిపోయాడు. ఇదే విషయం వాళ్ళిద్దరికీ చెప్పాను.

"చెప్పు మీ వాళ్ళెలా ఉన్నారు? ఎక్కడున్నారు?... నువ్వు ఎన్నాళ్ళకోసారి వస్తావు..?" ఒకదాని తర్వాత మరో ప్రశ్న. అమ్మానాన్న పోయి పదేళ్ళు దాటినట్లుగా చెప్పాను. అలాగా అని బాధ పడ్డారు.

"ఈ ముసలాయన కబుర్లకేం కానీ రా బాబూ.. భోజనం చేద్దువుగాని కాస్త కాళ్ళు కడుక్కో..." వర్ధనమ్మ అంది. భోజనం చేసి వచ్చానని చెప్పాను.

"అదేమిటయ్యా... మా ఇంటికొస్తూ భోజనం చేసేసి వస్తావా...?" వర్ధనమ్మ నిష్ఠూరంగా అంది.

"పాతికేళ్ళు దాటినా నీ చేతి చలవ మన రాంబాబు మర్చిపోలేదన్న మాట..." ఆయన వ్యంగ్యంగా బాణం వేసాడు. వర్ధనమ్మ ఆయనకేసి చురచురా చూసింది. ఆయనిదేం పట్టించుకున్నట్లుగా లేదు. వర్ధనమ్మ వంట మీద మరిన్ని వ్యంగ్యాలు గుమ్మరించాడు.

"ఇలా నా వంటకిన్ని పేర్లు పెడతారా... బయటకెళ్ళి తినమనండి చూద్దాం. ఎక్కడా నచ్చి చావదు. ఈసారి.. ఏమే వర్ధనం.. నీలా ఎవరూ వండరే అని అనండి చెబుతాను. చూసావా రాంబాబూ.. వయసొచ్చినా ఈ పెద్దమనిషి చులకన మాటలు..."

"మీ వంటంటే నాకెప్పుడూ ఇష్టమేనండీ... మీరొండిన మామిడికాయ పప్పూ... పనసపొట్టు కూరా.. వంకాయ పులుసు పచ్చడీ... ఇంకా నాకు గుర్తుకున్నాయి..." నవ్వుతూ చెప్పాను.

నా మాటలు వింటున్నారా అన్నట్లుగా వర్ధనమ్మ ముసలాయకేసి చూసింది.

"పోనీలే... నీకు పకోడీలంటే ఇష్టం. వేస్తాను ఒక్క క్షణముండు ..." అంటూ ఆవిడ వంటింట్లోకి పరిగెత్తింది.

"ఆ చేత్తోనే ఓ రెండు మిరపకాయ బజ్జీలు కూడా వేయి..." అంటూ మూర్తి పురమాయించాడు.

"చూడు ఈ మనిషిది నాలుకా.. తాటిపట్టా... ఇప్పుడేనా నా వంట చెత్త అన్నారు. ఒక్క సెకను తిరక్కుండా... మిరపకాయ బజ్జీలు కావాలంటూ... చచ్చినా వండను... ఏం చేసుకుంటారో చేసుకోండి... హు..." అంటూ ఆవిడ రుసరుసా లోపలికెళ్ళిపోయింది. ఇదంతా మాకు మామూలే అన్నట్లుగా మూర్తిగారు నవ్వుతూ నాకేసి చూసారు. నేనూ నవ్వాను.

వర్ధనమ్మ వంటింట్లోకి వెళ్ళాక, ఆ ఇల్లు పరికించి చుట్టూ చూసాను. ఆ ఇల్లు నాకు చిరపరిచయమే పెద్ద మండువా ఇల్లది. ఒక పక్క పాత భోషాణం పెట్టుంది. మరో వైపు కొబ్బరి మట్టలూ..చిప్పలూ పోగుగా ఉన్నాయి. ఓ మూల అరటిగెల కనిపించింది. ఇంకో పక్క ఉయ్యాల బల్లుంది. దానికి దగ్గరలోనే రావుగారి వాలు కుర్చీ వుంది. అక్కడే వున్న బల్లపై తెలుగూ.. ఇంగ్లీషు వార్తా పత్రికలున్నాయి. నేను ఊయల బల్లమీద కూర్చున్నాను.

మూర్తిగారే ప్రశ్నలడుగుతున్నారు.

"మీ అక్కయ్య వాళ్ళూ అమలాపురంలోనే ఉండేవారు కదూ...? ఎక్కడున్నారిప్పుడు...?"

"వాళ్ళూ కాకినాడలో ఉంటున్నారు. పిల్లలందరూ విదేశాల్లో సెటిల్ అయ్యారు....."

జవాబిచ్చి, ఉయ్యాల బల్లమీదనుండి లేచి మేం చదువుకున్న గది వేపు చూద్దామనుకున్నట్లుగా వెళ్ళాను. లంకంత కొంప పది గదులపైనే ఉంటాయి. ఎప్పుడో తాతల కాలం నాటి ఇల్లు. మూర్తిగారి ఉద్యోగం అమలాపురంలోనైనా వీళ్ళు ఇక్కడే ఉండేవారు. ఆయన రోజు సైకిలుమీద కానీ, బస్సు మీద కానీ వెళ్ళొచ్చేవారు. పడక్కుర్చీలోంచి లేచి నా వెనకాలే ఆయనా వచ్చారు. ఇల్లంతా ఓ మారు కలయజూసాను.

పెరట్లో మందారమొక్కలూ, కరివేప మొక్కలున్నాయి. నూతికి దగ్గర్లో నందివర్ధనం చెట్టునిండా తెల్లని పూలు విరగబూసాయి. మొగుడూ పెళ్ళాలిద్దరూ ఎంతో శ్రద్ధగా మొక్కలు పెంచుతున్నారనిపించింది.

మేం పెరట్లో ఉండగా "ఇక్కడున్నారా.. రండి .. టిఫిన్ రెడీ..." అంటూ వర్ధనమ్మ వచ్చింది.

ఆవిడ వెనకాలే మేమూ వెళ్ళాం.పళ్ళెంలో పకోడీలూ. మిరపకాయ బజ్జీలూ ఉన్నాయి. తినమని నా చేతికి ప్లేటిచ్చింది. మూర్తిగారికీ ఇచ్చింది. నా ప్లేట్లో మిరపకాయ బజ్జీ చూసాక తలెత్తి మూర్తిగారి వంక చూసాను. ఆయన మిరపకాయ బజ్జీ తాదాత్మ్యంతో తింటూ కనిపించారు. ఆయనకేసి నవ్వుకుంటూ చూస్తోంది వర్ధనమ్మ.

"చూసావా రాంబాబూ.. ఎలా గుటకలేస్తూ తింటున్నారో... నా వంట చూసి పేర్లు పెడుతున్నారు." వర్ధనమ్మగారి మాటల్లో ఉడుకుమోత్తనం కనిపించింది. ఆయనకివేం పట్టినట్లు లేదు. ఇద్దర్నీ చూస్తే నవ్వొచ్చింది. తినడం అయ్యాక ఆయనే అన్నారు.

"వర్ధనం నీకు వీళ్ళక్క గుర్తుందా... వాళ్ళు అమలాపురం నుండి మకాం మార్చేసారట. ప్రస్తుతం కాకినాడలో ఉంటున్నారట".

"అలాగా... మరి వాళ్ళిల్లు..." అర్థంకానట్లుగా అంది.

"లేదండీ. ఆ ఇల్లు అమ్మేసి ఆరేళ్ళు దాటింది. మా అక్కయ్య పిల్లలు తలొకరూ తలోచోటా సెటిల్ అయ్యారు. ఇక్కడే ఇద్దరూ ఉండలేక కాకినాడలో ఉంటున్నారు. మా అక్కకి కాస్త అనారోగ్యం. కాకినాడయితే కాస్త ఆస్పత్రి సౌకర్యాలుంటాయని.." నేనే వివరం చెప్పాను.

"అవున్లే! ఇక్కడ కన్నా అక్కడే నయం...: అంటూ వర్ధనమ్మ మరో రెండు మిర్చిబజ్జీలు మూర్తిగారి ప్లేట్లో వేసింది. వేసి ఊరుకోలేదు. మరో బాణం విసిరింది.

"చూసావా.... ఈ బజ్జీలెలా లాగిస్తున్నారో... నేనేమీ చెయ్యనట్లు చులకనగా మాట్లాడితే వొళ్ళు మండుతుంది..." గుర్రుగా అందావిడ.

"ఏదో... ఎలాగూ చేసావు కదా... నువ్వు బాధ పడతావని తింటున్నానంతే?" ఆయన ఏమాత్రం బెదరకుండా జవాబిచ్చాడు. ఆవిడ మరోసారి కళ్ళెర్ర జేసింది. ఇద్దర్నీ చూస్తే నవ్వాగలేదు నాకు. నేనే కావాలని మాట మార్చాను.

"కాకినాడలో మీఅక్కా వాళ్ళూ ఎక్కడుంటారు...?

"హోం ఫర్ ది ఏజిడ్"లో ఉంటారు...

"అంటే..." తెలీనట్లు చూసిందావిడ. వృద్ధాశ్రమం అని చెప్పాడాయన. మా అక్కకి నలుగురు పిల్లలు ఎవరూ వాళ్ళని పట్టించుకోరు చేసుకునే ఓపిక లేక మాఅక్క బావ హోం ఫర్ ది ఏజిడ్ లో జాయిన్ అయ్యారు. ఇదే విషయం చెప్పాను.

"మా అక్కయ్య పిల్లలందరూ తలోచోటా సెటిల్ అయ్యారు. అందరికీ మంచి సంబంధాలే వచ్చాయి. కొడుకు ఆస్ట్రేలియాలో ఉంటాడు.పెద్దమ్మాయి దుబాయి లోనూ, రెండోది ఫ్రాన్స్‌లోనూ, ఉంటోంది. ఉన్న ఒక్క కొడుకూ అమెరికాలో వుంటాడు. వాడదొక టైపు. వీళ్ళని పట్టించుకోడు. అంతెందుకు అమెరికాలో మావయ్య నేనున్నా ఒక్కసారీ పలకరించడు. అప్పుడప్పుడు కూతుళ్ళ దగ్గరికి వెళ్ళొస్తుంది. కానీ అక్కడా ఉండలేదు. కొడుకు దగ్గరకెళ్ళి ఉండాలని మా అక్క తాపత్రయం. వాడా పిలవడు. దాంతో బెంగ పెట్టుకొని ఆరోగ్యం చెడగొట్టుకుంది".

"పిల్లలు పట్టించుకోలేదని బెంగపెట్టుకొని ఆరోగ్యం చెడగొట్టుకోడం ఏమీ బాగోలేదయ్యా"

"నేనూ అదే చెప్పానండీ, వినదు మీకు తెలియని దేముంది.? పిల్లల్ని ఎంతో కష్టపడి చదివించారు మా అక్కా, బావ. మా బావకా సంపాదన అంతంత మాత్రంగానే ఉండేది. పిల్లలు బాగా చదువుకొని పైకి రావాలని మాఅక్క ఎంతో కష్టపడింది. వాళ్ళు తిన్నా తినకపోయినా మంచి చదువులు చదివించారు. పిల్లలకి రెక్కలొచ్చాక వీళ్ళనంతగా పట్టించుకోవడం లేదన్నదే మాఅక్క బాధ. అది తట్టుకోలేక మానసికంగా క్షీణించి పోయింది. ఈసారి నన్ను అమెరికా తీసుకెళ్ళమని మాబావ అడిగాడు. కానీ మా ఇంటికి తీసుకెళితే ఎక్కడ గొడవలవుతాయోనని ఆలోచిస్తున్నాను.? లోపలున్న నా భయాన్ని చెప్పాను.

"పోనీ తీసుకెళ్ళు, అమెరికా వెళితే ఆవిడ ఆరోగ్యం కుదుట పడుతుందేమో?" వర్ధనమ్మ అంది.

అవునన్నట్లు తలూపానంతే!

ఈలోగా మాటలు మారి మా చిన్నప్పటి సంగతుల్లోకి వెళ్ళిపోయాం. నందూ, నేనూ ఎలా అల్లరి చేసేవాళ్ళమూ. కంబైండ్ స్టడీ చేసి ఎలా చదివే వాళ్ళమూ. ఇవన్నీ విషయాలూ చెప్పుకున్నాం. కొంత సేపయ్యాక వర్ధనమ్మ చేతిలో కొబ్బరి బొండంతో వచ్చింది.

"తీసుకో రాంబాబూ.. " నీకిష్టమని ఎవరో పిల్లాడితో కబురంపించి దింపు తీసేవాణ్ణి రమ్మన్నాను. నీకూ నందూకి కొబ్బరి బొండమంటే ఎంత ఇష్టమో నాకింకా గుర్తుంది".

ఆవిడ అభిమానానికి సంతోషించాను. పాతికేళ్ళు దాటినా ఇంకా గుర్తున్నాయన్నమాట. వాళ్ళతో మాట్లాడుతుంటే సమయం తెలీలేదు.. ఎన్నో విషయాలు ముచ్చటించుకున్నాం మాటల్లో ఉండగా గేటు తీసినట్లు మువ్వల చప్పుడు వినిపించింది. ఓ పన్నెండేళ్ళ కుర్రాడొచ్చి గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

"ఒరే సీనూ.. ఈ రోజు క్లాసులేదు. మా ఇంటికి గెస్టొచ్చారు. మిగతా వాళ్ళకి కూడా చెప్పు" వర్ధనమ్మే అంది. అలాగే అని తలూపి ఆ పిల్లాడు వెళ్ళిపోయాడు.

"ఏదో కాలక్షేపానికి పిల్లల్ని చేరదీసి సంగీతం నేర్పుతుంది. నేనూ పిల్లలకి లెక్కలు చెబుతాను. ....." మూర్తిగారే వివరణ ఇచ్చారు. " మీకు సంగీతం వచ్చా?...." అడిగాను.

"అంత పెద్దగా రాదు. ఏదో చిన్నప్పుడు నేర్చుకున్నదే?" వర్ధనమ్మ చెప్పింది.

"ఏం చేస్తామయ్యా, ఉద్యోగమా సద్యోగమా.... రిటరయ్యి ఇరవై ఏళ్ళు దాటింది. ఏదో కాస్త పెన్షన్ వస్తుంది. అది మాకు చాలు. కాలక్షేపానికి పిల్లల్ని చేరదీస్తాం. ఆ వచ్చినబ్బాయి కుమ్మరాళ్ళబ్బాయి. నా దగ్గరకి లెక్కలు నేర్చుకోవడానికి వస్తాడు. ఈవిడ సంగీతం విని నేర్పమని అడిగాడు. భలే పాడతాడు. తెలుసా?"

"మా దగ్గరకొచ్చే పిల్లలెవరో తెలుసా... రిక్షావాడి కొడుకూ, చాకలాడి పిల్లలూ.... స్కూల్లో సరిగా చెప్పరు. వీళ్ళకా ట్యూషన్ పెట్టించుకునే స్తోమతుండదు. అందుకని మేం వీళ్ళందర్నీ చేరదీసి వూరికే చెబుతాం. శనాదివారాలు శలవు. లేకపోతే ఈ పాటికి ఇంటినిండా పిల్లలతో సరిపోయేది..."

వీళ్లిద్దర్నీ చూస్తే ముచ్చటేసింది. ఈ వయసులో ఎంతో ఓపిగ్గా పిల్లలందరికీ చదువు చెబుతున్నందుకు.

సాయంత్రం నాలుగయ్యాక నేను పాలగుమ్మి వెళ్ళి మా పొలం కొంటానన్న రావుగార్ని కలుద్దామని మూర్తిగారిని తీసుకొని బయలుదేరాను. అక్కడ పొలం అమ్మకంమాటలు పూర్తి చేసుకొని మూర్తిగారూ, నేనూ వెనక్కి వచ్చాం.

"ఏమండీ... వస్తాను. రాత్రికి కాకినాడ వెళ్ళిపోవాలి. ఇక్కడ రిక్షా ఏదైనా దొరుకుతుందా?"

వెళ్ళిపోతానంటే ఇద్దరూ నాకేసి "అప్పుడేనా?" అన్నట్లు చూసారు. కుర్చీలోంచి లేస్తుండగానే వర్ధనమ్మ నా చేతులు పట్టుకుంది.

"ఎన్నో ఏళ్ళకొచ్చావు. నువ్వు రావడం చాలా సంతోషం అనిపించింది. ఈ ఒక్క రాత్రికి ఉండి రేప్పొద్దునే వెళుదువు గాని... నా కోసం..." బ్రతిమాలు తున్నట్లుగా వున్నాయామాటలు. మూర్తిగారి కళ్ళలోనూ అదే అభ్యర్థన పెద్దవాళ్ళిద్దర్నీ కష్టపెట్టడం ఇష్టం లేక పోయింది. నా బ్యాగ్ క్రింద పెట్టాను.

------------------------------

నా కోసం ప్రత్యేకంగా వంకాయ పులుసు పచ్చడి, గోంగూర పచ్చడీ, మామిడికాయ పప్పూ చేసిందావిడ.

"రాత్రి పూట మేం అన్నం తినడం మానేసాం నాయనా. అరాయించుకునే వయసుకాదిది. నువ్వొచ్చావనే సంతోషంతో నీతో కలిసి తింటున్నాం..." భోజనాల దగ్గర వర్ధనమ్మే అంది.

"అయ్యో నేనొచ్చి మీ ఆరోగ్యం చెడగొట్టానన్నమాట" నవ్వుతూ అన్నాను.

"ఆ .. అదేం లేదు రెండు పుటలా చాలా అరుదుగా తింటాం. ఎప్పుడైనా నేనైనా తిండి విషయంలో కక్కుర్తి పడతానేమో కానీ, మా ఆవిడలా కాదు. ఆరోగ్యం విషయంలో మిలట్రీ డిసిప్లిన్."

"ఈ వయసులో ఆరోగ్యం చెడితే ఎవరు చేస్తారు చెప్పు? అందుకే కాస్త కడుపు కట్టుకుంటే ఆరోగ్యం అదే కుదుట పడుతుంది. వచ్చే వయసా... పోయే వయసా? నువ్వు నమ్మవు గత పదేళ్ళుగా మా ఇద్దరికీ ఒక్కసారి సుస్తీ చేయలేదంటే నమ్ము...."

"నిజం చెప్పద్దూ మీరిద్దరూ డెబ్భై దాటిన వాళ్ళలా కనిపించరు. ఏదో నిన్ననే అరవయ్యో పడిలో వచ్చిన వాళ్ళల్లా ఉన్నారు. మా అక్కయ్య కి ఇంకా అరవై రాలేదు. ఎంతో ముసలితనం వచ్చేసింది. అస్సలోపిక లేదు. ఆరోగ్యం కూడా అంత మాత్రమే...." మా అక్కయ్య విషయం చెప్పాను.

"అనారోగ్యం అంటున్నావు ఏమైనా జబ్బు చేసిందా....? మూర్తిగారే మరలా అడిగారు.

శారీరకంగా కంటే మానసికంగా మా అక్కయ్య క్షీణించిపోయింది. ఇంటి పనంతా మాఅక్కే చేయాలి. మా బావ నుండి సహకారం అంతంత మాత్రమే ఇక్కడి వస్తువక్కడ పెట్టడు. కొడుకులెవరూ రారూ. రానీయరు.

ఈ బెంగతోనే మా అక్కయ్యకి మానసిక రోగం మొదలయ్యింది ఇదే విషయం చెప్పాను.

"అయ్యో పాపం అందుకే మీ అక్కయ్య వాళ్ళూ వృద్ధాశ్రమంలో చేరేరన్నమాట. దేముడి దయ వల్ల మాకలాంటి గొడవలేదు. ఎంతైనా చెప్పొద్దూ ఈ ముసలాయన నాకెంతో చేదోడు వాదోడుగా వుంటాడు. అంట్లు తోమడం దగ్గర నుంచి.. ఇల్లు వూడవడం వరకూ అన్నిట్లోనూ సహాయం చేస్తాడు.." వర్ధనమ్మ మూర్తిగార్ని పొగిడింది.

"నీకు తెలుసో లేదో, మా నందూ వచ్చి అయిదేళ్ళు దాటింది. ఎప్పుడైనా మా ఆడపిల్లలొచ్చి చూసి వెళతారు. మాకు ఓపికుందా వెళ్ళి చూసొస్తాం. లేదా ఇక్కడే కాలక్షేపం చేసేస్తాం. ఎప్పుడైనా ఎలా వున్నారంటూ ఫోన్ చేస్తారు. ఏదో వాళ్ళ జీవితాలు వాళ్ళు సాగిస్తున్నారు. మేమూ అంతగా అడగం. మా జీవితాలు మావి....." మూర్తిగారు వేదాంత ధోరణిలో అన్నారు.

"మీ పిల్లలు మిమ్మల్ని పట్టించుకోకపోతే మీరెలా ఉండగలుగుతున్నారండీ?నందు వచ్చి అయిదేళ్ళయ్యిందా? ఆశ్చర్యంగా వుంది." మనసులో మాటలు పైకనేసాను.

పట్టించుకోలేదని నువ్వంటున్నావయ్యా? పిల్లల్ని పెంచి పెద్ద చేయడం తల్లిదండ్రుల బాధ్యత అందులో ప్రేముంది. మంచి చదువులు చెప్పించారని పెద్దయ్యాక వాళ్ళు చూడాలని ఆశించడం వ్యాపారం అవుతుంది. ప్రతిఫలాలు కోరే బంధాల్లో ప్రేముండదు. వ్యాపార ముంటుంది. మొక్కకి నీళ్ళుపోసి పెంచడం వరకే మన చేతిలో ఉంటుంది. పెరిగాక అది ఏ కాయ కాస్తుందో మనం చెప్పలేంకదా? నిజానికి మా పిల్లలు చూడలేదన్న ప్రశ్న మా మధ్య రాదు. ఓపికున్నన్నాళ్ళూ మా బ్రతుకు మేం బ్రతుకుతాం. ఎప్పుడైనా వచ్చి చూసెళతారా. సంతోషిస్తాం లేదా వాళ్ళు బిజిగా ఉన్నారనుకుంటాం"

మౌనంగా వింటున్నాను ఓ క్షణం ఆగి ఆయనే మరలా అన్నారు.

"మొదట్లో నేనూ మా ఆవిణ్ణి అంతగా పట్టించు కునేవాణ్ణి కాదు. పిల్లలందరూ దూరమయ్యాక మేం ఒక నిర్ణయానికొచ్చాం. వాళ్ళని తలుచుకుంటూ ఏడవ కూడదని. అంతకు ముందు వరకూ దెబ్బలాడుకునే మేమిద్దరం అప్పుడే ఒకరికొకరయ్యాం. మేమిద్దరం సంతోషంగా ఉండాలని నిర్ణయించుకున్నాం. ఆ సంతోషం నిలుపుకోడం కోసం ప్రతీ క్షణమూ ఇద్దరం శ్రమిస్తాం. మొదట్లో కష్టమనిపించినా ఇప్పుడలవాటయి పోయింది..."

మూర్తిగారు ఎంతో ఉద్వేగంగా చెబుతుంటే మధ్యలో వర్ధనమ్మ అంది.

"నేనూ పెళ్ళయి ముప్ఫై ఏళ్ళు దాటినా ఆయన్ని మానసికంగా ప్రేమించలేదు. ఆయన వాళ్ళ వాళ్ళతో గడుపుతున్నారని ఎంతో అక్కసు చూపించేదాన్ని, దెప్పేదాన్ని, తిట్టేదాన్ని. ఒక్కోసారి రోజుల తరబడి మాట్లాడ్డం ఉండేది కాదు. ఆయన అలాగే ఉండేవారు. ఆయన నన్ను ప్రేమించరూ అనుకునే ముందు నేను ఆ ప్రేమనెంతిస్తున్నానని ప్రశ్నించుకున్నాను. నేనేలా సంతోషం కోరుకుంటున్నానో ఆయన అంతే కదా అనిపించింది. పిల్లలకి పెళ్ళిళ్ళయ్యాక మేమిద్దరం మానసికంగా మరింత దగ్గరయ్యాం. ఒక్క క్షణం కూడా ఖాళీగా ఉండం. నాకు తెలుసున్న సంగీతం నేను నేర్పుతాను. అతనేమో పిల్లలకి పాఠాలు చెబుతారు. ఇహ అన్నీ మేమిద్దరం కలిసి చేసుకుంటాం. వ్యాయామం అంటావా మా తోటపనిలో మాకు అది పుష్కలంగా దొరుకుతుంది. నిజం చెప్పద్దూ, మీ మాష్టారి నుండే ఎన్నో తెలుసుకున్నాను. ముఖ్యంగా సంతోషంగా ఉండడం."

ఆవిడ మాటల్లో నిజానిజాలెలా వున్నా ఎంతో ఆత్మ స్థైర్యం కనిపించింది. ఆవిడ మాటల్ని కలుపుతూ మూర్తిగారందుకున్నారు.

"ఇందాకా నువ్వడిగావే - మా ఆరోగ్య రహస్యం ఏమిటని? ఇదే మేం సంతోషంగా ఉంటాం. ఒకర్నొకరు తిట్టుకోం తప్పులెన్నం. వీలైనంతా ఆనందంగా ఉండడానికి ప్రయత్నిస్తాం. అలాగే మా పిల్లలనుండి మేం ఏమీ ఆశించం. అదే మా ఆనందానికి కారణం. మేం ఎవరినుండీ ఏదీ ఎక్స్‌పెక్ట్ చేయం. సింపుల్ ఈ ఎక్స్‌పెక్టేషన్ అనేది ఉంది చూడు. అది కేన్సర్ లాంటిది. నిన్నూ నీ చుట్టూ ఉన్న వాళ్ళనీ కనిపించకుండా దహించేస్తుంది....."

మూర్తిగారు చెబుతున్నంత సేపు రెప్పేయకుండా వింటున్నాను. మాటలు పెగలల్లేదు.

కాకతాళీయంగా ఆ రోజు పౌర్ణమయ్యింది. ఆరుబయట వెన్నెల్లో పడుకోవాలనిపించింది. అదే చెప్పాను. ఇంకా శీతాకాలం పోలేదు. మంచు కురవచ్చని లోపలే పక్క వేశానంది వర్ధనమ్మ. నేను మరోసారి అడిగితే కాదనలేక మూర్తిగారూ బయటే పడుక్కుంటా నన్నారు. ఆయనతో పాటు ఆవిడా వచ్చింది. రాత్రి చాలా

సేపటి వరకూ మెలకువగానే ఉన్నాం. మాటల్లో ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. రాత్రంతా మా అక్కయ్య గురించే ఆలోచిస్తున్నాను. మా అక్కయ్య కోణంలో చూస్తే పిల్లలు రాక్షసుల్లా కనిపిస్తారు. ఎంతో కష్టపడి క్రమశిక్షణతో పెంచింది. పెద్దయ్యాక వాళ్ళు తననీ తన మాటనీ అంతగా గౌరవించకపోతే తట్టుకోలేకపోతోంది. లేని పోని గొడవలు తెచ్చుకొని తన ఆరోగ్యాన్ని దెబ్బ తీసుకుంది. దీనికంతటికి కారణం ఎక్స్‌పెక్టేషన్స్ పిల్లలు తమని చూడాలన్న ఆశ చూసి తీరాలన్న బాధ్యత. అక్కయ్య పిల్లల కోణంలోంచి ఆలోచిస్తే వేరొక విధంగా ఉంటుంది. తమకీ ఒక జీవితం ఏర్పడిందనీ దానికి కొన్ని అవసరాలూ, బాధ్యతలూ ఉంటాయని తల్లి తండ్రులు గుర్తించాలనుకుంటారు. మధ్య తరగతి కుటుంబాలకి మా అక్కయ్య ప్రతీక. పిల్లలు తమని గౌరవించాలని ఆశించడం కన్నా ప్రేమించాలని తల్లితండ్రులు కోరుకోవాలనిపించింది.

తెల్లారింది. లేచి చూస్తే తొమ్మిది దాటింది. ఎండ బాగానే వచ్చింది. నన్ను లేవగానే చూసి వర్ధనమ్మ వచ్చింది.

"రాత్రంతా అలసిపోయినట్లున్నావని లేపలేదు. లేచి స్నానం చేయి టిఫిను చేసాను"అంది.

ఎవరో వచ్చినట్లున్నారు. మూర్తిగారు వీధి వరండా దగ్గర మాట్లాడుతూ కనబడ్డారు. మధ్యాహ్నం భోజనం చేసి వెళితే కానీ కుదరదనీ బలవంత పెట్టారు. నాకోసం ప్రత్యేకంగా పనసపొట్టు కూర చేసిందావిడ.

"నువ్వొచ్చావనీ రామనాథంగారి తోటలోంచి తెప్పించారు. పొద్దున్న కూర్చుని పనసపొట్టు కొట్టారు. తెలుసా?" వర్ధనమ్మ అంది. నా కెందుకో ఆముసలాళ్ళ నిబ్బంది పెడుతున్నానన్న గిల్టీఫీలింగ్ కలిగింది. "అయ్యో ఎందుకండీ ఈ శ్రమంతా..."

"శ్రమ కాదు నాయనా సంతోషం"

"ఇంతలో సెల్ ఫోన్ మ్రోగింది. మా చిన్న బావ నుండి కాల్

"రాంబాబూ మీ అక్కయ్యకీ నాకూ అమెరికా టిక్కెట్లు నువ్వు బయలుదేరే రోజే దొరికాయి. ట్రావెల్ ఏజెంట్ ఓ పదివేలెక్కువవుతుందన్నా సరేనన్నాను. నువ్వు ఈ సాయంత్రానికొస్తున్నావా?"..

బయలుదేరుతున్నట్టుగా చెప్పి ఫోన్ పెట్టేసాను.

"అక్కయ్య రావాల్సింది అమెరికా కాదు. ఈ గంగల కుర్రు అగ్రహారం...." నా మనసు గట్టిగా అరచింది.

భోజనలయ్యాక ఇద్దరి కాళ్ళకీ దణ్ణం పెట్టి శలవు తీసుకున్నాను.

# అఖిలం - మధురం

- *నిర్మలాదిత్య*

'మధురాధిపతే అఖిలం మధురం' అంటూ ఎమ్ఎస్ గొంతులో నా ఫోన్ మ్రోగగానే వులిక్కిపడ్డాను. ఆ రింగ్ టోన్ నన్ను పేజి చేయటానికని పెట్టాను. అమ్మ, నాన్నలను పేజ్ చేస్తే అర్థముంది. నాన్న కార్డియాలజిస్టు, అమ్మ ఓబిజివైఎన్ . చిన్నప్పటినుంచి వారి పేజర్లు మ్రోగడం, వారు ఆఘమేఘాలలో వున్నట్టుండి మాయమవ్వడం నాకు పరిచితమే. ఈ పేజర్ల చప్పుళ్ళలో సృష్టించబడిన పూర్తికాని సంభాషణలు, ఆగిపోయిన పుట్టినరోజు పార్టీలు, గెలుపు ఓటములు తేల్చుకోలేని ఆటలు, ఒంటరి భోజనాలు నాకు మదిలో మిగిలిన చేదు గుర్తులే. ఫోన్ తీసి నంబరు చూసి ఫోన్ చేసాను.

"దిసీజ్ క్రిష్, నన్ను పిలిచావా?"

"హై క్రిష్, గ్లాడ్ యూ రిటర్న్‌డ్ ద కాల్. మిస్టర్ రాండెల్ మా హాస్పిటల్లో వున్నారు. నిన్ను చూడాలని అడిగారు."

బాబ్ రాండెల్ ఓ సంవత్సరమైంది చూసి. నేను మెడికల్ కాలేజీ చేరకముందు తరచుగానే కలిసేవాణ్ణి. కాని ఓ మూడు సంవత్సరాల క్రితం ఇంట్లో పెద్ద గొడవైంది. అండర్ గ్రాడ్ లో మేజర్ ఇంకా ఎన్నుకోనందుకు. కెరీర్ ఇంకా నిర్ణయించుకోలేదని అమ్మ నాన్నలకు కోపం. అప్పట్లో రోజూ యింట్లో ఓ గొడవే. గ్రేడ్స్, SAT స్కోర్ లతో మాత్రమే మెడికల్ సీట్ రాదని బలవంతంగా నన్నూ ఓ వాలంటీర్ ప్రోగ్రాం లో చేరమని పోరు. ఇక ఇంట్లో వుండలేక అమెరికన్ కేన్సర్ సొసైటీలో వాలంటీర్ గా చేరాను. వాళ్ళు పేజ్/ఫోన్ చేసినప్పుడల్లా కారు తీసుకొని పేషెంట్ వున్న అపార్ట్ మెంటుకు వెళ్ళడం. అక్కడినుంచి వారిని తీసుకొని హాస్పిటల్‌కు వెళ్ళడం. వాళ్ళ కీమో, రేడియేషన్ ట్రీట్‌మెంట్ అయ్యాక వారిని తిరిగి పికప్ చేసుకొని వాళ్ళింటి దగ్గర దిగపెట్టడం. మొదట బలవంతంగానే ఈ పని మొదలుపెట్టినా, నాకు ఈ పని మీద ఆసక్తి పెరిగింది. రాబర్ట్ రాండెల్‌ని కలిసిన మొదటిసారి "బాబ్" అని పిలవమని నవ్వుతూ చెప్పాడు. ఎందుకో ఎమ్ఎస్ "హసితం మధురం" అని మధురాష్టకం పాడాలనిపిస్తుంది బాబ్ నవ్వు చూస్తే. అతనింటినుంచి హాస్పిటల్ ఓ గంట ప్రయాణం. అలా బాబ్‌ను తీసుకొని పనిపడినప్పుడల్లా రెండుగంటలు ఆయనతో మాట్లాడ గలిగే అవకాశము దొరికేది. నాకిద్దరు తాతలు ఇండియాలో వున్నారు కాని బాబ్‌కు కూడా ఆ వయస్సే వుండచ్చు. దాదాపు తొంభై ఏళ్ళు వుంటాయనుకుంటా. మొదటిసారి చూసినప్పుడు బాగా నెరిసిపోయినా తలపైన జుట్టు వత్తుగానే ఏ మాత్రం బట్టతల ఛాయలు లేకుండా వుండేవి. కీమో మొదలెట్టాక అతను పూర్తిగా వెంట్రుకలు పోగొట్టుకోవడం, బాగ వీక్ కావడం నా కళ్ళ ఎదుటే చూడటం జరిగింది. నేను వాలంటీరుగ పనిచేసిన రెండేళ్ళు చాలామంది పేషంట్లను చూసినా బాబ్ లాంటి అతను తటస్థపడలేదు. ఎలాంటివారినైనా సేదతీర్చేలాంటి అతని నవ్వు నేను మరెక్కడా చూడలేదు. అలాగే అతన్ని చూసి అతనితో మాట్లాడుతూ వుంటే మన సుఖ దుఃఖాలను పంచుకోవాలనిపించడం నాకు కొత్త అనుభవమే. డాక్టర్ అవ్వాలా లేదా అన్న మీమాంస, ఇంట్లో ఆ విషయం పైన గొడవ పడటం కూడా అంతా శాంతంగా విని మెడికల్ ప్రొఫెషన్ గొప్పతనం గురించి తల్లితండ్రులు పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం తప్పుకాదని మెల్లగా నా మనస్సు మెడికల్ వైపు మళ్ళడానికి దోహదపడ్డాడు.

సెల్ ఫోన్ తో బాటు పక్కనే వున్న ఐ పాడ్ కూడా తీసుకున్నాను. పైజామా నుంచి జీన్స్ లోకి మారి క్రింద ఫ్లోర్‌కు వెళ్ళాను. డ్రాయింగ్ రూములో అమ్మ ఏదో టీవీ ప్రొగ్రాం చూస్తున్నది. పక్కనే తన పేజర్ కూడా వుంది. నాన్న అప్పటికే ఏదో 'కాల్' వస్తే వెళ్ళి పోయినట్టున్నారు.

"అమ్మా కేన్సర్ సొసైటీ వాళ్ళు పిలిచారు వెళ్తున్నాను."

'మెడికల్ కాలేజ చేరిన తర్వాత నీకసలు తీరికే లేదు కదరా" అంది అమ్మ.

"బాబ్ గురించి చెప్పాను కద. చూడాలని కబురంపాడు. వెళ్ళి చూసి వస్తాను."

కారులో ఐపాడ్ కనెక్ట్ చేసి వెంటనే ఎమ్ఎస్ సుబ్బలక్ష్మి పాడిన 'మధురాష్టకం' వెదికి ప్లే నొక్కాను. కారు రేడియో నుంచి ఎమ్ఎస్ శ్రావ్యంగా పాడటం మొదలు పెట్టింది. డాక్టర్ ??? చిన్న పిల్లలకు వ్రాసినట్టు మితమైన పదాలు ఎన్నుకుని ఇంత ఉదార్తమైన భావాన్ని "మధురాష్టకం"లో వల్లభాచార్యులు 15వ శతాబ్దంలోనే

ఎలా వ్రాయగలిగాడు. గూగుల్‌లో వెదికా. అతడు ఓ ప్రవాసాంధ్రుడే. తెలుగు మాతృభాషగా వున్నవాడే. తెలుగులోని తియ్యదనాన్ని సంస్కృతంలో పొందు పరచినట్లు వుంది ఈ మధురాష్టకం. చలికాలం బయట 'స్నో' వల్ల భూమి అంతా తెల్లగా వుంది. ఆకులు రాల్చిన చెట్లు మంచును పులుముకొని కొత్త అందాలు సంతరించుకొన్నట్లు వున్నాయి. ఆకాశంలో ఒక్క మేఘం లేదు. మూడొంతులు నిండుగా వున్న చంద్రుడు వెచ్చగా వెన్నెల కాస్తున్నాడు. అంత నిశ్శబ్దంగా నిస్తబ్ధంగా వున్న లోకంలో నాకెదురుగా రోడ్డుకడ్డంగా జింకలు పరుగెత్తి అటువైపు చెట్ల గుంపుల పైకి పోయాయి. "-------- చలితం మధురం అని అప్పుడే వినడం ఆ క్షణ అందాన్ని మరింత ద్విగుణీకరించినట్లు అనిపించింది.

హాస్పిటల్ రావడంతో కారు ఆపి బాబ్ వున్న యూనిట్ వైపు నడిచాను. నర్సింగ్ స్టేషన్‌లో వున్న ఆవిడకు నన్ను పరిచయం చేసుకోగానే బాబ్ రూముకు తీసికెళ్ళింది. బాబ్ పడుకునే వున్నాడు. 'కీమో' ఆపేశాక మళ్ళీ జుట్టు పెరిగినట్లుంది. తలంతా ముగ్గుబుట్టలాగ వుంది. ఆక్సిజన్ మాస్క్ ముఖమీద పెట్టారు.

'బాబ్!' అని పిలిచాను. వులుకు పలుకు లేదు. నర్సు, బాబ్ చివరి దశలో వున్నాడని నన్ను చూడాలని చెప్పాడని చెప్పి సెలవ తీసుకొంది. మంచం పక్కన అటువైపు గోడకు పెద్ద కిటికీ వుంది. ఆ కిటికి అద్దం లోనుంచి బయట వింటర్ సీనరి ఏదో క్యాలెండర్ పిక్చర్ లా అనిపిస్తున్నది. మనస్సులో మళ్ళీ ఎమ్ఎస్ పాడినట్లు అనిపించింది.

"-----సఖ్యం మధురం ----" బాబ్‌తో కలవడం ఓ మధురమైన అనుభవమేకద అనిపించింది. అంతా నెగటివ్ మైండ్‌తో వున్న నన్ను దగ్గర తీసి నవ్వుతూ జోకులు చెప్తూ దగ్గరలేని తాతలుగా బుజ్జగించి జీవిత పాఠాలను అరటిపండులా ఒలిచి తినిపించాడనిపించింది. కాని నేను తనకు థాంక్స్ చెప్పినప్పుడల్లా తను నాకంటే ఋణపడి వున్నానని పెద్దగా నవ్వేవాడు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్ వచ్చిన తరువాత ఆ విషయం మొదట నేను చెప్పడం బాబ్ కే. బాబ్ సంతోషం పట్టలేము. కంగ్రాట్స్ చెప్పి తన ఒంటరితనం గురించి మాట్లాడాడు. అతనికి పిల్లలు వున్నా వారి పనులలోపడి బాబ్ తో కలవడానికి వాళ్ళకి తీరిక లేదు. బాబ్ కావాలంటే తనే డ్రైవ్ చేసుకుని హాస్పిటల్‌కి వెళ్ళ గలడు. కాని తను తోడు కోసమే సొసైటీ సహాయం కోరాడు. దానితో నేను బాబ్‌ని కలవడం జరిగింది. మా ఇద్దరికి వయస్సునుంచి ఏ విధంగా చూసినా పొత్తు కుదరదు. కాని మా ఇద్దర్నీ బాధిస్తున్న ఒంటరితనాన్ని కల్సి ఇద్దరం జయించగలిగామని అనిపిస్తుంది.

బాబ్ రూముకు వచ్చి దాదాపు ఓ గంటైంది. బాబ్ తో కల్సివున్నప్పుడు ఇద్దరం పుస్తకాలు చదవటం, చర్చించడం జరుగుతూ వుండేది. అక్కడవున్న 'న్యూస్ వీక్' మ్యాగజైన్ తీసుకుని "మైటర్నీ" వ్యాసాన్ని గట్టిగా చదవడం మొదలుపెట్టాను. నా గొంతు విన్న కొద్ది నిముషాలలోనే బాబ్ కళ్ళు తెరిచి నావైపు చూసాడు. ఆక్సిజన్ మాస్క్ ఆ నవ్వును దాచినా ఆ కళ్ళు దాచలేక పోయాయి. బాబ్ చేతిని అప్రయత్నంగా పట్టుకున్నాను. 'బాబ్' నాచేతిని ఒక్కసారి ఒత్తి కళ్ళు మూసుకున్నాడు. ముఖం నవ్వుతున్నట్లే వుంది.

ఎందుకో మళ్ళీ మధురాష్టకం వినాలనిపించింది. వల్లభాచార్యులు "గాడ్ ఈజ్ లవ్" అన్నట్లుగా దేవుడి ప్రతి అణువు, చర్య ప్రేమ మయం మధురం అని వ్రాయడం ఎంతటి గొప్ప ఆలోచనో అని అనుకున్నాను. కాని ఆ క్షణంలో బాబ్‌లో వల్లభాచార్యుడు కనిపించాడు. జీవితాన్ని ప్రేమించడం అంత సులభం కాదు. ఇంటికి వెళ్ళడానికి కారు స్టార్ట్ చేసాను. రిపీట్ లో పెట్టాను కాబట్టి ఎమ్ఎస్ మధురాష్టకం పాడుతూనే వుంది.

'కరణం మధురం తరణం మధురం'

హరణం మధురం----

జీవితాన్ని పూర్తిగా అనుభవించి తృప్తిగా మరో లోకానికి కొత్త అనుభూతులకోసం బాబ్ విన్నూత ఉత్సాహంతో వెళ్ళిపోయాడనిపించింది. నేను పాడుతున్నది తప్పు అని తెలుసు. అప్రయత్నంగ నేను ఎమ్ఎస్ తో గొంతు కలిపి పాడసాగాను.

-----మరణం మధురం

మధురాధిపతే అఖిలం మధురం.

## కాలబంధం

***- సౌమ్య బాలకృష్ణ విద్య బి.***

"అమ్మా మొన్ననిచ్చిన పెన్ను ఎక్కడ పెట్టావు?" కేక వేసినట్లే అడిగింది సంజన.

"పనిలో ఉన్నా అక్కడే ఎక్కడో ఉంటుంది. వెతుక్కో " - వంటింట్లోంచి తల్లి జవాబు.

"ఈవిడ అన్నీ ఎక్కడెక్కడో పెట్టేస్తుంటుంది. అడిగితే గుర్తులేదనో పన్లో ఉన్నాననో అనేస్తుంది. ఏమిటో !" గొణుక్కుంటూ హాల్లో ఫ్రిజ్ పక్కన తలుపులేసి ఉన్న అలమారా వైపుకి వెళ్ళింది సంజన. అది తెరిచి, పైన అరలో ఉన్న వస్తువుల్ని తడిమింది. కాళ్ళు ఎత్తి అక్కడున్నవి చూట్టానికి ప్రయత్నిస్తూ, చేతికేదో తగిలింది. దాన్ని ఓ సారి మళ్ళీ తడమగానే అదేమిటో అర్థమైంది. సంజనకి మధ్యలో గుండ్రంగా ఉంది.... ఈ వైపూ, ఆవైపూ గొలుసులా ఉంది. వెంటనే దాన్ని బయటికి తీసింది - చేతిలో పడగానే ఓసారి చూసి ఓ క్షణం నవ్వుకుంది. ఓ క్షణం కళ్ళలో నీళ్ళు నిండాయి.

"అమ్మా! చూడు నాకేది దొరికిందో!"

"నువ్వసలు నన్నే పనీ ప్రశాంతంగా చేసుకోనివ్వవు కదా ! రేపో మాపో పెళ్ళికూడా అవబోతోంది - ఇంకా నీపిల్ల చేష్టలు మాత్రం మానవు." అంటూ సంజన వాళ్ళమ్మ సరిత వస్తూ, దూరం నుండే సంజన చేతిలోని వస్తువును చూసింది. ఓక్షణం ఆమెని కూడా జ్ఞా పకాలు చుట్టుముట్టాయి. కానీ, వెంటనే తేరుకుంది.

"ఇన్నాళ్ళూ ఇది ఇక్కడే ఉందా! నాకు అసలు తట్టనేలేదు దీని గురించి. పనిచేస్తుందంటావా అమ్మా?"

ఓసారి దాన్ని తీసుకుని చేత్తో తడిమింది సరిత. అది సంజన తండ్రి వేసుకున్న వాచీ. ఎప్పటిదో, చాలా పాతది. సంజన చిన్నప్పుడు ఆయన పోయారు. అప్పటికే ఎన్నో ఏళ్ళుగా ఆవాచీ వాడారు.

"అది కీ ఇచ్చే వాచీ, కీఇస్తే పనిచేస్తుందేమో. సెకన్ల ముల్లు తిరుగుతూనే ఉందిగదే..... పని చేస్తుందేమో ! " సంజనతో అన్నది సరిత. వెంటనే దాన్ని తన చేతుల్లోకి తీసుకుంది సంజన. ఇంతలోపే నవ్వింది. తన వంక అయోమయంగా చూసిన తల్లితో -

"ఈ వాచీ అంత స్పీడుగా ఏ వాచీ తిరగలేదేమో అమ్మా! చూడు... నేను ఎలా వంచితే అలా తిరుగు తున్నాయి దీని ముల్లులు! ఈ క్షణం తొమ్మిదంటోంది మరుక్షణం మూడంటుంది. ఇంత వేగం నా వల్ల కాదు బాబోయ్!"

"అది సరే గానీ, ఇక్కడ వేరే వాచీలు కూడా ఉన్నాయిగా" - సంజన మీద కాస్త ఎత్తున్న వాళ్ళమ్మ పై అరలో ఉన్న వస్తువుల్ని చూస్తూ అనింది.

"ఏవీ?" అమ్మ చేతిలోకి వచ్చిన రెండు వాచీల్నీ తీసుకుంది సంజన.

"ఇది నీపదో తరగతి పాసైనప్పుడు తాత కొనిచ్చిన వాచీ అని చెప్పేదానివి కదా....." "అవును చాలా రోజులు వాడాను దాన్నే. నువ్వు పుట్టేవరకూ." "ఇది .... అన్నయ్య వాచీ కదా..... వాడు స్ట్రాప్ చింపేసిన వాచీ.." నవ్వుతు అన్నది సంజన. "సరే ఎలాగో తీసాము కదా..... వెళ్ళి రిపేరు చేయించుకు రారాదూ?" "ఏదీ.... నాన్న వాచీ, నీ చిన్నప్పటి వాచీ కూడానా? అవి మ్యూజియంకి కావాలి అని వాళ్ళు తీసుకుంటే?" నవ్వింది సంజన. సరిత చిరు కోపంతో - "ఎందుకే అలా అంటావు? ఓ సారి ప్రయత్నించొచ్చు కదా...." "ఆవాచ్ షాపు వాడంటే నాకు చిరాకు. నావాచీ గురించి రకరకాల యాతనలు పెట్టాడు. సెల్లేయడానికి వారం రోజులు తిప్పాడు. స్ట్రాప్ మార్చమన్న రోజు నన్ను అదోలా చూసి - ఈ వాచీలకి రావండీ స్ట్రాపులు అనేసి, వెటకారపు నవ్వోటి నవ్వాడు." అంది సంజన.

" సర్లే, నీ బొమ్మ వాచీకి అలాంటివే వస్తాయి కామెంట్లు మరి. చిన్నప్పుడేదో పదేళ్ళప్పుడు ఓ వాచీ కొనిస్తే , దాన్ని ఇంకా వేసుకు తిరుగుతున్నావు మరి!"

"కొన్ని కొన్నింటితో మనకు అనుబంధం ఏర్పడుతుంది మరి! ఇన్నాళ్ళ బట్టి నువ్వే అమ్మవి. కొత్తమ్మ కావాలని అడిగానా? ఇది కూడా అలానే!"

"నీకు ఇలా చెప్తే ఎక్కదే....." చేత్లో ఉన్న గరిటె పుచ్చుకుని కూతుర్ని కొడుతున్నట్లు అభినయించింది సరిత. "వద్దు వద్దు వెళతాలే. దీనికంటే అదే నయం" - అంటూ వాచీని తీసుకుంది సంజన.

---------------------

వాచీ షాపులోకి అడుగుపెడుతూ ఓసారి ఆ షాపువాడి ఎదుగుదలని తలుచుకుంది సంజన. పదేళ్ళ క్రితం తను మొదటి సారి ఈ షాపుకొచ్చినప్పుడు అదో చిన్న కొట్టు. వాచీరిపేర్లు, అప్పుడప్పుడూ ఆడియో కేసెట్లు

అమ్మడం. అంతే. ఏళ్ళు గడిచే కొద్దీ సీడిలు పెట్టాడు. తర్వాత కొద్దికొద్దిగా బ్యాటరీలూ, హెడ్ఫోన్లు అమ్మడం మొదలైంది. సెల్‌ఫోన్ల ప్రభంజనం వీడికి బాగా అచ్చొచ్చినట్లు ఉంది. పక్క షాపుని కూడా కలిపేసి సెల్ఫోన్లు, దాని తలూకు వస్తువుల వ్యాపారం మొదలు పెట్టాడు. క్రమంగా కేసెట్లూ, సీడీలూ పోయాయి. వాచీలు, సెల్ఫోన్ల స్వర్గమైపోయింది షాపు. ఇదే తలుచుకుంటూ ఉన్న సంజన, షాపులో ఉన్న కుర్రాడు " ఏం కావాలండీ?" అన్నాక తేరుకుంది. తన చేతిలో ఉన్న మూడు వాచీలను చూపించింది. ఇంతలో సంజనను చూసిన ఓనరు వచ్చాడు ఆవైపు - "బాగున్నారా అమ్మా?" అంటూ.

ఏమిటీ ఇలా వచ్చరు" అన్నాడు? జవాబుగా సంజన అన్న, అమ్మ, నాన్నల వాచీలను చూపించింది. ఆయనోసారి వాటిని పరికించి చూసి- "దీనిస్ట్రాపు మార్చాలి. ఈ చిన్న దానికీ, పెద్ద దానికి ఏమిటీ సమస్య?" -అడిగాడు. "తెలీదండీ. అవి రెండూ పాత వాచీలు. కీ ఇస్తే పనిచేసే రకంవి. ఓసారి చూడండి." అంది. "సరే మీకేమన్నా పనుంటె చూసుకుని రండి. ఈ వాచీల సంగతి చూసేలోపు కాస్త సమయం పడుతుంది కదా?" అన్నాడు షాపు ఓనరు.

అలాగే నని చెప్పి వెనక్కి తిరిగింది సంజన. పక్కనున్న సూపర్ మార్కెట్‌కి వెళ్ళి వాళ్ళమ్మ తెమ్మన్నవి తెద్దామని.

--------------------

కాసేపాగి మళ్ళీ షాపులో అడుగు పెట్టింది సంజన. కిటకిటలాడుతోంది షాపు కస్టమర్లతో. ఒకప్పుడు - ఓనరొక్కడే. అతనే అన్నీ. కస్టమర్లు - ఒకళ్ళూ ఇద్దరూ అప్పుడప్పుడూ వచ్చి పోతూ ఉండేవారు. ఇప్పుడు చూస్తే, షాపులో పని చేసే వాళ్ళే ఐదారు మంది ఉన్నారు.

ఇలా పదేళ్ళుగా ఒకే షాపుకి బంకలా కరుచుకు కూర్చోకపోతే, వేరే షాపుకెళ్ళి రిపేరు చేసుకోవచ్చు కదా! అనుకుంది ఓ నిముషం. ఇదివరలో మాట్లాడకుండా తన వాచీకి స్ట్రాపు వేసిన షాపువాడిని తలుచుకుంటూ. కానీ..." అమ్మనీ అంబికానీ మరువలేము" అన్న ప్రకటన లాగా.... కొన్ని కొన్ని అనుబంధాలు వదల్లేము అనుకుంటూ లోపలికి అడుగుపెట్టింది సంజన.

ఓనరు కుర్చీ వద్దకి వచ్చి ఏమీ మాట్లాడకుండా నిలబడింది. అతను తలెత్తి చూసి, అటు వైపు వెళ్ళండి. అన్నట్లు సైగ చేసాడు. ఆవైపు చూసింది. ఒక గాజు కిటికీ అవతల ఇద్దరు ముగ్గురు వాచీల ప్రపంచంలో తాము మిణుగురు పురుగులైనట్లు వాటి వెనుక భాగంలోకి తలకాయ పెట్టేయడానికి ప్రయత్నిస్తూ ఉన్నారు. మాట్లాడకుండా అక్కడ నిలబడి వాళ్ళని చూస్తూ గడిపింది ఓ నిముషం. ఇంతలో ఒకతను తలెత్తి చూసాడు. "వాడే! ఆరోజు వెటకారపు నవ్వు నవ్విన వెధవే!" అనుకుంది సంజన. అతను ఈమెని చూడగానే బయటకి వచ్చి ఏమిటన్నట్లు చూసాడు. సంజన ముక్తసరిగా - "మూడు వాచీలు ఇచ్చివెళ్ళాను ఇందాక రిపేరుకి." అంది. అతను ఏదో గుర్తుకొచ్చినవాడిలా లోపలికెళ్ళి మూడూ చేతిలో పెట్టుకుని తెచ్చాడు. అన్నయ్య వాచీని చేతిలోకి తీసుకుని - "దీనికి స్ట్రాప్ మార్చాను. సెల్ కూడా వేసాను. చాలా రోజులుగా వాడినట్లు లేదు మీరు."

"అవునండీ. చాలా రోజులుగా వాడలేదు." - కొన్న ప్రతి వాచీనీ టిష్యూ పేపర్‌లా వాడి పడేసే అన్నని తలుచుకుంటూ. అతనే మళ్ళీ సంజన అమ్మ పాత వాచీని చూస్తూ "ఇక ఈ రెండు వాచీల్లో - ఈ చిన్నది పనిచేస్తోందండీ. దానితో సమస్యేమీ లేదు....." అన్నాడు.

"మరి పెద్దదీ???"

"ఇది.... ఇప్పుడు.... మీ ఇంట్లో ఎవరు వాడుతున్నారండీ?"

"ఎవరూ లేదండీ. మీరు బాగుచేస్తే వాడిస్తాం మనుష్యుల చేత."

"అంటే, నాఉద్దేశ్యం, వాడేవారు ఎలా ఉంటారో తెలుసుకుందామని."

" అంటే.... నా ఉద్దేశ్యం... ఇంకా ఎవరూ వాడటం లేదు. మీరు బాగుచేస్తే, వాడే వాళ్ళకి ఇస్తాం కదా. అప్పుడు చెబుదామని."

"ఎందుకండీ అంత కోపం తెచ్చుకుంటారు? "

"మీరు అడిగే ప్రశ్న అలా ఉంది మరి."

"సరేనండీ. ఎందుకు అడిగాను అంటే, ఈ వాచీ మరీ పాతకాలం నాటిదిలా అనిపిస్తోంది. నేనైతే ఎప్పుడూ ఇలాంటి వాచీని చూడలేదు నాసర్వీసులో."

"దాని వయసంత లేదు నీసర్వీసు." అని మనసులో అనుకుని పైకి మాత్రం మామూలుగా చూసింది అతని వైపు. "ఏమీ చేయలేరా ఈ విషయంలో?" మళ్ళీ అడిగింది.

"నాకు మరి తెలీదండీ ఈ వాచీ గురించి..."

"మీ ఎరుకలో ఎవరూలేరా అయితే ఈ వాచీ రిపేరు చేయగల వాళ్ళు?"

"పాత షాపులేవన్నా కనిపిస్తే అడగండి. లక్ష్మీకాపూల్ వంటి ప్రాంతాల్లో చూడండి వీలైతే." అన్నాడతను.

"సరే లెండి... ఏం చేస్తాం... ఇటివ్వండి." - మూడు చేతి గడియారాలూ తీసుకుని కౌంటర్ లో డబ్బులిచ్చేసి బయటకి వచ్చింది సంజన. ఇంటి వైపుకి నడుస్తూ ఉండగా ఏమరుపాటులో చేయి కాస్త గోడకి కొట్టుకుంది. ఆ కొట్టుకోవడం సరిగ్గా వాచీ ఉన్న చోటే జరగడంతో దాని అద్దం ముక్కలైంది. లోపల సంజన హృదయం కూడానూ. ఏదో జరిగి కాలం ఓ రెండు క్షణాలు వెనక్కి పోకూడదా, ఈ వాచీ మళ్ళీ జన్మించకూడదా అనిపించింది సంజనకి. వాస్తవానికి ఉండే పరిధులు అర్థమై, విరిగిన ఆ ముక్కల్ని ఏరుకుంటూ ఇంటిదారి పట్టిందిక.

అలానడుస్తూ ఓ సారి ఆ విరిగిన ముక్కల్ని చూసుకుంటూ ప్రాణంలేనివైనా కొన్ని జీవితంలో ఎంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయో కదా అనుకుంది. "ఒకటా రెండా.. ఎన్నెన్ని జ్ఞాపకాలు దీనితో!" అనుకుంది దాన్ని చూస్తూ. తనకు పదేళ్ళప్పుడు ఆవాచీ కొన్న రోజు గుర్తువచ్చింది. తాను నవ్వినప్పుడు, ఏడ్చినప్పుడు, సంతోషం లోనూ... దుఖంలోనూ... ఎప్పుడైనా, ఎక్కడైనా వీడని స్నేహం ఆవాచీది. "చేతికి ఈ వాచీ ఉండటం నాకు ఎంత సహజమైన విషయమైపోయింది!" అనుకుంది. వాచీ వేసుకోలేని రోజున అన్యమనస్కంగా ఉండటం.... పోయిందనుకున్న వాచీ ఓసారి వారం తరువాత కనిపించినప్పుడు కలిగిన ఆనందం.... అది ట్రైనెనన్నా పట్టించుకోకుండా ఉత్సాహంగా అరిచిన వైనం - ఒక్కటీ గుర్తొచ్చాయి సంజనకి.

ఇందులో ఏముంది? ఓ సారి తనను తానే ప్రశ్నించుకుంది. ఒక్క మాటలో చెప్పగలిగే జవాబులు ఉంటేగా! కొన్నింటికి ఉండవు. ఎందుకంటే - అదంతే!

ఒక వాచీ తన ఆత్మకథ చెప్పుకుంటే చాలదూ దాన్ని తొడుక్కున్న మనిషి గురించి తెలుసుకోడానికి?"

"సర్లేవోయ్!అందరూ నీలా దాన్ని కవచకుండలాల్లా వేసుకు తిరుగుతారా ఏం?" సంజన లోపలి మనిషి వెటకారం.

"ప్రాణం లేని ఈ వాచీ నాకు ఆరో ప్రాణం అంటే ఎన్ని సార్లు ఎంత మంది నవ్వలేదు.... అమ్మతో సహా, నాప్రాణస్నేహితురాలితో సహా..."

"నవ్విపోదురుగాక నీకేటి సిగ్గు?" - మళ్ళీ అంతరాత్మ వెటకారం. లోపలి మనిషి గనుక బయటి మనిషి అయి ఉంటే కానిబల్ అవతారమెత్తి నమిలి మింగేద్దాం అన్నంత కోపం వచ్చింది సంజనకి ఆ మాటలకి. కానీ... ప్రాణం లేకుండా నోరు మాత్రం ఉండేవి కొన్నుంటాయని గుర్తొచ్చి ఇక ఊరుకుంది. ఇంతలోనే తల్లితండ్రుల వాచీల గురించి గుర్తొచ్చింది. "నాకే ఇన్ని జ్ఞాపకాలుంటే వాళ్ళకి ఎన్ని ఉంటాయో కదా!" అనుకుంది. "అమ్మ పదో తరగతి అప్పటి వాచీ.... అమ్మకి ఎన్ని గుర్తులున్నాయో దానితో. చూస్తే ఎంత చరిత్ర చెబుతుందో ఆ వాచీ. అసలు వాచీకి ప్రాణముంటే ఏమయ్యేది?" - నవ్వొచ్చింది సంజనకి ఇలా అనుకోగానే. "నాన్న వాచీ ఎప్పుడు కొన్నదో ఇంతకీ .... నాకైతే అది నాన్న జ్ఞాపకం.... చిన్నప్పుడు నాన్న చేతిని పట్టుకుని నడిచిన రోజుల్లో ఆ వాచీ స్పర్శ తగిలిన గుర్తులన్నీ మనసులో మెదులుతూ ఉంటే అనుకుంది సంజన. నాన్నకైతే మరే జ్ఞాపకమో..... ఎన్నెన్ని జ్ఞాపకాలో..... ఎవరెవరి జ్ఞాపకాలో.... అనుకుంది మళ్ళీ తనే.

వాచీ చూసిన ప్రతిసారీ జ్ఞాపకాల వెల్లువే నిజానికి సంజనకి. దాన్ని చూసిన ప్రతిసారీ ప్రేమ పొంగుతుంది.... ఇష్టమైన మనిషి తలపు రాగానే పొంగినట్లు. గుండె చప్పుళ్ళు ఆగడంతోనే మనిషి మరణాన్ని నిర్ణయిస్తారు కానీ..... ఆమనిషి తాలూకు జ్ఞాపకాలూ, ఆమనిషితో ఏర్పరుచుకున్న అనుబంధాలూ - ఇవి ఆగేదెక్కడ? అవి సాగుతూనే ఉంటాయి. వాటిని నిరంతరం గుర్తుచేసేదే ఈ వాచీ... "నీ కదలికలతో నడిస్తే, అది నా జీవిత చిత్రం" - ఓసారి తనే అనుకున్న మాటలు గుర్తు వచ్చాయి. వాచీనోసారి చేత్తో తడిమింది. చిన్నగా నవ్వుకుని నడక కొనసాగించింది.... వాచీ నడకతో పాటు.

# మనోనేత్రం

- నిషిగంధ

రెండేళ్ళ చిట్టి నవ్వినప్పుడల్లా
తెల్లదనం తెరలు తెరలుగా
విచ్చుకుంటుంది.
కొసరి తినిపించే
అమ్మ చేతివేళ్ళ పసుపు
పవిత్రంగా అతుక్కుంటే
కాలిలో గుచ్చుకున్న ముల్లు నొప్పి
గుండెని చేరనివ్వని నేస్తం స్పర్శ
హరితమై ప్రవహిస్తుంది
తుంటరి చినుకుల చక్కిలిగింతలకి
తుళ్ళిపడుతున్న సెలయేరు
నీలాలు రువ్వుతుంది
గ్రీష్మకిరణాల
గాఢచుంబనమే కదా
ఎరుపంటే!
అపజయం పరిహసించినప్పుడల్లా
కాషాయం అభిమానంగా
చుట్టుకుంటుంది.
సన్నజాజి సందెగాలుల ప్రణయావేశం
తలత్ గజల్ తో కలిసినప్పుడే కదా
ఊదా రంగు వింత హొయలేమిటో తెలిసేది!!

ఇక ......
అన్ని రంగులూ కలిసిన నలుపు
కళ్ళెదురుగా కావలసినంత!
మనోఫలకంపై చెక్కుకున్న
ఈ వర్ణమాలికని తాకిన వారెవరనగలరు
నాకు చూపు లేదని!?

# అరవైలో ఇరవై, ఇరవైలో అరవై

**- కలశపూడి శ్రీనివాసరావు**

ఇరవైఐదో ఏట దాకా ఇండియాలో బ్రతికి వచ్చి అమెరికాలో మరో ఇరవై ఐదేళ్ళు బ్రతికిన నాకు అమెరికా అయినా ఇండియా అయినా ఒకటే అన్న భావన చాలా గట్టిగా ఉండేది. అమెరికాలో పగలైతే ఇండియాలో రాత్రి, ఇండియాలో పగలైతే అమెరికాలో రాత్రి అని మొదలు పెట్టి 'అక్కడ' 'ఇక్కడ' అని వాదించే వాళ్ళని పట్టించుకునే వాడిని కాదు. అలాంటి నాకు కనువిప్పు కలిగించింది వాసా విశాలాక్షిగారి వాక్యం. "ఇండియాలో ఇరవైలో అరవైలా బ్రతికిన నేను అమెరికాలో నా అరవైలలో ఇరవైలలా బ్రతుకు తున్నాను."

వాసా విశాలక్షిగారు న్యూయార్కులో సంగీతం టీచరు. కర్ణాటక సంగీతానికి చేతులడ్డుపెట్టి ఒక 'కాపు' కాస్తున్నాం అని అనుకొంటున్న ఎందరో వ్యక్తుల కంటే, సంస్థల కంటే, ఎక్కువ 'పెద్దకాపు' వాసా విశాలాక్షిగారు. నలభై ఏళ్ళగా ఆవిడ న్యూయార్కు లో ఉన్నారని గాని, ఎంతో సంగీత సేవ చేస్తున్నారని కాని న్యూయార్కులో ఎన్నాళ్ళున్నా మీకు నాకు తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే ఆమెను ఏసంఘాలు గుర్తించలేదు. అవార్డులు ఇవ్వలేదు. ఇండియా ఎబ్రాడ్ న్యూస్ పేపరులో వ్రాయలేదు. ఆవిడ చేస్తున్నసేవని, ఆవిడ ఉనికిని నలుగురికి తెలిసేలా చేసింది ఓ తెల్లవాడు. వాడికి సంగీతం కాని, భారతదేశం గురించి కాని ఏమీ తెలీదు. అసలు భారతదేశం అనేది ఉందని కూడా తెలియదు.

వాడికి తెలిసినదంతా రోజూ 'ఎలాగో ఒకలాగ' డబ్బులు 'సంపాదించి' 'డ్రగ్స్' తీసుకొని ఆనందోబ్రహ్మ - అని జీవితం గడపడం. అలాంటి వాడికి సంగీత విద్వాంసురాలు, పూజ చెయ్యకుండా పచ్చి మంచినీళ్ళు అయినా ముట్టని, పరాయివాళ్ళ ఇళ్ళల్లో పళ్ళు తప్ప మరేమీ తినని ఛాందసురలైన వాసావిశాలాక్షి గారికి లింకేమిటని ఆశ్చర్యపోకండి.. ఉంది.

ప్రతిరోజూ ఉదయం పూజ చేసుకొని, మడిగా వంటవండి భర్తకి పెట్టి, తాను తిని, పట్టుచీర కట్టుకుని లోపల థెర్మల్స్ (చలిని తట్టుకోడానికి తొడుక్కొనే లోపలి బట్టలు ) తొడుక్కుని, మఫ్లర్ కట్టుకొని, న్యూయార్కు బస్సులలో, సబ్‌వేలో తిరుగుతూ అభిరుచి ఉన్న వాళ్ళకి వెళ్ళి సంగీత పాఠాలు చెప్పడం ఆమె దినచర్యలో భాగం. అటువంటి ఒక రోజు ఆమెని సబ్‌వేలో ఓ తెల్లవాడు అటకాయించి 'మగ్గింగ్' అనే మెన్ హాటన్ స్టైల్ ముష్టికై ప్రయత్నించాడు. ఆమె మగ్గింగ్ కోసం దాచుకొన్న ఐదు డాలర్లు ఇచ్చేఅంతలో ఆమె శృతి పెట్టెని పట్టుకొన్నాడు. అపుడు శృతి పెట్టె పట్టుకున్న ఆమె చెయ్యిని తాకాడు. ఐదు డాలర్లు ఇద్దామనుకున్న ఆమెకి వాడు చెయ్యి తాకడం వల్ల మడికి భంగం అయి కోపం వచ్చింది.

"ముష్టి వెధవ్వి ముష్టివెధవలా ఉండక ముట్టుకొని నామడి మైల చేస్తావా?" అని అరిచింది.

ఆమె ఆవేశాన్ని ఆమె గాత్రం అద్భుతంగా అనువదించింది. పక్క వాడు చచ్చి పోతున్నా పట్టించుకొని జనాన్ని నిలబెట్టింది. గొడవైంది. పోలీసులొచ్చారు.

"ఓస్ ఇంతేనా?" అని వెళ్ళిపోబోయారు. అలాంటి పోలీసుల్ని ఆపి 'మడి' దాని ప్రాముఖ్యత గట్రా వివరించారు. అటువంటి తప్పుని అమెరికా ఖండంలో చేసేవారిని వదిలేస్తే ఈ ఖండం అపవిత్ర మైపోతుందన్నారు.

"ముష్టి వాళ్ళు ముష్టి అడగడం మనం ఇవ్వడం సనాతన ధర్మం"అని చెప్పారు.

ఆమె చెపుతున్న విషయంకంటే ఎంతోసేపైనా వినాలనిపించే ఆమె గొంతు వినడానికై మరిన్ని ప్రశ్నలు వేసారు పోలీసులు. ముచ్చటపడి కేసు రాసి, నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు.

అమెరికాలో క్రైం న్యూసు ఎక్కువ. కాని అందులో ఇండియన్ పేర్లు తక్కువ. అంచేత మనం ఇక్కడ ఉన్నామని నలుగురికి తెలియదని, న్యూయార్కు అంటే 'మెల్టింగ్ పాట్' అని అది సంస్కృతుల సంగమం అని అందులో ఇవాళ 'మడి' అనే భారతీయ సంస్కృతికి సంబంధించిన విషయం అమెరికాలో క్రైం కి కొత్త కోణాన్ని ఇస్తుందని న్యూయార్కులోని ఇండియన్ ప్రెస్ విజృంభించింది.

వారు వాసా విశాలాక్షిగారి ఇంటి ఎడ్రస్ పట్టుకొన్నారు. కెమేరాలు వెంట తెచ్చుకున్నారు. ఆమెని వివిధ ప్రశ్నలు వేసారు. ఆమెకి ఇది ప్రథమ ఇంటర్వ్యూ

అవడం వల్ల ఆమె ఏ సమాధానం చెప్పకుండా ముందు 'మహాగణపతిం...' అంటూ మొదలు పెట్టారు. ఆ తరవాత ఆమె అన్ని ప్రశ్నలకి సమాధానం చెప్పారు. ఆమె జీవిత చరిత్ర అంతా వివరించారు. మగ్గింగ్ పాలబడ్డా మరేమి జరిగినా 'అమెరికా' మాత్రమే నచ్చిందన్నారు. విలేఖర్లు వివరంగా చెప్పమన్నారు. ఎన్నో కారణాలు వివరాలు ఎందుకు ఒక్కటి చాలన్నారు ఆమె. ఆ సమాధానమే 'అమెరికాలోఅరవైలో ఇరవై, ఇండియాలో ఇరవైలో అరవై.' అదెలా అని ఆశ్చర్యంగా ప్రశ్నించింది. ఇరవైలలో ఉన్న జుహి ఝూన్ ఝూన్ వాలా అన్న విలేఖరిణి.

"నాకు ఇరవైవ ఏట పెళ్ళైంది. నేను వాళ్ళింట కాలు పెట్టిన వేళావిశేషం యేమో కాని నాభర్తకి ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది. తుళ్ళుతూ, తేలుతూ, తిరుగుతూ సంగీతం ఊపిరిగా బ్రతుకుతున్న మాపల్లెటూరి నుండి ఢిల్లీ వెళ్ళిన నాకు అదో పెద్దజైలులా అనిపించింది. వాసావారింటి అబ్బాయి అని మానాన్న నన్ను ఒప్పించి చేసిన పెళ్ళి నాది. వారి ఇంట ఉన్న సంగీత సాంప్రదాయాన్ని గౌరవించి, అటువంటి కుటుంబం లో పుట్టిన ఆయనకి 'ఇంగువ కట్టిన గుడ్డ'లా ఎంతో కొంత సంగీతం రాదా అని అనుకొన్నాం. అయితే అది మారోజుల్లో పెళ్ళిచూపుల్లో పెళ్ళికూతురు ప్రశ్నలు అడగలేదు కదా.. పెళ్ళైన తరువాత తెలుసుకొందాం అని వాయిదా వేసాను. ఢిల్లీ వెళ్ళిన తరువాత తెలిసింది అది 'ఇంగువ కట్టిన గుడ్డే' కాని మా ఆయన తరంలో అది 'సర్ఫ్' వేసి శుభ్రంగా ఉతికి ఆరేసిన బట్ట అని. ఆయనకి సంగీతం రాకపోతేనేం నలుగురికి పాఠాలు చెప్పుకుని నా సంగీతాన్ని నిలబెడదాం అనుకొన్నాను. కాని కుదిరేది కాదు. రోజు తెల్లవారుఝామున మూడు గంటలకి లేచి నీళ్ళు పట్టుకోవాలి. ఐదు గంటలకి పాలబూత్ దగ్గరకి వెళ్ళి పాలు తెచ్చుకోవాలి. ఆరుగంటలకి భర్తని లేపి కాఫీ అందించాలి. ఏడు గంటలకి పిల్లల్ని లేపి తయారు చెయ్యాలి. వంట చెయ్యాలి. వాళ్ళని బస్సెక్కించాలి భర్తకి టిఫిన్ పెట్టాలి. కేరేజ్ కట్టి ఇయ్యాలి. మార్కెట్‌కి వెళ్ళాలి. ఆతరవాత ఇంత తిని పడుకొందామంటే కుదరదు కొత్తగా కొన్న టీ.వి చూడడానికి రోజు పొరుగువాళ్ళు వస్తారు. కునికి పాట్ల మధ్య చూస్తు లేస్తు ఉండే సరికి పిల్లలు వచ్చేస్తారు. రాత్రి పదిదాకా ఏవేవో పనులు. పడుకునే సరికి పదకొండు. మళ్ళీ తెల్లవారుఝామున మూడు గంటలకి లేవడం. అలా పని చేసి చేసి నా ఇరవైలలో అరవైఏళ్ళదానిలా తయారైయ్యాను. నాకు నచ్చిన సంగీతానికి కనీసం ఓ గంటైనా రోజులో దొరికేది కాదు. కాని ఇప్పుడు అరవైలలో అమెరికాలో నాకు నచ్చిన సంగీతాన్ని నలుగురికి నేర్పుకొంటున్నాను. అంచేత ఇండియాలో ఇరవైలో అరవైలా బ్రతికిన నేను అమెరికాలో అరవైలో ఇరవైలా బ్రతుకుతున్నాను" అన్నారు.

అది ITVలో విన్న నాకు అమెరికా జీవితం గురించి కనువిప్పు కలిగింది. అప్పటినుండి నేను చూసిన, విన్న అమెరికా భారతీయ జీవనం లోని అనుభవాలు నామెదడులో శతపత్రదళ పుష్పంలా వికశించడం మొదలు పెట్టాయి.

# విజయవాడ నుండి గుడివాడ వరకు - బస్సులో

*- పద్మశ్రీ డా. యస్. వి. రామారావు*

నేపుట్టిన వూరు గుడివాడకు వెళ్ళాలి. విజయవాడ బస్సు డిపోలో టిక్కట్టు కోసరం నిలబడ్డాను అందరిలా క్యూలో. ఎప్పటికీ క్యూ కదలదు. టిక్కట్లు అమ్మే అతను బుకింగ్ ఆఫీసులో కటకటాల వెనుక తాపీగా కూర్చొని ఏవో టిక్కట్లు లెఖ్ఖ పెట్టుకుంటున్నాడు. అతని ప్రక్కన మరో అతను కుర్చీలో కూర్చొని ఇతన్ని చూస్తున్నాడు. నేను క్యూలోంచి బయటకు వచ్చి బుకింగ్ ఆఫీసులో అతన్ని అడిగాను. "ఏమండీ మీరు గుడివాడ వెళ్ళే బస్సుకు టిక్కెట్లు ఇస్తారా?" అని. "నేను ఇవ్వను ప్రక్క బుకింగ్ ఆఫీసులో అతను ఇస్తాడు." అన్నాడు. "మరి అక్కడ ఎవరూ లేరే" అన్నాను. "అయితే కాసేపు ఉన్నాక నేను ఇస్తాను. క్యూలోనే నిలబడండి" అన్నాడు. ప్రక్కన ఉన్న అతను ఇవ్వవచ్చుగదా! మా సంభాషణలతో ఏమీ సంబంధం లేనట్లుగ అతను ఇతన్ని చూస్తున్నాడు. చీమ కుట్టినట్టు కూడా లేదు. ఇంతమందిమి క్యూలో నిలబడ్డా వీరిద్దరికి. బుధ్ధిమంతుల్లా, ఓపిగ్గా, సైలెంటుగా, గుడివాడ వెళ్ళేవాళ్ళు అందరూ టిక్కట్లకోసరం నిలబడి ఉన్నారు. నాకు ఈ వాతావరణం కంపరం ఎత్తింది. నిర్ల క్ష్యానికి ఇంతకంటే మరో ఉదాహరణ లేదనిపించింది. ప్రభుత్వపు బస్సులు వీళ్ళ స్వంత ఆస్థిలా ఉంది. ప్రయాణీకులు నోరు మూసుకొని ఉండాలి వీళ్ళ దయా దాక్షిణ్యాలపై. అలాగే సాగుతున్నది కాలం.

టిక్కట్టు కౌంటర్ దగ్గర్లో కొన్ని బస్సులు ఉన్నాయి. ఒక్క దానిమీద 'గుడివాడ'కు అని వ్రాసి ఉన్నది బోర్డుమీద. బస్సులో డ్రైవరుగారు తన సీటులో స్టీరింగ్ చక్రం ముందు కూర్చొని ఏదో పేపరు చదువు కుంటున్నాడు. నేను వెళ్ళి "ఏమండీ ఈ బస్సులో టిక్కట్టు ఇస్తారా కండక్టర్ గారూ! గుడివాడకు?" అని అడిగాను. "ఇందులో ఇవ్వరు, క్యూలో నిలబడి కొనిక్కోవలసిందే టిక్కట్టు. అయినా ప్రక్క బస్సు భీమవరంది. అది గుడివాడ బస్సుస్టాండులో ఆగి తర్వాత భీమవరం వెళ్తుంది బస్సులోకి కండక్టరుగారు టిక్కట్టు ఇస్తారు గుడివాడకు" అని సలహా ఇచ్చాడు. ఒక్క మంచి వాడిని, సహాయకారుణ్ణి చూచానని సంతోషించాను.

భీమవరం వెళ్ళే బస్సు ఎక్కాను. మగవాళ్ళు కూర్చొనే సీట్లు, ఆడవాళ్ళ సీట్లు విడివిడిగా ఉన్నాయి. నేను మగవాళ్ళు కూర్చొనే సీటులో కూర్చున్నాను. బస్సు రెండు నిమిషాల్లో కదిలింది. గుడివాడ వెళ్ళవలసినవాళ్ళు టిక్కట్టు కొనేందుకు ఇంకా క్యూలోనే నిలబడి ఉన్నారు. క్యూ కదలడం లేదు. టిక్కట్టు అమ్మవలసిన అతను టిక్కట్లు లెఖ్ఖపెట్టుకుంటూనే ఉన్నాడు ఇంకా. ఈ క్యూలో నిల్చున్నవారికి భీమవరం వెళ్ళే బస్సులో ఎక్కితే గుడివాడలో దిగవచ్చు అని తెలియదా?

బస్సు ప్రయాణం సాగించింది. అరగంట అయిన తర్వాత ఏదో ఊరిలో ఆగింది. నలభై ఏండ్ల లావుపాటి ఆవిడ, ఇంకో ఇరవై అయిదు సంవత్సరాల వయసు - ఆవిడ, పద్దెనిమిది ఏండ్ల సన్నటి కుఱ్ఱాడు బస్సు ఎక్కారు. అందరూ ఒకరినొకరు తెలిసినవాళ్ళలా ఉన్నారు. వాళ్ళలో వాళ్ళు ఏదో మాట్లాడుకుంటున్నారు. స్త్రీలు మాత్రమే అన్న సీట్లలో ఒక భార్య,భర్త గాబోలు కూర్చొని ఉన్నారు. వాళ్ళకు ముప్పయి సంవత్సరాలు ఉంటాయి. మరొక సీటులో ఇద్దరు మగవాళ్ళు కూర్చుని ఉనారు. మధ్య వయసు వాళ్ళు. వాళ్ళ సీటుకు "సీనియర్ సిటిజన్స్‌కి మాత్రమే" అని వ్రాసి ఉంది. ఇద్దరు స్త్రీలు, కుఱ్ఱాడు నిల్చొనే ప్రయాణం చేస్తున్నారు. బస్సు పోతున్నది పంట కాలువ ప్రక్కనే.

భార్య, భర్తలు కూర్చున్న సీటు మీద "స్త్రీలకు మాత్రమే" అని వ్రాసిఉంది గనుక, వాళ్ళు లేచి నిలబడ్డ ఇద్దరు ఆడవాళ్ళలో ఎవరికన్నా కూర్చొనవలసిందలి చెప్పాలి. భర్త లేస్తాడా? లేదు. భార్య,భర్త చేయి పట్టుకొని అతనిని ఇంకా దగ్గరగా లాక్కున్నది,ఒకవేళ పొరపాటున తాను లేస్తాడేమో అని అనుమానించి గాబోలు. నేను నా సీటులో కూర్చొని చూస్తున్నాను ఈ సీను.

భర్త సీటులోంచి లేవడం లేదేమిటి అన్నది చిత్రంగా ఉన్నది నాకు. బస్సు పోతున్నది, కాల్వ ప్రక్కగా. గతుకుల గుంటల రోడ్డుపై గంతులు వేస్తున్నది బస్సు. అటు ఇటు ఊగుతున్నారు ప్రయాణీకులు. నిల్చున్న లావుపాటి ఆవిడ కుదుపులతో కష్టపడుతున్నది ఒక చేత్తో ఇనుపస్తంభం పట్టుకొని. బస్సుకు ఈ కుదుపులు మామూలేలా ఉంది. తాపీగా ఒకే స్పీడులో ప్రయాణం చేస్తున్నది.

లావుపాటి ఆవిడతో "ఏమండీ, మీరు కూర్చోండి" అని లేచి నిలబడ్డాను, నాసీటులోనుండి. పాపం నిలబడి ఇబ్బంది పడ్తున్నది గదా అని. ఆవిడ ముఖం విప్పారింది.

"అరేయ్! నువ్వు కూర్చోరా" అన్నది తనతో ఉన్న కుఱ్ఱాడిని. అతను కొడుకో, తమ్ముడో. ఏమి సంకోచం లేకుండా వెంటనే నా సీటులో కూర్చున్నాడు హాయిగా.

ఇది చోద్యమే! నిల్చోని ఇబ్బంది పడ్తున్నదిగదా అని ఈ లావుపాటి ఆవిడ్ని పిలిచి నా సీటు ఇచ్చాను. అలా జరుగలేదే! కూర్చున్న కుఱ్ఱవాడు దుక్కలా ఉన్నాడు. తనకంటె వయసులో పెద్దగదా ఆవిడ. నువ్వు కూర్చో అని అనవలసింది గదా కుఱ్ఱాడు. ఊం... ఊం... అతనికి అసలు ఇలా అనాలి అని తట్టనేలేదా! ఇది ఏమంత విశేషమైందా ఏమిటి తల బ్రద్దలు కోవడానికి అని అనుకోని ఉంటాడు. ఇండియాలో అందరు ఇలానే ప్రవర్తిస్తారా? ఒక్క ఆంధ్రలో మాత్రమేనా? తెలియదు.

నే చోటు ఇచ్చింది ఆవిడకు,నిలబడగల వయసులో ఉన్నవాడికి కాదు. ఇతనికైతే నేను సీటు ఇచ్చేవాడ్నే కాదు. ఇప్పుడు జరిగిన అన్యాయానికి నా మనసులో బాధగా ఉంది. ఆవిడకు తట్టలేదా నేను ఎందుకు నా సీటు లోనుండి లేచింది? అంత వివక్షత లేకుండా ఉంటారా ఎవరైనా? అసలు లేవడం నాదే తప్పు. బూడిదలో పోసిన పన్నీరైంది నా మంచితనం. నన్ను ఓ వెఱ్ఱి వెంగళప్పగా కట్టింది." ఎవడో ఈ ప్రాంతాలవాడు కాదులా ఉందే. బస్సులో ప్రయాణం చేయడం క్రొత్తేమో వీడికి. అమాయకుడు. మా సంగతి తెలీదు. అవకాశాన్ని మా ఇష్టం వచ్చినట్లుగా ఉపయోగించుకుంటాం. ఏదో సీటులోనుండి లేచాడు గనుక వీడు చెప్పినట్లుగ కూర్చుంటానా! నా ఇష్టం వచ్చిన వాళ్ళని కూర్చోబెడ్తాను. ఒకసారి సీటు ఇస్తే సీటు నాది. నిర్ణయాలు నావి. వీడి ఇష్టాలతో నాకేమిటి పని" అని అనుకుంటుంది గాబోలు. నాకు బలే కోపం వచ్చి ఉడికిపోతున్నాను లోలోపలే.

బస్సు మెత్తగా వెళ్తున్నది. రోడ్డు బాగా ఉన్నది గాబోలు. ప్రయాణీకులు ఎవరి ఎవరి గొడవల్లో వాళ్ళు హాయిగా ఉన్నారు. నాలోనే ఈకుదుపులన్ని. మనసులోనే పడ్తున్న మధన ఈవిడతో చెప్పాలి అనిపిస్తున్నది. భరించలేని, కుములుతున్న నా వేదనను. "ఏమిటమ్మా! నాగురించి నీ ఆలోచనలేమిటి? అంత సునాయాసంగా, నిలబడగల యువకుణ్ణి కూర్చోపెట్టావే, నీ కిచ్చిన అవకాశాన్ని అతనికిచ్చి, నీకు బంధుత్వంపై ఎంత మమకారం ఉందో చూపించావా? అది గ్రుడ్డి ప్రేమేమో అనే అనుమానం అసలు రానేలేదా. నీకు వచ్చిన అవకాశాన్ని తీసికొని అనుభవించు, ఇతరులకు పంచడం కాని, ఇవ్వడం కాని చేయక అని మలిచావా కుఱ్ఱాణ్ణి. నీవు చెప్పిచట్లు అతను వింటే అది వినయం క్రింద గుర్తిస్తున్నావా నీపట్ల. అలా అని అనుకోవడం లేదే నేను? ఎందుకని?

నే వదులుకున్న సౌఖ్యాన్ని గౌరవించావా, గుర్తించావా? లేదే! మంచిపని అని అనుకోని నేచేసినది బూడిదలో పోసినపన్నీరు అయిందే. మనమిద్దరం త్యాగం చెయ్యడం కుఱ్ఱాడి కోసరమా?" ఎన్నోవిధాలుగా నా మనసు ఆలోచిస్తున్నది.

బస్సు సగం దూరం వచ్చింది గుడివాడ చేరేందుకు. నా జీవిత అనుభవంలో ఇది క్రొత్తగా ఉంది. నేను నాలుగు దశాబ్దాలుగా నివశిస్తున్న దేశాలలోని వాళ్ళు ప్రవర్తించేలా కాకుండ భిన్నంగా ఉంది, ఇక్కడ ఆంధ్రలో.

"ఏమిటి! చాలాసేపటినుండి నిలుచునే ఉన్నారు. మీరు కూర్చోండి. లేరా అబ్బాయి, వారు కూర్చుంటారు." అన్నది లావుపాటి ఆవిడ. మాటలు నన్ను ఓ కుదుపు కుదిపాయి. మనసులో అనుకుంటున్నదంతా తనకు ఎలా తెల్సింది. నా మనోభావాలు కెరటాలుగా మారి, - ఆవిడని చేరుకున్నాయా? తాను నాపై దృష్టి సారించ గానే నా భావాలన్నీ తెలిసాయి గాబోలు. ఆశ్చర్యంలో మునిగి తేరుకోలేక పోయాను. కుఱ్ఱాడు నావంక చూస్తున్నాడు. లేవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. "లేవొద్దు, కూర్చో" అన్నాను అతనితో. ఆవిడకు నా భావాల్ని తెలియ చెప్పకపోతే నన్ను నేను మోసగించుకుంటున్నానన్న మాట. అనేశాను ఇక ఉండబట్టలేక. "మీరు కూర్చుంటారని నేను లేచి మీకు నా సీటు ఇచ్చాను. అంతేకాని కుఱ్ఱవానికి కాదు. కూర్చోనివ్వండి అతన్నే. నేను నిల్చుంటాను, ఫరవాలేదు."

"ఏదో పిల్లవాడు గదా అని కూర్చో పెట్టాను" అని సమర్ధించుకున్నది ఆవిడ. అంతకంటే ఎక్కువ సంజాయిషీ లేదు. ఇది అంతగా ఆలోచించవల్సిన విషయం కాదు ఆవిడకు. అని అర్ధం అయింది నాకు. లేవబోయే కుఱ్ఱాడు కూర్చున్నాడు. అతనికి ఈ గందరగోళంతో సంబంధం లేదు. ఒక్క నిట్టూర్పు వదలి "అమ్మయ్య! ఇక నేను కూర్చున్న సీటునుండి కదలక్కర్లేదు" అని తలచాడు గాబోలు. నేను మాత్రం అప్పటి వరకు నా గుండెల్లో ఉన్న నా మనోభావాల్ని కుండ బ్రద్దలు కొట్టినట్లుగా చెప్పేసాను ఆవిడతో. నీళ్ళు నమల లేదు. నా ఆత్మగౌరవాన్ని గాపాడుకున్నాను. ధైర్యంగా ఆవిడకు, చెప్పినా మనసులోని భావాన్ని, ద్విగుణీకృతమైన శక్తిని తెచ్చుకున్నాను. తేలిక పడింది

మనసు. బాగా గాలి పీల్చాను నన్ను నేనే మెచ్చుకుంటూ.

బస్సు వెళ్తున్నది. ఏదో ఊరు రాబోతున్నది. బస్సు వేగం తగ్గింది, ఆగింది. బయటనుండి అమ్మే అతను తినుబండారాలను కొన్నవారికి అందచేయాలని, చేతులు చాపి బస్సు కిటికీలగుండా బయటనుండి అంద చేస్తున్నారు లోపల ఉన్నవాళ్ళకు. కిటికీ దగ్గరగా కూర్చున్న వాళ్ళకు ఇచ్చి, బస్సులోపలి వారికి అందచేయ మని అడుగుతున్నారు. సోడాలు,వేరుశనగలు, బటానీలు, కాల్చిన కండెలు, నీళ్ళ కొబ్బరి బొండాలు, సమోసాలు అలాగ ఏవేవో.

ఇద్దరు మగ ప్రయాణీకులు బస్సు దిగారు. ఇప్పటి వరకు నిల్చున్న లావుపాటి ఆవిడ, తనతో ఉన్న ఆవిడ ఖాళీ అయిన సీట్లలో క్షణం ఆలస్యం చేయకుండ, తటాలున కూర్చున్నారు. కూర్చున్నందుకు చాలా - ఆనందంగా ఉన్నది ఇద్దరికి. నా స్థానంలో మార్పు లేదు. పైన ఉన్న గుండ్రటి ఇనుపరాడ్‌ను పట్టుకొని నిలబడే ఉన్నాను ఒక చేత్తో. మరో చేతిలో ఓ చిన్న సంచి ఉంది బట్టల్తో. అంత బరువైంది కాదు సంచి.

అరవై, అరవై అయిదు సంవత్సరాలు ఉంటాయి - ఆవిడకు. ఆవిడ, మరో ముగ్గురు మగవాళ్ళు ఎక్కారు బస్సు. అందరు నిలబడే ఉన్నారు. బస్సులో మారిన వాతావరణాన్ని చూస్తున్నాను. కొత్తగా ఎక్కిన వాళ్ళు అటు ఇటు చూచి ఎక్కడ సీటులు లేవు అని నిర్ధారణ అయిన తర్వాత నిలబడి ప్రయాణం చేయడానికి సిద్ధపడ్డారు. ఎవరెవరి స్థానాల్లో వారి వారి స్వగత లోకాల్లో సెటిల్ అయిపోయారు. నేనొక్కణ్ణే వీరందరిలో కలవనివాణ్ణి. వాళ్ళ లాంటిది కాదు నాలోకం, నాస్థానం. జీవితంలో జరిగే అన్యాయాలకు సర్దుకు పోవడం, ఎదురు చెప్పలేకపోవడం, మనకెందుకులే, ఎలాగో దిగిపోతాము కదా గమ్యస్థానం వచ్చిన తర్వాత అని ఉదాసీనంగా ఉండేవాడిని కాను. నేనూ వీళ్ళందరిలా పుట్టినవాడినే ఆంధ్రలో. ఇక్కడే ఉంటే వీళ్ళలా ఉండేవాడినేమో, వాళ్ళలానే ఆలోచించే వాడినేమో! విశాల ప్రపంచంలో తిరిగి, తిరిగి మారినవాణ్ణి. జరుగుతున్న డ్రామాలో భాగస్తునిగా చేసింది ఈ బస్సు. ఇది భారత దేశం వాళ్ళ బస్సు. వాళ్ళ బస్సుప్రయాణం చేయాలంటే వాళ్ళలా ఉండు. అలానే ఆలోచించు. లేకపోతే దిగిపో" అంటున్నది బస్సు. ఏమి చేయలేని, అనలేని నిర్వీర్యుణ్ణి. నిలబడి ఉన్నవారు నిలబడే ఉన్నారు. కూర్చున్నవారు కూర్చునే ఉన్నారు. బస్సుకు చింత లేదు. దానిలో పెట్రోలు నిండు మోతాదులో ఉన్నది. అందుకే అది అంత తృప్తిగా, తాపీగా సాగిపోతున్నది. కూర్చున్న వారిలో కొంతమంది హాయిగా కునుకులు తీస్తున్నారు. ఈ డ్రామాలో వారు పాల్గొన లేదు. ఇది అంత విశేషం కాదు. రోజూ మామూలుగా జరిగే సంఘటనలే. మరి నాలో ఈ కలవరమేమిటి?

అరవై, అరవై అయిదు ఏండ్ల ఆవిడ అలాగే నిలబడ్డది. వయసులో శరీరం కుచించుకోబడ్డది-కొంచెం. జీవితంలో పడ్డ కష్టాలు ముఖంపై మడతలుగా ముద్రలు వేసాయి. సహనం ఆవిడ హాల్ మార్క్ "సీనియర్ సిటిజెన్స్‌కు మాత్రమే" ఉన్న సీట్లో కూర్చున్న వారిద్దరు చలనం లేకుండ కూర్చున్నారు. ఈవిడ వాళ్ళ ప్రక్కనే నిలబడ్డది. నిజానికి సీటు విడది. కండక్టరు గారు అయినా చెప్పవచ్చుగా వాళ్ళలో ఒకర్ని లేవమని. అతను తనకు ఏమి సంబధం లేనట్లే ప్రవర్తించాడు. భార్య,భర్త జంట ఈవిడ గురించి పట్టించుకోవడం లేదు. కిటికీలోంచి బయట వెలుతుర్ని, పరిగెడుతున్న పల్లెటూర్లను చూస్తున్నారు. వీళ్ళ మీద బలే కోపం వస్తున్నది నాకు. ఈవిడ్ని కట్టుకున్న హెన్ పెక్ గాడెవడు? ఎక్కడ పుట్టాడు, ఎలా పెరిగాడు. తన జీవితానికి తాను నిర్వచనం చెప్పుకోలేని వెధవ, స్వలాభి గూడాను. భార్య అంతకంటే చలించలేని రాయి. తన భర్త దగ్గరుంటే చాలు ఆదిపత్యం వహించడానికి. "చూడండి! నేకూర్చోమన్న చోట కూర్చుంటాడు. తనకున్న మనోభావాలన్నీ నేనిచ్చినవే. తనకు స్వంతజీవితం ఉండ వలసిన అవసరం ఏమి ఉందని? నా మాట జవదాటని, నన్ను అంటి పెట్టుకొని పెరిగే సునిశితమైన తీగగా చేసాను. నాచుట్టూ తిరుగుతూ, నన్ను అంటిపెట్టుకొన్న తీగ నా భర్త. అంతకంటే నాకేం కావాలి. ఔతిమూర్తు లంతటి వారిని పసిపాపలుగా చేయగల్గింది స్త్రీశక్తి." అని అనుకుంటోంది గాబోలు. కోపంతో కుతకుతలాడి పోతున్నాను. ఈవిడ కూర్చోడానికి చోటు ఇవ్వలేని స్థల భ్రంశుడను. ఆవిడతో పాటు నిలబడి కుదుపుల్లో ప్రయాణం చేసే తోటి సహచరుణ్ణి.

హాయిగా కూర్చున్న లావుపాటి ఆవిడ తనతో వచ్చిన అమ్మాయి, కుర్రాడు మాటలాడుకుంటున్నారు వాళ్ళతో వాళ్ళు. కండ్లముందు వున్న ఆవిడ వాళ్ళకు కన్పించడం లేదు. "మేమెందుకు ఈవిడ గురించి తెలుసుకోవాలి? - ఆవిడకు సీటూ లేకపోవడం మాతప్పు కాదుగా. మేమూ నిలబడ్డాంగదా ఇంతకుముందు. అలాగే ఈవిడ"

అనుకుంటున్నారు గాబోలు.

బస్సు కుదుపుతున్నది. నిలబడ్డ ఆవిడ కండ్లపాపలో ఓ తెల్ల పొర కన్పిస్తున్నది. అప్పుడా ఉదయించీ ఉదయించని ఉషోదయాన, పచ్చగడ్డిని కప్పిన పల్చటి మసక మసక తెలుపు మంచుపొగ ఆవిరిమాదిరిది. నిన్నటి రోజున దట్టంగా పెరిగిన చక్కటి, చిక్కటి జీవితం ఆవిడది. ఎన్ని వసంతాలు చూచిందో. పుట్టిన పిల్లల్ని ఎంత ప్రేమగా పెంచిందో. తాను తినక పోయినా అందరి కలి తీర్చిన తల్లి. నిండైన జీవితంలో మునిగి తేలింది. మరి ఈ రోజున తనతో భర్త రాలేదా? తోడు లేని నీడ అయిందేమో! పాపం, మరి పిల్లల సంగతేమిటి? వాళ్ళూ అంతే, వాళ్ళ పెళ్ళాల చేతుల్లో కీలు బొమ్మలు గాబోలు. వక్కర్తే ఎక్కడకు వెళ్తుందో! ఏదో ఒక కోడలు గర్భిణి అయితే, ప్రసవించే రోజులు దగ్గర కొస్తున్నాయని, భార్యకు చాకిరి చేసేందుకు కొడుకు పిల్చాడేమో! అందుకని వెళ్తుందా ఈవిడ. ఇంకా పీక్కు తింటూనే ఉన్నారా పిల్లలు-దయా దాక్షిణ్యాలు లేని రాక్షసులు.

అమ్మా, నువ్వెవరవు? అందర్నీ క్షమించే భూమాతవా? నేను చూడలేను చిన్ని, చిన్ని బస్సు కుదుపులకు పెద్దపెద్ద అలలుగా నువ్వు అటూ ఇటూ ఒరగడం. నువ్వు సముద్రానివా? ఎలా బ్రతుకు తున్నావమ్మా వీళ్ళ మధ్య-చూస్తూ కండ్లు లేని వాళ్ళ మధ్య. చేసేదేమి లేక నా మాదిరిగానే నువ్వునూ నిర్లిప్తంగా చూస్తున్నావా. ఎంత వోపిక నీకు. నిన్ను చూస్తుంటే నీవు గడిపిన, గడుపుతున్న జీవితం నాకు - ఆదర్శప్రాయంగా ఉండాలని నా ఆకాంక్ష. నిన్ను చూచి నమస్కారం పెట్టాలి అందరూ. ఓరిమికి నువ్వు ప్రతి రూపానివి. అయినా నిన్ను ఎవరు లెఖ్ఖ చేస్తారులే! నీ సుఖం అక్కర్లేదు బస్సులో వాళ్ళకు, బస్సు బయట ఉన్నవాళ్ళకు గూడా అక్కర్లేదు.

గుడివాడ దగ్గరకు వస్తున్నట్లున్నది. రైసు మిల్లులు కన్పిస్తున్నాయి. కాలేజి దగ్గరకొచ్చింది ప్రపంచానికి అవసరమైన యువతతో నిండిన కాలేజి. గుడివాడ బస్సు స్టాండులో ఆగింది బస్సు. చెక్కెరకేళీలు అమ్ముతున్నాడు బస్సు కిటికీ అవతల నిలబడి. సపోటాలు తియ్యగా, పానకంలా ఉంటాయట - అంటున్న మాటలు అంత తియ్యగా ఉన్నా,యి. సపోటాలు అలాగే ఉంటాయా? యేమో!

బస్సు దిగాను-బస్సులో ఇమడని నేను. ఎవరో, ఎవరో దిగిపోయారు నామాదిరిగా గుడివాడలో. - లావుపాటి ఆవిడ, తనతో పాటు ఉన్న ఇద్దరు, ఈ పెద్దావిడ దిగలేదు. వీరందరూ ఏ ఊళ్ళో దిగుతారో! నాప్రయాణం అయింది. వాళ్ళది ఇంకా సాగుతున్నది.

# కొయ్య కన్ను

- అఫ్సర్

అతన్ని రోడ్డు దాటిస్తున్న
ఆ కర్ర చప్పుడు
నా వెనక నీడలాగా
తెరుచుకొనే వున్న అతని చూపు కింద
ప్రపంచం ఒక శూన్యపు గులక రాయి

గిరగిరా తిరుగుతూనే వుంటుంది
అనేకార్థాల
అనేక వర్ణాల చక్రంలాగా
అతని కళ్ళకింద పొందిగ్గా
వొదిగి కూర్చున్న వాటి అర్థాల కోసం
వెతుక్కుంటూ వుంటాను

అసలు అర్థం ఏమిటా అని
అదే పనిగా శోధిస్తూ వుంటాను
ఈలోపు అతను రోడ్డు దాటి వెళ్ళిపోయాడు

నేను
రోడ్డు మధ్యలో
చిక్కు బడి పోయాను
కొయ్యబారిన కన్నుతో

## హిమగిరితనయే ....

- *ఓరుగంటి గోపాలకృష్ణ*

బిర్లామందిర్ మెట్లెక్కుతున్నాడు చంద్రశేఖర్. పైమెట్టు దగ్గరికి వచ్చేసరికి ఆయాసం వచ్చింది. కాసేపు స్తంభాన్ని ఆనుకుని నిల్చున్నాడు. అతనికి ఏభై తొమ్మిదేళ్ళు. కాసేపు నిల్చున్న తరవాత అలుపు తీరినట్టయి, ప్రదక్షిణ చెయ్యబోయాడు. అప్పుడు కనుపించింది ఆమె. అప్పుడే దర్శనం కానిచ్చుకుని, ప్రసాదం చేతిలో పెట్టుకుని బయటకు వస్తోంది. ఆమెతో పాటు ఒక యువకుడు వున్నాడు. ఆమె ముఖంలో మంచి వర్చస్సు. ఎక్కడో పరిచయం వున్న పోలికలు. అలా తేరిపార చూడ్డం సభ్యత కాదనిపించి తల పక్కకి తిప్పుకోబోతున్న సమయంలో ఆమె కూడా అతని వైపు యధాలాపంగా తల ఎత్తి చూసింది. ఇద్దరి దృక్కులూ క్షణకాలం కలుసుకున్నాయి. ఆమె చూపులో కూడా అదే భావన.... చాలా పరిచయం అయిన ముఖమే ఇది అన్నట్టుగా.

చంద్రశేఖరం తల పక్కకు తిప్పుకుని ప్రదక్షిణకి ఉపక్రమించాడు. మనసులో అంతా ఆమె ముఖమే మెదులుతోంది.తప్పకుండా ఆ ముఖం తనకు తెలుసును. ఎక్కడ చూశాడో గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. విశాలమైన ముఖం, తిన్నని ముక్కూ, పెద్ద కళ్ళూ, గుండ్రని బొట్టు, అక్కడక్కడ నెరసిన జుట్టు రెండు మూడు పాయలు, కొద్దిగా వంకులు తిరిగిన ముంగురులు... ఆ ముఖములో అందమూ ఆకర్షణా, తేజస్సుతో కూడిన ఒక ప్రశాంతత వున్నాయి.

దేముడి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, ఆమె వున్న దగ్గరికి చేరుతున్నప్పుడల్లా యధాలాపంగా చూసినట్టు అటువైపు దృష్టి మళ్ళించి చూశాడు. ఆమె కూడా తననే చూస్తూ వుండటం గమనించాడు. అలా ఎన్ని సార్లు ప్రదక్షిణ చేశాడో గుర్తులేదు. ఆమె ముఖంలో కొంచెం చిరునవ్వు కనిపించినట్టనిపించింది. బహుశా తను చాలాసార్లు పిచ్చివాడిలా ప్రదక్షిణ చెయ్యడం ఆమె గమనించి వుంటుందని, ఇక బాగుండదని దర్శనానికి వెళ్ళాడు.

మనసులో ఓ మూల ఆమె గురించే ఆలోచిస్తూ దేముడికి దండం పెట్టుకుని, తీర్థం, ప్రసాదం తీసుకుని బయటకు వచ్చాడు. పైవరుస మెట్లు దిగాక కుడివైపున ఇంకొన్ని మెట్లు వున్నాయి. వాటిమీద కూర్చుని ఆమె కోసం వెదక బోతుంటే దూరం నుంచి ఆమె తనవైపే రావడం చూశాడు. ఆమె దగ్గరగా వచ్చి, 'మీరు... మీ పేరు చంద్రశేఖర్ కదూ!' అని అడిగింది.

ఆ గొంతులోంచి బయల్దేరిన శబ్దతరంగాలకి అతని వూహల దొంతర్లలో ఎక్కడో ప్రకంపన కలిగింది.

"జలజలమని కురిసింది వాన, జాల్వారింది అమృతంపు సోన". మారుమూల జ్ఞాపకాల గదిలోంచి మున్నెన్నడో మరచిన తియ్యని కవితొక్కటి ఆకారం దిద్దుకున్నట్టయ్యింది...అప్రయత్నంగా..."హైమవతి!"అన్నాడు.

'అవును' అన్నట్టుగా ఒక ప్రశాంతమైన చిరునవ్వు నవ్వింది ఆమె.

'తుహిన కిరణ కోమలరేఖవో వెలుదీవెవో... ఎవ్వతెవీవు?' - నిద్రించిన భావుకత్వం నింగికెగయగా మూడు దశాబ్దాలనాటి, ముఖారవిందంతో మౌలికం చేస్తూ, "హైమవతి... నువ్వు... మీరు హైమవతి కదూ!" అన్నాడు.

'అవును, నేను హైమవతినే. గుర్తొచ్చానే' మాటలో ఎక్కడా ఎత్తిపొడుపు లేదు. స్వచ్ఛమైన చిరునవ్వు మాత్రమే వుంది. ఒడిదుడుకుల సంసారంలో అశాంతి, అల్లకల్లోలాలతో తల్లకిందులైన తన జీవితంలో తన మనసులో మాత్రమే నిక్షిప్తమైపోయిన భావుకత్వానికి ఓ ప్రేరణగా, ఊహాలోకాల్లోనైనా అశాంతిని తాత్కాలికంగా మరచిపోయేటట్టు జేసిన తన భావాంబర వీధి విస్తృత విహారిణి, ఇన్నాళ్ళకి మున్నెదుట సలక్షణంగా ప్రత్యక్షమైతే ఉద్వేగం ఉప్పెనై చెలరేగింది. అతని హృదయంలో కలిగే భావ సంచలనపు చాయలు ముఖంలో ప్రస్ఫుటంగా ప్రతిబింబించాయి. ఆ సంచలనం సహజమే అన్నట్టుగా ఆమె నిశ్శబ్దంగా నిలుచుంది.

ఏనాటి హైమవతి!. కాకినాడలో బాలాత్రిపురసుందరి గుడి దగ్గిర ముప్ఫై సంవత్సరాల క్రితం తను ఇంజనీరింగు పాసయి పెళ్ళిచూపులకని వాళ్ళింటికి వెళ్ళాడు. అమ్మాయి అందంగా వుంది. బి.ఎ. పాసయింది. తనకి బాగానే నచ్చింది. కానీ అమ్మాయి తండ్రి పౌరోహిత్యం చేసేవారు, పెద్దగా ఆస్తి అంతస్థు లేని కుటుంబం అని తన తలిదండ్రులకి ఆ సంబంధం అంతగా నచ్చలేదు. ఎవరో మధ్యవర్తి ద్వారా వచ్చిన సంబంధం, మొహమాటంకొద్దీ వెళ్ళి చూశారు. తీరా వెళ్ళాక అతి సాధారణంగా వున్న ఇంటి వాతావరణమూ

చూసి, జాతకాలు కుదరలేదని కారణం చెప్పి వదిలేశారు. తను కూడా అడ్డు చెప్పలేదు.

ఆ అమ్మాయికి మాత్రం తను బాగా నచ్చినట్టనిపించిది. పెళ్ళిచూపుల్లో ఒక పాట పాడమని అడిగితే "హిమగిరితనయే హేమలతే...." అంటూ తన్మయత్వంతో పాడింది. కానీ తన తల్లిదండ్రులే-'అబ్బాయి పెద్ద ఇంజినీరు, అమ్మాయి కనీసం ఏ ప్రొఫెషనల్ కోర్సులైనా చేసి వుంటే బాగుంటుంది. బొత్తిగా బి.ఎ....అందులోనూ తెలుగులో... మా అబ్బాయికి ఏ డాక్టరో ఇంజినీరో చూస్తున్నాం' అని మధ్యవర్తి ద్వారా తెలిపారు. తను కూడా అంతగా పట్టించుకోలేదు. తల్లిదండ్రులు చెప్పినట్టు వినేసి ఊరుకుండిపోయాడు.

పెళ్ళిచూపులయిన కొన్ని రోజులకి ఆ అమ్మాయి తన తమ్ముడి ద్వారా చంద్రశేఖర్కి ఒక కబురు పంపింది. తనని వచ్చే శనివారం గుడిలో కలుసుకొమ్మని. చంద్రశేఖర్ వెళ్ళాడు. హైమవతి ముందర చాలా మొహమాటంగా క్షమాపణలు చెప్పింది, 'ఇలా కలుసుకోమని కబురు పంపినందుకు మరోలా అనుకోవద్ద'ని. ఆమె స్వతంగా చేసిన గ్రీటింగు కార్డు ఒకటి శేఖర్ చేతికిచ్చింది. మొదటి పేజీలో ఆమె వేసిన రేఖా చిత్రం...సముద్రకెరటాలు, పైన ఒక చిన్న మేఘం వెనకాల నుంచి బయటకు వస్తున్న సూర్యకిరణాలు. లోపల 'నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు..' అని రాసి వుంది. తాను అది చదివి ముఖంలో ఏ భావమూ వ్యక్తపరచి వుండక పోవచ్చు..... అది గమనించి... "తిలక్... దేవరకొండ బాలగంగాధర్ తిలక్... కవితలు చదివారా మీరు?" అని అడిగింది.

"లేదు" అని తను చెప్పినప్పుడు కొంచెం నిరాశ చెందినట్టనిపించింది ఆమె ముఖం. నేనెందుకు రమ్మన్నానంటే....అమ్మాయిలు ఇలా చెప్పవచ్చునో లేదో నాకు తెలియదు. కానీ, చెబుదామనే నిర్ణయించుకున్నాను. నాకు మాత్రం మీరు నిజంగా నచ్చారు.... అందుకోసమే ఆఖరిసారిగా నా ప్రయత్నం. మీకు ఆశ్చర్యంగా వుండొచ్చు... పెళ్ళిచూపులకి వచ్చిన అబ్బాయిని ప్రేమించడం అన్నది కొంత అసహజంగా, తాత్కాలికమైన ఆకర్షణేమో అన్న అనుమానం నాకే వచ్చింది... 'వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో... మహాశ్చర్యంబు చింతించగన్' గలగలా నవ్వేసింది.

'అందుకనే చాలా సంశయించాను. ఎందుకో మీతో ఒక్కసారి మాట్లాడి... 'లోటు రానీయనున్నంతలోన నీకు... రమ్ము దయచేయు మాత్మపీఠమ్ముపైకి' అని నా మనసులో మాట చెప్పాలనిపించింది...'.

ఆమె అలా చెబుతున్నా అతనిలో చలనం ఎందుకు కలగలేదో! ఏ పూర్వజన్మ సుకృతమో ఆమెని కలిసే అవకాశాన్ని కలిగిస్తే, ఏ మహా శనో నెట్టనెదుట నిలచి అతన్ని స్తబ్దుణ్ణి, మృత్పిండుణ్ణీ చేశాయి.

గడచిన ఇన్నేళ్ళలో ఎన్నో సార్లు ఆనాటి ఆ అమ్మాయి రూపు గుర్తు తెచ్చుకున్నాడు, సన్నని జరీ అంచు వున్న ఆకుపచ్చ వెంకటగిరి కాటన్ చీర, తలంటుపోసుకుని కొంచెం వదులుగా వేసుకున్న పొడుగాటి జడలో కనకాంబరాలు, మరువము కలిసిన మల్లెపూదండ, నుదుట ఎర్రని గుండ్రని బొట్టు, రెండు చేతులనిండా గాజులు, కుడిచేతికి పసుపుకొమ్ము కట్టిన దీక్ష. కాళ్ళకి పసుపు పారాణి, చిన్నగా కదిలే మువ్వలపట్టీలు, బాలాత్రిపురసుందరిలా వుంది.

తరువాత కొద్దికాలానికే తనకి ఎంబిఏ పాసయిన సంబంధం కుదిరి కొంతకాలానికి లండను వెళ్ళిపోయాడు.

తనకిప్పుడు ఏభైతొమ్మిదేళ్ళు, అంటే ఈమెకి ఇంచుమించు ఏభైనాలుగు వుంటాయి. అయినా ఆమె ముఖంలో ఎంత అందమో! వున్న వయసు కంటే పదేళ్ళు తక్కువగా ఆమె, పదేళ్ళు ఎక్కువగా తానూ కనుపిస్తున్నారు. మంత్రముగ్ధుడిలా ఆమెనే చూస్తూ జ్ఞాపకాల వెల్లువలు పెల్లుబుకుతుంటే... నిశ్చేష్టుడై పోయాడు చంద్రశేఖర్.

కాసేపటికి... తేరుకుని మెల్లిగా "చాలా ఆశ్చర్యంగా వుంది కదూ... మళ్ళీ మనం ఇలా గుళ్ళో కలవడం" అన్నాడు.

'అవును. చెప్పండి, మీరెలా వున్నారు? ఎక్కడున్నారు? మీ కుటుంబం ఎక్కడుంది? మీ అమ్మా నాన్నగార్లు కులాసాగా వున్నారా?' అని అతని కళ్ళల్లోకి చూస్తూ చాలా కలుపుగోలుగా అడిగింది.

చంద్రశేఖరంకి తానెలా వున్నాడో ఏమని చెప్పాలో అర్థం కాలేదు. జీవితం ఎన్ని మలుపులు తిరిగిందో ఎలా చెప్పగలడు ఇంత తక్కువ వ్యవధిలో? ఎన్నోసార్లు అనుకున్నాడు, ఎప్పుడైనా ఆమె కనబడితే స్వచ్ఛమైన నిజాయితీతో మాట్లాడాలనీ, భేషజంతో అబద్ధాలు చెప్పకూడదనీ.

'చెబుతాను, కానీ, ముందర మీ విషయాలు

చెప్పండి. ఎక్కడ వుండటం? మీ ఆయన ఏం చేస్తూ వుంటారు? ఎంతమంది పిల్లలు, మీరేంచేస్తూ వుంటారు?..' అని ఆమెనడిగాడు.

"మీరు నన్ను మీరూ అని సంబోధించొద్దు. నువ్వూ అనండి. అలాగేనా?" అని చనువుగా అంది.

"అలాగే" అని ఒప్పేసుకున్నాడు. ఇంత సాన్నిహిత్యం ఎప్పుడేర్పడింది? ఊహల్లో ఎన్నోసార్లు మాట్లాడి దగ్గరయ్యాడా తను?

"మీతో కలిసిన కొన్నాళ్ళకి నాకు చక్రపాణితో పెళ్ళయ్యింది. ఆయన కార్డియాలజిస్టు. అమెరికా వెళ్ళిపోయాను.

ఆస్టిన్‌లో వుంటాము మేము. ఇద్దరు పిల్లలు, పెద్దవాడు 'మోహనవంశి', అమ్మాయి 'నిహారిక'.

అబ్బాయి నాతో ఇక్కడే... కింద పుస్తకాల షాపులో వున్నాడు. ప్రస్తుతం ఆస్టిన్‌లో అసిస్టెంటు ప్రొఫెసర్ గా పని చేస్తున్నాడు. విడిగా హఠయోగ పాఠశాల ఒకటి పెట్టి అందరికీ యోగా, మెడిటేషనూ నేర్పిస్తాడు. నేనే వాడి ప్రధమ శిష్యురాలిని...గత పదేళ్ళుగా" అని గలగలా నవ్వేసింది.

"అమ్మాయి ప్రిన్స్‌టన్‌లో చదివి ఇప్పుడు యునైటెడ్ నేషన్‌లో పని చేస్తోంది. దగ్గర్లోనే న్యూయార్కు సిటీలో వుంటోంది. ఇంకా పెళ్ళి కాలేదు. తనకి ప్రపంచాన్ని ఓ సిగ్నేచర్‌తో, ఓ పాలసీతో మార్చేయాలన్న తపన. నేను మాత్రం ఏ ఉద్యోగమూ చేయకుండా హాయిగా ఇంట్లో కూర్చుని, నా సాహిత్యమూ సంగీతమూ వెలగపెడుతూ వుంటాను. పొద్దున్నే లేచి సంగీతం మొదలుపెట్టి, మావారు వద్దనేదాకా మార్నింగ్ రాగాస్, నూన్ రాగాస్, ఈవినెంగ్ రాగాస్ అంటూ అబ్బాయినీ కోడలునీ విసిగించేస్తూ వుంటాను... సర్లెండి మీరడిగింది తడవు, నా సొదంతా గడగడా చెప్పేసాను. మా ఆయన అంటారు. నీ స్నేహితులు కనిపిస్తే నీలో చతుష్షష్టి కళలూ పైకొస్తాయని. ఇన్నాళ్ళకి మీరు కలిసిన ఆనందం మరి. మీరు చెప్పండి మీగురించి..."

ఆమె గొంతు వింటుంటే ఎంతో హాయిగా వుంది. తన జీవితానికి ఆమె జీవితానికి ఎంత కాంట్రాస్ట్!

శేఖర్ కాసేపు కూగి చెప్పాడు... హైమవతిని కలిసిన కొన్నాళ్ళకే తనకి బాంబేలో ఎంబిఎ చదివిన అమ్మాయితో పెళ్ళవడమూ, లండన్ వెళ్ళి తను లండన్ మెట్రో రైల్‌లో ఎలెక్ట్రికల్ ఇంజనీరుగా పని చేయడమూ, కొడుకు ఆనాల్, అమ్మాయి కరిష్మా పుట్టడమూ, కొడుకు కాలేజి వదిలేసి ఇండియన్ గ్రాసరీ షాపు పెట్టి అది పని చెయ్యక, ప్రస్తుతం ఇండియన్ రెస్టారెంటు బిజినెస్సు పెట్టడమూ, తనతో పనిచేస్తున్న పోలిష్ అమ్మాయిని పెళ్ళి చేసుకుని విడిగా వెళ్ళిపోవడమూ, కూతురు ఒక బ్రిటిష్ బాయ్ ఫ్రెండుతో కలిసి వుండటమూ, ఇంట్లో మనస్పర్ధలూ, దెబ్బలాటల మధ్యలో తన వుద్యోగం పోవడమూ, భార్య తనకి విడాకులిచ్చేసి, ఒక పంజాబీ రెస్టారెంటు బిజినెస్ మేన్‌తో వెళ్ళి పోవడము.... అన్నీ నిబ్బరంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా చెప్పాడు.

హైమవతి మాట్లాడకుండా, ముఖంలో ఏ భావనా కనుపించకుండా జాగ్రత్తగా వింది.

చివరిలో శేఖర్ అన్నాడు "నే ఎగిరిన జీవ విహంగం, నా పగిలిన మరణ మృదంగం...". గబుక్కున హైమవతి అతని చెయ్యి పట్టుకుని ఆపేసింది.

"మిమ్మల్ని కించ పరచడం కోసమని అడగ లేదు..." ఇంకా ఏదో చెప్పబోతుంటే శేఖర్ వారించాడు.

"హైమవతీ, ఎన్ని సార్లో నా ఊహల్లో మెదిలావు. ఇన్ని కలతల్లోనూ నాకు నీ ఊహలే ఆలంబన అయ్యాయి...." ఇంకా ఎన్నో చెప్పాలనుకున్నాడు కానీ తన్నుకొస్తున్న ఆలోచనల కెరటాలలో ఊగిసలాడి పోయాడు. మాటలుకన్నా మనసు ముందుకి పరుగెట్టి గొంతుకి అడ్డుపడింది. కానీ మళ్ళీ ఈ అవకాశం రాదు... ఎంత తపించిపోయాడో ఈ అవకాశం కోసమని... ఎప్పుడైనా కనిపిస్తే ఒక్కటి అడగాలనీ, తను ఒక్కసారి ఆమె గొంతులోంచే మళ్ళీ వినాలనీ...

"హైమవతీ, నువ్వేమనుకోనంటే ఒక విషయం అడగనా? ఒక్కసారి... హిమగిరి తనయే హేమలతే.... పాట పాడవా?"

అతని మనసులో ఎప్పుడో కలగవలసిన చలనం, ఒక జీవితకాలం ఆలస్యంగా కలిగింది....

హైమవతి శేఖరం ముఖంలోకి దీర్ఘంగా చూసింది. అప్పుడు గమనించింది అతని కన్నుల్లో సన్నని నీటి పొరనీ, దాని కింద కన్నీటి కెరటాలనీ, ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో ప్రళయ ప్రభంజనాలనీ, ముడుతలు పడిన ముఖంలో ఎండిపోయిన నెగళ్ళనీ, గుండె సంద్రంలో బడబాగ్నినీ. చంద్రశేఖరం గళంలో హాలాహలం కనుపించింది. మండిపోతున్న గుండెల్ని చల్లపరచటానికి శిరస్సున గంగమ్మ మాత్రం కనుపించలేదు. అర్థం అయ్యింది. తానొక చిన్ని చినుకై, మంచుతునకై

అతనిమీద కురిస్తే తప్పులేదని నిశ్చయించుకుంది. పరిసరాలను లెక్కచెయ్యకుండా, ధ్యాన నిమగ్నయై, నెమ్మదిగా కన్నులు మూసుకుని, గొంతు సవరించి మొదలుపెట్టింది...

"హిమగిరితనయే హేమలతే... అంబ ఈశ్వరి శ్రీ లలితే..."

గగనపథవిహార గంధర్వ సమసంగీత ఝురి ఒక్కటి చినుకై, వానై, వరదై, వెల్లువై, కల్లోలమై పెల్లుబికింది. కరడు గట్టిన కఠిన కుటిల నిరంకుశ నిరాశ, నిస్తేజిత స్తబ్ధతలో ఉత్తేజ జాహ్నవి ఉరకలెత్తింది. అతని మనసాక ఇక్షు సముద్రమైపోయింది. శుద్ధధన్యాసిలో ధన్యమై పోయిన ప్రాణశక్తి విశుద్ధిచక్రంలో ప్రవేశించింది. ఆదితాళంలో అనాహత చక్రం అధిరోహించింది.

పాట అయిన తర్వాత కొంతసేపటి వరకూ నిశ్శబ్దం... ఆమెకు తెలుసును, వేడెక్కిన ఎడారిలో వాన పడితే ఆవిరి పైకెగసి కమ్ముకుంటుందని... మెల్లిగా అతని చెయ్యి తాకింది. ఆ తర్వాత ఆ చేతిని తన రెండు చేతుల్లోనూ తీసుకుని ఆర్ద్రతతో నొక్కింది. అతని చేతివేళ్ళు కూడా ఆమె అరిచేతి చుట్టూ బిగుసు కున్నాయి. అలా ఎంతసేపో వుండిపోయారు... మౌనంగా.

దూరంగా అబ్బాయి మోహనవంశి తమ వైపు రావడం ఇద్దరూ గమనించారు. హైమవతి తన చేయి పట్టు సడలించే ప్రయత్నం చేయలేదు. చంద్రశేఖరం మాత్రం కంగారుగా చెయ్యి వదిలించుకోడానికి ప్రయత్నించాడు. ఆమె అతని చేతిని మరింత గట్టిగా పట్టుకుని "ఏమీ ఫరవాలేదు" అన్నట్టుగా మౌనంగా కళ్ళతోనే చెప్పింది.

ఇంతలో ఆ అబ్బాయి తల్లి దగ్గరికి వచ్చాడు. హైమవతి శేఖరం చేయి ఇంకా పట్టుకునే "మా అబ్బాయి- మోహనవంశి. వంశీ, ఈయన నా చిన్ననాటి స్నేహితులు... చంద్రశేఖరం గారు" అని పరిచయం చేసింది.

"నమస్కారమండీ" అని వంశి కొంచెం తల వంచి నమస్కరించాడు.

శేఖరం తన కుడి చేయిని హైమవతి చేతుల్లోంచి విడిపించుకుని, గొంతు సవరించుకుని "నమ.... నమస్కారం..." అని అనగలిగాడు. వంశి, తన తల్లికేసి చూసి, "అమ్మా, నేనింకా కాసేపు ఆ బుక్ స్టాల్‌లో వుంటాను అని చెప్పడానికి వచ్చాను" అన్నాడు.

"అలాగే, నేనటు వస్తాలే!" అని హైమవతి అంది. శేఖరానికి మళ్ళీ నమస్కారం చేసి వంశీ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. ఆ అబ్బాయిలో వుట్టిపడుతున్న అందానికీ, మర్యాదకీ ముగ్ధుడైపోయాడు శేఖరం.

'మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి' అని మనసులోనే అనుకున్నాడు. మోహనవంశి! నీహారిక! ఎంత మంచి పేర్లు పెట్టుకుంది పిల్లలకి! ఆ పేర్లు వింటుంటే గుండెలు పుల్కరించిపోయాయి.

అలా హైమవతి చేతుల్లో తన చెయ్యి వుంచి... మౌనంగా ఎంతోసేపో వుండిపోయాడు.ఆ సాయంకాలం అతని మీద అమృతమే కురిసింది. హైమవతి కూడా సమయంతో నిమిత్తం లేదన్నట్టుగా....నిశ్శబ్దాన్ని కానుక ఇచ్చింది అతనికి.

ఆఖరికి మెల్లగా అన్నాడు...' 'అనంత చైతన్యోత్స వాహ్వాన్ని వినిపించుకోలేకపోయాను...." ఆమె గబుక్కున తలెత్తి అతని కన్నుల్లోకి చూసింది.

"తిలక్....దేవరకొండ బాలగంగాధర తిలక్... అమృతం కురిసిన రాత్రిలోనిది..." ఇంక మాట పెగల్లేదు. హిమగిరి కరిగి గంగమ్మే గొంతులో ఉరికిందో, అమృతమే గుటక వేసాడో మరి!".

# తీరిక

- నోరి రాధిక

గుడిలో నుండి వేంకటేశ్వర సుప్రభాతం గట్టిగా వినిపించడంతో నిద్రమెలకువ వచ్చేసింది సమయకి. 'ఆలస్యం అయినట్టుంది. టైమెంతయిందో? బోలెడన్ని పనులున్నాయి తాతయ్య పూజ మొదలెట్టాసారేమో! అనుకుంటూ వులిక్కిపడి లేచి, గబగబా స్నానం ముగించి పూలబుట్టతో తోటలో అడుగు పెట్టింది. ధనుర్మాసం చలి బయట బాగా ఉంది. ఇంకా చీకటిగానే ఉంది. తోటలో ఇంకా లైట్లు ఉన్నా పగటి వేళంత స్పష్టంగా కనిపించడంలేదు. ఆమె పూలు కోయడం మొదలు పెట్టిన అయిదు నిమిషాలకి పరుగు పరుగున వచ్చాడు నూకరాజు "నన్ను పిలవలేదేమిటి అమ్మాయిగోరు" అనుకుంటూ. "ఫరవాలేదులే! నిద్రపోతున్నావేమో, నిన్ను లేపడం ఎందుకని.... " అని సమయ ఇంకా ఏదో అనబోతుంటే "అయ్యయ్యో! నిద్రేమిటమ్మా! సీకట్లో పురుగు, పుట్ర వుంటాయని పెద్దయ్యగారు పూలు కోసేంత వరకు మీకు తోడుగా ఉండమన్నారు. మీరొక్కరూ ఇలా పూలు కోస్తున్నారని తెలిస్తే నన్ను సంపేత్తారు" అన్నాడు భయంగా. "సరేలే! నన్ను ఏ పురుగో, పామో కరుస్తుందన్న ఆరాటం కంటే తాతయ్య నిన్నెక్కడ తిడతారోనన్న భయమే ఎక్కువగా వున్నట్టుంది" నవ్వుతూ అంది సమయ.

ఆమె పూలు కోయటం పూర్తి చేసుకొని వచ్చేసరికి పూజ గదిలో ఆమె తాతగారు, బామ్మగారు పూజ మొదలు పెట్టేసారు. గబాగబా పూల బుట్టను అక్కడ పెట్టి వంటింట్లోకి వెళ్ళి ప్రసాదం వండడం మొదలు పెట్టింది. పూజ, నైవేద్యం అన్నీ అయిన తర్వాత తిరుప్పావై లోని పద్యం ఒకటి రాగయుక్తంగా చదివింది. ధనుర్మాసం ముప్పైరోజులూ రోజుకొక్కటిగా తిరుప్పావై లోని పద్యాలు చదవటం, నైవేద్యంకోసం రోజు చక్రపొంగలి చేయటం ఆమెకి అలవాటే! అంతా అయిన తర్వాత తీర్థం, ప్రసాదం తీసుకుని పూజగదిలోంచి బయటకు వచ్చింది. "ఎంత బాగా పాడావే తిరుప్పావై పద్యం! ఏదో, నీ చదువు అయిపోయి ఇంకా వుద్యోగం అంటూ ఏదీ మొదలు పెట్టలేదు కాబట్టి నీకు కాస్త ఈ పూజలకీ, పాటలకీ, పద్యాలకీ టైం దొరొకుతోంది కానీ లేకపోతే ఈ పూజలు చేయటానికి, ప్రసాదాలు వండటానికి నీకు తీరికుంటుందా?" అన్నారు బామ్మ గారు సమయ వైపు మురిపెంగా చూస్తూ. అప్పటికి తెల్లవారిపోయింది. వంటావిడ వచ్చి వంట ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు. "సమయమ్మా! ఇవాళ వంట ఏంచేయమంటావు?" అని అడిగారు ఆవిడ. ఆ పూటకి ఏం చేయాలో ఆవిడకి అన్నీ చెబుతూ "పనస పొట్టు కూరలో ఆవఘాటు కొంచెం తక్కువగా వేయండి. పిన్నిగారు! పోయినసారి ఆవ ఎక్కువై వేడి చేసిందనుకున్నారు తాతయ్య" అంది సమయ. ఆవిడ అలాగే అన్నట్లుగా తలూపుతూ "ఏదో ప్రస్తుతం నువ్వు తీరికగా వున్నావు కాబట్టి ఇంత సేపు నాతో ఇలా వంటలూ, వార్పూ మాట్లాడటానికి నీకు కుదిరింది కానీ రేపు ఏదన్నా ఉద్యోగం అంటూ మొదలుపెడితే నాతో మాటలు కాదు గదా, నేను చేసింది తింటానికి కూడా సమయం వుండదు నీకు" అంది ఆవిడ మళ్ళీ. "అంతదాకా ఎందుకు? అబ్బాయికి ఇపుడు వీలు కాదన్నారని ఆగాము కానీ ఈ మాఘమాసంలో దీనికి కూడా ఆమూడుముళ్ళూ వేయించేసే వాళ్ళం కదా! అప్పుడు వాళ్ళక్కలాగా తను కూడా అత్తవారింట్లో ఏలేది రాజ్యం" అంది వాళ్ళమ్మ అప్పుడే అక్కడికి వస్తూ.

సమయ సిగ్గుపడుతూ అక్కడి నుంచి లేచి హాల్లోకి వచ్చేసరికి అక్కడ ఇల్లు వూడుస్తూ పారు కనిపించింది. "పారూ! ఇలారా" అంటూ దానితో బయట తోటలోకి నడిచింది సమయ. మొక్కలకి నీళ్ళు పోస్తూ కనిపించాడు నూకరాజు అక్కడ. నూకరాజూ! నువ్వు కూడా ఇలారా. ఇంట్లోమాట్లాడితే నాన్నకి, తాతయ్యకి తెలుస్తుందని పారుని కూడా ఇక్కడికే తీసుకొచ్చాను. పారూ! నువ్వు కూడా ఇలారా. ఇప్పుడు చెప్పండి ఇద్దరూ. ఏమిటి మీ పోట్లాట అసలు? పని పాట లేదా అస్తమానూ ఇలా కీచులాడుకోవటం తప్ప? "నూకరాజూ! నువ్వేమిటి పారుకి డబ్బులివ్వకుండా సతాయిస్తున్నావట? ఇంట్లో ఖర్చుకి డబ్బులివ్వకపోతే ఎలా నడుస్తుంది ఇల్లు? ఏం చేస్తున్నావు నీ జీతం?" అని అడిగింది సమయ. "అలా గట్టిగా అడగండి అమ్మాయిగోరూ! ఎప్పుడడిగినా లేదంటాడు. ఏం సేస్తున్నాడో జీతం అంతా మీరైనా గట్టిగా నిలదీయండి అంటోంది" పారు. "ఏడిసావులే! ఏమిటి సేసేది? నోరు మూసుకో" అంటూ పెళ్ళాం మీద గదమాయిస్తూ "అదేం కాదు అమ్మాయిగోరూ!

మొన్ననే పాతిక రూపాయలిచ్చా. మళ్ళీ నన్న రాత్రి డబ్బులడిగితే ఎట్టా అమ్మాయిగోరూ? మీరే సెప్పండి. అసలు డబ్బులతో ఏం సెత్తుందో, ఏ సోకులకి తగలెడుతోదో, నన్ను కాదు దాన్నడగండి" అన్నాడు నూకరాజు సమయతో. సమయకి వాళ్ళిద్దరికి నచ్చజెప్పి, వాళ్ళ దెబ్బలాట తీర్చి, ఇద్దరినీ ఒక ఒప్పందం లోకి తీసుకొచ్చేసరికి తల ప్రాణం తోకకొచ్చేసింది. "చిన్న పిల్లలైపోతున్నారు ఇంకెప్పుడూ ఇలా ఇద్దరూ కొట్టు కోకండి. పెద్దయ్యగారికి తెలిస్తే చంపేస్తారు. అని చివరికి ఇద్దరికీ ఏదో ఒప్పందం చేసి "వెళ్ళవే వెళ్ళి నీ ఇల్లు ఊడవటం పూర్తి చేసికో. నూకరాజు! నువ్వుకూడా నీమొక్కల పని పూర్తిచేసుకో" అంటూ పారుని, నూకరాజుని పంపించేసి ఇంట్లోకి నడిచింది సమయ. నూకరాజుని కేకలేసి మందలించినందుకు పారుకి సంతోషంగా ఉంది. "మీరు కొలువేది సేయకుండా ఇంట్లోనే వున్నారు కామట్టి నా గోడు వింటానికి తీరిక దొరికింది. లేకపోతే మీరు దొరుకుతారా?" అంది సమయతో. నూకరాజుకి కూడా సమయ పారుని మందలించినందుకు చాలా సంతోషంగా ఉంది. "అమ్మాయిగోరూ ఇంటికాడే వున్నారు కామట్టి తన గోడు ఇంటున్నారు లేకపోతే ఆమెగారికి తీరికెక్కడిది అనుకున్నాడు మనుసులో.

సమయ హాల్లోకి వచ్చేసరికి బయట ఆఫీసు రూము దగ్గర ఎవరో ముగ్గురు గుమాస్తాగారితో మాట్లాడుతూ కనిపించారు. "సమయమ్మా! ఒక్కసారి ఇలా వస్తావా?" అని ఆయన పిలిస్తే ఆఫీసు రూములోకి వెళ్ళింది. "వీళ్ళు మన అరటి గెలలు కొనటానికి వచ్చారమ్మా. దానికి సంబందించిన వివరాలన్నీ మొన్న చెప్పాను మీకు. contract అదీ తీసుకొచ్చారు ఇప్పుడు" అన్నారు ఆయన సమయతో. సమయ వారికి నమస్కారం చేసి ఆ contract అంతా గబాగబా చదివింది. contract అంతా last year లాగానే ఉందిగా! కొత్త clause లేవీ లేవుగా!" అంటూ "అంతా సరిగ్గానే వుంది. నాన్నగారికి చూపించండి. సంతకం చేస్తారు" అంది.

"మంచిదమ్మా" అని ఆయన వాళ్ళతో వెళ్ళబోతూ ఉంటే "బాబాయి గారూ! ఆ pest control వాళ్ళకి ఫోను చేసి చెప్పాను. రేపు వాళ్ళ మనషులను పంపుతామన్నారు. వాళ్ళు వచ్చి తోటలో spray చేస్తున్నపుడు కాస్త దగ్గరెవరన్నా వుండేట్లు చూడండి. ఇదే టైము కనక అయితే మాత్రం నేను కూడా రాగలను" అంది మళ్ళీ. "అలాగే నమ్మా, నేను పిలుస్తాలే వాళ్ళు వచ్చినప్పుడు" అన్నాడు ఆయన. "పెళ్ళి, ఉద్యోగం అంటూ ఇంకా ఏది లేదు కాబట్టి నీకు ప్రస్తుతం ఇవన్నీ చూసుకోవడానికి తీరిక ఉంది. లేకపోతే ఇవన్నీ అయ్యగారే చూసుకోవాలి" అన్నాడు ఆయన సమయతో.

సమయ లోపలికి వెళ్ళగానే బామ్మగారు ఎదురు చూస్తున్నారు సమయ కోసం. "సమయా! ఇలా రావే, కాస్త ఈ వుత్తరం రాసిపెట్టు. మళ్ళి మీ తాత, నాన్న భోజనాలంటూ వస్తారు. అన్నారు సమయని చూడగానే. అలాగే బామ్మా" అంటూ సమయ కాగితం, కలం తెచ్చుకొని వచ్చింది వుత్తరం రాయటం కోసం. బామ్మ గారికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు ఆ రోజుల్లోనే ప్రేమవివాహం చేసుకొన్నాడు. అప్పటికి ఆయన తర్వాత ఇద్దరు అమ్మాయిలకూ ఇంకా పెళ్ళికాలేదు. అయినా కాబోయే అత్త మామలు ఒత్తిడి చేస్తున్నారని ముందు తను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అప్పటినుండి ఏదో తెలీని కారణం, సంకోచం వలన కుటుంబానికి కొంచెం దూరం అయ్యాడు. అదీకాక వ్యాపారంలో బాగా ఆర్జిస్తూ తన కుటుంబంతో కొంచం దూరన వుంటాడు. తల్లితండ్రులు, తోబుట్టినవారి గురించి ఆలోచన కొంచం తక్కువని, ఎంతసేపూ తను, తన సంసారం గురించే చాలా ఆలోచిస్తాడని, బాధ్యతలని తోసిరాజని తన సుఖం చూసుకున్నాడని, స్వార్ధపరుడని ఆయనంటే సమయ తండ్రికి కోపం, అందుకే చిన్న కొడుకైనా తల్లితండ్రులని తన దగ్గరే పెట్టుకున్నాడు. అక్కచెల్లెళ్ళకి మంచి సంబంధాలు చూసి వైభవంగా పెళ్ళి చేయడంలో తండ్రికి చేదోడు వాదోడుగా వుండటమే కాకుండా పండగలకి, పబ్బాలకి వాళ్ళని తమింటికి ఆహ్వానిస్తాడు. ఇది అని చెప్పటానికి ప్రత్యేకంగా ఏమీ కారణం లేకపోయినా అన్నదమ్ములిద్దరి మధ్యా ఈ విధమైన ఒక గుప్త యుద్ధం నిశ్శబ్దంగా జరుగుతోంది. అందుకే ఆయన తల్లి చిన్న కొడుక్కి తెలియకుండా సమయ చేత అప్పుడప్పుడు పెద్ద కొడుక్కి వుత్తరాలు రాయించుకుంటుంది. "పాపం, తల్లి ప్రేమ. ఇద్దరి కొడుకుల మధ్య నడుస్తున్న ఈ అకారణ స్పర్థలలో అనవసరంగా బామ్మ, తాతయ్య నలిగిపోతున్నారు. తాతయ్య మగవారు కాబట్టి బింకంగా వుంటారు. పాపం. బామ్మ ఆడది కాబట్టి ఇలా బయట పడుతూ వుంటుంది. ఏదో అప్పుడప్పుడు తమకిష్టం లేని పనులు చేసారని తల్లిదండ్రులు పిల్లల్ని వదులుకుంటారా

ఏమిటి? అనుకుంటూ వాళ్ళ బామ్మ మీద జాలి పడుతూ వుంటుంది సమయ. "చెప్పు బామ్మా" అంది వుత్తరం రాయటానికి సిద్ధంగా కూర్చుని. ఆమె వుత్తరం రాయటం పూర్తి చేసి stamp అతికించటానికి లోపలికి వెళ్ళబోతూవుంటే "వుద్యోగం, పెళ్ళిఅంటూ భాధ్యతల్లో ఇంకా ఇరుక్కోలేదుకాబట్టి ప్రస్తుతం నీకు ఇలా వుత్తరాలు రాసిపెట్టడానికి తీరిక వుంది. పెళ్ళయిన తర్వాత అత్తవారింటికి వెళ్ళిపోతే అప్పుడు మీ అమ్మనే అడగాలి నేను నా పని కాస్త చేసి పెట్టమని" అన్నారు బామ్మగారు సమయతో. "అమ్మ రాసిపెడుతుందిలే బామ్మా" అంది సమయ.

"బామ్మగారూ! మీరు, పెద్దయ్యగారు భోజనానికి వస్తారా? వడ్డిస్తాను" అన్నారు వంటావిడ. వంట అయిపోగానే బామ్మగారికి, తాతగారికి మడిగా వడ్డించి ఇంటికి వెళ్ళిపోతారు ఆవిడ. మిగిలిన వారందరి భోజనాలు ఆ తర్వాత చూసుకునేది సమయే! ఆ పనులన్నీ చూసుకొని పారు, నూకరాజులకి కూడా అన్నం పెట్టి వంటింట్లో అన్నీ సవరించి బయటకు వచ్చేసరికి వంటింటి ముందు వసారాలో ఆమె తల్లి ఎదురు చూస్తోంది సమయ కొరకు. "సమయా! స్టోర్ రూంలో పెద్ద స్టీల్ డబ్బాలు పెట్టాను, ఇలా తీసుకురా. ఈ కరిగిన నెయ్యి మళ్ళీ పేరుకునే లోపల మినపసున్ని చేయాలి" అంది ఆవిడ. మినపసున్ని సన్నాహాలన్నీ పూర్తి చేసుకుని. సమయకి అప్పుడు గుర్తొచ్చింది. భోజనాలయిన తర్వాత ఆరోజు చెయ్యటానికి agenda లో వాళ్ళు పెట్టుకున్న పని, ఎనిమిది నెలల క్రితం పెళ్ళి చేసి పంపించిన సమయ అక్క అప్పుడు మొగుడితో పాటు మొదటి సంక్రాంతికి పుట్టింటికి వస్తోంది. ఆమెతో పాటు ఆమె మేనత్తలు కూడా వస్తున్నారు. వీరందరికి సారెకు ఇవ్వటానికి మినపసున్ని చేయాలి. "వంటావిడ ఎలాగో వీలు చూసుకొని చేయమని అడుగుతానంటే వద్దన్నావు. ఇప్పుడుచూడు కనీసం మూదువందలన్నా మినపసున్ని లడ్డూలు చేయాలి. అంతసేపు కూర్చుని లద్దూలు కట్టాలంటే నా నడుం నొప్పి పెడుతుంది. ఇంకా చలిమిడి బూంది లడ్డూ ఎప్పుడు చేయాలి? అంది ఆవిడ సమయ మీద విసుక్కుంటూ. "అబ్బ విసుక్కోకమ్మా, పాపం, పిన్నిగారు కూడా తన కూతురు, కొత్తల్లుడితో బిజీగా వున్నారని మినపసున్ని మేమే చేసుకుంటాం అన్నాను. ఒక్క రెండు రోజులైన తర్వాత బూంది లడ్డు, చలిమిడి ఆవిడే చెస్తానన్నారులే. అప్పుడు నేను కూడా సహాయం చేస్తానన్నాను" అంది సమయ మినపసున్ని చేయటం మొదలు పెడుతూ. "ఇప్పుడంటే పనిపాట ఏమీలేక కావలసినంత తీరిక కాబట్టి ఇవన్నీ చేయటానికి సిద్ధం అయ్యావు. రేపు పెళ్ళయి నీవు కూడా మీఅక్కలాగా వెళ్ళిపోతే అప్పుడు మా పనివాళ్ళతో మా తిప్పలేవో మేమే పడాలి" అంది ఆవిడ తనుకూడా మినపసున్ని చేస్తూ. కానీ మినపసున్ని చేయడం మూడొంతులు పూర్తి అయిన తర్వాత "ఇంక నా వల్ల కాదు సమయా! కాస్త నడుం వాల్చనిదే నేను మనిషిని కాను. ఇది రేపు పూర్తి చేద్దాంలే" అంటూ సమయ తల్లి వెళ్ళిపోయింది కాస్సేపు పడుకోవటానికి. ఆ మిగిలిన పని కూడా పూర్తి చేసి మినపసున్ని డబ్బాలన్నీ గట్టిగా మూత పెట్టి స్టోర్ రూంలో సర్ది బయటకొస్తుంటే అప్పుడే లోపలికి అడుగు పెడుతున్న వంటాయన కనిపించారు.

"ఇంట్లోకి అడుగు పెడుతుంటే అన్నపూర్ణ దర్శనం అయింది. సమయమ్మా! ఎలా వున్నావు? అన్నాడు ఆయన పలకరింపుగా. "బాగానే వున్నాను. మీరెలా వున్నారు బాబాయిగారూ! ఇవాళ రేపట్లో నేనే మీకు కబురు పెడదామనుకున్నాను". అంది సమయ ఆయనకు నమస్కరిస్తూ. "నాకు తెలుసమ్మా! నువ్వేమీ కబురు పెట్టనక్కరలేదు. శ్రీరామనవమి దగ్గరకొస్తుంటే గుళ్ళో పెద్దయ్యగారు చేయించే అన్నదానం సంగతి ఎలా మర్చిపోతాను?" అన్నారు ఆయన. "నువ్వు తీరికగా ఇంట్లో వున్నావు కాబట్టి ఈ పనులన్నీ చేస్తున్నావు. నీ పెళ్ళయిన తర్వాత ఇవన్నీ చిన్నయ్యగారే చూసుకోవాలి" అన్నారు మళ్ళీ. సమయ సమాధానం ఏదీ చెప్పలేదు. ఆయనతో ఆ అన్నదానం సమయంలో చేయవలసిన వంటకాల సంగతి మాట్లాడి "ఒక్కసారి అమ్మ, బామ్మతో కూడా మాట్లాడండి. ఇప్పుడు పడుకున్నారు" అంది. తర్వాత ఆయనను పపించి లీపలికి bedroom లోకి వెళితే అక్కడ రామకోటి పుస్తకాలు కనిపించాయి. అవన్నీ లెక్కపెట్టి బీరువాలో పెడుతూ "ఇంకా లక్షన్నర రాయాలి, అమ్మకు చెప్పాలి, శ్రీరామనవమి లోపు చకచకా పూర్తి చేయమని" అనుకుంది మనసులో. "అమ్మాయిగోరూ! post అబ్బాయి వచ్చాడండి" అని పారు చెప్తే బయటకు వచ్చింది సమయ. Register post లో వచ్చిన parcels అన్నీ లెక్క పెట్టుకొని సంతకం చేసి అతన్ని పంపించేసింది. ఇంతలో మధ్యాహ్నం కునుకు ముగించి లేచి వచ్చిన బామ్మగారు అడిగారు "సమయా! ఏమిటి ఆ డబ్బాలు? ఎవరు పపించారు వాటిని అన్నారు

"నెయ్యి డబ్బాలు బామ్మా! బెంగుళూరులో ఒక dairy farm వాళ్ళు ఆవు పాలు, ఆవు నెయ్యి అమ్ముతారు. వాళ్ళ దగ్గర నుండి ఆవు నెయ్యి తెప్పిస్తున్నాను" అంది సమయ. "ఆవు నెయ్యా? ఎందుకు" అని అడిగారు బామ్మగారు అయోమయంగా. "ఎందుకేమిటి బామ్మా! ఆవు నెయ్యితోనేగా లక్షవత్తుల నోము చేస్తారు! మరి నువ్వు, అమ్మ చేయబోయే లక్షవత్తుల నోముకి నెయ్యి కావద్దూ" అంది సమయ "అందుకా! అయినా ఇన్నా?" అని ఆవిడ ఆశ్చర్య పోతూవుంటే" మరి రెండు లక్షల వత్తులు కాల్చటానికి కావద్దూ ?" ఇంకా వాళ్ళు ప్రస్తుతం కొన్నేపంపించారు. మిగిలినవి డబ్బాలు మళ్ళీ పంపుతారు" అంది సమయ.నూకరాజు సహాయంతో అవన్నీ లెక్కపెట్టి కొట్టుగదిలోని spare refrigerator లో పెట్టించింది.

మధ్యాహ్నం నిద్ర పోయిన వాళ్ళు మెల్లగా అందరూ లేచి వస్తున్నారు. సమయ వంటింట్లోకి వెళ్ళి అందరికీ కాఫీలు పెట్టింది. స్టీల్ డబ్బాలోంచి తీసి అందరికీ కాజాలు, జంతికలు ప్లేట్లలో సర్ది అందించింది అందరికీ. "సమయా! నువ్వు కాఫీ బాగా కలుపుతావమ్మా. ఇప్పుడంటే తీరికగా ఇంట్లో వున్నావు కాబట్టి మధ్యాహ్నం కాఫీల పని నువ్వు చూస్తున్నావు. లేకపోతే మీ అమ్మే చూసుకోవాలి ఇదంతా. కాఫీ ఇంత బాగా పెట్టడం ఎలాగో మీ అమ్మకీ, బామ్మకీ కూడా నేర్పు" అన్నారు తాతయ్య. "మనవరాలంటే ఎంత ప్రేమ వున్నా మరీ అంత పక్షపాతం చూపించటం అన్యాయం మామయ్యా! మాకామాత్రం కనీసం కాఫీ కలపడమన్నా రాదా?" నవ్వుతూ అంది సమయ తల్లి. అందరూ నవ్వుకున్నారు.

సమయ కాఫీలు, టిఫిన్ల పని ముగించేసరికి పారు ఒక పెద్ద బుట్ట నిండా గోరు చిక్కుడుకాయలు తీసుకొచ్చింది తరగటానికి "మన పొలం గట్టున కాసాయమ్మా, లేతగా చాలా బావున్నాయి. రేపటి కూరకి వలిచి సిద్ధం చేస్తానని వంటక్కకి చెప్పాను" అంది సమయతో. అవన్నీ తను కూడా గబగబా వలుస్తూ ఆ గోరుచిక్కుడు కాయలన్నీ చకచకా తరగడంలో సహాయపడింది సమయ.

"పారూ ఈ పని అయిందిగా! ఇంక నీ పుస్తకాలు తెచ్చుకో. నిన్న చెప్పిన ఆ లెక్కలు చేసావా? ఏదీ చూపించు" అంది సమయ పారుతో. ఏమీ మాట్లాడకుండా అక్కడే నిలబడ్డ పారుని చూస్తూ "ఏమిటలా నిలబడ్డావు ఏమీ చెప్పకుండా? చదువంటే నీకు నచ్చదు. డబ్బులెక్కలు సరిగ్గా చెప్పటం లేదు. అబద్దాలాడుతున్నాడని నూకరాజు మీద పోట్లాడతావు. మరి నువ్వు లెక్కలు నేర్చుకుంటే ఆ తిప్పలేవీ ఇంక వుండవుగా! పద, పద, త్వరగా రావాలి" అంటూ సమయ పారుని వత్తిడి చేసి ఆమె చేత పుస్తకాలు తెప్పించి లెక్కలు చెప్పటం మొదలుపెట్టింది. ఇంతలో సాయంత్రం వంట కోసం వంటావిడ మళ్ళీ వచ్చారు. ఆ పూటకి ఏం చేయాలో చెపుతూ "చపాతీలకి పిండి కలిపి పెట్టండి పిన్ని గారూ! రాత్రి భోజనం చేసే ముందు నేను వేడివేడిగా చేసి పెడతాను. ఇప్పుడు మీరు చపాతీలు వత్తక్కరలేదు" అంది సమయ. ఆమె వంటింట్లోంచి బయటకు వస్తోంటే తండ్రి పిలుపు విని బయటకు వచ్చింది. "ఈ డబ్బు లోపల దాచమ్మా, నరసరాజు పంపించాడు" అంటూ ఆయన ఒక పెద్ద bag ని ఇచ్చారు సమయకు. సమయ దాన్ని అందుకొని లోపలికి తీసుకెళ్ళి బీరువాలో పెట్టే ముందు ఒక్కసారి bag తెరచి చూసింది. డబ్బంతా వంద నోట్లలో వుంది. లెక్కపెట్టి పుస్తకంలో లెక్కరాసి, తారీకు వేసి డబ్బంతా భద్రంగా పద్దుపుస్తకంతో పాటు బీరువాలో పెట్టి బయటకు వచ్చింది. "ఇవాల్టి డబ్బు ౮౦ వేలు వుంది నాన్నా. నరసరాజు అంకుల్ ఇంకా ౪౫౦౦౦ ఇవ్వాలి" అని తండ్రికి లెక్క చెపుతూ గుర్తు చేసింది. "అవునమ్మా, ఆ లెక్కలన్నీ ఫోనులో చెప్పాడు. వడ్డీ లేకుండా ఇంత డబ్బు సహాయం చేసి అవసరంలో ఆదుకున్నామని, పాపం, ఎప్పుడూ పొగుడుతూ వుంటాడు. ఈ డబ్బు వ్యవహారాలన్నీ నువ్వే చూసుకుంటావని ఇప్పుడంటే సమయ తీరికగా వుంది కాబట్టి ఇవన్నీ చూసుకుంటోంది, లేకపోతే ఇవన్నీ నువ్వే చూసుకోవాలి అని నాకు ఎప్పుడూ చెపుతూ వుంటాడు" అన్నాడు ఆయన. మూడేళ్ళ క్రితం నరసరాజుగారి వ్యాపారంలో నష్టం వచ్చి ఆయన పరిస్థితి almost దివాలా తీసేదాకా వస్తే వెంటనే తండ్రిని ప్రోద్బలం చేసి ఆయన చేత అయిదు లక్షలు అప్పు ఇప్పించింది సమయ. దాంతో వ్యాపారాలన్ని నిలబెట్టుకుని కాస్త నిలదొక్కుకున్నాడు - ఆయన. కూతురులాంటి సమయ చేసిన సహాయం ఆ-యన ఎప్పుడూ మరిచిపోలేదు.

"బామ్మా! అమ్మా! తయారవండి. గుడికి వెళ్దామన్నారుగా! మీరుకూడా వస్తారా? అంటూ బామ్మని, అమ్మని హెచ్చరించి తాతగారిని అడిగింది సమయ. అందరూ తయారయి సాయంత్రం గుడికి బయలుదేరారు. "పెద్ద కారు కావాలి. లేకపోతే అందరికీ

చాలదు" అని వాళ్ళు అనుకుంటూ వుండగానే సమయ గరాజులోంచి పెద్దకారు బయటకు తీసుకొచ్చి వాళ్ళముందు పెట్టింది. డ్రైవరు సీటులో కూర్చున్న సమయను చూస్తూ "డ్రైవరు ఏమయ్యాడమ్మా? నువ్వెందుకు drive చేస్తున్నావు?" అని అడుగుతున్న తాతయ్యతో "వాళ్ళబ్బాయికి జ్వరంగా వుందట తాతయ్యా. నేనే ఇంటికి పంపించేసాను. మిమ్మల్ని అందరినీ తీసికెళ్ళటానికి నేను వున్నాను కదా!" అంది సమయ. "అమ్మాయిగోరూ! ఇప్పుడి మీకు కావలిసినంత తీరిక కాబట్టి డ్రైవరన్న పనికూడా మీరే సేత్తుండారు. లేకపోతే పెద్దయ్యగారికి సిక్కే మరి" అన్నాడు నూకరాజు. "అందుకే నీకు డ్రైవింగు నేర్పిస్తానంటే నువ్వేమో భయం అంటావు. భయం లేదు, ఏమీ లేదు, రేపటినుండి మధ్యాహ్నం నా దగ్గర driving నేర్చుకోవాలి నువ్వు" అంది సమయ నూకరాజుతో "మళ్ళీ ఆ పని కూడా నీకేనా? ఏదన్నా driving school లో చేర్పించవే" అంటున్న బామ్మగారితో "స్కూలు గీలు వద్దండీ పెద్దమ్మగోరూ. అమ్మాయిగారైతేనే నేర్చుకుంటా" అన్నాడు సనుగుతూ నూకరాజు. "సమయ అయితే వాడి ఆటలు చెల్లుతాయని అలా అంటున్నాడు" అంటున్న తల్లితో "అదిగాదండీ సిన్నమ్మగోరూ, అమ్మాయిగోరూ తీరిగ్గా వుండగా వుత్తగా డబ్బు ఖర్చు ఎందుకని...." అంటూ గొణిగాడు. "నీ మొహం" అంటూ అందరూ నవ్వారు.

వీళ్ళందరూ గుడికి వెళ్ళేసరికి ధనుర్మాసం పర్వ దినాలు కాబట్టి గుడి అంతా జనంతో కోలాహలంగా వుంది. సమయ తాతగారు వచ్చారని అందరూ ఆయనకు నమస్కరిస్తూ ముందుకు వెళ్ళటానికి తోవ ఇస్తున్నారు. ఆయన పూర్వీకులే ఆ గుడిని కట్టించారు. వారి కుటుంబ క్షేమం కోసం ప్రత్యేకమైన అర్చనలు చేయించి ప్రసాదం తింటూ అందరూ గుడి ఆవరణలో కూర్చున్నపుడు "మీరందరూ ఇక్కడే వుండండి, ఇప్పుడే వస్తాను" అంటూ సమయ పూజార్ల quarters వైపు చకచకా నడిచింది. ఒక పావుగంటలో తిరిగొచ్చిన సమయను "ఎక్కడికెళ్ళావే? వెయ్యి గుళ్ళ పూజారివి, మళ్ళీ ఎవరు కనిపించారు?" అని అడిగింది బామ్మగారు. "అత్తయ్యగారితో మాట్లాడటానికి పూజారి మామయ్యగారింటికి వెళ్ళాను బామ్మా. ఇంకో వారం రోజుల్లో రెండు లక్షల వత్తులు చేయటం పూర్తి అవుతుందని చెప్పారు" అంది సమయ. "చాలా రోజులనుండే సేత్తున్నారు కదూ అమ్మగోరూ" అంటున్న పారుతో, అవునే! ఒకటా? అరా? రెండు లక్షల వత్తులంటే మాటలా? బామ్మ, అమ్మ చేయబోయే లక్షవత్తుల నోముకి ఇద్దరికీ కలిసి మొత్తంరెండు లక్షల వత్తులు కావాలి. అదృష్టం కొద్దీ అత్తయ్యగారు చేసి పెడతానన్నారు కాబట్టి బతికాము" అంది సమయ. కాసేపట్లో అందరూ ఇంక ఇంటికి వెళ్ళడానికి లేచారు. ఇంతలో అక్కడికి పూజారిగారితో పాటు గుడి మేనేజరుగారు కూడా వచ్చారు. సంక్రాంతికి జరగబోయే గుడి anniversary special ప్రోగ్రాముల గురించి, శ్రీరామనవమినాడు జరగబోయే సీతారాముల కల్యాణం గురించి వారితో తాతయ్య, తండ్రితో బాటు సమయ కూడా మాట్లాడింది. "సమయమ్మకి ఇపుడు తీరిక కాబట్టి ఇవన్నీ మాట్లాడటానికి టైము దొరుకుతోంది. ఆ తర్వాత ఇంక గుడికి ఇంటికి రావటానికి కూడా తీరిక వుంటుందో లేదో" అన్నారు మేనేజరుగారు. అందరూ నవ్వుతూ లేచారు.

ఇంటికి వెళ్తున్నపుడు దారిలో బజారులో నగల కొట్టు ముందు కారు ఆపింది సమయ. "మళ్ళీ ఇక్కడెందుకు ఆపావే? నీతో బయటకొస్తే ఇంతే! ఇలా ప్రతిచోటా ఆగుకుంటూ నీ పనులన్నీ పూర్తి చేసుకొని ఇంటికి చేరేసరికి ఆ పుణ్యకాలం కాస్తా గడిచిపోయి తాతయ్యకి భోజనానికి ఆలస్యం అయ్యేటట్లుంది" విసుక్కుంటూ అంటున్న తల్లితో "అక్కకి మనం ఇద్దామనుకున్న కెంపులసెట్టు పూర్తి అయ్యిందో లేదో కనుక్కున్నానమ్మా. లాకెట్టు డిజైను నేను కొంచెం మార్చమన్నాను కదా! అది ఎలా చేసాడో, ఎలా వుందో చూసి వచ్చాను" అంది సమయ. "తొందరగా తీసికెళ్తాలే అమ్మా. తాతయ్యకి ఆలస్యం కాదు" అంటూ వేగంగా అందరినీ ఇల్లు చేర్చింది సమయ. ఇంట్లోకి అడుగు పెడుతూనే చకచకా చపాతీలు చేసి వేడివేడిగా చపాతీలు అందరికీ భోజనాలు ఏర్పాట్లు చేసింది. భోజనాలు చేస్తున్నపుడు "నాన్నా! ఆ ricemill లో ఏవో రెండు మెషిన్లు పాడయినాయన్నారు. వాటి సంగతేదో చూసారా ఇవాళ? అని అడిగింది తండ్రిని. "రేపు వస్తాడమ్మా వాటి సంగతి చూసే మనిషి. ఏమంటాడో చూడాలి" అన్నాడు ఆయన. అందరికీ భోజనాలు అయిన తర్వాత పారు, నూకరాజులకి కూడా అన్నం వడ్డించి వంటిల్లంతా సవరించి బయటకొచ్చింది సమయ. బామ్మ, తాతయ్య ఆమె కోసం ఎదురు చూస్తున్నారు. "రా సమయా నీ కోసమే నిద్ర ఆపుకొంటున్నాం"

అన్నారు ఆమెను చూస్తూనే. "నా కోసం కాదులే తాతయ్యా నేను చదివబోయే రుక్మిణీ కల్యాణం కోసం" అంది నవ్వుతూ సమయ పురాణం చదవటం కోసం పుస్తకం తెచ్చుకుంటూ. ఆమె రాగయుక్తంగా చదివిన ఆ రుక్మిణీకల్యాణం పద్యాలను ముగ్ధులై విన్నారు వారిరువురూ. "సమయా! నీ గొంతులో అమృతం వుందే! అర్ధయుక్తంగా ఎంత బాగా పాడావు ఆ పద్యాలన్నీ!" అన్నారు బామ్మగారు పరవశంగా సమయను మెచ్చుకుంటూ. "పెళ్ళి కావలిసిన పిల్లలు రుక్మిణీ కల్యాణం చదివితే త్వరగా వారికి ఆ కల్యాణ గడియలు తోసుకు వస్తాయంటారు. అందుకేగా నువ్వు సమయ చేత రుక్మిణీ కళ్యాణం చదివిస్తున్నావు. స్వామి కార్యం, స్వకార్యమూనూ" అన్నారు తాతయ్యగారు. "ఏటన్నిటి పుణ్య ఫలమే దానికి బంగారం లాంటి వరుడిని సంపాదించి పెట్టింది.విరించి ఎంతో మంచి వాడు. ఇంక చాల్లే సమయా! వెళ్ళి పడుకో, మళ్ళీ రేపు పూలకోసం తెల్లవారుఝామున లేస్తావు. చాల్లే తల్లీ, వెళ్ళి పడుకో" అన్నారు బామ్మగారు సమయ వైపు ఎంతో మెరిపెంగా చూస్తూ. వారిద్దరికీ గుండెలదాకా దుప్పటికప్పి, లైటు ఆర్పి, night light on చేసి తన రూములోకి వెళ్ళింది సమయ. పక్కమీద వాలి ఏదో పుస్తకం చదువుదామని చేతిలోకి తీసుకుంటే కళ్ళు మూతలు పడతం మొదలుపెట్టాయి. ఇంతలో ఫోను మోగింది. నిద్రలోకి జారుతున్న సమయ ఒక్కసారి ఉలిక్కిపడి, రిసీవరు చేతిలోకి తీసుకొని మెల్లగా హలో అంది. అవతలి వైపు నించి విరించి సమయా అంటున్నాడు. విరించి గొంతు విని ఒక్కసారి లేచి కూర్చుంది సమయ. "విరించీ! ఎలా వున్నావు?" అంది సంభ్రమంగా. "బాగానే వున్నాను" అన్న విరించి సమాధానం పట్టించుకోకుండా "నీ thesis accept అయిపోయిందా? నీ graduation ఎప్పుడు? ఆ మధ్య చేసిన నీ job interview ఏమైంది?" అంటూ గబగబా అడిగింది. విరించి పెద్దగా నవ్వాడు. "my god! ఒకేసారి ఇన్ని ప్రశ్నలా! అన్నిటికీ కలిసి సామూహిక సమాధానం చెప్తున్నాను, విను. అంతా బాగానే జరిగింది. ఇంకో పది రోజుల్లో PHD చేతికి వచ్చేస్తుంది. రాబోయే semister నుండి ఒక యూనివర్సిటీలో faculty లో join అవుతున్నాను" అన్నాడు సంతోషంగా. ఇంతలోనే అతని గొంతు చాలా మెత్తగా మారింది. "సమయా! ఇప్పుడు మన పెళ్ళికి ఇంకే ఆటంకమూ లేదు. మంచి ముహూర్తము చాడమని మా నాన్నకు చెప్తాను." మంద్రస్థాయిలో ప్రేమగా అన్నాడు విరించి. సమయకి సిగ్గు చాలా ముంచుకొచ్చింది. ఆమె దగ్గరనుండి ఏ సమాధానము రాకపోయే సరికి "సమయా! వింటున్నావా? ఏం చేస్తున్నావు? నిద్ర పోతున్నావా అప్పుడే"? అన్నాడు. "లేదు లేదు నిద్ర పోవటం లేదు, వింటున్నాను నీమాటలు. అయినా అప్పుడే నిద్రా అంటావేమిటి? మీ అమెరికాలో ఇప్పుడు పగలు కాబోలు. కానీ మాకు రాత్రి పదకొండు దాటింది తెలుసా"? అంది సమయ. "సరేలే ఇంతకీ నువ్వు నేను చెప్పిన కోర్సులకో చేరావా, లేదా? చదవటం మొదలుపెట్టావా, లేదా?" అన్నాడు ఆరాగా విరించి. సమయ కొన్ని సెకన్లపాటు సందేహించింది. తర్వాత మెల్లగా "లేదు" అంది తటపటాయిస్తూ. "లేదా ఇంకా మొదలుపెట్టలేదా? సమయా! నిన్ను వెంటనే ఆ కోర్సులలో చేరమని గట్టిగా చెప్పానా? లేదా? అవన్నీ చేస్తేనే ఇక్కడ మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశం వుంది. నువ్వు త్వరగా అవన్నీ పూర్తిచేస్తే ఇక్కడికి వెంటనే రావటానికి ఇంక ఏవిధమైన అడ్డంకులూ వుండవు. అయినా అసలు ఇంకా ఎందుకు మొదలుపెట్టలేదు ఆ కోర్సులు? రోజంతా ఏమీ పనిపాటా లేకుండా తీరికగానే వుంటావు కదా! ప్రస్తుతం ఉద్యోగం అంటూ ఏమీ లేదుగా! మరి టైమంతా ఎలా గడుపుతావు? టి వి చూస్తున్నావా? బోలెడంత ఖాళీ సమయం వృర్థంగా దాటవేస్తున్నావు. అనవసరంగా జారవిడుచుకున్న సమయం మళ్ళీ తిరిగి రాదు" అన్నాడు విరించి కొంచెం విసుగ్గా, కొంచెం మందలింపుగా. సమయకు ఒక్క క్షణంపాటు ఏమనాలో తెలియలేదు. నీకు చాలా తీరిక అంటున్న విరించి మాటలకి ఒక్కసారి నవ్వొచ్చింది. "విరించీ! కోపం తెచ్చుకోకు. వెంటనే చేరుతాలే. నువ్వేమీ దీనిగురించి అనవసరంగా ఆలోచించకు" అంది నవ్వు ఆపుకుంటూ మెల్లిగా. ఇంకొంచెంసేపు అతనితో మాట్లాడి ఫోను పెట్టేసిన తర్వాత అతని మాటలు గుర్తొచ్చాయి సమయకి. ఆ తర్వాత ఉదయం నుండి తన దినచర్య గుర్తొచ్చింది. ప్రతీవాళ్ళు మాటిమాటికీ తనకి పనేమీ లేదని, బోలెడంత తీరికని గుర్తుచేసేవాళ్ళే! కానీ వాస్తవం ఆలోచిస్తే తనకి ఒక్క క్షణం తీరికకూడా లేదు సరికదా, అసలు ఊపిరి పీల్చుకోవటానికి కూడా సమయం లేదు. ఇంక కోర్సులలో చేరటానికి టైము ఎక్కడ వుంటుంది? ఇలా ఆలోచిస్తుంటే ఎందుకో,

సమయకి మళ్ళీ ఇంకోసారి పెద్దగా నవ్వొచ్చింది. ఆ రాత్రి నిద్రలో కూడా సమయ అప్పుడప్పుడు నవ్వుకుంటూనే వుంది.

## 'ఉగాది'కి స్వాగతం

- కోవెల

మావిచిగురు తొడిగేవేళ
మల్లెమొగ్గ విచ్చుకునేవేళ
మంచుబిందువులు తప్పుకునేవేళ
మది ఆనందంతో చిందులేసేవేళ
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

చిరుజల్లు రాకతో పుడమి పులకరించేవేళ
చిన్నబుచ్చుకున్న చెట్లు చిగురేసేవేళ
అవని పచ్చదనంలో పలకరించేవేళ
ఆమని క్రొత్త అందాలతో విరబూసేవేళ
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

పక్షుల కిలకిలా రావాలతో ప్రకృతి పరవశించేవేళ
కోయిల పాటలో గొంతు కలిపి కూనిరాగం తీసేవేళ
మామిడి తోరణాలతో తలుపులు అలరించేవేళ
రంగురంగుల ముగ్గులతో ముంగిళ్ళు రంజిల్లువేళ
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

ఉగాది పచ్చడి షడ్రుచులతో
పిండివంటల ఘుమఘుమలతో
పండితుల పంచాంగ శ్రవణాలతో
పెద్దచిన్న చేసికొనే సంబరాలతో
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

పలుకుదాం నవజీవనానికి నాంది
కలుపుదాం విరోధితో స్నేహం
పలుకుదాం ఉగాదికి స్వాగతం
పలుకుదాం నవయుగాదికి స్వాగతం!!

## 'ఆశా నా ఆధారరేఖ' ని ఆలంబనగా మిగిల్చిన ఇందిరగారి కవిత

- *నారాయణస్వామి*

ఇందిరగారి కవిత్వం చదివాక మనం ఒక మంచి కవినీ, ఒక అద్భుతమైన భావుకురాలినీ మాత్రమే కాదు - మనకీ మధ్య అరుదుగా కనబడే సామాజిక స్పృహగల ఒక మంచి వ్యక్తిత్వాన్ని కోల్పోయామే అని ఎంతో బాధేస్తుంది. హృదయంలో ఏదో ఒక శూన్యం. గుండె గొంతుకలో అడ్డం పడుతుంది. ఎంత చక్కగా రాసింది కొన్ని కవితలు! కొన్ని మ్యూజింగ్స్ (చలంగారే గుర్తు కొస్తారు) !! గొప్ప సృజనాత్మకత, భావుకత, sentitivity మాత్రమే కాదు తనలో సామాజిక బాధ్యత అణువణువూ కనిపిస్తుంది. మనల్ని కదిలిస్తుంది.

అమెరికాలో ఉన్న మనం సాధారణంగా ఒక 'కడుపులో చల్లకదలని' జీవితానికి అలవాటు పడిపోయి (ఏదో ఒక పెద్ద తుఫాను లాంటి సంక్షోభం మనల్ని కుదిపేస్తే తప్ప) ఇతరుల గురించి, అణగారిన ప్రజల గురించి, హక్కుల్ని కోల్పోయిన వాళ్ళను గురించి ఆలోచించడం మానేస్తాం. ఆలోచించినా ఒక కంటి తుడుపుగానో ఒక మాటవరసగానో, అప్పుడప్పుడు అరకొర మాటల్ని కొన్ని మనం తరచూ కలిసే సందర్భాలలో మాట్లాడేసి తర్వాత మన రొటీనులో మునిగిపోతాము. కాని ఇందిరగారు అట్లా కాదు ఒక గొప్పవేదన, angst దుఃఖంతో బ్రతికిందావిడ. బతికినంత కాలం బహుశ ఒక కనబడని, ఒక కదిలించే వ్యథతో బతికిందేమో అన్నట్టుగా కవిత్వం రాసింది. 'తనకూ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం' అట్లాంటి అంతర్మథనం, యుద్ధం, ఘర్షణ ఇందిరగారు చేసారు. అనుక్షణం తపనతో మథనపడ్డట్టు కనిపిస్తారామె కవిత్వం చదివితే! ఒక గొప్ప ఆర్తి, వ్యధ ఆమె కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. కదిలించే అంతర్లీన దుఃఖం వినబడుతుంది. కవిత్వం మొత్తం చదివాక మన కను కొలకుల్లో నీరు మనకు తెలియకుండా నిండుతుంది. హృదయం బరువెక్కుతుంది. అయ్యో ఇంత సున్నితత్వం, సృజనాత్మకత ఉన్న కవిని కోల్పోయామా అని దిగులేస్తుంది.

అమెరికాలో ఉండే రచయితలు చాలా అరుదుగా పట్టించుకునే అంశాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీల సమస్యలు(స్త్రీగా చెప్పడం) హేతువాదం, సామాజిక బాధ్యత,అణగారిన వారిపట్ల సానుభూతి మాత్రమే కాదు ఒక బాధ్యతతో కూడిన గౌరవం (పైపై సానుభూతి చాలా మంది ప్రకటించవచ్చు) ,ఇక్కడ మన జీవితాల్లోని డొల్లతనం, పరాయీకరణ, ఒంటరితనం, ఏదో కోల్పోయినతనం-ఇవన్నీ చాలా అరుదుగా ఇక్కడి నుండి వచ్చే రచనల్లో కనబడతాయి. ఈ మధ్యే యీ పరిస్థితి మెరుగయ్యింది. కాని ఇందిరగారు మొదటి నుండి అట్లా ఆలోచించిందనడానికి ఎన్నో దాఖలాలు ఆమె కవిత్వం నిండా కనబడతాయి. ఉదాహరణలిస్తూ పోవచ్చుగానీ తను స్త్రీల జీవితాల గురించిరాసినవి మంచి తార్కాణాలు. అట్లా ఆమె జీవితాంతం ఆలోచించింది అనడానికి ఈ కవితాసంకలనం నిండా కవిత్వం ఒక సాక్ష్యం. ఇక్కడి జీవితానికి అలవాటు పడి, ఆకళింపు చేసుకుని ఇక్కడి వాతావరణాన్ని అద్భుతంగా తన కవిత్వంలో ప్రతిఫలింపచేసింది. చాలా మంచి images వర్ణనలూ ఉన్న కవితలు ఎన్నెన్నో ఉన్నాయీ కవితా సంకలనంలో!

మనం ఇక్కడి ప్రకృతిలో మార్పులు చూసి ఆనందిస్తాము, స్పందిస్తాము. కాని వాటి specificities ప్రత్యేకతలను పెద్దగా పట్టించుకోము. కానీ ఇందిరగారు అట్లా కాకుండావాటిని కవిత్వంలో మంచి images గా మార్చేరు. అందుకే ఆ కవితలు మంచి paintings లాగా హృదయానికి హత్తుకునే పద్ధతిలో గాఢంగా ఉన్నాయి. ఏ కవితైనా నిర్దిష్టత నుండి సార్వజనీనతకి ప్రయాణం చేస్తే మంచి కవిత అవుతుంది. కలకాలం నిలబడుతుంది. అట్లాంటి కవితలు ఈ కవితా సంకలనంలో చాలా వున్నాయి. అందుకు ఇందిరగారికి మనఃపూర్వక నివాళులు. 'ఆశ నా ఆధారరేఖ' అని చెప్పుకున్న ఇందిరగారు ఆ ఆధారరేఖ పైనే తన జీవితాంతము కవిత్వం చెప్పారు. స్పష్టమైన ఆశావాదం (optimism) జీవితం పట్ల ప్రేమ అవ్యాజమైన అనురాగంతో పాటు ప్రకృతిని ఆరాధంచే తత్త్వం - ఇవన్నీ కలగలిసిన కవి ఇందిరగారు. ఆమె చివరగా రాసుకున్న అభిప్రాయాల్లాంటి notes చూసాక, మళ్ళీ మళ్ళీ కళ్ళు చెమర్చాయి. బౌద్ధభిక్షువులు స్వర్గానికి పోవాలంటే పురుషులుగానే ఎందుకు జన్మించాలి, రాముడు సంబూకుణ్ణి ఎందుకు చంపాడు. ఇట్లాంటి

notes ఇందిరగారిలో ఉన్న గాఢతని, జ్ఞానాన్ని, లోతైన ఆలోచనలని మనకి అందిస్తాయి. కొంతమంది రచయితల్లా పుస్తకాలు రాసి పారేసి కొంత ఖ్యాతిని, చదివిపారేసి నలుగురిలో పేరు కావాలని కోరుకున్న వ్యక్తి కాదు. చాలా స్పష్టంగా ఒక rebel తత్త్వం, ఒక తిరుగబడే వ్యక్తిత్వం అనుక్షణం ఇతరులకోసం వ్యధ చెందే మనసు, ఇతరుల కష్టాలని తనవిగా భావించి కళ్ళు చెమర్చే హృదయం, అమెరికన్ తెలుగు జీవితంలోని జడత్వాన్ని, డొల్లతనాన్ని, పరాయీకరణని, పట్టించుకోనితనాన్ని, లేని గొప్పలు డాంబికాలు చెప్పుకుని బతికే hypocracy ని, నటనల్ని, మర్యాదస్తుల ప్రపంచాన్ని, insensitivity ని వ్యతిరేకిస్తూ పూర్తిగా భిన్నంగా సాగిన సాహిత్య వ్యక్తిత్వం ఇందిరగారిది. మన మధ్య prosaic గా ఉన్నడొల్లతనపు నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టిన poetry ఇందిరగారిది.

ఇందిరగారు మన మధ్యన లేనందుకు హృదయం బరువెక్కి, కళ్ళు చెమర్చినా ఆమె మనకింత మంచి కవిత్వాన్ని మిగిల్చి వెళ్ళినందుకు ఆనందంగా ఉంది. ఇందిరగారు నిస్సందేహంగా చిరంజీవి. మన మధ్య ఆమె, ఆమె ఆశ ఎల్లప్పుడూ సజీవంగానే ఉంటాయి.

# చంద్రహారం

**- చల్లా సత్యవతి**

గాయత్రీ దేవి మూడు వారాలనుండి జ్వరంతో బాధపడ్తూ మంచంమీదనే వున్నది. ఈరోజు టెంపరేచరు తగ్గినట్లున్నది. చాలా నీరసంగా అనిపించి ఎవరైనా వేడిగా ఒక కప్పు కాఫీ యిస్తే బాగుండును అనుకుంది. కాని యింకా తెల్లవారినట్లు లేదు. పనిపిల్ల "మల్లి" ఆరుగంటలకుగాని లేచి కాఫీ చెయ్యదు. తానే మెల్లగా లేచి ముఖం కడుక్కుని కాఫీ చేసుకుందామని వంటింట్లోకెళ్ళింది. బ్రూకాఫీ డబ్బా ఖాళీగావుంది. పంచదార సీసా మీద మూతలేదు. చీమలు చక్కని క్రమశిక్షణతో బారులుగా వెళ్ళి విందు చేసు కుంటున్నాయి. గాయత్రికి నవ్వొచ్చింది. నాకంటే అవే నయం ఎవరిమీదా ఆధారపడకుండా కష్టపడి తింటున్నాయి అనుకుని చేసేదేమీ లేక మళ్ళీ మంచాన్నాశ్రయించింది.

మేగజైనులో పేజీలు తిరగేస్తుంటే ఫోను మ్రోగింది. ఇంత ప్రొద్దుటే ఎవరా అనుకుంటుంటే మల్లి లేచివచ్చి "హల్లో ఎవరూ" అని రెండునిమిషాల్లోనే పెట్టేసి 'రాంగ్ నెంబరమ్మా' అంటూ లోపలికెళ్ళిపోయింది. అయిదు నిముషాలైనా కాకుండానే మళ్ళీ రింగయితే ఈసారి తానే ఎత్తింది. అవతల వ్యక్తి, "మీరు గాయత్రీ మేడం గారేనా? నేను సూరిని, గుర్తుకు వచ్చానా? మీ అమ్మాయీ, నేనూ ఒకే స్కూల్లో చదువుకునేవారం" అని అన్నాడు. గాయత్రికి అస్సలర్థం కాక మౌనంగా వుండి పోయింది. మళ్ళీ అదే కంఠం, "నేను మీ 'కిరణ్'ని. కాకినాడలో మీఇంటి ప్రక్కన వుండే పూజారి గారబ్బాయిని" అనగానే గాయత్రికి ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి పెల్లుబికి వచ్చాయి.

"నువ్వు... నువ్వు నా కిరణ్వా! ఎక్కడినుంచి ఈ పిలుపు? ఎలా వున్నావు? ఏ చేస్తున్నావు? అన్నీ తెలుసు కోవాలని నామనస్సు ఆతృత పడుతోంది."

"ప్రస్తుతం హైదరాబాదునుండి మాట్లాడుతున్నాను. నేను చాలా బాగున్నాను. ఈరాత్రి బయలుదేరి రేపు మీ ఇంట్లో వుంటాను. సరేనా అపుడన్ని విషయాలు మాట్లాడుకుందాం" అని ఫోను పెట్టేసాడు. గాయత్రి ఆనందంతో తేలిపోతూ మల్లి తెచ్చిన కాఫీ ఒక గుక్కలో త్రాగేసి ఆలోచనలలో పడింది.

తన చిన్నతనం, తల్లిదండ్రుల ప్రేమ, రామమోహన్తో వైవాహికజీవితం, పిల్లలు, ఈ కిరణ్తో అనుబంధం అన్నీ సినిమా రీల్స్ మాదిరిగా మారిపోతున్నాయి. అమ్మా నాన్నలకు ఒకే సంతానం అయినా క్రమశిక్షణతో పద్ధతిగా పెంచారు. తాహతుకు మించినా మంచి స్కూల్లో చదివించారు. తన కుటుంబపు స్థితిగతులు అర్థం చేసుకుని కాలేజీలవైపు మ్రొగ్గకుండా టీచరు ట్రైనింగులో జేరింది. కష్టపడి ఆ కోర్స్ పూర్తిచేసి తన వూళ్ళోనే ఉద్యోగం సంపాదించింది. అదే స్కూల్లో సీనియర్ పోస్టులోవున్న రామమోహన్తో పరిచయం ప్రేమగా మారింది. తల్లిదండ్రులు సంతోషంగా వారి పెళ్ళిచేశారు. అయిదేళ్ళలో ఇద్దరు పిల్లల తల్లయింది. కొడుకుకు వంశీకృష్ణ అని, కూతురుకు సుధీర అని అని పేర్లు పెట్టుకున్నారు. ఇద్దర్నీ ఒకే పద్ధతులతో పెంచినా ఎందుకనో వంశీ చిన్నప్పటినుండీ దుడుకు స్వభావంతో సాటి పిల్లలతో పేచీలకు దిగేవాడు. సున్నిత మైన మందలింపులు పనిచేయలేదు. ఒకసారి ఎదురింటి అబ్బాయితో కొట్లాట పెట్టుకుని చేయి చేసుకుంటే, తండ్రి కలుగజేసుకుని కోపంగా రెండు దెబ్బలువేసి యింట్లోకి లాక్కు వచ్చాడు. వాడు పౌరషపడి ఆ రాత్రి బీరువాలోనున్న వెయ్యి రూపాయలతో మాయ మయ్యాడు. ప్రక్కవూళ్ళలో వెతికించారు. పేపరులో వేయించారు. కాని ఫలితం శూన్యం. గాయత్రి బాగా బెంగపెట్టుకుని, కూతురిమీదే ప్రాణాలన్నీ పెట్టుకుంది.

సుధీర మాత్రం అన్నకు పూర్తి వ్యతిరేకం. చిన్నప్పటినుండి తల్లిదండ్రులను, పరిస్థితులను అర్థం చేసుకొని శ్రద్ధగా చదివి టీచర్ల మెప్పు సంపాదించింది. వారి ప్రక్క ఇంట్లో పూజారి రామ భద్రయ్యగారు కొడుకుతో అద్దెకుండేవారు. సూరి, సుధీర ఒకే క్లాసు చదివేవారు. కలిసే స్కూలుకెళ్ళడం, హోంవర్కు చేసుకోవడం, ఆడుకోవడంతో ఎంతో చనువుగా వుండేవారు.

గాయత్రి కూడా తన తప్పిపోయిన కొడుకుని వానిలో చూసుకుని తృప్తి పడేది. వాడి అందం చూసి 'కిరణ్' అని ముద్దుగా పిలుస్తూ తల్లిప్రేమను అందించేది. రామభద్రయ్య ఆ దంపతులను తాను పూజించే పార్వతీ పరమేశ్వరులుగా భావించేవాడు.

కాని ఆ ఆనందం ఎక్కువ రోజులు మిగలలేదు. ఒక

రోజు కిరణ్ పరుగుపరుగున వచ్చి తమ ఇంటికి తీసుకు వెళ్ళాడు. పూజారిగారు విపరీతమైన ఆయాసంతో బాధ పడుతూ నోటమాట లేకుండా పడివున్నారు. రామమోహన్ డాక్టరుని తీసికొనివచ్చేలోపలే ఆయన ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోయాయి. పాపం కిరణ్ తల్లిదండ్రులు లేని అనాధగా మిగిలాడు. ఇల్లంతా శూన్యమయింది.

కిరణ్‌పై జాలి, కరుణ, ప్రేమలు గాయత్రిలో ప్రవహించాయి. వాడిని దగ్గరగా తీసుకొని 'నువ్వు అనాధవుకావు. మాబిడ్డవు. ఈరోజునుండే మా సుభీరతో సమానం. మా ఇంట్లోనే వుంటావు' అని తనతో తీసుకొని వెళ్ళింది. ఆ మరునాడు వాడి మేనమామ, భార్య వచ్చి కాస్సేపు దుఃఖించి తదుపరి కార్యక్రమాలు పూర్తిచేశారు. పదమూడవరోజు గాయత్రి దంపతులకు కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

'ఇన్నాళ్ళు మీరే వాడి తల్లిదండ్రులుగా మంచీ చెడూ చూశారు. మాబావ ఎప్పుడూ మిమ్మల్ని గురించే చెప్పేవాడు. వీడిని మేము తీసికొని వెళ్ళి, మాకున్నంతలో మా బిడ్డలలో బిడ్డలాగ చూసు కుంటాము. మీరిద్దరూ అపుడపుడు వచ్చి చూసివెళ్తే బిడ్డ బెంగనుండి కోలుకుంటాడు'. అందరికళ్ళూ చెమ్మ గిల్లాయి. కిరణ్ గాయత్రిని పట్టుకుని, వచ్చే ఏడుపుని ఆపుకుందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గాయత్రి పరిస్థితీ అలానేవుంది. ఏమనాలో తోచక, భర్తవైపు చూస్తే ఆయన కూడా నిస్సహాయంగా మౌనం వహించాడు. చటుక్కున గాయత్రికి కర్తవ్యం గుర్తొచ్చి లోనికి వెళ్ళి, తన పెట్టెలో అడుగున భద్రంగా దాచిన చంద్రహారం చేతిలోనికి తీసుకుని కళ్ళకద్దుకుంది. కిరణ్ మేనమామను సమీపించి ఆయన చేతిలో పెట్టి, "నాకున్న విలువైన వస్తువు యిది ఒకటే. కిరణ్ స్కూలు ఫస్టు వస్తాడు. కాలేజీలో చేర్పించండి. ప్రస్తుతం మేము వాడికి చేయగలిగిందింతే. మంచిమనస్సుతో చేసిన ఏ పనైనా సత్ఫలితాలనిస్తుందని పెద్దలంటారు. మీరు చేసిన ఉపకారంవల్ల వీడికి మంచి భవిష్యత్తు వుంటుందనీ, మంచిమనిషిగా ఎదిగి ఎందరికో మంచి కలుగ జేస్తాడని నాకు అనిపిస్తోంది. తర్వాత వాడి అదృష్టం" కిరణ్ తలపై చేయివేసి మనస్సులోనే దీవించి, కన్నీళ్ళాపుకుంటూ వడివడిగా లోనికెళ్ళిపోయింది. ఎవరినోట మాటరాక ఒకరిముఖాలొకరు చూసు కుంటూ వుండిపోయారు. మేనమామ రామమోహన్‌కి నమస్కరించి "జగన్మాతవంటి అమ్మగారి కోరికను తీర్చడాన్కి ప్రయత్నిస్తాను. ఇంక మేము సెలవు తీసుకుంటాము" అన్నాడు. కిరణ్ రామమోహన్ పాదాలు తాకి గాయత్రికి దూరంనుండే వీడ్కోలు చెప్పి వెనుతిరిగాడు.

కాలమే అన్ని గాయాలకు మందు అన్నట్లు అప్పటి దుఃఖ తీవ్రత క్రమంగా తగ్గింది. ఈ పద్దెనిమిది ఏళ్ళలోనూ ఎన్నో సంఘటనలు మంచివీ, చెడ్డవీ కూడా జరిగాయి. సుభీర అన్ని క్లాసులలోను మంచి గ్రేడ్లు సంపాదించుకొని పోస్టుగ్రాడ్యుయేట్ అయింది. తాను ప్రేమించిన బెంగాలీ యువకుడిని పెళ్ళిచేసుకొని అమెరికా వెళ్ళిపోయింది. రామమోహన్ గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు. గాయత్రి వంటరిగా, అనారోగ్యంతో మిగిలింది. అమెరికావచ్చి తమతో వుండమని కూతురికోరిక మేరకు ఒకసారి వెళ్ళి రెండునెలలకంటే వుండలేక పోయింది. వంటరితనం ఇంకా బాధించి తన స్వంతవూళ్ళోనే వుండటాన్కి నిర్ణయించుకొన్నది. ఇరుగుపొరుగు తనని గౌరవంగానే చూస్తారు. పనిమనిషి రమణమ్మ కూతురు మల్లిని చేరదీసి, దానికి చదువు నేర్పించి ఒక ఇంటిదాన్ని చేయాలని ప్రస్తుత ఆశయం. కిరణ్‌ని సుభీరతో సమానంగా ఏలోటూ లేకుండా పెంచి, పెద్దచేసి గొప్పవానిగా చూడాలనే తపన వుండేది. ఇపుడెలా వున్నాడో. కాస్సేపటిలో చూడబోతున్నాకదా! అని తనలోనే అనుకుని నవ్వుకుంది.

తాను ఎదురు చూస్తున్న క్షణం రానేవచ్చింది. ఉదయం ఎనిమిది గంటలకు టాక్సీనుండి హుందాగా దిగుతున్న కిరణ్‌ని చూసి తనకళ్ళను తానే నమ్మలేక పోయింది. అతను గుమ్మంవద్ద జోళ్ళువిప్పి నవ్వుతూ గాయత్రివద్దకు వచ్చి పాదాలను తాకాడు. గాయత్రి కన్నీళ్ళు అతని తలపై ముత్యాల్లాగా రాలాయి. ఆమె మనసు ఆర్ద్రమై కాసేపు నోటమాట రాలేదు.

"కిరణ్, ఇంత మంచిరోజు వస్తుందని కలలోకూడా అనుకోలేదు. ఈమధ్య చాలా సుస్తీ చేసింది. నిన్ను కళ్ళారా చూడటానికే దేవుడు నన్ను బ్రతికించాడు". అతని భుజంపై వ్రాలి తన్మయంగా కళ్ళుమూసుకున్నది. కిరణ్ 'నేనొచ్చేశాను. ఇంక మీకేమీ దిగులు వుండదు' అని భరోసా యిస్తున్నట్లు ఆమె భుజం మీద చేయి వేశాడు. కాఫీ టిఫెన్ తెస్తూన్న మల్లి ఆశ్చర్యంగా గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

మళ్ళి వేడివేడి ఇడ్లీలు, ఘుమఘుమలాడే సాంబారు గిన్నెలు తెచ్చి బల్లపై ఉంచింది.

"ఇడ్లీ సాంబారు నీకు ఎంతో ఇష్టమని చేయించాను తృప్తిగా తిను" అన్నది గాయత్రి.

బ్రేక్‌ఫాస్టు పూర్తిచేసి ఇద్దరూ సోఫాలో ప్రక్కప్రక్కగా కూర్చుని కబుర్లలో పడ్డారు. కిరణ్‌ని గురించి అన్ని వివరాలు వినాలని గాయత్రి ఎదురుచూస్తున్నది. ఉపక్రమించింది "నువ్వు హైస్కూలు చదువు పూర్తి చేయడం, ఇంతలో మీనాన్న గారిమరణం, మీ మామయ్య దగ్గరకు వెళ్ళడం తర్వాత నీసంగతులేమీ తెలియలేదు. మీ మామయ్యవాళ్ళు ఆవూరునుంచి వెళ్ళిపోయారని చెప్పారు. నువ్వెక్కడున్నావో, ఏం చదివావో ఏమీ నాకు తెలియవు. మీ మామయ్య చాలా వుత్తముడనిపించింది.ఇంతవాడవయ్యావంటే నీకు చాలా సహాయం చేసివుంటారు. భగవంతుడే ఆయనలోవుండి నీ అభివృద్ధికి కారణమయ్యాడని అనుకుంటున్నాను."

కిరణ్ చెప్పసాగాడు "అవును. మీరు చెప్పింది పూర్తిగా నిజమే. మామయ్య, అత్తయ్య వారి పిల్లలతో సమానం గానే కాదు, ఎక్కువగా కూడా నాకు ఎంతో మేలు చేశారు. కాని నా యీ అభివృద్ధి, ప్రస్తుతస్థితికి మీరే ముఖ్య కారణం." అన్నాడు.

తనేంచేసింది? ఇన్నేళ్ళు అసలు చూడనేలేదు. ఇలా అంటాడేమిటీ? అన్నట్లు తెల్లబోయి చూస్తోంది గాయత్రి.

కిరణ్ తనజేబులో భద్రంగా దాచిన చంద్రహారం బల్లపైనుంచాడు.

"మీరు ఆనాడు ప్రేమతో యిచ్చిన ఈ చంద్రహారమే నన్ను అన్నివేళలా ఆదుకుంది. ఈ నగను తాకట్టు పెట్టి నన్ను కాలేజీలో జేర్చాడు మామయ్య. తర్వాత నాకు స్కాలర్‌షిప్పు వచ్చింది. వేసవి సెలవులలో ఇద్దరు విద్యార్థులకు ట్యూషన్ చెప్పి ఆ డబ్బుతో నగను విడిపించుకున్నాను. అలాగే ఎన్నో సార్లు ఈ నగ నా అవసరాలను తీర్చింది. ప్రతీసారి ఎంతకష్టపడైనా హారాన్ని సంపాదించుకునేవాడిని. ఆ విధంగా నేను పోస్టు గ్రాడ్యుయేషను పూర్తిచేయగలిగాను. నేను ట్యూషన్ చెప్పినవాని తండ్రి పెద్ద ఆఫీసరు. ఆయనకు నాప్రవర్తన మీద, నిజాయితీ మీద మంచి అభిప్రాయం ఏర్పడింది. ఆయనే నన్ను ఐ.ఎ.యెస్. పరీక్షకు కట్టమని ప్రోత్సహించడమే కాక, చక్కటి కోచింగు కూడ ఇప్పించారు. క్రమంగా వారివల్ల నామీద నాకు నమ్మకం కుదిరి పరీక్ష వ్రాసి సెలక్టు అయ్యాను." అన్నాడు.

గాయత్రి ముఖంలో సంతోషంతో కూడిన వెలుగు గదంతా వ్యాపించింది.

"చిత్తశుద్ధితో ఏపని చేసినా సత్ఫలితాలు కల్గుతాయని మీరు చెప్పేవారు. ఆ ఫలితాన్నందు కోవటానికి నాకు ముగ్గురు కారణమయ్యారు. మీరు, మామయ్య, ఆఫీసరుగారు. మీ ముగ్గురిని ఈ జన్మలో మరచిపోలేను".

కిరణ్ మాటలకు గాయత్రి ఏమీ అనలేకపోయింది.

"సరే కిరణ్, పెద్ద ఆఫీసరు అయ్యావు. చాలా సంతోషమే గాని, జీవితంలో ముఖ్యమైన మంచి ఇల్లాలిని సంపాదించావా? అది చెప్పు."

"ఆ విషయాలలోకే వస్తున్నాను. మామయ్య, అత్తయ్యల కృషివలననే కదా నా యీ అభివృద్ధి. అందుకని వారి కుటుంబంలో మనిషినై వారికి అండగా వుండాలనే వుద్దేశ్యంతో వారి పెద్దమ్మాయి సంధ్యను వివాహం చేసుకున్నాను."

గాయత్రి కుతూహలంగా వింటోంది.

"చాలా మంచి అమ్మాయి. పెద్దపెద్ద డిగ్రీలు లేవు గాని మంచి అవగాహనా శక్తి, సంస్కారం నిండుగా వున్నాయి. సంధ్య నా జీవితాన్ని, చుట్టుప్రక్కలవారినీ కూడా ఆనందమయం చేస్తుందనే నమ్మకం నాకు."

గాయత్రి తృప్తిగా చిరునవ్వు నవ్వి అతని భుజం మీద చేయి వేసింది.

"మీకు ఇంకో ముఖ్యమైన విశేషం చెప్పాలి. రెండు నెలలక్రితం ట్రయినింగుకోసం అమెరికా వెళ్ళాను. మన సుధీర కుటుంబంతో రెండు రోజులున్నాను. వారిద్దరూ చాలా బాగున్నారు. ఇద్దరు పిల్లలూ మీ గురించి ఎన్నో ప్రశ్నలడిగారు. ఇండియానుంచి వచ్చానని వాళ్ళకు తెలుసును. సుధీర మాత్రం అమ్మ తమతో వుండలేక పోతోందని, వంటరిగా వుంటోందని బాధపడింది. దానికి నేనొక చక్కని పరిష్కారం సూచించాను. ఇకముందు మీరు నాదగ్గర సుఖంగా వుండే ఏర్పాట్లన్నీ చేశాను. మనం ఆడుకోవటాన్కి రెండు నెలలలో ఓ చిన్ని పాపాయి రాబోతోంది. సుధీరను కుటుంబంతో సహా మనవద్దకువచ్చి, వీలైనన్ని రోజులు గడపడానికి కూడా ఒప్పించాను" గాయత్రికేసి చూసి, "నేను ఒక మిత్రుని ఇంటికి వెళ్ళాలి. అక్కడే డిన్నర్ చేసి విజయవాడకు బయలుదేరతాను. మళ్ళీవారం వచ్చి మిమ్మల్ని, మల్లిని కూడా తీసికొని వెళ్తాను. మీరనుకున్నట్లుగా మల్లికి విద్యాబుద్ధులు నేర్పించి ఒక ఇంటిదాన్ని చేద్దాం. సరేనా?"

అని మరొకసారి గాయత్రికి చెప్పి బయలుదేరాడు.

ఈమాటలన్నీ అర్ధంచేసుకున్న మల్లి తన తల్లికి చెప్పడానికి సంతోషంగా పరుగెత్తింది. ఇదంతా కలో నిజమో కూడా తెలియని గాయత్రి తన యిష్టదైవానికి కృతజ్ఞతలు తెల్పుకోవాలని పూజగదిలోనికెళ్ళింది. శారదాదేవికి హారతిస్తుంటే ప్రక్కనే బల్ల మీద తాను పారాయణచేసే భగవద్గీత కనబడింది. చేతిలోనికి తీసుకుని పేజీలు తిప్పితే ౨వ అధ్యాయంలో ౪౦వ శ్లోకం ఎదురు వచ్చింది.

"నే హాభిక్రమనాశో స్తి ప్రత్యవాయో న విద్యతే
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"

తాత్పర్యం:

పార్థా! ఈ కర్మయోగం ప్రారంభించి పూర్తిచేయలేక పోయినా వృధా అవదు. ఈ ధర్మం ఎంత కొంచెం ఆచరించినా మహత్తర భయాలనుండి రక్షిస్తుంది.

ప్రస్తుత తన పరిస్థితి సమంజసంగా తోచిన గాయత్రి ఆ గ్రంధాన్ని కళ్ళకద్దుకొని భక్తిగా బల్లపై నుంచింది.

ఓం తత్ సత్

సర్వేజనా సుఖినోభవంతు!

## తెలుగు వారము

*- సాయిలక్ష్మి*

తెలుగు వారమండీ మనం తెలుగువారం!!
ఇరుగువారికి పెడదామంటే నమస్కారం
రెండు చేతులు పైకి రావేం?
పొరుగువారికి చేతులు కలుపుదాం
అనగానే చేతులు బారెడు సాగుతాయేం!
నామోషి తెలుగువారమని చెప్పుకోవటం
'గుల్తేలూ' అనటానికి సైసై! ముందుకు రావటం.
తెలుగునేల నాది, తెలుగు తల్లి మాది పలుకుతం
మల్లెపూదండ మంగళహారతులే పాడతాం,
ఏ ఊరు మీదంటే హైదరాబాదనే చెప్తుతం,
హైటెక్కు సిటీయని చెప్పి టెక్కు బోతం,
కన్న నేలనే తెలుగునాడున మరిచాం,
పుట్టినిల్లు పల్లేయని చిన్నబుచ్చుకుంటం.
దేశభాషలందు తెలుగు లెస్సయని వెన్ను చరుస్తాం,
%తెలుగు ఇంగ్లీషు భాషలో టైపు సేసి బోర విరుస్తాం.
అమ్మనాన్న దూరం దూరం; మమ్మీడాడీ దూరం దూరం
మిగత అందరు ఆంటీలు, అంకుళ్ళు మనం, మనం.
పప్పు పచ్చడి కారం, కారం; పాస్తా పిజ్జా ప్రాణం ప్రాణం.
అల్లుళ్ళు, కోడళ్ళు అమెరికనులు దూరం దూరం
మనవళ్ళంతా మాట్లాడకున్నా బంధం, బంధం.
తెలుగు ఆట, పాటకు లేదు సహనం,
ఇంగ్లీషు ఆట, పాటకు హైలైటే మన అహం.
తెలుగు సంగీత సాహిత్యాలు వద్దేవద్దు గీరబోతం.
తెలుగు చీరజాకెట్టు బోరు బోరు, అంటూ ముట్టుకోం.
తెలుగు పంచె జారు జారు అని జారుకుంటం
షార్ట్, స్వెట్ షర్టులే హాటు, హాటు అంటూ తిరుగుతం
ఆరేసుకుంటం, పారేసుకుంటం తెల్గుతనం.
'తెలుగు నేర్పుతా' అంటే ఆమడ దూరం, దూరం
(పోతూ)
'తెలుగు అంటించక' మాకు అంటాం
తెలుగు రాతలకు వత్తెందుకని మార్చాలంటం
భద్రాద్రి రామన్న, తిరుపతి వెంకన్న గీతలే
దేముడంటం
తెలుగు సీతరాములు గోవిందులై గీత దాటాం.
'నలుగురు నావాళ్ళే' అప్పుడు అన్నాం,
'నేను నేను అన్నదే' ఇప్పుడు నవ జీవనం.
తెలుగువారమండి మనం తెలుగువారం.!!
%(పెన్ను పారవేసి)

# స్వాతిముత్యం

- ఇందిర మాలెంపాటి

"ఎంకెవ్వరని లోకమెప్పుడయిన కదిపితే
వెలుగునీడల వైపు వేలు సూపింతు"
-నాయుడు బావ

"నెలవంక పలకలో
నీరూపె గీతురా
తలవంచి సెలయేరులో
ఆ రూపె సూతురా" -ఎంకి

నాయుడు బావ, ఎంకిల ప్రేమభావనలో మనసుకు చల్లదనం కలిగించే మత్తు ఉంది. ఆ కవితలు చదువుతూ పుస్తకం గుండెలమీద పెట్టుకుని నిద్రలోకి జారిపోయింది స్వాతి. ఆ రోజే రాహుల్‌కు ఉత్తరం వ్రాసి పోస్టులో వేసింది. టెలిఫోనులూ, ఇంటర్నెట్‌లూ వచ్చాక ఉత్తరాలు వ్రాసే అలవాటు పోయింది. ఇమెయిల్స్ పెట్టటమే కాని అందులో మనసంతావిప్పి గుండెలో కొట్టాడుతున్న భావాలు చెప్పే అవకాశమే లేదు. ఎంకి, నాయుడు బావలాగ గుండె గొంతుకలోన కొట్టాడు తుంటే, మనసిప్పి ఊసులాడుకునే తీరికాలేదు. ఈ ఇంటర్నెట్ యుగంలో జీవితం రొబాటిక్‌గా, యాత్రికంగా, వేగంగా జరిగిపోతోంది.

కాలం కరిగిపోతోంది. అందుకే ఈరోజు మనసంతా విప్పి తీరికగా తెల్ల కాగితం మీద పెట్టింది.

"రాహుల్,

"వెన్నల రాత్రిలో చందమామను చూస్తూ
నీతో ఊసులాడాలని, నీవు నాకు తోడుగా
నేను నీకు నీడగా కాలం గడపాలని
ఆశతో వేచి ఉన్నాను, నేను.
ఎక్కడో చుక్కల్లో దాగిన జాబిల్లిలా
అందకుండా ఉండిపోయావు నీవు.
కదిలి పోతోంది కాలం
తిరిగి రాదు కరిగి పోయిన మాయదారి కాలం"
-- "నీకోసం ఎదురు చూసే నీ స్వాతి."

ఫోన్ రింగ్ శబ్దానికి ఉలిక్కిపడి లేచింది స్వాతి. అవతలి నుండి రాహుల్ "స్వాతీ ఏం చేస్తున్నావు? సడెన్‌గా నీతో మాట్లాడా లనిపించింది. అఫ్‌కోర్స్, నీతో ఎప్పుడూ మాట్లాడాలనే ఉంటుంది. కాని ఫోన్‌లో అప్పుడప్పుడు మాత్రమే మాట్లాడగలం కదా! ఇంక నాలుగు నెలల్లో నీకు వీసా రావచ్చు. ఈ నాలుగు నెలలూ నాలుగు యుగాలనిపిస్తున్నది. అయినా మనం ఇలా విడివిడిగా ఉండటమేమిటి? ఉద్యోగం మానేసి వచ్చేయ్యనా? అక్కడే ఏదయినా చూసు కోవచ్చు. ఈ నరకం కంటే అదే మంచిదికదా".

"ఇంతకాలం వెయిట్ చేశాము. ఈ నాలుగు నెలలూ ఎంతలో గడుస్తాయి? రాహుల్ ఈ ఎడబాటు వల్ల మనం మానసికంగా మరింత దగ్గరవుతున్నా మనిపిస్తున్నది. ఒకరి కోసం ఒకరు తపన పడటంలో కూడా ఒక మధుర మయిన అనుభూతి ఉంది" అన్నది స్వాతి.

రాహుల్ ఫోన్ పెట్టేశాక స్వాతి ఆలోచనులు కాలేజీ రోజుల్లోకి పరిగెత్తాయి.

*******

బ్లూకలర్ సిల్క్ చుడీదారు వేసుకుని మాచింగ్ చెప్పులు వేసుకుని, విజయవాడ ఇంజనీరింగు కాలేజీ అడ్ మినిస్ట్రేటివ్ ఆఫీసు వైపు నడిచి వెడుతున్న స్వాతిని మొదటి సారిగా చూసినప్పుడు, రాహుల్ కళ్ళు తిప్పుకోలేకపోయాడు. దివినుండి భువికి దిగివచ్చిన దేవతలా కనిపించింది అతని కళ్ళకు. రాహుల్ కూడా ఆ రోజే ఇంజనీరింగు ఫస్ట్ యియర్‌లో చేరాడు. ఆమెను పలకరించాలనే కుతూహలం ఆపుకోలేక దగ్గరకు వెళ్ళి, "ఈరోజే కాలేజీలో చేరుతున్నారా?" అని అడిగాడు. "అవునండీ ఇప్పటికే ఆలశ్యం అయిపోయింది. ప్రిన్సిపాల్‌ని కలిసి స్కెడ్యూలు తీసుకుని క్లాసుకు వెళ్ళాలి. మీరు ఏ యియర్ చదువుతున్నారు? ఏ బ్రాంచ్?" అని అడిగింది.

"నేను కూడా ఫస్ట్ యియర్-ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో చేరాను. గ్లాడ్ టుమీట్ యు. అయామ్ రాహుల్" అన్నాడు.

"అయామ్ స్వాతి. ప్లీజ్ టు మీట్‌యు."

స్వాతి వాళ్ళ అన్నయ్యా, వదినా విజయవాడలోనే ఉంటారు. వాళ్ళ అన్నయ్య రాజశేఖరం డాక్టరు. విజయవాడలోనే ప్రాక్టీసు చేస్తున్నారు. స్వాతి, వాళ్ళింట్లోనే ఉండి చదువుకోవటానికి ఏర్పాట్లు జరిగాయి. వాళ్ళది గుడివాడ దగ్గర చిన్న పల్లెటూరు నాన్న జనార్దనరావుగారు వ్యవసాయం చేసుకుంటూ ఉంటారు. వేసవికాలంలో పల్లెటూర్లో గడపటం స్వాతికి

చాలా సరదాగా ఉంటుంది. తాటి ముంజలు కొట్టించుకుని తినటం, చెట్ల నుండి పచ్చి మామిడి కాయలు కోసి ముక్కలు చేసుకుని కారం అద్దుకుని తినటం ఇవన్నీ ఎంతో బాగుంటాయి.

నాన్నగారు ఐదారు ఎకరాల పొలంతోనే పిల్లలందరికీ కాలేజీ చదువులు చెప్పించారు. స్వాతి తమ్ముడు చంద్రశేఖర్ కాలేజీలో సెకండియర్ ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు.మధ్యతరగతి కుటుంబాలలో ఉండే సమస్యలు ఉండనే ఉంటాయి. స్వాతి పెళ్ళి గురించే ఆయనకు ఆందోళన.

స్వాతి వాళ్ళ అమ్మ శారద, స్వాతికి నాలుగేళ్ళ వయసప్పుడే చనిపోయింది. అమ్మ జ్ఞాపకాలు కొద్ది కొద్దిగా ఏదో కలలో జరిగినట్లు కనిపిస్తూ ఉంటాయి. అమ్మ ఎలా చనిపోయిందో తనకు తెలియదు. హార్ట్ఎటాక్ అని కొందరూ, కాన్సర్ అని కొందరూ చెబుతూఉంటారు. ఆరోజుల్లో, ఆపల్లెటూర్లో వైద్య సహాయం ఏమీ ఉండేది కాదు. ఏదో కాలం మూడిపోయింది, మహర్జాతకురాలు వెళ్ళిపోయింది అనుకుంటూ ఉంటారు. ముత్తయిదుగా పోవటం అదృష్టం అని కూడా అంటారు.

ఆమె ఉండగా ఇల్లంతా కళకళలాడుతూ ఉండేదని కథలు కథలుగా చెబుతారు. 'పెద్దంచు గద్వాల చీర కట్టుకుని, నుదిటి మీద పెద్దబొట్టుతో ఒంటినిండా నగలతో మహలక్ష్మిలా నట్టింట తిరుగుతూ ఉంటే ఎంత నిండుగా ఉండేదో' అంటూ ఉంటారు.

జనార్ధనరావు గారి చెల్లెలు లక్ష్మీకాంతమ్మ ఇంట్లోనే ఉండేది. పదహారేళ్ళ వయస్సులో పెళ్ళిచేసి అత్తవారింటికి పంపిస్తే, పదిహేడవ సంవత్సరానికే పుట్టింటికి వచ్చేసే పరిస్థితి వచ్చింది. ఆమె భర్త రాఘవరావు ఎలా చనిపోయాడో ఎవరికీ అంతు పట్టలేదు. చెడుతిరుగుళ్ళ వల్ల ఎయిడ్స్ జబ్బుతో చనిపోయాడని అంటారు కొందరు. ఏది ఏమయినా లక్ష్మీకాంతమ్మ పదిహేడేళ్ళ వయసుకే బొట్టు చెరుపుకుని, తెల్లచీర కట్టుకుని పుట్టింటికి వచ్చింది. ఆమె ఎక్కువ చదువులు చదువు కోలేదు. అన్నయ్య జనార్ధనరావుగారి అండలోనే ఉండవలసిన అవసరం ఏర్పడింది. లక్ష్మీకాంతమ్మ హైస్కూలు చదువు పూర్తికాక ముందే సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. అబ్బాయి అందంగా ఉన్నాడు, మంచి కుటుంబం మంచి సంబంధం అని త్వరపడ్డారు. అబ్బాయి మనస్తత్వం గురించి కానీ, అతని చెడుతిరుగుళ్ళ గురించి కానీ ఎవరూ తెలుసు కోలేకపోయారు. లక్ష్మీకాంతం తనకు పెళ్ళి కుదిరిందనే సరదా, కొత్తబట్టలూ నగలూ వస్తున్నాయనే సంతోషమే కాని, కట్టుకోబోయే మొగుడు ఎలాంటివాడు, అతని ఆలోచనలేమిటి? అని ఆలోచించే అవగాహనలేదు. జీవితమంతా కలిసి ఉండాల్సిన వ్యక్తిని గురించి వివరాలు తెలుసుకోవాలనే కుతూహలం కూడా ఆ అమ్మాయికి లేదు. పెద్దలు చూస్తున్నారు, వాళ్ళకు మంచిచెడూ తెలియదా అనే భరోసా తప్ప స్వంతగా ఆలోచించే వ్యక్తిత్వం రాని వయసు.

పుట్టింటికి చేరిన లక్ష్మీకాంతం అన్నగారి పిల్లల బాధ్యత తీసుకోవలసి వచ్చింది. ఇంట్లో వంట చేయటం, పిల్లలకు కావలిసినవి ఏర్పాటు చేయటంలో ఆమెకు రోజంతా గడిచిపోయేది. అత్తయ్య గురించి ఆలోచిస్తే స్వాతికి చాలా బాధ కలుగుతుంది.

తన కంటే పన్నెండేళ్ళే పెద్దయినా అరవయ్యేళ్ళ వయస్సున్న మనిషిలా మాట్లాడుతుంది. ఏ అనుభవాలకూ, ఆనందాలకూ నోచుకోకుండా ఆమె జీవితం వెళ్ళబోస్తూ ఉంటే స్వాతికి ఈ కృత్రిమ సాంప్రదాయాలమీద చాలా కోపం వస్తుంది. నాన్నతో చాలా సార్లు వాదించింది. అత్తయ్యకు మళ్ళీ పెళ్ళి చేయకూడదా నాన్నా? లేకపోతే ఆమెను కాలేజీకి పంపించి చదువన్నా చెప్పించండి - అంటూ.

లక్ష్మీకాంతానికి చదువు మీద ఆసక్తీ, ధ్యాసా ఎప్పుడూ లేవు. ఇంటిపనులు చూసుకోవటం, కుట్లూ, అల్లికలతో కాలక్షేపం చేయటంలోనే కాలం గడిచిపోతోంది.

రాహుల్తో పరిచయమయిన తరువాత తన ఇంటి సంగతులన్నీ చెబుతూ స్వాతి అనేది - "అత్తయ్యను చూస్తూఉంటే, నేను కూడా ఆమెకు ఏమీ చెయ్యలేకపోతున్నానే అని బాధవేస్తుంది రాహుల్!"

"వాళ్ళ మానసిక స్థాయి ఎదిగి, వాళ్ళలో చైతన్యం వస్తే తప్ప, మనకుగా మనం ఏమీ చెయ్యలేం స్వాతీ! ఆచైతన్యం ఆమెకు కలిగినప్పుడు నీవు సహాయం చేయటానికి సిద్ధంగా ఉండాలి."

రాహుల్ కూడా మధ్య తరగతి కుటుంబానికి చెందినవాడే. వాళ్ళ నాన్న స్కూలు టీచరు. అక్క మాధవికి పెళ్ళయింది. బావగారు ఇంజనీరు. వాళ్ళు విజయవాడలో ఉంటారు. రాహుల్ అక్కావాళ్ళింట్లో ఉండి చదువుకుంటున్నాడు. అక్కపెళ్ళికీ, తన చదువుకూ, చాలా అప్పులు చేయవలసి వచ్చింది.

రాహుల్ పెళ్ళికి వచ్చే కట్నంతో ఆఅప్పులన్నీ తీర్చాలని రాహుల్ నాన్నగారి ఆలోచన.

ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చే సరికి స్వాతీ రాహుల్‌ల తొలిపరిచయం స్నేహంగా మారింది. సరదాగా కలిసి సినిమాలకు వెళ్ళటం, కలిసి చదువుకోవటం లాంటివి చేసేవారు. ఆఖరి సంవత్సరం లోకి వచ్చేసరికి ఒకరినొకరు చూడకుండా ఉండలేనంత సన్నిహితులయ్యారు. ఒక సారి రాహుల్ అడిగాడు "స్వాతీ మనం పెళ్ళి చేసుకుంటే ఎప్పటికి కలిసే ఉండొచ్చు కదా?" "అవును రాహుల్, నాకూ అలాంటి కోరికే కలుగుతోంది.".

పెళ్ళి విషయం, ఇద్దరి ఇళ్ళల్లో పెద్ద సమస్యగా తయారయింది. ముఖ్యంగా రాహుల్ వాళ్ళ ఇంట్లో, కట్నం లేకుండా చేసుకోవటం రాహుల్ వాళ్ళ నాన్నకూ అమ్మకూ ఇష్టం లేదు. కట్నం ఇచ్చే తాహతు స్వాతి వాళ్ళ నాన్నగారికి లేదు. "నాన్నా నాకు కట్నం తీసుకోవటం అసలు ఇష్టం లేదు. నాకు నచ్చిన అమ్మాయి, నన్ను అర్థం చేసుకునే అమ్మాయి స్వాతి.పెళ్ళంటూ చేసుకుంటే, స్వాతిని తప్ప మరెవరినీ చేసుకోను" అన్నాడు రాహుల్ తండ్రితో.

జనార్ధనరావుగారికి కూడా ఈ పెళ్ళి విషయం చాలా అసంతృప్తిగా ఉంది.

ఆడపిల్ల తన పెళ్ళివిషయం తనే నిర్ణయించుకోవటం ఆయనకు అసలు ఇష్టం లేదు. స్వాతికి చదువు చెప్పించటం చాలా పొరపాటయింది. తండ్రి చాటున ఉండవలసిన ఆడపిల్ల ఎంత స్వతంత్రమయిన నిర్ణయాలు తీసుకుంటోంది.

ఎంతమందికి అసంతృప్తి కలిగించినా స్వాతీ, రాహుల్ రిజిష్టరు మారేజి చేసేసుకున్నారు. లక్కీగా చదువు పూర్తవగానే ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చేశాయి. జీవితం సాఫీగా గడిచిపోతోంది.

ఇద్దరూ అమెరికా కొద్దికాలం వెళ్ళి వద్దామని, హెచ్ వన్ బి వీసాకు అప్లైచేశారు. రాహుల్‌కు వెంటనే వీసా వచ్చింది. స్వాతి కొన్నాళ్ళు ఉద్యోగం చేసుకుంటూ, వీసా కోసం వెయిట్ చేద్దామని నిర్ణయించుకుంది. రాహుల్ వెళ్ళిన కొద్ది కాలానికే, ఆఎడబాటు ఎంత కష్టంగా ఉంటుందో ఇద్దరికీ అర్ధమయింది.

కాని ఎవరి జీవితం ఏ మలుపులు తిరుగుతుందో ఊహించటం కష్టం. స్వాతికి వీసా కొద్దినెలలలో వస్తుందనగా అనుకోని సంఘటనలు జరిగిపోయాయి.

రాహుల్ నుండి ఒక నెల రోజులుగా ఫోను కాని, ఇమెయిలు కానీ రాలేదు. స్వాతి పదిసార్లు ఫోన్ చేసినా ఆన్సరు లేదు. కనీసం ఒక పాతిక ఇమెయిల్స్ పెట్టింది. దీనికీ జబాబు లేదు. ఏమయింది రాహుల్‌కు? ఎంత పనివత్తిడి ఉన్నా రెండు నిమిషాలు ఫోన్ చేసి మాట్లాడ వచ్చుకదా! సరే నేనూ చూస్తాను. ఎన్నాళ్ళు మౌనంగా ఉంటాడో!

ఎప్పుడూ లేనిది, అమెరికా నుండి పెద్ద ఉత్తరం వచ్చింది.

స్వాతీ! ఇన్నాళ్ళూ నిన్ను మభ్యపెట్టినందుకు నన్ను క్షమించు. నేను నెలరోజులుగా మథనపడి నీకు ఎలా తెలియపరచాలో అర్థం కాక ఇప్పటికి రాస్తున్నాను.

నీవు లేకుండా బ్రతకలేనని, నువ్వంటే ప్రాణమని నేను ఎన్నో సార్లు అన్నాను. కాని మనిషి మనసు ఎంత త్వరగా మారిపోతుందో ఇప్పుడర్థమవుతోంది. మన పరిస్థితుల ప్రభావం కానీ ఇంత దూరంలో ఉండటం వలన కానీ, నాకు ఇదివరకటి ఫీలింగ్స్ ఇప్పుడు లేవు.... నాకు ఇక్కడ మరొకరితో పరిచయమయింది. మారుతున్న కాలాన్ని, మానవ నైజాన్ని అర్థం చేసుకోవాలి. మేము త్వరలో పెళ్ళి చేసు కోవాలను కుంటున్నాము. నన్ను గురించి నీవేమనుకున్నా ఫరవాలేదు. నేను నాజీవితం గురించి ఆలోచించు కున్నట్లే నీ జీవితం గురించి నీవు ఆలోచించుకో. అంత కంటే నేను చెప్పగలిగేదేమీ లేదు.

ఈ కవరులో డైవర్సు పేపర్లు పంపిస్తున్నాను. అవి సంతకం చేసి మళ్ళీ నాకు పోస్ట్ చేయి. ఇద్దరూ అనుకూలంగా సంతకాలు పెట్టుకుంటే విడాకులు రావటం చాలా తేలిక."

- రాహుల్

ఇది నిజంగా రాహుల్ వ్రాసిన ఉత్తరమేనా చేతివ్రాత అతనిదే కాని రాసిన వాక్యాలు అతని మనసులోంచి వచ్చినవేనా? స్వాతికి చాలా అయోమయంగా ఉంది. ఏవిషయమూ అంతు పట్టటం లేదు - తను ఇది వరకు చాలా కథలు విన్నది. అమెరికా వెళ్ళిన జంటలు ఎంతోమంది విడిపోవటం - ఇదేమీ కొత్తకాదు. కాని రాహుల్ అలాంటి వాడు కాదు. ఇందులో ఏదో పొరపాటు ఉంది. రాహుల్ వ్యక్తిత్వాన్ని అంచనా వేయటంలో తను అంత పొరపాటు చేసిందా... కాదు! కాదు. రాహుల్ ఏదో దాచిపెడుతున్నాడు.

అనూష తన క్లోజ్ ఫ్రండ్ తనతో పాటే ఇంజనీరింగు చదివింది. చదువుతూనే పెళ్ళయిపోయింది. అమెరికా సంబంధం వచ్చిందని వాళ్ళువాళ్ళంతా ఎంతో సంతోషపడ్డారు. అనూష ఫామిలీ చాలా డబ్బున్న వాళ్ళు అనూషా వాళ్ళ నాన్నగారు కోట్లలో వ్యాపారం చేస్తారు. ఆ అమ్మాయి పెళ్ళికి బహుశా కోటిరూపాయలు ఖర్చుపెట్టి ఉంటారు. ఐదు రోజుల పెళ్ళి చాలా ఆరాటంగా చేశారు. తెలుగు సాంప్రదాయలతో పాటు ఉత్తరభారత సాంప్రదాయాలు కూడా కలవేసి, మెహందీఅని ఒక రోజు, గర్బా అని ఒక రోజు ఇలా ఐదు రోజుల ఫెస్టివిటీస్‌తో ఎంతో ఆరాటంగా జరిగింది. పెళ్ళయిన ఆరునెలలకు తనకు వీసా వస్తే అమెరికా వెళ్ళిపోయింది. చాలా సంతోషంగా ఉన్నట్లు ఉత్తరాలు వ్రాసేది.

నాలుగయిదు నెలలు గడిచిం తరువాత అనూష దగ్గరనుండి ఉత్తరాలు రావటం ఆగిపోయింది. కొత్తగా పెళ్ళయిన అమ్మాయి, స్నేహితురాలికి ఉత్తరాలు వ్రాస్తూ గడుపుతుందనుకోవటం తెలివి తక్కువ. అందుకే ఆ విషయం గురించి ఎక్కువ ఆలోచించలేదు.

సడన్ గా ఒక రోజు అనూష ఫోన్ చేసింది. "స్వాతీ! నేను ఇండియా తిరిగి వచ్చేశాను నేను అక్కడ ఆ ఇరుకు జీవితంలో ఇమడలేను. "

"ఏమయింది, అనూషా నీవు చాలా సంతోషంగా ఉన్నావనుకున్నాను. అసలేం జరిగింది? "

"ఏముంది, సుధీర్ గురించి నాకు పెళ్ళికి ముందు ఏమీ తెలియదు. ఏదో నాలుగయిదు ఈ మెయిల్స్ పెట్టుకోవటం, ఫోటో చూసి చాలా బాగున్నాడను కోవటం తప్ప నాకు అతని గురించి ఏమీ తెలియదు. డబ్బు విషయంలో అతను చాలా టైట్‌గా ఉంటాడు. బడ్జెట్ లోనే ఖర్చుపెట్టు కోవాలంటాడు. షాపింగ్‌కు వెళితే ఏమీ కొననివ్వడు. నాన్న డబ్బు పంపిస్తారు నా ఖర్చులకంటే అతనికి నచ్చలేదు. విపరీతమయిన కోపం వచ్చిందతనికి."

"అదేమిటి అనూషా? ఇవన్నీ వింటూఉంటే అతను మంచి ప్రిన్సిపుల్స్ ఉన్న వ్యక్తిలా అనిపిస్తోంది. నీవే తొందరపడుతున్నావేమో ఆలోచించు."

"అది కాదు స్వాతీ! నాకసలు అమెరికా జీవితమే నచ్చలేదు. గిన్నెలు కడుక్కోవటం, బట్టలు ఉతుక్కోవటం, ఇస్త్రీ చేసుకోవటం దగ్గరనుండీ అన్ని పనులూ మనమే చేసుకోవాలి. వీటన్నిటితో పాటు, ఇంకా కాలేజీలో ఏవో కోర్సులు తీసుకోమంటాడు. ఒక సరదా కూడా ఉండదు. ఒక క్లబ్బుకు వెళ్ళటం కాని, ఒక పార్టీకి వెళ్ళటం కాని ఏమీ ఉండదు. ఆ ఇరుకు జీవితం నాకసలు నచ్చలేదు. ఇండియా వెళ్ళిపోదాం రమ్మన్నాను. నాజాబ్ నాకు నచ్చింది. కొన్ని సంవత్సరాల దాకా నేను రానంటాడు. అందుకే వచ్చేశాను. నేనిక అక్కడికి వెళ్ళను." అన్నది.

స్వాతికి చాలా ఆశ్చర్యమేసింది. ఇంత చిన్న విషయానికి భర్యాభర్తలు విడిపోతారా? ఇలాంటి సంఘటనలు చాలా విన్నది. వాళ్ళ అవగాహనలో పొరపాటు ఉందేమో అనుకునేది. కాని ఇప్పుడు రాహుల్ నుండి అలాంటి ఉత్తరం వచ్చాక ఏమనుకోవాలో తెలియటంలేదు. రాహుల్, తనూ ఇష్టపడి, ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్న తరువాతే పెళ్ళిచేసుకున్నారు. అసలు ఈ వివాహవ్యవస్థలోనే ఏదో లోపం ఉంది. తన ప్రేమనంతా మాటలలో నింపి, తన మనసు స్పందించే విధంగా వ్యవహరించే రాహుల్ ఇలాంటి ప్రలోభంలో పడతాడంటే తనకు నమ్మశక్యం కావటంలేదు. వెంటనే అతని దగ్గరకు వెళ్ళి ముఖాముఖి మాట్లాడదామంటే తనకు వీసా ఇవ్వరు. ఏం చేయాలి? చేసుకున్న బాసలూ, కన్న కలలూ అన్నీ కల్లలేనా? కాని ఎందుకో రాహుల్ మీద కోపం రావటం లేదు. ఆ డైవర్సు పేపర్లు మాత్రం తను సంతకం పెట్ట దలుచుకోలేదు.

ఆ ఉత్తరం అన్నయ్యకు చూపించి "అన్నయ్యా నీకు తెలిసిన వాళ్ళెవరికయినా ఫోన్ చేసి విషయాలు తెలుసుకోమని చెప్పగలవా? నాకు అతను వ్రాసిన వేవీ నమ్మ బుద్ధికావటం లేదు." అని అడిగింది.

"నేను మొదట్లోనే చెప్పాను. నీవు అతని విషయంలో తొందరపడుతున్నావేమోనని. నీవు వినిపించుకోలేదు. అతను అంత క్లియర్‌గా వ్రాస్తే ఇంకా నీకు అనుమానమెందుకు? అతని సంగతి మరిచిపోయి నీ జీవితం గురించి ఆలోచించు. " అన్నాడు.

ఎవరెన్ని విధాల చెప్పినా స్వాతి మనసులో అపనమ్మకం పోవటంలేదు. ఏదో బలవంతమయిన కారణం ఉండి ఉంటుంది. రాహుల్ చపలచిత్తుడు కాడు. అతను చాలా డీసెంటుగా ఆలోచిస్తాడు. ఎన్నో అభ్యుదయ భావాలున్నాయి.

అమెరికా నుండి ఫోనులు చేసే రోజుల్లో అతను అక్కడి విషయాలు కొన్ని చెప్పేవాడు. అతను చెప్పే

కథలలో ఇతరుల పట్ల జాలి అభిమానం, కష్టంలో ఉన్న వాళ్ళకు సహాయం చేయాలనే తపనా కనిపిస్తాయి.

ఒకసారి వాళ్ళ పక్కింటి వాళ్ళ కథ చెప్పాడు. "మా ఎపార్టుమెంటు కాంప్లెక్సులో మాకు క్రింద భాగంలో ఒక అమెరికన్ ఫామిలీ ఉంటున్నారు. బాబ్, లిండా వారిద్దరికి ఇద్దరు పిల్లలు. ఇద్దరూ అమ్మాయిలే వాళ్ళకు ఆరేళ్ళూ, మూడేళ్ళూ, ఎంతో ముద్దుగా ఉంటారు. బాబ్ ఒక కారుడీలరు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. లిండా ఇంట్లోనే ఉండి పిల్లల్ని చూసుకొనేది. వాళ్ళు ఎప్పుడూ ఎంతో ఉషారుగా, సంతోషంగా కనిపించేవాళ్ళు. రోజూ సాయంత్రం పిల్లలిద్దరినీ తీసుకుని ఎదురుగా ఉన్న పార్కుకు వెళుతూ కనిపించేవారు.

సడెన్‌గా లిండాకు బ్రెస్ట్ కాన్సర్ అని డయాగ్నోస్ చేశారు. ఆపరేషను చేశారు. తరువాత రేడియేషన్ థెరపీ ఇచ్చారు. ఇంకా కీమోథెరపీ కూడా ఇవ్వాలన్నారట. ఈ ట్రీట్‌మెంటు కంతా బాబ్ జాబ్‌లో ఇచ్చే ఫామిలీ ఇన్సూరెన్సు ద్వారా పే చెయ్యగలిగారు. ఇంతలో సడెన్‌గా బాబ్‌కు ఉద్యోగం పోయింది. హెల్త్ ఇన్సూరెన్సుపోయింది. కీమోథెరపీకి చాలా ఖర్చవుతుంది. లిండా చాలా నీరసంగా ఉండేది. ఖర్చు భరించలేక కీమోథెరపీ ఆపేస్తానంటున్నది. కళ్ళముందే వాళ్ళ పరిస్థితి దిగజారి పోవటం చూస్తే చాలా బాధేస్తుంది. ఇంత ధనవంతమయిన అమెరికా దేశంలో ఇలాంటి దీనమయిన పరిస్థితి చూస్తే ఆశ్చర్యమేస్తుంది. అప్పుడప్పుడు ఆపిల్లల్ని దగ్గర పెట్టుకుని బేబీసిట్టింగ్ చేసి ఆమెకు రిలీఫ్ ఇస్తున్నాను. ఇంతకంటే నేను చేయగలిగింది ఏముంది?" అతని కంఠంలో ఆ కుటుంబంపట్ల జాలీ, తనేమీ చెయ్యలేకపోతున్నాననే బాధ స్పష్టంగా తెలుస్తున్నాయి.

మరొక సారి ఇంకొక కథ చెప్పాడు.

"ఇన్నర్ సిటీలో పిల్లలకు చదువులు సరిగ్గా ఉండవు. స్కూళ్ళకు సరయిన ఫండింగ్ లేక సరిపోయినంత మంది టీచర్లు ఉండరు. పిల్లలకు ఎడ్యుకేషను సరిగ్గా ఉండదు. ఆ పరిస్థితులలో పిల్లలు చెడ్డ అలవాట్లలో పడిపోవటం చాలా తేలిక. వాళ్ళ ఫామిలీ లైఫ్‌లో కూడా ఒక స్ట్రక్చర్ ఉండదు. చాలా వరకు వాళ్ళ జీవితాల్లో తండ్రి ప్రమేయం లేకపోవటం తల్లి ఒక్కతే పెంచటం జరుగుతూ ఉంటుంది. ఒకోసారి కుటుంబం గడవటం కోసం, తల్లి రెండు జాబ్‌లు చేయటం, దాంతో పిల్లలకు సూపర్ విజన్ లేక విచ్చలవిడి తనం అలవాటవుతుంది. ఇల్లీగల్ డ్రగ్స్ వాడటం, అమ్మటం లాంటివి కూడా చేస్తారు. అందుకే కొన్ని చోట్ల "బిగ్ బ్రదర్" ప్రోగ్రాము ఉంటుంది. ఒకబ్బాయిని బ్రదర్‌గా తీసుకుని, వాళ్ళకు చదువుమీద శ్రద్ధకలిగేట్లు చేయటం, ఆటలు ఆడించటం, చెడ్డ అలవాట్లలో పడకుండా చేయటం లాంటి పనులు చేయాలి.

నేను కూడా శని ఆదివారాలు 'క్రిస్' అనే అబ్బాయిని వెంట బెట్టుకుని 'బిగ్ బ్రదర్'గా అతనితో గడుపుతాను.

ఇంత ఆదర్శంగా ఆలోచించే రాహుల్ అంత దారుణంగా ప్రవర్తిస్తాడని, తను ఊహించలేక పోతోంది.

రాహుల్ ఫ్రెండ్స్ కెవరికయినా ఫోన్ చేద్దామంటే వాళ్ళ ఫోన్ నంబర్లు తెలియవు. ఏం చేయాలో తెలియని అయోమయ స్థితిలో మరో నెలరోజులు గడిచి పోయాయి. ఆనెల తరువాత మరో ఉత్తరం వచ్చింది. చాలా క్లుప్తంగా ఉన్నది.

స్వాతీ, నెలరోజుల క్రితం నీకు పేపర్లు పంపించాను. అవి వెంటనే సంతకం చేసి కొరియర్లో పంపించు. నాకు ఎక్కువ టయిము లేదు.

రాహుల్

ఉత్తరంలో అక్షరాలన్నీ ఒంకరటింకరగా ఉన్నాయి. ఎదో హడావిడిలో గిరికినట్లున్నాయి.

ఇంత క్లుప్తంగా ఏవిధమయిన వివరాలూ లేకుండా, ఇలాంటి ఉత్తరం చూస్తే స్వాతికి చాలా ఆశ్చర్యం కలిగింది. అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలనే పట్టుదల పెరిగింది.

అనూష భర్త స్టేట్స్‌లో బోస్టన్‌లో ఉంటాడని గుర్తుంది. - ఆరోజే అనూష దగ్గరకు వెళ్ళి, అతని అడ్రసు, ఫోన్ నంబరూ తీసుకుంది.

"సుధీర్ గారూ, మీకు నేను తెలియదు. నా పేరు స్వాతి. మీ పెళ్ళికి నేను వచ్చాను. నేనూ, అనూషా క్లోజ్ ఫ్రెండ్స్ ఎప్పటి నుండో. నాకు మీ నుంచి ఒక సహాయం కావాలి."

"చెప్పండి నేను చేయగలిగిందేమయినా ఉంటే తప్పక చేస్తాను."

"బోస్టన్‌కు న్యూయార్క్ మరీ దూరమేమి కాదుగదా! నేను మిమ్మల్ని శ్రమపెట్టాల్సి వస్తోంది - కాని ఇది నాజీవితానికి సంబంధించిన విషయం" అని మొదటినుండీ వివరాలన్నీ చెప్పింది. రాహుల్ మొదటి

నుండి ఎలా ఉండే వాడో, ఈ రెండు నెలలుగా ఎలా విచిత్రంగా ప్రవర్తిసున్నాడో అన్నీ వివరంగా చెప్పింది. అతను వ్రాసిన రెండు ఉత్తరాల గురించి చెప్పింది. ఈమెయిల్స్‌కు ఆన్సర్ చేయక పోవటం, ఫోనులో దొరక్కపోవటం అన్నీ చెప్పింది.

"సుధీర్‌గారూ! రాహుల్ ఎలాంటివాడో నాకు బాగా తెలుసు. ఏదో అనివార్యకారణాలవల్ల ఇలా చేస్తున్నాడని నా అభిప్రాయం. మీరు ఏమీ అనుకోకపోతే, నాకోసం ఒకసారి న్యూయార్క్ వెళ్ళి విషయం కనుక్కోండి." రాహుల్ ఫోన్ నంబరూ, అడ్రసూ ఇచ్చింది.

"తప్పకుండా వీకెండ్ మాత్రం నాకు వీలవుతుంది. న్యూయార్క్‌లో నాకు ఒక ఫ్రండ్ ఉన్నాడు. త్వరలో అక్కడకు వెళ్ళి, విషయం తెలుసుకుని మీకు ఫోన్ చేస్తాను."

----------

ఆరోజు సెప్టెంబరు పదకొండవతేదీ (౨౦౦౧) అన్ని రోజులలాగానే ఆరోజూ సూర్యుడు తూర్పున ఉదయించాడు. రోజూలాగే ఉదయం ఎనిమిది గంటల కల్లా పిల్లలు స్కూళ్ళకూ, పెద్దవాళ్ళు ఉద్యోగాలకూ బయలుదేరి వెళ్ళారు. రాహుల్ కూడా ఉదయంలేచి, బ్రేక్ ఫాస్ట్‌కు బేగల్ తిని హడావిడిగా వర్క్‌కు బయలు దేరాడు. అతని ఎపార్టుమెంటు, వర్క్ ప్లేసుకు చాలా దగ్గర పదినిముషాలు వాకింగు. ఈ మహా పట్నంలో వర్క్, వాకింగ్ డిస్టెన్సులో ఉండటం మహాభాగ్యం.

ఆ ట్రాఫిక్‌లో కారులో వెళ్ళాలన్నా, కారు పార్క్ చేయాలన్నా గంటలు పడుతుంది.

అది సెప్టెంబరు నెల కావటంతో అప్పుడప్పుడే కొంచెం చలి ప్రారంభమవుతోంది. పలచగా ఉండే ఫాల్ జాకెట్ వేసుకుని, రాహుల్ నడుచుకుంటూ ఆఫీసుకు బయలు దేరాడు. అతని ఆఫీసు వర్ల్డ్‌ట్రేడ్ సెంటరు, ట్విన్ టవర్స్‌లో ఒక టవరు నాల్గవ అంతస్తులో ఉంది. ఎలివేటరు తీసుకుని ఆఫీసుకు వెళ్ళి డెస్క్ దగ్గర కూర్చున్నాడు. ఆరోజు వర్క్ ఏమి పూర్తి చేయాలో చూస్తున్నాడు. టయిము దాదాపు ఉదయం ౮:౩౦ గంటలయి ఉండొచ్చు సడెన్‌గా చాలా పెద్ద శబ్దం వినిపించింది. ఎంత పెద్ద శబ్దం అంటే ప్రళయం వస్తుందా అన్నంత భయంకరంగా ఉంది. అదే సమయంలో బిల్డింగ్ అంతాషేక్ అవుతున్న ఫీలింగు - వీటన్నిటితో పాటు విపరీతమయిన పొగలు. ఏమీ కనపడటం లేదు. అందరూ గందరగోళంగా పరిగెత్తుతున్నారు. బిల్డింగ్‌లో ఫైర్ మొదలయిందేమో అనుకున్నాడు. ఎవరి దారిన వాళ్ళు పరుగులు పెడుతున్నారు. ఎలివేటరు ఉపయోగించ గూడదనే విషయం అర్థమయింది. అందరూ బిల్డింగ్ లో నుండి బయట పడటానికి ప్రయత్నిస్తున్నారు. ఆ సమయంలో ఎవరేం చేస్తున్నారో అర్థం కావటంలేదు. ప్రాణాలతో బయటపడాలంటే బయటికి వెళ్ళిపోవాలి అని మాత్రం అర్థం మవుతోంది. త్వరగా బాల్కనీ దగ్గరకు వెళ్ళి, ధైర్యంగా క్రిందికి దూకేశాడు రాహుల్. ఆ తరువాత అతనికి ఏమీ తెలియలేదు. స్పృహతప్పింది. కళ్ళు తెరిచే సరికి హాస్పిటలు బెడ్ లో ఉన్నాడు.

కొంచెం తేరుకుని విషయం అర్థం చేసుకునే లోపల డాక్టరు రౌండ్స్‌కు వచ్చారు. "మిస్టర్ రాహుల్ ! వుయి డిడ్ నాట్ హావ్ ఎనీ చాయిస్.... వుయ్ హాడ్ టు యాంపుటేట్ బోత్ యువర్ లెగ్స్ ఎబౌ ది నీస్"... కాసేపు ఆగి మళ్ళీ అన్నారు ఇంగ్లీషులో "మీ ఫామిలీ మెంబర్సుకు ఎవరికెయినా కబురు చేయమంటే సేస్తాము అడ్రసు, ఫోన్ నంబరూ చెప్పండి. మీరు కొంత రికవర్ అయ్యాక ప్రోస్తిసిస్‌కు ఆర్డరిద్దాము. అంతవరకూ రీహాబ్ వాళ్ళు హెల్ప్ చేస్తారు. క్లచ్చర్సుతో నడవటానికి ప్రయత్నించండి."

రాహుల్‌కు ప్రపంచ మంతా తలక్రిందులయినట్లు అనిపించింది. ఏమంటున్నారు? తనకు రెండు కాళ్ళూ లేవా? స్వాతిని వెంటనే చూడాలని తహతహ కలిగింది. ఆమె వళ్ళో తల పెట్టుకుని భోరున ఏడవాలని పిస్తోంది. --- కాని కానీ, అమ్మో స్వాతికి ఈ విషయం తెలియకూడదు. ఈస్థితిలో తను స్వాతిని కలవకూడదు - అందుకే తనకెవరూ లేరనీ, ఎవరికీ తెలియ పరుచనవసరం లేదనీ చెప్పాడు డాక్టర్లకు.

ఆ పాపిష్టి రోజు ఏం జరిగిందో, ఎంత నష్టం జరిగిందో, ఎన్నివేల మంది జీవితాలు కోల్పోయారో టి.వి. లో పదేపదే చూపిస్తున్నారు. ఏ పత్రికలలో చూసినా అదే న్యూస్. ఆ టెర్రరిస్టులు, విమానాలను మారణాయుధాలుగా ఉపయోగించి ప్రపంచానికే ఎంత కష్టం కలిగించారో కళ్ళెదుట కనిపిస్తోంది. తను కూడా అలా కాలగరంలో కలిసిపోతే ఎంత బాగుండేది. ఇప్పుడిలా రెండు కాళ్ళూ పోగొట్టుకుని ఏం చేయాలి? ఏమయినా ఈ విషయం స్వాతికి తెలియటానికి వీల్లేదు. తను ఎంత బాధ పడుతుందో ఊహించగలడు. స్వాతి జీవితంలో సుఖపడాలి. తనకు ఏకష్టం రాకూడదు.

ఏదో విధంగా స్వాతి తన నుండి దూరం అయేట్లు చూడాలి. తనంటే కోపం, అసహ్యం కలిగేట్లు చూడాలి.

డాక్టరు రౌండ్స్‌కు రావటంతో రాహుల్ ఆలోచనా స్రవంతి ఆగిపోయింది.

ఆరోజు ఆదివారం. రాహుల్ హాస్పిటలు నుండి డిశ్చార్జి అయి ఒక వారం అవుతోంది. నెమ్మదిగా క్రచెస్‌తో అడుగులు వేయటం అలవాటయింది. ఇంకా ప్రొస్తిసిస్ ఇవ్వటానికి టయిము పడుతుందన్నారు. నెలరోజులు గడిచినా తను వ్రాసిన ఉత్తరానికి స్వాతి నుండి తను ఆశించిన సమాధానం రాలేదు.

కాలింగ్ బెల్ వినబడితే నెమ్మదిగా వెళ్ళి తలుపు తీశాడు.

"రాహుల్ మీరేనా? నాపేరు సుధీర్ నేను మీకు తెలియదు. నేను మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"రండి కూర్చోండి."

"నేను బోస్టన్ లో ఉంటాను. స్వాతిగారు నాకు ఫోన్ చేసి మిమ్మల్ని కలిసి వివరాలు తెలుసుకోమన్నారు." కొంచెం ఆగి నెమ్మదిగా అన్నాడు సుధీర్ "మిమ్మల్ని చూశాక నాకు విషయం పూర్తిగా అర్ధమవుతోంది. మీరు స్వాతికోసం త్యాగం చేద్దామనుకున్నారు. కాని ఆమె ఎంత తల్లడిల్లిపోతోందో ఊహించారా? ఇంత త్యాగం చేస్తున్నారంటే, మీరామెని ఎంతగా ప్రేమిస్తున్నారో అర్ధమవుతోంది. మరి ఆమె కూడా మిమ్మల్ని అంతగానే ప్రేమిస్తోంది కదా! నిజం దాచి పెట్టి ఆమెకు మంచి ఎలా చేద్దామనుకున్నారు? మీరు చాలా పొరపడుతున్నారు. కష్టంలోనూ, సుఖంలోనూ తోడుగా ఉండాలనుకునే సహచరిని ఇలా మభ్యపెట్టి దూరం చేసుకోవటం అవివేకం. ఆలోచించండి."

రాహుల్ ముఖంలో విపరీతమయిన నిరాశ కనిపిస్తోంది. "సుధీర్ గారూ స్వాతికి మంచి జీవితాన్ని కల్పించాలని నా తాపత్రయం. ఇలా చేస్తే ఆమె నన్ను అసహ్యించుకుని, నెమ్మదిగా మరిచిపోతుంది. ఆ తరువాత మరెవరినయినా పెళ్ళి చేసుకుని సుఖపడుతుందని నా ఆశ."

"సుఖమంటే ఏమిటి? మనసైన వారికి దగ్గరలో ఉండి, వాళ్ళ సుఖదుఃఖాలలో భాగంగా ఉండటం." కొంచం ఆగి మళ్ళీ సుధీర్ అన్నాడు. "విత్ యువర్ పర్మిషన్ నేను స్వాతిగారికి నిజం చెబుతాను. తరువాత ఆమె నిర్ణయం ఆమె చేసుకుంటారు."

విషయం తెలిసిన తరువాత స్వాతి వెంటనే విజిటరు వీసాకు అప్లై చేసింది. తన భర్త 9।। ప్రమాదంలో కాళ్ళు పోగొట్టుకుని ఒంటరిగా ఉన్నాడని వివరించింది. వీసా వచ్చిన వెంటనే న్యూయార్క్ వచ్చేసింది.

"రాహుల్ ఎందుకిలా చేశావు? నేనెలా నమ్ము తాననుకున్నావు? నీవేమిటో నాకు తెలియదా? ఇదేనా నీవు నన్నర్ధం చేసుకున్నది? కష్టసుఖాల్లో భాగస్తులుగా ఉంటామని ప్రమాణం చేసుకున్నాం. నీకింత కష్టం వస్తే నన్నిలా దూరంగా తోసివేస్తావా?"

"స్వాతీ నాతో పాటు, నీజీవితాన్ని కూడా ఈ చీకట్లోకి లాగటం నాకిష్టం లేక పోయింది."

రాత్రి చీకటి తరువాత పగటి వెలుగు వస్తుంది రాహుల్! అది ప్రకృతి ధర్మం - మనకూ ఈ చీకటిలో నుండి వెలుగులోకి దారి కనిపిస్తుంది. రాహుల్!"

"నేను పొరపాటుగా ఆలోచించాను స్వాతీ! నన్ను క్షమించు."

"అయినా నన్ను విడిచి వంటరిగా ఎలా ఉండగలననుకున్నావు? నీవు లేకుండా నేను ఎలా సుఖపడతాననుకున్నావు?"

"స్వాతీ ఇలా కుంటివాడిగా బ్రతికేకంటే ఆ ప్రమాదంలో చనిపోతే ఎంతో బాగుండేది."

"అలా అనకు రాహుల్! నా అదృష్టం వల్ల నీవు బ్రతికి బయటపడ్డావు. కాళ్ళు లేకపోతే ఏమయింది రాహుల్! ఆలోచించే జ్ఞానం ఉంది. అన్నిటికంటే మించి ప్రేమించే మనసు ఉంది. - రాహుల్ నీమనసు కల్మషం అంటని స్వాతిముత్యం లాంటిది. అలాంటి స్వాతి ముత్యాన్ని నేనెలా వదులుకోగలను? రాహుల్!"

# నింద

**- బేతనపల్లి బోస్**

అమెరికాలో వున్నా, ఆంధ్రాలో వున్నా, పండుగల్ని మర్చిపోవడం సుబ్బారావు తత్వం లోనే లేదు.

"నాగుటించి పట్టించుకోక పోయావో........ జాగ్రత్త! నేనేమిటో నా పవరు ఏమిటో...... మానవుల దగ్గరనుండి ముక్కోటి దేవతల వరకూ తెలియనిది కాదు" అని చెప్పే వినాయక చవితిని మర్చిపోవడమా?

అమెరికాలో పని సౌలభ్యం కోసం, సోమవారం నుండి శుక్రవారం మధ్యలో పడ్డ పండుగల్ని, వారం చివరకు తోసేయడం ఆనవాయితి. వాతావరణం మరియూ ఇతర పరిస్థితుల వల్ల అప్పటికి, ఆ పండుగ జరుపుకోవడం కుదరక పోతే, ఆ పైవారానికి పోస్టుపోను చెయ్యడం అతి సాధారణం.

కానీ సుబ్బారావు అలాకాదు ఘడియలు, విఘడియలు లెక్క జూసుకున్నాడు. టంచన్‌గా ఉదయం ఏడో గంటకు వినాయకపూజ జరిగిపోవాలి. కాలెండరు ప్రకారం, పండుగ వారం మధ్యలో పడింది. అయితే ఏమిటి? టైమ్, చాలా చక్కగా, భేషుగ్గా కుదిరి పోయింది. ఏడో గంటకు పూజ అయిపోతే, కొడుకు హరి స్కూలు టైమ్‌కి. తన ఆఫీస్ టైమ్‌కి గాని ఇబ్బంది లేని ముహూర్తం.

మరునాడు - చవితి రోజు ఉదయం, ఐదుగంటల సమయం. పన్నెండు సంవత్సరాల కొడుకు హరిని లేపే ప్రయత్నంలో వున్నాడు సుబారావు. లేవనుగాక లేవను అని పేచీ పెట్టాడు హరి. లేవడం కష్టం, డాడ్ అని సర్దుకు పడుకున్నాడు. పెందరాళే కొడుకును నిద్ర లేపడం సుబ్బారావు సహనానికి పరీక్షే అయింది.

అప్పటికే స్నానం ముగించి అటు వచ్చిన శాంత "నాన్నా, హరీ, లేరా" అంటూ వంటగది వైపు నడిచింది, ఆగకుండానే. వేరే మాట లేకుండా, హరి లేచి కూర్చున్నాడు.

శాంత సుబ్బారావు భార్య. సౌమ్యురాలు. గంభీర మూర్తి. మితభాషిణి. సుబ్బారావుకు ఎప్పుడూ ఆశ్చర్యమే. తను అరచి ఘీపెట్టినా, వినని కొడుకు - వాళ్ళమ్మ "నాన్నా" అని అన్న ఒక్క మాటతో సెట్ రైటు అయిపోతాడు.

ముచ్చటగా, ముగ్గురూ కూర్చున్నారు పూజకు. వినాయక చవితి కథా పుస్తకం చదివాడు సుబ్బారావు. అర్థం కానిది అయినా అమ్మమీద ప్రేమ వల్లో, తండ్రి మీద భయం వల్లో కథని శ్రద్ధగానే విన్నాడు హరి. ఆయురారోగ్య సుఖసంతోషాలతో పాటు ఎలాంటి నిందలూ రాకుండా చేయమని వినాయకుణ్ణి ప్రార్థించాడు సుబ్రావ్. పూజ ముగిసింది.

పూజ కోసం చేసిన ఉండ్రాళ్లు, వడపప్పు, బ్రేక్ ఫాస్టుగా తిన్నారు ముగ్గురు.

School Busలో హరి స్కూలుకి వెళ్ళాడు. భార్యకు బై చెప్పి ఆఫీసుకు వెళ్లాడు సుబ్బారావు. పని మీద ధ్యానం కుదరలేదు మనసంతా గతవారంలో జరిగిన సాహితీ సదస్సులో కొన్న "భరాగో ।।6" గొప్ప సినిమాపాటల సంకలనంతో నిండిపోయి వుంది. టైమ్ కుదరక, ఇంతవరకూ, పేకెట్ ఓపెన్ కూడా చెయ్యలేదు.

సీట్లో *అనీజీగా* కదిలాడు. అటూ ఇటూ చూశాడు పిచ్చిగా. అవసరం అయినప్పుడు, ఆఫీస్‌లో లేట్ అవర్సు ఎలాగూ వుంటాడు, పని ముగించేదానికి. ఈ రోజు వినాయక చవితి. ఎప్పుడో సాయంత్రం ఇంటికి వెళ్ళే టైమ్‌కి చవితి చంద్రుడు వద్దు అనుకొన్నా కన్పించే ప్రమాదం వుంది. చెడుచూడొద్దు, వినొద్దు, మాట్లాడొద్దు అన్నట్లు తెలిసి ఎందుకు రిస్కు తీసుకోవడం?

వుండబట్ట లేక, వాళ్ళ బాస్‌తో, ఒంట్లో బాగాలేదు అనిచెప్పి, మధ్యాహ్నం మూడో గంటకల్లా ఇల్లు జేరిపోయాడు సుబ్రావ్. భార్యకు హలో చెప్పి, సోఫావైపు నడిచాడు. సోఫా వెనుకనే వున్న కిటికీ కర్టెన్ పూర్తిగా మూసేశాడు, ముందు జాగ్రత్తగా. హమ్మయ్య చంద్రుణ్ణి చూడవల్సిన ఆపద తప్పింది. కంప్యూటర్‌లో bugs వచ్చినప్పుడు ఏదో విధంగా ఫిక్సు చేసుకోవడం మామూలే. అది మిషను ప్రాబ్లమ్. నింద అనేది మనిషి ప్రాబ్లమ్. ఫిక్సు చేయడం కష్టం. అలా అనుకుంటూ కూర్చున్నాడు విశ్రాంతిగా.

భార్య ఇచ్చిన కాఫీ చప్పరిస్తూ, "భరాగో" సినిమా పాటల పాకేజ్ ఓపెన్ చేశాడు. పుస్తకం చూడముచ్చటగా వుంది. కవర్ పేజి వెనుక పేజ్ లామినేట్ చేసివుంది. బాండ్ పేపరు మీద ముద్రణ ముచ్చటగా వుంది. రెండు పేజీలు తిప్పగానే "భరాగో"ఫోటో, ప్రక్కనే "సుఖకష్టాలు" అన్న టైటిల్‌తో ముందు మాటలున్నాయి. కష్టసుఖాలు అన్న మాటని ఈయన తిప్పిరాశారే అనుకుని, తీపి

అలసట కలిగేటంత ఆత్రంగా చదవడం ప్రారంభించాడు సుబ్రావ్.

కొంచం చదివిన తరువాత "ఓపిక లేని వాళ్లు దీనిని వదిలేసి ప్రక్క పేజీల్లోకి వెళ్లిపోవచ్చు" అని "భరాగో" వ్రాసినట్లుగానే, పాటల పట్టికలోకి వెళ్లాడు. "సీతాకల్యాణం" హరికధని ఎంచుకొన్నాడు మొదటి పాటగా. పండుగరోజు, పుణ్యం, పురుషార్ధం అంటే మాటలా!

సీతాకల్యాణం పాటలో - నాయనలారా, ఇది సీతా కల్యాణ సత్కధ. సీతాదేవి స్వయంవరానికి ముల్లోకాల నుండీ విచ్చేసిన వీరాధివీరుల్లో అందరినీ ఆకర్షించిన దివ్య సుందర మూర్తి ఎవరయ్యా అంటే, "రఘు రాముడు, శ్రీరాముడు"

అంతవరకూ బాగానే అనిపించింది సుబ్రావ్‌కు. అందం అందరినీ ఆకర్షిస్తుంది.అందాన్ని ఆరాధంచడంలో తప్పులేదు, కావాలని కోరుకోవటంలోనే వుంది.

....అలా విజయం చేస్తున్న శ్రీరామ చంద్రుణ్ణి, ఓరకంట చూసినదై, చెంగటనున్న చెలికత్తెతో, "ఎంత సొగసుగాడే, మనసింతలోనె దోచినాడే.... శ్యామలాభి రాముని జూడగ నామది వివశమాయె నేడే" అని పరవశంతో పాడుతుంది.

అది బాగానే నచ్చింది సుబ్రావ్ కి.

....అక్కడ స్వయంవర మండపంలో, సభాసదులతో జనకుడు "ముక్కంటి వింటి నెక్కిడ జాలిన .... ఎక్కటి జోదును నేడు, మక్కువ మీరగ వరించి మల్లెల మాలవైచి పెండ్లాడు" అని ఛాలెంజ్ చేయడం సుబ్రావ్ కి నచ్చలేదు. సీతాస్వయంవరం అన్నప్పుడు, సీతాదేవి స్వయంగా తన మనసులో కోరుకొన్న మనిషి మెడలో మాల వేసినట్లయితే, న్యాయంగా వుండేది. మొదటి చూపులోనే సీతాదేవి మనసు శ్రీరాముడి వశం అయినప్పుడు - ఏ కాకాసురుడో, బకాసురుడో, రావణాసురుడో విల్లు విరిచినట్లయితే, అతనికే సీతాదేవి భార్య అయివుండేది. మనసు ఒకరికి తనువు మరొకరికి! ఛ ఛ సుబ్బారావు మనసు ఏదోలా అయిపోయింది.

ఓరగా, వంటగదివైపు చూశాడు. వంట చేస్తున్న శాంత వెనుక భాగం కన్పిస్తుంది. సీతాదేవి టైమ్‌కి, ఇప్పటికి పెద్దతేడా లేదనిపిస్తుంది. "భుజబలం" చూపించ గలిగినవాడు "సీతాదేవికి" భర్త, మామగారిచ్చిన "కట్న బలం" నచ్చిన వాడు "శాంత"కు భర్త. అక్కడ బలం, ఇక్కడ ధనం. సీతాదేవి మనసు జనకుడు పట్టించు కోలేదు. శాంత మనసు వాళ్ళ నాన్న పట్టించుకోలేదు. తన కంటే ముందు, శాంతను పెళ్లిచూపులకు వచ్చిన వాళ్లలో శాంత మనసుకు నచ్చిన వాడు ఎవరని ?

ఎప్పుడూ శాంత చెప్పలేదు. తను అడగలేదు. ఎందుకని అడగలేకపోయాడు? కాలేజీలో వున్నప్పుడు "కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాను" అన్న మాటలు, "పెళ్లిలో కట్నం లేకుండా తాళి కట్టను" అన్న మాటలు గుర్తొచ్చాయి సుబ్రావ్‌కి. మాటలకు మహాత్ముడు చేతలకు పాపాత్ముడు. చెప్పరాని అశాంతితో మనసు వికలమైయ్యింది.

వంటగదిలో పని చేస్తున్న శాంత కూడా పాట వింటూనే వుంది. శాంత ఇలా అనుకుంది. సీతాదేవి ఒక విధంగా అదృష్టవంతురాలు. భావస్వాతంత్ర్యంతో పక్కనే వున్న చెలికత్తెతో నయినా మనసులో మాట చెప్పుకుంది. వ్యక్తిస్వాతంత్ర్యం, భావస్వాతంత్ర్యం, ఆర్ధికస్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం అంటే కూడా తెలియని వాళ్లు, రామాయణ కాలం నుండీ, నేటివరకూ, కారణాలు ఏమైనా కోకొల్లలుగా వున్నారు.

బాల్యం మీరకుండానే, ఆడపిల్లలకు పెళ్లిళ్ల జరిగి పోవడం, ఆయుషుతీరకుండానే బలవంతంగా చనిపోవడాలు, చంపబడడాలు, ఆడది అంటే ఆస్తితో సమానం, ఎవ్వరి కంటా పడకూడదన్నట్లు బురఖా ధరించే నిర్బంధనలు, బురఖాలు వేసుకొంటే కాలేజీల్లో సీట్లు ఇవ్వకపోవడాలు, మతమనే మంచి మాటలు చెప్పవల్సిన ప్రీస్టులే, లేతమొగ్గలుగా వున్న ఆడపిల్లల్ని మానభంగాలు చేయడం, చిన్న చిన్న ఆడపిల్లల్ని వయసుతో సంబంధం లేకుండా ఎగబడి కొనుక్కుని పోతున్న ఆరబ్‌షేక్స్ ఆగడాలు ...... పతితులు, భ్రష్టులు ఎలా పుడతారో, చెప్పక చెప్పే ఈ సమాజం తీరు చూస్తుంటే ఆ సీతాదేవికి కోరుకున్న మనిషితో పెళ్లి కావడం అన్నది అదృష్టమే మరి.

వికలమనస్కుడై కూర్చున్న సుబ్బారావు హరికధ అయి పోయి, ఇంకా వేరే పాటలు కూడా అయిపోతుండడం గమనించుకోలేదు. అంతలో బయట బస్సు ఆగిన శబ్దం విని టేపు ఆపుచేశాడు.

మధ్యాహ్నం, స్కూలు అయిపోవడంతో హరి ఇంటికి వచ్చాడు. సుబ్బారావుని చూస్తూ, హాయ్ డాడ్ అంటూ -- శాంత దగ్గరకు వెళ్లి హగ్ ఇచ్చి - అమ్మా, నేను ఆడుకోవడానికి వెళ్లేదా ? అని అడిగాడు.

"ఉదయం తొందరగా లేచావుగదా. హోం వర్కు చేసుకో. ముందుగా లెక్కలు చేసి డాడీకి చూపించి, చెక్ చేయించుకో. డాడీ కూడా తొందరగా ఇంటికి వచ్చారు. ఈరోజు కాసేపు చదువుకుని, తిని, తొందరగా నిద్రపో" అంది.

అమ్మ మాట హరికి మంత్రం. ఇష్టాఇష్టాలతో నిమిత్తంలేదు. అలాగే అంటూ, పెట్టింది తిని, హోం వర్కు చేసేదానికి కూర్చున్నాడు.

ఏదో లోకంలో వున్న సుబ్బారావుని ఎవరో కుదిపి నట్లయి కళ్లుతెరిచాడు. ఎదురుగా హరి నిలబడి వున్నాడు. "ఐ యామ్ డన్ విత్ మాత్ డాడ్" అన్నాడు.

అంత తొందరగానా! అన్నాడు సుబ్రావ్ ఆశ్చర్యంగా. ఆన్సర్స్ చెక్ చేసి, గుడ్, మరి నీ workout పేపరు చూపించు, ఎలా సాల్వు చేశావో చూస్తాను" అన్నాడు. "work out" అఖ్ఖరలేదు. ఆన్సర్స్ కాపీ చేసి, మాత్ ముగించాను" అన్నాడు హరి.

సుబ్బారావు మనసు అదోలావుంది. పుండు మీద కారం అన్నట్లుగా, ఖయ్యిమన్నాడు హరి మీద. "work out పేపరు అంటే backup కాపీ లాంటిది. అది లేకపోతే నీకు problem ఎలా solve చెయ్యాలో ఎప్పటికీరాదు. మళ్లీ చేసి step by step ఎలా solve చేశావో చూపించు" సుబ్బారావు గద్దించాడు.

హరి మొగంలో కోపము, ఏడుపు రెండూ కలిసి వచ్చేలా వున్నాయి. ఎర్రని మొఖంతో "డాడ్, ఉదయం వినాయక పూజ చేశాం. అప్పుడు మీరు వినాయకుడు ఎంత శక్తిపరుడో ఎంత యుక్తిపరుడో అని మెచ్చుకొన్నారు. ముల్లోకాల ప్రదక్షణ కోసం కుమార స్వామి, నెమలి వాహనం వేసుకొని, రయ్యిన బయలుదేరితే, వినాయకుడు మాత్రం తల్లిదండ్రుల చుట్టూ మూడు సార్లు తిరిగి "ముల్లోకాలకు మీరే తల్లిదండ్రులు, మీచుట్టూ తిరిగితే, మూడు లోకాలు తిరిగినట్లే" అని చెప్పినప్పుడు శివపార్వతులకు ఆనందంతో మతులు పోయాయని చెప్పావు."

వినాయకుడు workout లేకుండా ముల్లోకాలు యాత్ర చేస్తే, అది ఎంతో గొప్ప విషయంగా మెచ్చుకున్న మీరు - అదేవిధంగా తక్కువ టైమ్‌లో సులువుగా math చేస్తే ఎందుకు మెచ్చుకో లేక పోతున్నారు నన్ను? పైగా కోపం. డాడ్, మీరు చెప్పేది ఒకటి చేసేది మరొకటి. మీదంతా డబుల్ స్టాండర్డు. హిపోక్రసి" అంటూ విసవిసా నడిచిపోయాడు హరి.

సుబ్బారావుకు నోట మాట రాలేదు. శాంత హరి వెనకాలే వెళ్లి ఏమి చెప్పిందో తెలియదుగాని ఏశబ్దం వినిపించలేదు సుబ్బారావుకు. అంతా నిశ్శబ్దమే. భోజనానికి లేవొచ్చు అని పిలిచేవరుకూ నిశ్శబ్దమే.

ముగ్గురు భోజనాలకు కూర్చున్నారు. హరి వైపు చూశాడు సుబ్బారావు. మీతో మాట్లాడడం నాకు ఇష్టం లేదన్నట్లుగా వుంది వాడి వైఖరి. తలవంచుకు తింటున్నాడు. వాడిలో రోజూ వుండే హుషారు వీసమంత లేదు. పండుగ రోజున కొడుకు మీద కోపగించుకోవడం సుబ్బారావుకు తనమీద తనకే కోపం వచ్చింది.

ముద్దు ముద్దు మాటలతో మైమరపించే హరి, చిట్టి పొట్టి ఆటలతో అలరించే హరి ఇలా ఖిన్నుడై కూర్చోవడం చూస్తుంటే - తండ్రిదగ్గర పిల్లకు భయం వుండాలని చెప్పే శాంత మీద కోపం వచ్చింది.

చదువు, సంధ్య, ఉద్యోగం, హోదా, డాబు, దర్పం అని నేర్పించే సంఘనీతినియమావళి మీద కోపం వచ్చింది.

మనుష్యులు ఇలానే వుండాలి అని పెట్టిన కట్టుబాట్ల మీద, ఎన్నోతరాల నుండి వస్తున్న ( మూఢ) నమ్మకాల మీద చెడ్డకోపం వచ్చింది.

కొడుకును దగ్గరకు తీసుకొని గుండెలకు హత్తు కొందామన్న కోర్కె ఎంత బలంగా వున్నా - కుర్చీలో నుండి లేవనీకుండా సుబ్బారావుని కట్టిపడేసిన "డిసిప్లిన్" అన్న రక్కసి మీద మహా కోపం వచ్చింది సుబ్బారావుకు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, శాంత సౌమ్యంగానే అడిగింది. "అయితే భరాగో పాటలు ఎంతకు కొన్నారు" అని. చెప్పాడు సుబ్రావ్ .

అదోలా చూసింది సుబ్బారావు కళ్ళలోకి. ఆ చూపంటే సుబ్బారావుకు భయం. ముల్లులా గుండెలో గుచ్చుకుంటుంది. ఈ మధ్య అది మరీ లోతుగా వెళ్లి, ఎక్కడా ఆగను అన్నట్లుగా వుంది.

మాట్లాడితే, పోట్లాడదామని చూస్తున్నాడు. గుండెల్లో బరువు తగ్గించే ఛాన్స్ సుబ్బారావుకు ఎప్పుడూ ఈయలేదు, ఇప్పుడూ ఈయలేదు శాంత.

క్రిందటి వారం, షాపింగ్‌కి వెళ్లినప్పుడు షోకేసులో వున్న అందమైన చీరను ఆసక్తిగా చూస్తున్న శాంతతో, చూస్తే చూశావుగాని, కొనమని అడగొద్దు అని హెచ్చ రించాడు. అది 25 డాలర్ల అందమైన Binny Silk Saree.

అప్పుడు కూడా ఇదే చూపు. ముల్లు చూపు. మాటలకు అందని నింద. మహానింద. ఎన్నో అర్థాలు స్ఫురిస్తాయి ఆ చూపులకు.

స్వామీ, వినాయకా, పుస్తకంలో వున్నట్లు నీకధ చదివాను. పూజ చేశాను. చవితి చంద్రుణ్ణి చూడలేదు. మరి ఎందుకు నాకీ బాధ? ఏమిటి నీ లీల? అనుకుంటూ, అలవాటుగా తల ఆకాశం వైపు తిప్పి, ఈ రోజు 'చవితి' అని జ్ఞాపకం వచ్చి, చటుక్కున తలదించేసుకున్నాడు.

జుట్టు పీక్కుందాం అనుకున్నాడు. నీట్‌గా వున్న డైనింగ్ టేబుల్ ముందు అలా చేయడం నాగరికత కాదని, జుట్టుపీక్కో లేకపోయాడు.

హెల్ విత్ మానర్స్, నాజుట్టు నా ఇష్టం, పీక్కుంటే ఏం అనుకున్నాడు.

నిశితంగా సుబ్బారావునే చూస్తున్న శాంత కళ్ళలోకి చూసి, భార్యా పిల్లల ముందు జుట్టుపీక్కోవడం సభ్యత కాదు అనుకోని రెండవ సారి కూడా జుట్టు పీక్కోలేక పోయాడు...... సుబ్బారావు.

అంకితం: గురుతుల్యుడు, స్నేహశీలి స్వర్గీయ శ్రీ కిడాంబి రఘునాధ్ గార్కి.

# పల్లె బాల్యం

- *భమిడిపాటి కామేశ్వరి*

పల్లె బాల్యం మహద్భాగ్యం
అల్లరి పనుల ఆనందం
అమ్మచేతి చద్దన్నం
ఆరగించి కడుపార
ఎగురుతు దూకుతు
ఏటి ఒడ్డుకు చేరి అలలపై
రాళ్ళు రువ్వి మురిసే బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

తోటి వారిని గూడి
చెట్టా పట్టాలేసుకు
చేల గట్ల వెంబడి
చెంగు చెంగున గెంతుచు
చెరువులోన దిగి ఈతకొట్టి
తానమాడి గొంతెత్తి పాడుకొంటు
గోల గోలగ యిల్లు జేరు బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

పలకా బలపం బట్టి
పరుగుపరుగున
పాఠశాల జేరి
పంతులుగారికి
వందనమొనర్చి
అయ్యవారు నేర్పిన
అక్షరాలు దిద్ది
పాఠాలు వల్లెవేసి
బడి గంట కోసం
పడి పడి జూసి
గంట వినపడగనే
ఆట విడుపుగ
బయటుపడు
పల్లె బాల్యం మహద్భాగ్యం

మామిడి తోటల్లో రాలిన
మామిడి పిందెలు
చింత తోపుల్లో చింతకాయలు
ఏరుకొని తింటు
పిల్లలందరు జేరి
ఆటల పాటల దేలుతు
ఇల్లు జేరు బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

అమ్మ చేతి గోరు ముద్దలుగ
కమ్మని నేతి పప్పన్నం
మీగడ పెరుగన్నం
ప్రేమ మీర అమ్మ పదాలు పాడుతు
పెట్టగ గోముగ మారాము చేస్తూ
అమ్మ ముద్దుమురిపాలను
ఆరగించు పల్లె బాల్యం మహద్భాగ్యం

తోటి పిల్లల గూడి
తొక్కుడుబిళ్ళ
గోణెబిళ్ళాట
గోళీలాట
అష్టచమ్మ కబడి
పులి మేక వామన గుంటలాడుతు
గలగల గడపే బాల్యం
పల్లె బాల్యం మహద్భాగ్యం

చిన్నారి చిటపట చినుకుల తడిసి
పారే నీటిలో కాగితంపు
పడవలు వేసి
చప్పట్లు కేరింతలతో
గడిపే బాల్యం
చీకు చింతా లేని
పల్లె బాల్యం మహద్భాగ్యం

# రేపటి తెలుగు కోసం

*- ఏలూరిపాటి అపర్ణ*

మా అబ్బాయి చిన్నప్పుడు కథలపుస్తకాలు బాగా చదివేవాడు. వాడు ఒకసారి (8,9 ఏళ్ళ వయస్సు ఉన్నప్పుడు) ఒక చందమామ కథ చదివాడు.. అందులో సింహానికి భయపడి కుందేలు చెట్టుపైకి ఎక్కితే, కిందనున్న సింహాం గర్జిస్తూ, 'కిందికి రా. నిన్ను నంజుకుతింటాను.' అంటుంది. ఆ మాట వీడికి బాగా నచ్చి, నా దగ్గరికి పరిగెట్టుకొచ్చి ఆ మాట చదివి వినిపించాడు. ఎందుకో వాడికి ఆ మాటలో ఏదో దగ్గరితనం, ఆత్మీయత కనిపించాయి.. రోజూ వినే నంచుకోవటం అనే మాట కథలో కనపడేసరికి వాడికి ఒకలాంటి సరదా కలిగించిందన్నమాట. ఇప్పటికి వాడు ఆమాటను అప్పుడప్పుడు సరదాగా ఫ్రెండ్స్ మీద ప్రయోగిస్తుంటాడు.. 'మా ఇంటికి రారా, నీ మెదడు నంజుకుతింటాను.' అంటూ.

అలాగే మా అమ్మాయి ఒకసారి తెలుగు న్యూస్‌పేపర్ లో 'ఆ అంశం ఇప్పటికి రావణకాష్ఠంలాగా రగులుతూనే ఉంది' అనే వాక్యాన్ని చదివి, 'అంటే ఏమిటి'అని నన్ను అడిగింది. నేను రావణాసురుడు చాలా దీర్ఘకాయుడు, అతని చితి ఇప్పటికి మండుతూనే ఉందని పురాణగాథ. అది జాతీయమయ్యింది. ఎప్పటికి పరిష్కరించబడని, ముగింపులేని సమస్యలను, విషయాలను రావణ కాష్ఠంలాగా రగిలిపోవటం అంటారు అని వివరించాను. అప్పటినుంచి తను ఎక్కడ ఏ విషయం చదివినా, అందులోని జాతీయాలను, సామెతలను పరిశీలిస్తూ, వాటి అర్థాలు తెలుసుకుని ఎంజాయ్‌చేస్తూ మరీ చదువుతూ ఉంటుంది.

ఈ విషయాలు ఎందుకు చెప్పానంటే, పిల్లలే కాదు పెద్దలుకూడా తాము విన్న, లేదా చదివిన విషయం మీద ఆత్మీయతను అంటే మనది అనే భావాన్ని పెంచుకోవాలంటే ఆ భాష వాళ్ళకు బాగా పరిచయం అయినదయ్యుండాలి. చిన్నపటి నుంచి విన్నదయ్యుండాలి. లేదా బాగా అభ్యాసం చేసిన-దయ్యుండాలి.

అసలు భాష అనే మాట 'భాషణం' అంటే మాట్లాడడం అనే దానినుంచి పుట్టింది. భాష యొక్క ముఖ్యఉద్దేశ్యం మన భావాన్ని ఇతరులకు, ఇతరుల భావాలను మనకు తెలుపుకోవటానికే కదా. నిజానికి దేశదేశాలలో ఎన్నో భాషలు పుట్టి, ప్రాచుర్యాన్ని పొంది, విశ్వవ్యాపితాలైనప్పటికి, భాషయొక్క ముఖ్య ఉపయోగం భావాలను వ్యక్తపరచటమే. కాలక్రమేణా భాష కేవలం భావ వినిమయానికే కాక, విషయాలను నిక్షిప్తం చెయ్యటానికి కూడా ఆలంబన అయ్యింది. దాని కోసం రాత అవసరమయ్యింది. అందువల్ల లిపి ఏర్పడింది. గతంలో జరిగిపోయిన విషయాలను గ్రంథాలద్వారా, ఇప్పుడు జరుగుతున్న విషయాలను వార్తాపత్రికలద్వారా రాబోయే తరాలకు, మన సమక్షంలో లేనివారికికూడా తెలపటానికి, తద్వారా విషయం కేవలం మాట్లాడటం తోనే ముగిసి పోకుండా శాశ్వతంగా నిలబడడానికి కూడా లిపి దోహద పడుతోంది.

అయితే సాధారణంగా పిల్లలు చిన్నప్పుడు తమ భావాలను చెప్పటానికి తమ సొంత భాషనే అంటే మాతృభాషనే మాధ్యమంగా ఉపయోగిస్తారు. అంటే కొత్తభాషకోసం పాకులాడకుండా మన సొంతభాషనే, అంటే చిన్నప్పటినుంచి తమ పరిసరాలలో, తల్లిదండ్రుల దగ్గర, ఇతర కుటుంబసభ్యుల దగ్గర ఏ భాషనైతే నేర్చుకుంటారో ఆ భాషనే తమ ఆలోచనలకు కూడా ఉపయోగిస్తారు. అందులోనే ఆలోచిస్తారు, పదాలను కూర్చుకుంటారు, చెపుతారు. కాబట్టి, అది వారికి మాతృభాష అవుతుంది.

అయితే, నేటి కాలంలో ఏది మాతృభాష అనేది ప్రశ్నార్థకమౌతోంది. నిడదవోలు మాలతిగారు తెలుగు జ్యోతి జూలై - ఆగస్టు పత్రికలో తన 'కులదీపకుడు' అనే కథలో ఒక చక్కని మాట చెప్పారు. అందులో కొడుకు తల్లితో "అమ్మా మనం ఈనాడున్నది అయోమయస్థితిలో. సమస్తం, సందిగ్ధం, అస్తవ్యస్తం, గందరగోళం - ఈ యుగాన్ని గజిబిజియుగం అనవచ్చు." అంటాడు. నిజమే. ఈ మాట అక్షర సత్యం. ఏ ఒక్క విషయానికో సందర్భానికో కాదు. అన్ని విషయాలకు ఈ మాట వర్తిస్తుంది. చివరికి భాష విషయంలో కూడా. నిజంగా మాతృభాష అనే మాట పూర్తిగా గజిబిజిగా గందరగోళంగా తయారయ్యింది.

ముఖ్యంగా పిల్లలకు ఈ అవస్థ మరి ఎక్కువ వుతోంది. వారు చిన్నప్పుడు తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి వినే భాష వేరు. స్కూలుకు వెళితే వినేది, నేర్చేది,

చదివేది అన్ని వేరు. చివరికి ఆలోచించడంలో కూడా ఎందులో ఆలోచించాలో వారికి తెలియదు. ఎవరు నిర్దేశించనూలేరు.

ఎక్కడో పరాయిదేశంలో పుట్టి, అక్కడి సంస్కృతిని, భాషను నేర్చుకుంటున్న పిల్లలకే కాదు. సొంత ప్రాంతం లోని వారికి కూడా ముఖ్యంగా తెలుగు పిల్లలకు కూడా తమ మాతృభాష ఏమిటి అని అడిగితే ఆలోచించ కుండా చెప్పలేని పరిస్థితి. మరి భాష విషయంలోనే ఇలా ఉంటే ఇంక ఆ భాషలోని సాహిత్యం విషయానికి వస్తే మరీ దయనీయస్థితి. పూర్వకాలంలో ప్రతి ఇంట్లోనూ అంతో ఇంతో భాషాపరిజ్ఞా నం ఉన్నవారై ఉండేవారు. ముద్రణ అనేది లేని రోజుల్లో వారు తమ రచనలకు తాళపత్రాలను ఉపయోగించేవారు. నిజానికి ఇప్పుడు మనం ప్రాచీనగ్రంథాలని ముద్రించుకుని చదువుతున్న గ్రంథాలు అందులో ఒక శాతం కూడా ఉండవేమో. రకరకాల దండయాత్రలకు, పరాయిపాలనకు గురై, ఉనికిని కోల్పోయిన భారతదేశం చివరికి తన సాహిత్య సంపదను కూడా చాలా చాలా కోల్పోయింది. తరాలు గడిచి, ఖిలమైపోయి, చెదలు తినెయ్యగా మిగిలిన తాళపత్ర గ్రంథాలను వాటి విలువ తెలియని తరువాతి తరాలవారు చిత్తుకాగితాలకన్నా ఘోరంగా పొయ్యి అంటించుకోవటానికి, లేదా తూకాలకు కూడా అమ్మేశారని, అలా కొంత సాహిత్యం నశించిపోగా, దొరికినంతవరకు కొన్ని విదేశాలకు తరలించాబడ్డాయని విన్నప్పుడు చాలా బాధ కలుగుతుంది.

సరే పోయింది రాదు. ఉన్నవైనా అన్నీ చదవటానికి, అర్థం చేసుకోవటానికి మన ఆయుస్సు, మన పరిజ్ఞా నం సరిపోతాయా అంటే అదీ అసంభవమే. ఎన్నో కథలు, కవితలు, నవలలు, నాటికలు యాత్రా రచనలు, చరిత్ర గ్రంథాలు, శాస్త్రగ్రంథాలు, పరిశోధనలు, నిఘంటువులు, విజ్ఞా నసర్వస్వాలు తెలుగులో ఉన్నాయి. అవన్నీ కనీసం ఒక్కసారి చదవటానికి కూడా మన జీవితకాలం సరిపోదు. ఎంతోకొంత తెలుగు తెలిసిన మన పరిస్థితే ఇలా ఉంటే అసలు తెలుగు పలకటం, అర్థం చేసుకోవటం తెలియని తరువాతి తరాల పరిస్థితి ఏమిటి? ఈ క్రమంలో తెలుగుభాష పరిస్థితి ఏమిటి? అని ఆలోచిస్తే జవాబు దొరకదు.

నిజానికి ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోకూడా తెలుగు సరిగా రాని పిల్లలు ఎందరో ఉన్నారు. మా పిల్లలకు తెలుగు రాదు అని చెప్పుకోవటం ఒక ఫ్యాషన్ కూడా. పెద్దవాళ్ళలో కూడా కేవలం భాష అంటే మాట్లాడేది అన్నట్టే కాని, అది ఒక సంస్కృతీవారాసత్వం అనే భావన ఉండటం లేదు. 'అమ్మా నీ కోసం ఎవరో వచ్చారు' అనే మాట కన్నా, 'మామ్ ,సం ఆంటి కేమె ఫర్ యూ ' అన్న మాటను వాళ్ళు సంతోషంగా స్వీకరిస్తున్నారు.

కనీసం స్కూళ్ళలో కూడా ఇంగ్లీష్ తర్వాత స్థానాన్ని కూడా తెలుగు నేర్చుకోవటానికి ఇవ్వటంలేదు. పిల్లలకు జాతీయభాష అని హిందీని, లేదా ఫ్రెంచి, జపనీస్ వంటి విదేశీభాషలను నేర్పించటానికి చూపించే ఉత్సాహం తెలుగు పట్ల చూపించటంలేదు. నేర్పించటం లేదు నేటి తల్లితండ్రులు.

వీటన్నింటికి తోడు తెల్లవారిలేస్తే చూసి, విని ఆనందించే టీ.వీ. చానెల్స్ కూడా తెలుగు భ్రష్టు పట్టి పోవటానికి తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. ఆ యాంకర్స్ మాట్లాడే మాటల్లో ఇంగ్లీషు చాలా చక్కని ఉచ్చారణతో ఉంటుంది. తెలుగు మాత్రం తింగ్లిష్ లాగానే ఉంటుంది. అదీ పరిస్థితి.

కన్యకుమారి నుంచి కాశ్మీరు వరకూ విస్తరించి ఉన్న మన సువిశాల భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. ఆయా ప్రాంతాల వైవిధ్యాన్ని పూలదండలోని దారంలాగా పట్టి ఉంచేవి భారతీయ సంస్కృతి, భారతీయ సాహిత్యం. వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు వంటివారు సంస్కృతంలోనే రచించినా, ఆయా గ్రంథాలు అన్ని భారతీయ భాషల్లోను కావ్యాలుగా, నాటకాలుగా, కథలుగా, జానపద కళా రీతులుగా రూపుదిద్దుకున్నాయి. ఆర్ష సాంప్రదాయనికి, భారతీయాత్మకు నిలువెత్తు దర్పణాలు ఆ కావ్యాలు.

మన సాహిత్యంతో తగుమాత్రమైనా పరిచయం లేకపోతే వివిధ భారతీయభాషల్లోని సాహిత్యాన్ని అవగాహన చేసుకోవటం చాలా కష్టం. ప్రాచీన-నవీన సాహిత్య పఠనం అలవాటు లేకుంటే మనప్రాంతాల గురించిన స్థలపురాణాలు, దివ్యక్షేత్రాలు, పుణ్యతీర్థాల మహత్యాన్ని గురించి తెలియదు. కొన్ని పదబంధాలు, జాతీయాలు, ఉపమానాలు, కథలు, పొడుపుకథలు, వాటి అర్థాలు తెలియవు. సమగ్రత రాదు.

పత్రికల్లో వచ్చే కవితల్లో, కథల్లో, నాటికల్లో, కార్టూన్లలో ఇంకా మనం రోజూ వాడే సామెతలు, జాతీయాలు, నానుడులు ఇవన్ని మన సాహిత్యం, అందులోనూ పురాణకథలు తెలియకపోతే అసలు అర్థమే కావు. ఉదా: ధృతరాష్ట్రకౌగిలి, రావాణకాష్టం, లక్ష్మణ

రేఖ' ఇలాంటి పదాలకు అర్థాలు తెలియాలంటే ఆయా పురాణాలు తెలియాలి. అప్పుడే వాటి మీద ఆత్మీయత కలుగుతుంది. అదే నేటివిటీ అంటే.

ఇంతటి ప్రాథమ్యాన్ని కలిగిన తెలుగును నేర్చుకోవటం, చదవటం రేపటిపౌరులకు ఎంతైనా అవసరం. మనం మన మూలాలు, వాటి విలువలూ తెలుసుకోవాలంటే ప్రతివారు మాతృభాషను చక్కగా నేర్చుకోవలసిందే. నేటి ఉరుకులు-పరుగుల జీవనవిధానం పిల్లలను పుస్తకాలు చదవటం అనే అలవాటుకు దూరంచేస్తోంది. కాని, మనిషి ఆకాశంలో విహరించినా, భూమే అతనికి ఆధారమైనట్టుగా ఎవరెవరు ఎంత చదువులు చదివినా, ఏయే విద్యలు నేర్చినా మాతృభాషను కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలి. లేకపోతే నేల విడిచిన పామే అవుతుంది. పక్క ఇంటి ఆంటి ప్రేమతో పిండివంటలు పెట్టినా, అవి అమ్మ అప్యాయంగా పెట్టే కమ్మని వంటకాలు కావుకదా.

కాబట్టి మనందరం మన పిల్లలకు చక్కని తెలుగును నేర్పటం, మంచి పుస్తకాలను చదివింప చేయటం, ముఖ్యంగా ఇంటివాతావరణాన్ని తెలుగులో ఉంచడం చేయాలి. అప్పుడే వారికి సరైన ఆలోచనా రీతి, చక్కని భావాలు, వ్యవహారిక దృక్పథం అలవాటు అవుతాయి. పంచతంత్రకథల్లో కేవలం కథలు వినటం వల్లనే రాజకుమారులు లోకజ్ఞానాన్ని పొందారని మనం చదువుకున్నాం కదా. పిల్లలకు మాతృభాషలోని కథలు, గేయాలు వినిపించడం, చదివించటం, వారిచేత చెప్పించడం చేస్తుంటే తెలుగులోని పదాలు, అర్థాలు, సమానార్థకాలు, నానార్థాలు, జాతీయాలు, నానుడులు, సామెతలు అన్ని వారు తెలుసుకుంటారు. ఎంజాయ్ చేస్తారు. అమృతతుల్యమైన తెలుగుభాష మృతసదృశం కాకుండా రేపటికీ, ఎప్పటికీ, తరతరాలా నిలిచి ఉంటుంది.

# వందనా కాలేజ్

- కొమరవోలు సరోజ

వందనా కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరుగుతోంది. ఆ రోజు కార్తీక పౌర్ణమి కావటం వల్ల వందనాదేవి ఇంట్లో సత్యనారాయణ వ్రతం ముగించుకుని, ప్రసాదం స్వీకరించి, కట్టుకున్న కంచిపట్టు చీర మార్చుకుని, అమెరికన్ డ్రెస్ వేసుకుని రయ్యిరయ్యిన కారు డ్రైవ్ చేసుకుంటూ రెడ్ లైట్లను కూడా ఖాతరు చెయ్యకుండా వచ్చి వాలింది.

అప్పటికే ఆమె మిత్రబృందమంతా అతిధులను సాదరంగా ఆహ్వానించి...పన్నీరు చల్లి, స్త్రీలకు చిన్న మల్లెపూల మాల, పురుషులకు గులాబీ పువ్వు ఇచ్చి....గెస్ట్ బుక్‌లో సంతకం చేయించి...లోపలికి తీసుకువెళ్ళి.... మేంగో మిల్క్‌షేక్ ఇచ్చి.. మేక్ యువర్ సెల్ఫ్ కంఫర్టబుల్ అని చెప్పి...ప్రోగ్రామ్ షీట్ ఇచ్చి వెళ్ళారు.

గవర్నరుగారొచ్చి ఎర్రని సిల్కు రిబ్బన్ని బంగారు రంగు కత్తెరతో కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ రకమైన కాలేజ్‌కి ప్రారంభోత్సవం చేయటం తనకు ప్రధమం అని, అది తనకు కల్గిన మహత్తర అవకాశ మనీ...విద్యార్థులందరూ బాగా ఎంజాయ్ చేయగలరనీ నాలుగంటే నాలుగు వజ్రతుల్యమైన పలుకులు పలికారు.

తరువాత ఆ ఏరియా ఎమ్.పి మాట్లాడారు అభినందిస్తూ. ఆ తరువాత సోషల్ వర్కర్ అఫ్షాన్ మాట్లాడింది. చివరగా అందరికీ ధన్యవాదాలు తెలుపు కుంటూ నమ్రతగా రెండు మాటలు చెప్పి వందన సమర్పణ చేసింది వందనాదేవి.

అతిధులందరూ బ్లూబెర్రీ మఫిన్స్, సమోసాలు తిని, టీ తాగి వెళ్ళారు.

వందన ఆనందంతో తలమున్కలైపోతోంది. తను అనుకున్న ఈ కార్యం చిన్నా చితకా కాదు. ఎంతో బాధ్యత గల వ్యవహారం తలపెట్టింది తను. తను కెనడాకు వచ్చి అప్పుడే పది సంవత్సరాలు దాటిపోయింది. తనకెప్పుడూ ఏదో సాధించాలనే తపన. కుకింగ్, నిట్టింగ్, ఎంబ్రాయిడరీ, సంగీతం, కూచిపూడి నృత్యం, సైకాలజీ యే కాక "ప్రీమేరేజ్" కోర్స్ కూడా ప్రవేశపెట్టింది, అది ఆరు నెలల చదువు. దీనివల్ల అవగాహన, సర్దుబాటు తత్వం అలవరటం మాత్రమే కాకుండా ఏ పరిస్థితుల్లో ఏ రకంగా హేండిల్ చెయ్యాలో కూడా తెలుస్తుంది.

జనవరి ఎనిమిదవతేది రెండువేల నాలుగు.

ముప్ఫయిమంది వున్న క్లాసది. ఒక్కక్కళ్ళనీ వాళ్ళ గురించి చెప్పి పరిచయం చేసుకోమని చెప్పి.....ఈ కోర్స్ తీసుకోవడానికి గల కారణాలు వివరించమని చెప్పింది టీచరు సౌ అని పిలవబడుతున్న సౌభాగ్యం.

ఈ కోర్స్ చాలా వెరైటీగా వుందనీ, కొత్తగా కూడా అనిపించిందనీ అంతే కాక బాగా అవసరమని పించిందనీ అందుకే తీసుకున్నామంటూ ఎవరి కారణాలు వాళ్ళు చెప్పారు. క్లాసు జరుగుతోంది.

"మగ పిల్లలు తల్లికి చాలా ప్రత్యేకమైన గౌరవాన్నివ్వాలి. ఆ ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేని వాడు భార్యను ఏ మాత్రం గౌరవించలేడు. అలాగని చెప్పి తల్లి భార్యమీద నేరాలు చెప్పినా...భార్య తల్లి మీద గరమ్మసాలా వేసి వున్నవీ-లేనివీ కల్పించి నూరిపోసినా విని, బుర్రకెక్కించుకుని వాళ్ళను హర్ట్ చేయకూడదు.

భర్త భోజన ప్రియుడైతే భార్యకు వంటరాని పక్షంలో, నిందించి, తూలనాడి ఆమెకు అటు ఏడు తరాల వాళ్ళనూ ఇటు ఏడు తరాల వాళ్ళనూ శాపనార్థాలు పెట్టనవసరం లేదు.

"మూడు తరాల వాళ్ళకు పెట్టొచ్చా?" బ్రేసెస్ బయట పడేటట్లు ఇకిలిస్తూ అడిగాడొక విద్యార్థి.

"స్టూపిట్.... మధ్యలో పిచ్చి ప్రశ్నలు వేస్తే, బయటికి పంపిస్తాను. మళ్ళీ వెనక్కురావటం లేదు. మీరు కట్టిన ఫీజు కూడా వాపసు రాదు. పాఠం పూర్తి అయ్యాకనే మీ ప్రశ్నలూ, డిస్కషనూ. మధ్యలో ఎవరైనా వెకిలి నవ్వులు నవ్వినా, చచ్చు ప్రశ్నలు వేసినా పది అమెరికన్ డాలర్లు ఫైన్... "కెనేడియన్ డాలర్లు....పనికి.....రావా...?" ఎవరో నసిగారు. సౌ పాఠం చెప్పటం రెండు నిమిషాలు ఆపి... అక్కడే కిటికీలో పెట్టిన నీలం రంగు డబ్బా చూపించింది. కొట్టొచ్చినట్లు 'ఫైన్ యు.ఎస్ డాలర్లు ౧౦' అని పసుపు పచ్చని రంగులో అందరికీ కనబడింది.

భర్త వంటచేయవచ్చు. భార్య సహాయం చేయవచ్చు. కూరలు తరగడం, బియ్యం కడగటం, కూరపొడి తయారు చేయటం, వంటగది శుభ్రం చేయటం ఇత్యాదులు.

భార్య కూడా దొరికిందే ఛాన్సని "ఒక అన్నం మెతుకు కంటే రెండవది పొట్టిగా వుంది, సాంబారు పొడిలో మిరియాలు ఎక్కువైనాయి, వంకాయ కూరలో

పసుపు ఎక్కువైంది, దొండకాయ పచ్చడిలో పోపు మాడింది, మామిడికాయ పప్పులో టెంక కనబడింది, మజ్జిగపులుసులో పకోడీ రుచిగా లేదు. మా నాన్న ఇంకా బాగా వండేవాడు. మా వంటమనిషి మీకంటే నయం" అంటూ వంకలు పెట్టకూడదు.

భర్తకానీ, భార్యకానీ నాన్ వెజ్ తినేవారైతే.....మెల్లిగా ఆ వాసనలు భరించటం రెండోవారు అలవాటు చేసుకోవాలి. అంతేకానీ తమ అయిష్టాన్ని మాటల్లో, చేతల్లో, ముఖకవళికల్లో హావభావ ప్రదర్శనలు చేయ నక్కరలేదు. అతిథులొచ్చినప్పుడు ఇంటి పనిలో భర్తకానీ, భార్యకానీ తప్పకుండా సహాయం చేయాలి. ఎవరో ఒక్కరు మాత్రమే చేయాలంటే అది అసాధ్యం కాకపోయినా కష్టసాధ్యం.

ఒక్క వ్యక్తి సామాన్యమైన సంపాదనతో గృహంలో ఎంత అవకతవకలూ, ఆర్థికమాంద్యం కనిపిస్తుందో, ఆ రకంగానే... .పనిపాటల్లో శ్రమవిభజన లేకపోతే.... అసహనం, చిరాకూ, ఒకర్నొకరు దెప్పిపొడుచుకోవటం...... మనం వుంటున్న దేశాల్లోని ప్లస్ పాయింట్లన్నీ మరిచిపోయి.... మారాత, నా గీత అంటూ తమను తాము తిట్టుకొంటూ..... ఇండియాలో అందరూ సుఖపడి పోతున్నారంటూ ఓ విసురు విసరటం... మెల్లిమెల్లిగా చినికిచినికి గాలివాన అయినట్లు....సెపరేషన్స్....విడాకులు లాంటి వాటికి అవకాశం వుంది. కాబట్టి, ఎదటివారి పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రయత్నలోపం ఏమాత్రం వుండకూడదు. అయినప్పటికి కొన్ని విషయాల్లో మనం నిమిత్తమాత్రులం అని గ్రహించాలి.

"నాకు వంటరాదు. నేర్చుకోవాలనే ఇంట్రస్టుకూడా లేదు. అయినా పెళ్ళి తరువాత భార్య వంట చేయాలనే కోరికవున్నవాడైతే.... నాకు వంకాయలు కూడా తరగటం రాదని గ్రహించి దొండకాయల్లాంటివి తరగటం నేర్పించాలంటే.... నా భర్త నా నడుంచుట్టూ చేతులు వేసి.....'మధువొలకబోసే నీ చిలిపికనులు'అని పాడుతూ రొమాంటిక్‌గా వంట నేర్పించాలని నాకోరిక. అందుకు వ్యతిరేకంగా జరిగితే నేను ఒప్పుకోనుగాక ఒప్పుకోను" తన గట్టిగొంతుతో హై పిచ్‌లో బల్లగుద్ది మరీ చెప్పింది వినయలక్ష్మి.

"ఈ కోర్స్ పూర్తయ్యేసరికి తప్పకుండా నీ అభిప్రాయం మారి తీరుతుంది." ఘంటాపథంగా చెప్పింది సౌ.

వందనగారి కాలేజ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా లక్షణంగా మూడు బాచ్‌లూ నాల్గు కోర్సుల్లా చక్కగా నడుస్తోంది. టీచరు సౌభాగ్యం మెటర్నటీ లీవులో వుంది. కుంకుమరేఖ టీచ్ చేస్తోంది.

"పెళ్ళి ఒక పద్మవ్యూహం లాంటిది. అభిమన్యుడి లాగా కాకుండా వ్యూహం ఛేదించటం కూడా నేర్చు కోవాలి.అభిమన్యుణ్ణి యుధిష్టులవారు కోరినట్లు ఎవరైనా మీమీ కుటుంబాలలోని వారు కోరినా ఈ సంసార వ్యూహంలోకి అడుగుపెట్టకూడదు. మర్యాదగా తిరస్క రించాలి. లేకపోతే ఎంతో కష్టపడాల్సొస్తుంది. ఈ పెళ్ళి అనే ఝుంజాటం వుంది చూశారూ, లోపలికి వెళ్ళటం సులభం, బయట పడటం అతికష్టం. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా బాగా దెబ్బతిని చితికిపోతారు. ఆడపిల్లలకు త్వరగా అవగాహన శక్తి వస్తుంది కనుక పెళ్ళి వయస్సు ఇరవైరెండు నుండి ఇరవై ఐదు మధ్య, మగపిల్లలకు ఇరవైఐదు ముప్ఫయి మధ్య అనుకూలం. వయస్సులో మగవాళ్ళే మూడునాలుగేళ్ళు పెద్ద అయితే బాగుంటుంది.

ఎటువంటి ఎక్స్‌పెక్టేషన్స్ లేకుండా ఈ 'పెళ్ళి' అనే బంధానికి అనుబంధపు శ్రీ కారం చుట్టాలి. తల్లిదండ్రుల దగ్గరనుండి వచ్చినట్లుగా ముఖ్యంగా ఆడపిల్లలకు 'అన్ కండిషనల్' లవ్ ఇక్కడ లభించదు. భార్యాభర్తలు మనస్సులోని విషయాలు ఓపెన్‌గా మాట్లాడుకోవాలి. వారానికి ఒక్కరోజు, అలా కుదరకపోతే హీనపక్షం, కనీసం నెలకొక్కరోజు రెండు మూడు గంటలు కుటుంబ విషయాలూ, నిర్ణయాలు, ద్రవ్యసంబంధమైనవీ చర్చించుకోవాలి. ఒకరినొకరు అవసరమైనంత వరకు మాత్రమే జడ్జి చేసుకోవాలి. కంపేరిజన్స్ ఏమాత్రం మంచిది కాదు. ఇంకో స్త్రీతో భార్యను కంపేర్ చేస్తూ మాట్లాడితే ఆమె ఎంత హర్ట్‌వుతుందో తెలుసుకోవాలి. అలానే ఇంకో పురుషుడితో అస్తమానం కంపేర్ చేస్తుంటే భర్త ఏ రకంగా రియాక్ట్ అవుతాడు, ఎంత హర్ట్ అవుతాడు అనే విషయాన్ని ఆలోచించి మరీ మాట్లాడాలి.

ఇంకొకరి బూట్లలో మన కాళ్ళు పెట్టి పది మైళ్ళు నడుస్తే ఎలా ఉంటుంది అని ఆలోచిస్తే పది మైళ్ళు కాదు ఒక్క మైలు కూడా నడవడం సరికదా పది అడుగులు వెయ్యటానికి కూడా ఎంత నొప్పి పుడుతుందో,ఆ బాధ ఎటువంటిదో ఒకసారి మీ చెప్పులు కాని వాటిల్లో నడచి చూస్తే అవగాహనవుతుంది.

భార్య అలసిపోయి ముఖం వేలాడేసుకుని ఆఫీసు నుంచి వస్తే.....తాను ఆమెకంటే ముందుగా వచ్చివుంటే... కాస్త అనునయంగా మాట్లాడి ఓ కప్పు టీ యివ్వటం, దగ్గర కూర్చోవటం అవసరం. అలానే భార్య కూడా.

తల్లి కాబోయే భార్యను చేతనైనంత అపురూపంగా చూడాలి. కొత్తగా పెళ్ళయిన జంటల మధ్య పెద్దవాళ్ళ అభిప్రాయాలు, వాళ్ళు చొరబడటం లేకపోతే చాలా మంచిది. ఒకవేళ వాళ్ళు చొరవ తీసుకొని పెత్తనం చేయటం ప్రారంభిస్తే ఆదిలోనే తుంచెయ్యాలి.

ఆ రోజు వందనగారి కళాశాల వార్షికోత్సవాలు. విద్యార్థులు కొందరు పాటలు పాడారు. మరికొందరు తాము స్వయంగా వ్రాసిన నాటకం "ఓర్పూ-నేర్పూ" ప్రదర్శించారు. ఈ కోర్స్ వల్ల తామందరూ ఎంత లబ్ధి పొందారో ఎంత అవగాహన అలవరచుకున్నారో చెప్పకనే చెప్పింది ఆ నాటకం.

వందనాదేవికి అసలీ రకమైన కాలేజ్ పెట్టటం, అందునా ఈ ప్రత్యేకమైన కోర్స్ ప్రవేశపెట్టటం అనే ఆలోచన ఎలా కలిగిందో చెప్పమని కోరారు.

చిరునవ్వుతో వేదిక మీదకు వచ్చిన వందన చెప్పింది.

"ఇందులో అంత వింతేమీ లేదు. నాచుట్టూ వున్న ప్రపంచం, మనుష్యులు, మా కుటుంబం. అవగాహన లేకపోవటం ఒక్కటే కాక ఆటుపోట్లకు తట్టుకునే శక్తి లేకపోవటం వల్ల, ద్రవ్యలోపం వల్ల ఛిన్నాభిన్నమైన సంసారాలు. భార్యా భర్తల మధ్య ప్రేమాంకురం, అనురాగసుధ చిప్పిల్లాలంటే.... కొంత ప్రేమ అవసరమే అయినా..... పాతికేళ్ళు దాదాపు ఎక్కడో పుట్టిపెరిగిన వాళ్ళకు ఆలోచనా విధానం, అలవాట్లూ ఒకేమాదిరి వుండవు కదా! సర్దుబాటు మనస్తత్వానికి ఇలాంటి చదువులు కూడా అవసరమని నేను భావించాను. ఇండియాలో కూడా ఈ కోర్స్ కొంతవరకూ ఉపయోగించిందనే చెప్పవచ్చు. ఆ ఆలోచనతోనే నేను ఇక్కడ కూడా ప్రారంభించాను. నాకు ఇక్కడ అవకాశ మిచ్చిన స్కూల్ బోర్డుకి, మా టీచర్స్‌కి, స్టూడెంట్స్‌కి అందరికీ నా కృతజ్ఞతలు. నా భర్త సహకారం లేకపోతే నేనేమీ చేయలేకపోయేదాన్ని" గొంతు జీరబోయింది. ..... ఆవేశంతో ఆనందంతో నిలువెల్లా పులకించి.... దుఃఖం ముంచుకొచ్చింది. ఇంక నిగ్రహించుకోలేక..... 'నమస్తే' అంటూ చేతులు జోడించి చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ..... పరుగులాంటి నడకతో.... రెస్ట్‌రూమ్ లోకెళ్ళి.... ముఖం కడుక్కుని నెమ్మదిగా తిరిగివచ్చి తనపని చూసుకోసాగింది.

నిండుమనస్సుతో నిష్కల్మషమైన తలంపులతో అణువణువూ హాయినిగొల్పే సేవాభావంతో ఆ రోజు సంస్థకు వచ్చిన విరాళాలలో రెండు వంతులు స్త్రీ సంక్షేమనిధికి, ఒక వంతు చిన్నపిల్లల సంక్షేమనిధికి, మిగిలింది పురుషబాధితుల సంఘసంక్షేమానికి విరాళంగా ఇచ్చింది.

కొన్ని గంటల్లో ఆమె జీవితంలో "పెద్దమార్పు" రాబోతుందని కూమెకు చూచాయగా సూచన ప్రాయంగానైనా తెల్సివుంటే......ఆమె ఏ రకంగా ప్రవర్తించి వుండేదో అని కనక ఆలోచిస్తే.....ఆమెను ఎరిగున్నవారూ, అసూయాపరులు కాని వారెవ్వరైనా ఖచ్చితంగా చెప్పగలరు "ఆమె ఈమాదిరిగానే వుండేది. పోతే శ్రీ కృష్ణ దేవరాయలవారి ఆస్థానంలోని జ్యోతిష్కుడిలాంటి వారెవరైనా ఘంటాపథంగా నొక్కి వక్కాణించి భవిష్యత్‌ని సూచిస్తే కొంతవరకైనా జాగ్రత్తపడి షాక్ అయ్యుండేదికాదు" అని.

ఆమె ఆ స్కూల్లో ప్రవేశపెట్టిన "ప్రీమేరీడ్" కోర్స్ ప్రోగ్రాం అందరికీ బాగా నచ్చటమే కాక ఉపయోగం గానూ, లాభసాటిగానూ వుంది. కేవలం అసలు పెళ్ళికాని వారికి మాత్రమే కాక రెండవసారి మూడవసారి పెళ్ళి చేసుకోబోయేవాళ్ళక్కూడా బాగా వుంది గతంలోని పొరపాట్లను సరిదిద్దుకోవడానికి.

తను బిజీగా వుండటంవల్ల సరిగ్గా తినలేదు.... ఆయన ఏం వండారో ఈరోజు.... తనకిష్టమని బంగాళ దుంపలకూరలో బాగా జీడిపప్పూ అల్లం పచ్చిమిరప కాయలు దట్టించి వేసారేమో !

ఆకలి దంచేస్తోంది బాబూ! మజ్జిగపులుసు చేశారేమో! ఎంత చక్కగా నేర్చుకున్నారు వంటలన్నీ! తను నిజంగా అదృష్టవంతురాలు. అమ్మా నాన్నా వుంటే ఈరోజు తననీ తన సంసారాన్నీ చూసి ఎంత మురిసిపోయేవారో! 'పైనించి చూస్తాంలే తల్లీ నీ అభివృద్ధిని' అనేది అమ్మ. అట్లాగే జరిగింది. మనస్సు బాధతో బరువెక్కబోతోందని గ్రహించి ఆలోచనలను మళ్ళీ ఫుడ్ మీదకు మళ్ళించింది వందన. కంది పచ్చడి తిని ఎన్నేళ్ళయిందో! రేపు ఇంట్లో వుంటుందిగా చక్కగా కంది పచ్చడి, వంకాయ పులుసు పచ్చడి, గుమ్మడికాయ వడియాలు చేసుకోవచ్చు తను. భోజనం గురించి ఆలోచిస్తూనే తలుపు తాళం తీసింది. త్వరగా భోజనం

చేసి..... డేకేర్‌కి వెళ్ళి పిల్లలు ముగ్గుర్నీ తీసుకురావాలి అనుకుంటూ.

ఇంట్లోకి వచ్చిన వందన తిండిమాట మర్చిపోయి అవాక్కయింది. అప్రతిభురాలైంది. శిలాప్రతిమే అయింది కొంతసేపటివరకు. ఇంట్లో చిరిగిపోయిన సోఫా తప్ప ఇంకేమి లేవు. కొత్త సోఫాసెట్టు, డైనింగ్, క్రిష్టల్ షోపీస్‌లూ వెండివీ ఏమీలేవు. బెడ్‌రూమ్ లోకెళ్ళి డ్రెస్సర్ సొరుగులు లాగి చూసింది. ఇంట్లో వుంచిన నగలు ఒక్కటీ లేవు.

మర్నాడు బేంకుకి వెళ్ళి లాకర్ తెరిచి చూసింది.

షాక్ మీద షాక్ ఎలెక్ట్రిక్ షాక్ కొట్టినట్లు. ఎంత వద్దనుకున్నా కళ్ళల్లోనుంచి గిర్రున నీళ్ళు తిరిగాయి. తన ఎక్కౌంటులో రెండంటే రెండు డాలర్లు మిగిల్చాడు మహానుభావుడు జానతన్. బాధగా విరక్తిగా ఆమె పెదవులమీద నవ్వు కాని నవ్వు. ఎంతకు తెగించాడీ జానతన్.. తన భర్త... అవును నిజంగా తన భర్తే, తన మురిపాల ముద్దుమగడు. అక్షరాలా అగ్నిసాక్షి.

జాయింట్ ఎక్కౌంట్ ఓపెన్ చేయటం తనదే తప్పు. తన స్కూలు ఎంతోమందికి ఆదర్శమైంది. కానీ తను మోసపోయింది అతగాడి తీయతీయని మాటలకి. అందుకే అతని భార్య అయింది. గత ఐదేళ్ళనుండీ చక్కగా వున్నాయనుకున్న పరిస్థితులు..... .స్కూలు మీద రాబడి బాగా వుండటంతో జానతన్ తన ఉద్యోగం మానేసి అక్కౌంట్స్ చూడటం మొదలుపెట్టాడు. అదే అతని అత్యాశకూ, పతనానికీ నాంది. తన కొత్త లెక్సస్ కూడా అతని పరమే అయింది. మనసంతా దుఃఖంతో నిండి ఆమె నిలవలేకపోతోంది. రక్తం మరుగుతోంది. ఏదో ప్రతీకారవాంఛతో సలసలా కాగుతోంది. ఫంక్షనుకు రాకుండా ఎంతపని చేశాడు జానతన్! తెల్లవాణ్ణి నమ్మి తప్పు చేసిందా తను! విధి నిర్ణయం ఇదే అయితే ఎవ్వరైనా ఒక్కటేనేమో! అన్యమనస్కంగానే తనకు తన భర్త దయతో మిగిల్చిన డొక్కు కారు కేమెరీని డ్రైవ్ చేసుకుంటూ డేకేర్‌కి వెళ్ళి పిల్లల్ని పికప్ చేసుకుంది.

'నేను ధైర్యంగా ఉండాల్సిన సమయమిదే' అనుకుంది గట్టిగా. కమ్యూనిటీ లివ్వింగ్ అంటారియోకు ఫోన్ చేసింది. వాళ్ళొచ్చి అవసరమైన సహాయా న్నందించారు. 'జానతన్! ఎంత దుర్మార్గానికి ఒడిగట్టావ్! ఎంత అమానుషం! తన బట్టలూ, పిల్లలవీ, చెప్పులూ, బూట్లూ ఒకటేమిటి! సమస్తం పరశురామ ప్రీతి. ఇక్కడ జానతన్ ప్రీతి... తను కమ్యూనిటీ లివింగ్‌కి చాలాచాలా ఋణపడివుంది, భవిష్యత్తులో తను ఆ సంస్థకు వంద వేలైనా ఇవ్వగలిగే స్తోమత రావాలి. తన స్కూలు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నడవాలి' అనుకుంది ధ్రుడంగా పిల్లలు ముగ్గురూ ఆమె మీద చేతులేసి ఆదమరచి నిద్రపోతున్నారు. ఎదురుగ్గా వున్న ఫొటోలోని జానతన్ తనను చూసి వెక్కిరింతగా.... "యూ ఇండియన్ లేడీ.... చూడు... మోసపోయావ్.... గెలుపు నాదే సుమా!" అన్నట్లు చూస్తున్నాడు. వందన లేచి ఆ ఫొటో భళ్ళున పగిలేట్లు విసిరి పడేద్దామని అనుకుంది. కానీ ఆమె చదువూ, వివేకం, విచక్షణా అడ్డు తగిలి ఆగు... ఆగు... అంటూ హెచ్చరించాయి.

అప్పుడు నిశితంగా ఆలోచించి.... మనస్సును కొంత కుదుట పరచుకుని.... ఆ ఫొటోవంక చూసింది మళ్ళీ. సుమారు రెండువందల డాలర్ల ఖరీదు గల క్రిస్టల్ ఫొటో ఫ్రేమ్‌కి మారుగా డాలర్ స్టోరులో కొన్నట్లు కనబడుతున్న డాలర్ ఫొటో ఫ్రేమ్ తనను చూసి వికటాట్టహాసం చేస్తున్నట్లుంది. అది తీసి ట్రాష్‌లో పడేద్దామనుకుంది. లేవబోతున్న తల్లిమీద పిల్లలు ముగ్గురూ నిద్రలో అటూ ఇటూ పొర్లుతూ అమాయంకంగా కాళ్ళూ చేతులూ వేసి 'అమ్మా మమ్మల్ని వదలకు' అన్నట్లు గట్టిగా బంధించి, 'నాన్న ఎప్పుడొస్తాడమ్మా?' అంటూ కలవరిస్తున్నారు. ఎక్కడి కెళ్ళాడో తెలియదు. ఇంత ఘనకార్యం వెలగబెట్టినవాడు ఇక జన్మలో రాడు. ఏ ముఖం పెట్టుకుని వస్తాడ్లే, వచ్చినా తను రానివ్వదు. ఇకనుంచీ ఈ పసివాళ్ళకు తండ్రి కూడా తనే.

నిశ్చయంగా అనుకుని తేలికపడిన హృదయంతో... మెల్లమెల్లగా నిద్రలోకి జారుకుంది వందన.

# తెల్లారింది

**- శ్రీనివాస ఫణికుమార్ డొక్కా**

వీధిగేటుకి రెండు వైపులా అల్లుకున్న సన్నజాజీ, విరజాజీ పైకి పాకి పాకి పోర్టికో మీద కలిసిపోయి కబుర్లు చెప్పుకుంటున్నాయి. లేతాకుపచ్చా, ముదురాకు పచ్చా గీతలతో తెల్లటి పూల చుక్కల్ని కలుపుతూ గచ్చకాయరంగు సిమెంటు గచ్చు మీద వచ్చీరాని రధం ముగ్గు వేస్తున్నాయి.

కింద గది కిటికీ బయట, పడికట్టిన పచ్చని మొక్కకి పూసిన ఎఱ్ఱని రామబాణాల గుత్తి సిగ్గరి పెళ్ళికూతురిలా తలంటి పోసుకుని సాంబ్రాణి పొగలో తడి కురులారబెట్టుకుంటున్న కన్నెబంగారులా ఓరగా తలవాల్చి, ఉదయభానుడి రాక కోసం ఎదురు చూస్తున్నట్టుగా ఉంది. ఆయన్ను పలకరించాలనే ఆతురతతో పైకి చూస్తున్న పూలుకొన్నీ, తీరా వస్తే ఏమి మాట్లాడాలో తెలియక సిగ్గుతో ముడుచుకుపోయిన మొగ్గలు ఇంకొన్నీ - పాపం ఆ ముగ్ధ ఎటూ తేల్చుకోలేక ఎరుపెక్కిన బుగ్గలతో కొంత ఎదురుచూపులూ, అంతలోనే బెదురుచూపులూగా ఉంది.

అవతలి కిటికీ బయట నిటాగ్గా నిలుచున్న లిల్లీ జెడల్లోంచి తొంగి చూస్తున్న తెల్లపూలు బుల్లిబుల్లి గ్రాంఫోనుల్లా వున్నాయి. వాటిల్లోంచి వీధి అవతల ఎవరింట్లోనో పెట్టిన విష్ణుసహస్రనామం లీలగా వినిపిస్తోంది.

స్టేషనుకెళ్ళే మొదటి బస్సువాడు మెయిన్రోడ్డు మీదున్న స్పీడుబ్రేకరుమీంచి ఎగిరెళ్ళిపోయాడు పెద్దగా రేకుల శబ్దం చేస్తూ. ఆపక్కనే పొంచి వుండి వీపుకి సంచీ తగిలించుకున్న సూపర్ మేనొకడు బస్సు అందుకోలేక, ఇక లాభం లేదని కాళ్ళీడ్చుకుంటూ స్టాపు వైపు నడవడం మొదలెట్టాడు.

టిఫెన్ సెంటరు వాడు అరటి పళ్ళలో అగరత్తులు గుచ్చేసి, పెనం మీద నూనె వేస్తున్నాడు. భక్తి భావమూ, భుక్తి ఆత్రమూ కలగలిసిన కమ్మటి పొగేదో ముక్కు పుటాలని పలకరించి చక్కాపోయింది.

గేటుకి వేళ్ళాడదీసిన నీలం బుట్టలో రెండు తెల్లటి పాకెట్లేసి వెళ్ళిపోయాడు పాలవాడు. రెండు చందమామలు ఉదయించిన నీలాకాశంలా నిండుగా వుందా బుట్ట. పేపరువాడెక్కు పెట్టి విడిచిన నమస్కార బాణం రివ్వునొచ్చి కుర్చీ పక్కనే వాలి పాదాల దగ్గర ఒదిగిపోయింది. అంత ఒడుపుగా విసరడం ఎవరు నేర్పేరో వాడికి. అక్కడక్కడా జిహ్వాప్రక్షాళనం చేసుకుంటూన్న అరసికుల హాహాకారాలు ఆగి ఆగి వినిపిస్తున్నాయి. ట్యూషన్ నించి ఇంటికెళిపోతూ స్కూటీ మీద ఇద్దరు స్కూలు పిల్లలు. పాపం, వీళ్ళెప్పుడు లేచారో, ఏకలల వేళ మేల్కొన్నారో? అసలు పడుకున్నారో లేదో? పెద్దయ్యాక వీళ్ళకి చిన్ననాటి జ్ఞాపకాలంటూ వుంటాయో లేదో? వున్నా వాటి నిండా స్కూటీలూ, పోటీలూ, పరీక్షలూ ట్యూషన్లేనేమో . ఇంత నిర్దయగా, నిమ్మళంగా ఎవరు ఎత్తుకుపోయారో వీళ్ళ బాల్యాన్నీ, చిన్నతనాన్నీ !

నలభై యేళ్ళ నల్లని వాడొకడు రొప్పుతూ, పరిగెడుతూ, ఆగుతూ, నడుస్తున్నాడు రోడ్డు వారగా. లావుపాటి ఓ ఆడమనిషి చీపురు నేలకానీ ఆననట్లుంచి రోడ్డూడుస్తోంది. ఆమెని చూసిన నల్లవాడు వేగంపెంచి పరిగెత్తాడు, అతన్ని చూసి గబగబా వూడ్చెయ్యడం మొదలెట్టిందా ఆడమనిషి. అతను కొంచం దూరం వెళ్ళి ఆగి పోయాడు మలుపు తిరుగుతూ. అతను వెళ్ళి పోయాడని నిర్ధారించుకుని ఊడవటం ఆపేసింది ఆడమనిషి.

ఇద్దరు ముసలివాళ్ళు మార్నింగ్ వాక్ చేస్తున్నారు. ఒకతలమీద చెవుల్ని కప్పేస్తూ మంకీ కేప్పూ, ఇంకో తలచుట్టూ చెవులు మూస్తూ నాలుగు చుట్లు చుట్టేసిన ముదురు నీలం మఫ్లరూ. ఒకళ్ళ మాట మరొకళ్ళకి వినబడడం దాదాపు అసాధ్యం. అయినా వాళ్ళేవో మాట్లాడేసుకుంటూ, తలలూపుకుంటూ వెళిపోతున్నారు. బహుశా ఆవయసొచ్చాకా, మనిషితో సంభాషించడానికి మాటలతో పనిలేదేమో!

పార్కు పక్క సందులో చాకలి వాడు ఇస్త్రీ పెట్టె లో బొగ్గులు చేరుస్తున్నాడు. స్కూటర్ వర్క్సు వాడు అప్పుడే షట్టర్లు తెరుస్తున్నాడు. నర్సింగరావు కేకలకి భయపడి నల్లకుక్క పిల్ల వాళ్ళ గుమ్మం ముందునించి లేచి పరిగెత్తింది. కొత్తగా పెళ్ళైన జంట హోండా సిటీలో తుర్రుమంది. వెనక సీట్లో ఒక నీలం లంచి బాక్సూ, ఒక ఎర్రలంచి బాక్సూ.

ఖాళీ ప్లాటులో గుడిసె లేసుకున్న శామ్యూలు సత్తిగాడు ఆలీబాబా దగ్గర అల్లమురబ్బాలు

కొంటున్నాడు. రోడ్డు మీద ఐ.ఎస్.డీ. బూత్ వాడింకా తెరిచాడో లేదోచూసి వెళ్ళిపోతున్నాడో పెద్దాయన. ఎదురుగా వెంకట్రావుగారింట్లో పేద్ద మావిడి చెట్టు పైనంతా పచ్చటి పూల రిబ్బన్నులు కట్టిన భారద్దేశ పటంలా వుంది. అక్కడక్కడా పూతలాంటిదేదో కనబడుతోంది అస్పష్టంగా. పైకొమ్మల్లో ఎక్కడో దాక్కున్న కోయిల వుండుండి కూస్తోంది. ఎంత పరీక్షగా చూసినా ఎక్కడుందో కనబడలేదు. అయినా, కమ్మటి పాటల పిట్టకి కారు నలుపు పులిమేసాడు కదా, మరి ఎల్లా సమర్ధించుకుందావనుకున్నాడో? ఆ దేవుడు! కిందనించి రెండో కొమ్మమీద రెండు పావురాలు కష్టం, సుఖం మాట్టాడుకుంటున్నాయి.ముగ్గుగొట్టంతో తలవాకిట్లోకొచ్చి ఓమాటు అటూ, ఓమాటు ఇటూ తిప్పేసి వెళ్ళిపోయింది ఆండాళ్ళమ్మగారు.

గుమ్మంలో సన్నాయి పాట విని కిందకొచ్చాను. ఇక్ష్వాకుల కాలంనుంచి ఇప్పుడే ఇంపోర్టై వచ్చినట్టున్న ఓ సన్నపాటి ముసలి సన్నాయివాడు, పైనున్న దుప్పట్ల బరువునే మోయలేనంత బలహీనంగా వున్న ఓ గంగిరెద్దూ. చూడగానే గుండె చెరువై కళ్ళమ్మట నీళ్ళుతిరిగాయి. భూపాలం వినిపించాడు. నాన్నకిష్టమైన చక్రవాకమూ, నాకిష్టవైన అభేరీ తనివితీరా మళ్ళీ, మళ్ళీ వినిపించుకుని దక్షిణిచ్చి పంపేసాను. తృప్తిగా దీవించి వెళ్ళిపోయాడు వాడు. "ఇంక ఆగలేను బాబూ! "అంటూ, ఇనస్పెక్షను బంగళా వెనకనించి, వేపకొమ్మలు తప్పించుకుంటూ వెచ్చ వెచ్చని సూర్యుడు పైకొచ్చేసి ప్రపంచాన్ని పలకరించాడు.

అప్పుడూ...... మా కోలనీలో తెల్లారింది!!

.

# మనసే మందిరం

-డా. సుదర్శన్ రాజ్

ఓం గణానాం త్వా గణపతిం గుం హావామహే
కవిం కవీనాం ఉపమశ్రవస్తమం
జేష్టరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆనశ్శృణ్వనోతిభిః సీదసాదనం.
ఓం శ్రీ మహాగణపతయే నమః
గురుభ్యోనమః హరిః ఓం

అని ప్రార్ధన ముగించి-"వయోవృద్ధ నారీమణులకు, వృద్ధులకు, వారికి సహకరించడానికి వచ్చిన యువతీ యువకులకు, బాలబాలికలకు నమస్కారములు, ఆశీర్వచనములు" - అంటూ ప్రారంభించేరు ప్రొఫెసరు చంద్రశేఖర్ గారు.

"నాచిరకాల స్నేహితుడు, ఒకే ఊరివాడైన సంపత్ బాబు నాకు ఎన్నో సార్లు ఫోను చేసి మా "సీనియర్స్ క్లబ్"లో మాట్లాడమని అడగటం, నాకు ఖాళీ దొరక నందున, ఏమి మాట్లాడాలో తెలియక వాయిదాలు వేస్తూ రావడం జరిగింది. కాని నాకేదో ultimatum ఇచ్చినట్లు మాట్లాడి, "నీ ఇష్టమొచ్చిన 'టాపిక్' మీద మాట్లాడు." అని కోరడంవల్ల నాకు కాస్త ధైర్యమొచ్చి మీ అందరి ముందు ఇలా ప్రసంగించడానికి నిల్చోడమైంది.

"నా మాటల్లో చాలా ఆంగ్ల పదాలు వస్తూంటాయి, క్షమించాలి. దానికి రెండు కారణాలు. (1) ఉదాహరణకి "ధూమ శకటవిశ్రామ స్థానము" అనేకంటే 'రెయిల్వే స్టేషన్ 'అంటే చాలా మందికి అర్ధమౌతుంది. (2) మన తెలుగువాళ్ళు చాలా మంది రెండు తెలుగు వాక్యాలు మాట్లాడేసరికి మూడో వాక్యం ఇంగ్లీషు లో వస్తుంది. ఆ కోవకి చెందిన వాడినే నేనూను.

"ఇంక ఉపోద్ఘాతం చాలించి అసలు విషయానికి వద్దాం" 'సీనియర్స్ గ్రూప్'కి సంబంధించిన 'టాపిక్స్' మాట్లాడ్డం అంటే ఆరోగ్యానికి సంబంధించినవి. 'మధుమేహం',గుండెపోటు, కీళ్ళ నెప్పులు, రక్తపు వత్తిడి' వగైరాలు. ఇవి ఆయా 'స్పెషలిష్టులు' మాట్లాడితే చాలా బాగుంటుంది. కాబట్టి మీరేమైనా వృద్ధులకి సంబంధించిన ప్రశ్నలు వేస్తే వాటిని గురించి ఏమైనా మాట్లాడుతాను"

ఆమాటనగానే ఆగుంపులో ఒకాయన మెల్లిగా లేచి 'నాపేరు సుబ్బారావు, నావయస్సు 73 సంవత్సరాలు. వయస్సు మళ్ళిపోతోందే అనే బాధ నన్ను పీక్కు తింటోంది, aging ని అరికట్టగలమా? అని ప్రశ్నించాడు.

ప్రొ.చం: "రోజుకిరోజు వృద్ధి అయ్యే 'bilogical age' ని అరికట్టలేము. మీకు 73 సంవత్సరాలు. అది అంతే. కాని 73 సంవత్సరాల వయసున్న ఇద్దరు వ్యక్తులను తీసుకోండి. ఒకాయన 85సంవత్సరాలు వయసువానిగా కనిపిస్తాడు. రెండో ఆయన 58 సంవత్సరాల వయసున్న వానిలాగ కనిపిస్తాడు. వారిద్దరిలోనున్న ఆలోచనాశక్తే వేరు. ఒకాయన "అయ్యో నేను ముసలివాణ్ణై పోతున్నాను, ఇంక ఎన్నోరోజులు బ్రతకననుకుంటాను" అనుకుంటూ ఉంటాడు. రెండో ఆయన - అసలు తన వయసునే పట్టించుకోడు. రోజూ తను చేయగలిగినంత వ్యాయామం చెయ్యడం, కాస్త దూరం నడవడం, యువకులు చేసే ఉత్సాహకార్యక్రమాల్లో 'వాలంటీర్'గా పనిచెయ్యడం - ఇటువంటి పనుల మూలాన తన వయస్సుకి చిన్నగా కనిపిస్తాడు.

"నేను ముసలాడిని అనుకునే బదులు" దైవకృప వల్లనేను చాలా సంతోషంగా ఉన్నాను. ఉత్సాహంగా ఉన్నాను, నాకు సాధ్యమైనంతలో సంఘానికి సేవ చేస్తాను" అనుకుంటూ ఉండండి; మీవయస్సు ప్రస్తావనే జ్ఞా పకం రాదు.."

"ఇంటికి దూరం, కాటికి దగ్గర" అనే పరిస్థితిలో ఉన్నాం. ఇటువంటి కాలంలో ఇంకేం చేస్తామండీ బ్రతికుండి అన్నాడో నిరాశావాది (pessimist) .

ప్రొ.చం: "అలాగనకండి. వయస్సుకి, సాధించడానికి ఏమీ సంబంధం లేదు. వయసు మళ్ళినవాళ్ళు సాధించినవి కొన్ని ఉదాహరణలు చెప్తాను. అవి మీ ఆలోచనా విధానానికి ఉపయోగ పడవచ్చు. గ్రీకు వేదాంతైన 'సోక్రటీస్' 80ఏళ్ళు వచ్చిన తర్వాత సంగీత వాద్యాలు వాయించడం నేర్చుకుని పేరు గడించేడుట. 85 సంవత్సరాలు వచ్చిన తర్వాత కూడా ఆంగ్ల శాస్త్రవేత్త 'ఐజాక్ న్యూటన్' పరిశోధనలను చేస్తూ ఉండేవాట్ట. చిత్రకారుడు 'మైఖెలాంజలో' 80 ఏళ్ళు వచ్చిన తర్వాత కూడా 'కేన్వాసు' మీద చిత్రిస్తూనే ఉండేవాడుట. 'యోహాన్ గోథే' "ఫౌస్ట్" అనే గ్రంధాన్ని తన 80 ఏట పూర్తి చేసేడుట. అలాగే 'లియోపాల్డ్ ఫాన్ రాన్' 92 వ ఏటన "ప్రపంచ చరిత్ర" వ్రాయడం

మొదలు బెట్టాడుట. 'మార్కస్ కేటో' అనే 'రోమన్ వ్యక్తి తన ౮౦ ఏటన గ్రీకు భాష నేర్చుకోడం మొదలు బెట్టాడుట. 'జనరల్ మెకార్థర్, హారీట్రూమన్, జనరల్ ఐసెన్ హోవర్' - ఇలా చెప్పుకు పోవాలంటే - చాలా మంది ప్రముఖులు వయసు మళ్ళింతర్వాతే ఎన్నో ముఖ్యమైన పనులు చేసేరు."

కాబట్టి 'నేను ముసలివాడిని, నాకు ఓపిక లేదు, నేనెందుకూ పనికి రాను' అనుకునే బదులు - రోజూ "దేవుని దయవల్ల నేను సంతోషంగా ఉన్నాను; రోజు రోజుకీ నేను యవ్వనంగా ఫీలవుతున్నాను, నామెదడు చాలా చురుకుగా పనిచేస్తోంది, ఇంకా ఎన్నో సాధించి సంఘానికి ఉపయోగపడతాను" అని పదేపదే అనుకోండి ఉదయం లేవగానే" అని సలహా ఇచ్చేరు చంద్రశేఖర్ గారు.

Audience నుంచి ఒక ముసలామె నిల్చుని "నా పేరు నాగరత్నమ్మ. నా వయసు చెప్పకుందుకేమి భయం లేదు. నావయసు ౬౮ సంవత్సరాలు. ప్రొఫెసరు గారూ! మీరు చెప్పిన ఉదాహరణలు చాలా బాగున్నాయి. అటువంటి మేధావులకి ఊహాశక్తి, జ్ఞాపకశక్తి బాగా ఎక్కువగా ఉండిఉండాలి. మాలాటి వ్యక్తులు memory ని (జ్ఞాపకశక్తి ) అభివృద్ధిచేయడానికి సాధ్యమౌతుందా? ఐతే ఎలాగ? వివరిస్తారా?"

**ప్రొ.చం:** "చాలా మంచి ప్రశ్న. memory అన్నది - మనం పుట్టకముందు, పుట్టిన తర్వాత క్షణక్షణం - జరిగిన అనుభవాలను గుర్తుంచుకోడమే. ఈ అనుభవాలని ముఖ్యంగా మూడు భాగాలుగా చెప్పవచ్చు. ఈ అనుభవాలు బుద్ధిపూర్వకంగా (conscious), అపస్మారకంగా (sub-conscious) తెలిసినవి, బుద్ధికి మించిన స్థితి (super-conscious) గా ఉన్నపుడు తెలిసినవి.

మన పంచేంద్రియాల (స్పర్శ, చూపు, వాసన, వినికిడి, రుచి ) వల్ల కల్గిన అనుభవాలు conscious mind జ్ఞాపకం పెట్టు కుంటుంది మన మెదడులో. ఈ conscious mind లో కల్గిన అనుభూతులు sub-conscious mind కూడా record చేస్తూనే ఉంటుంది. ఇవే కాకుండా గాఢ నిద్రలో కలలు వస్తూంటాయి. అవి semi-super conscious state లో వస్తాయి.

జ్ఞాపక శక్తిని ఎలా అభివృద్ధి చేసుకోవచ్చు అని అడిగేరు. దాని గురించికొంచెం చెప్తాను. మీరు రోజూ పడుకునే ముందు మీ చిన్ననాటి నుంచి ఈ రోజు వరకు జరిగిన మంచిసంఘటనలకి దేవుడికి ధన్యవాదాలు చెప్పుకోండి. ఇలా చెయ్యడం వల్ల మీ జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది. అంతే కాక - "మన తల వెనకాల భాగం - అంటే మెడకి తలకి మధ్యలో, గుంట (ముచ్చిలిగుంట) లాగ ఉండే భాగం - దానినే 'మజ్జ' (Medulla Oblangata) అంటాము. దాన్ని ఉదయం లేవగానే, రాత్రి పరుండ బోయేముందు ఐదు నిముషాలు మర్దనాలు చెయ్యాలి. ఆ 'మజ్జ' దగ్గర రెండు బొటన వేళ్ళతో బాగా వెనక్కి, ముందుకి, గుండ్రంగాను రుద్దాలి. వేళ్ళను ముడిచి బుఱ్ఱ మీద రెండు నిముషాల పాటు మొట్టికాయలు మాదిరిగా మెల్లిగా కొడుతూ - ప్రతిసారి కొడుతున్నపుడు కళ్ళు మూసుకుని "నా నిద్రపోతున్న మెదటి కణాలు (brain cells) మేలుకుని జ్ఞాపకశక్తిని వృద్ధిచేస్తున్నాయి అనుకుంటూ ఉంటే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

Sub-conscious mind ప్రతీ చిన్నవిషయం చిత్ర గుప్తుడిలాగా record చేస్తూనే ఉంటుంది. మనకి మరణకాలం వచ్చి నప్పుడు జీవితజాబితాలో ఉన్న ప్రతీ అంశము గుర్తుకొస్తుంది. వాటిలో దేనికి ప్రాముఖ్యమిస్తామో మన రాబోయే జీవితం ఆధారపడి ఉంటుంది. అందువల్లనే ఎవరైనా మరణశయ్య మీద ఉన్నపుడు రామాయణమో, భాగవతమో చదువుతుంటారు. పోయే జీవి, రాబోయే జీవితం మంచి ఉద్దేశాలతో ఉన్న శరీరం తో పుట్టాలని, లేదా జన్మరాహిత్యం పొందాలని ఉద్దేశం.

మనకి జననమరణాలు మాత్రం తెలుసు. అవి నిజమనుకుంటాము. కాని, దైవానికో కలలో భాగాలు. జననమరణాలు,పునర్జన్మ-ఇవి జీవితవలయంలో భాగాలు.

"Mental exercises" (ముఖ్యంగా ధ్యానం ) మూలంగా ప్రతివ్యక్తి "super-consciousness" స్థితిని పొందవచ్చు. ఈ ధ్యానం మూలాన మెదడులో ఎన్నో అతీతమైన మార్పులు వచ్చి జీవితంలో జరిగిన క్షణక్షణ అంశాలు గుర్తుంటాయి. అదే super-consciousness యొక్క ప్రతిభ. మహా యోగులకి ఈ super-consciousness ఉండడంవల్ల వారికి జరిగినవి, జరుగుతున్నవి, జరుగబోయే విషయాలు తెలుస్తాయి. వారి గురించే కాకుండా, చుట్టుపట్ల ఉండే ప్రజల గురించి, ఎక్కడో జరుగుతున్న విషయాల గురించి చెప్పగలరు.

సభలోనున్న మరో ముసలాయన లేచి "నాపేరు శోభనరెడ్డి. మీరు చెప్పే మాటల్ని బట్టి మనం ధ్యానం చేస్తూ కూర్చుంటే చాలు. కాబట్టి గుడికి వెళ్ళి ప్రార్థించ నక్కర లేదనుకుంటాను. దాని గురించి వివరిస్తారా?"

**ప్రొ.చం:** మన జగత్తు ఒక తరంగాల పుట్ట. ప్రతి వస్తువు - అంటే గులకరాయి నుంచి, క్రిమి నుంచి తిమింగలం దాకా తరంగాల స్థితిగతులు, వాటి అలల రీతి (frequency rate) మీద ఆధారపడి ఉంటుంది. ఈ తరంగాలలో ధృఢతరంగాలు (positive vibrations), ఋణతరంగాలు (negative vibrations) అని రెండు రకాలు. గుడిగంటల శబ్దాలనుంచి వచ్చే ధృఢతరంగాల వల్ల మనకి మంచి ఆలోచనలు వస్తాయి. అలాగే విగ్రహాలు చలనం లేకుండా స్థిరంగా ఉన్న శిలల్లా కనబడినా వాటిలో జీవం ఉంది. కాబట్టి మనం దైవంతో సమానులైనపుడు (వట్టి మాటల్లో కాదు ) గుడికి వెళ్ళక్కర్లేదు. అంతవరకు వెళ్ళడం మంచిది.

ఇంతలో మరొకామె లేచి "దైవంతో సమాన మవడం ఎలాగో, ప్రథమంగా జీవితంలో చేయవలసిన exercise ఏమైనా చెప్పగలరా?" అని ప్రశ్నించింది.

**ప్రొ.చం:** "తప్పకుండా చెప్తాను. నేను, నాభార్య, నా పిల్లలు,నాచుట్టాలు అనుకుని కూర్చోకుండా మీకు సాధ్యమైనంతలో ఇతరులకి వీలైనంత సహాయం చెయ్యడం, సంఘానికి సేవచెయ్యడం వల్ల మీచిత్తాన్ని (consciousness) విస్తరింపు చేస్తున్నారన్నమాట. ఉదాహరణకి - మీస్వంతలాభం ఆపేక్షించికుండా మీ దగ్గర డబ్బులేకపోయినా-వందమంది బీదలకి అన్నదానం చేస్తానని నిశ్చయించుకుని మీచేతనయినంతలో పని ప్రారంభించండి-మీకు లభించే సాయం ఎలాగొస్తుందో చూడండి.

ఇంతలో మరొక స్త్రీ లేచి "మీరిచ్చే సమాధానాలు చాలా బాగున్నాయి నాదొక ప్రశ్న. దైవాన్ని చూడ గలమా?"

**ప్రొ.చం:** అమ్మా మీరు అడిగినట్లే 'థామస్ ఎడిసన్' ని 'విద్యుత్ శక్తి' అంటే ఏమిటి దాని నెలా చూడగలం? అని ఒకామె ప్రశ్నించిందట. అప్పుడు ఎడిసన్ ఇచ్చిన సమాధానం-మేడం! విద్యుత్ శక్తి - అదో శక్తి - వాడడం నేర్చుకోండి' అన్నాడుట.

అలాగే మీరడిగిన ప్రశ్నకి నేనిచ్చే సమాధానం. దైవం ఉంది. ఆ శక్తిని మీరు ఉపయోగించుకోండి. అలాగే ప్రాణాన్ని ఎలా చూడగలమంటే ఏం చెప్పగలం? మనం బ్రతికున్నాం కాబట్టి ప్రాణముంది.

ఇంతలో ఒక 24 ఏళ్ళ యువకుడు (తల్లిదండ్రుల పోరుపడ లేక పోతున్నాడేమో!) ప్రొఫెసరుగారూ మీరేమీ అనుకోనంటే నాకో ప్రశ్న అడగాలని ఉంది. అన్నాడు. అందరూ కుతూహలంగా అతడి వేపుతిరిగి చూస్తున్నారు. ఆ యువకుడు నాపేరు "హరనాధ్ MBA First Year లో ఉన్నాను. నాప్రశ్న: 'సీనియర్స్ సొసైటీకి బర్డెన్ (burden) అంటాను. మీ అభిప్రాయమేమిటి?"

అక్కడ వృద్ధుల మనసులు చివుక్కుమన్నాయి. అతడి సహాయంతో వచ్చిన తాత, నాయనమ్మ లెంత బాధపడ్డారో!

**ప్రొ.చం:** మంచి ప్రశ్న వేశావు బాబూ! ఒక చిన్న కథ చెప్తాను. ఆ కథలోనే నీకు రావలసిన జవాబు వస్తుందని తలుస్తాను. కథ చెప్పడం ప్రారంభించేరు చంద్రశేఖర్‌గారు. "ఒక పండితుడు ఒకసారి పెద్దనది దాటి ఆవలి గట్టుకి వెళ్ళవలసిన అవసరం వచ్చింది. ఒక పడవవానితో బేరమాడి పడవనెక్కాడు. పది నిముషాలైంది. పండితునికేమీ తోచటం లేదు. అందుకని పడవవానిని భగవద్గీత చదివేవా అన్నాడు."అదేటి బాబు. ఆ పేరే ఇనలేదు" అన్నాడు నావికుడు. "నీజీవితం సగం వృధా అయిపోయిందన్నాడు పండితుడు. మరికొన్ని నిముషాలయ్యాయి. మేఘాలుదట్టంగా వస్తున్నాయి. గాలి కూడా మొదలైంది. పడవ నది మధ్యలోకి వచ్చింది. "పోనీ రామాయణం చదివేవా?" అన్నాడు పండితుడు. "బాబూ! నాకసలు సదువబ్బలేదండి" అన్నాడు నావికుడు. "అయితే నీ జీవితం ముప్పాతిక శాతంవృధా అయిపోయిందన్నాడు పండితుడు. ఇంతలో బాగా వాన మొదలైంది. గాలికి పడవ ఇటు అటు ఊగడం మొదలెట్టింది. అప్పుడు నావికు డడిగేడు పండితుడిని: "పంతులుగోరూ! పడవ మునిగె లాగుంది. మీకు ఈత వచ్చా బాబుగారూ?" "అయ్యో నాకీత రాదురా" అన్నాడు పండితుడు. పడవ సగం మునిగింది. "అయ్యగోరూ! మీ జీవితం నూరుపాళ్ళూ వృధా. నేనేమీ సాయం చెయ్యలే"నని ఈత కొట్టు కుంటూ ఆవలి గట్టు చేరేడు. పండితుడు నదిలో మునిగి మరణించేడు.

ఈ కథని బట్టి చూస్తే ఎవరు ఎక్కడ ఉపయోగ పడతారో చెప్పలేము. వృద్ధులకున్న అనుభవం, ఇంగిత జ్ఞా నం యువకులకుండదనుకుంటాను. కాబట్టి ఎవరు సంఘానికి బరువో నీవే ఆలోచించు అన్నారు చంద్రశేఖర్‌గారు. దాన్తో ఆ యువకునికి కాస్త బుద్ధొచ్చింది. అక్కడికి వచ్చిన వాళ్ళు ఆనందకరంగా ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

"కీళ్ళ నొప్పులతో పరమ బాధ పడిపోతున్నాను. పదడుగులు కూడా వెయ్యలేను. నా బాధ ఎలా

తీరుతుంది?" అని ఒక 60సంవత్సరాలు వయస్సున్నామె ప్రశ్నించింది.

**ప్రా.చం:** మందుల ద్వారా ఎలా తగ్గుతుందో చెప్పలేను. కాని మానసికంగా ఎలా తగ్గించుకోవచ్చో చెబుతాను. ముఖ్యంగా మీకు కీళ్ళ నొప్పులు తగ్గించుకోవాలన్న కోరిక ఉండాలి. అంతేకాని "నేను పది అడుగులు వెయ్యలేను. నా కొడుకూ కోడలూ చెయ్యవలసిందే" అని మాత్రం కూర్చోకూడదు. దాని బదులు ఉదయం లేవగానే "దేవుని దయ వల్ల ఈ రోజు లేవగలిగేను. ఈ రోజు నిన్నటికంటె అన్ని విషయాల్లోనూ బాగుంటుంది. నాకీళ్ళ నొప్పులు నిన్నటి కంటె మెరుగనుకుంటాను" అనుకుని ఇంట్లోనే మెల్లిగా నాలుగు సార్లు ఇటు అటు తిరగండి. అలాగే రోజు రోజుకీ మరో నాలుగడుగులెక్కువ చేస్తూ నడవండి.నామాట నమ్మండి. నెల రోజుల్లో ఫర్లాంగు దూరం 15 నిముషాల్లో నడవగలుగుతారు. ఆతర్వాత మీకు అదే అభ్యాసం కూసువిద్యగా మారుతుంది."

ఇంతలో మరొక యువతి లేచి "నాపేరు సక్కు. 28సంవత్సరాలు. మా అమ్మమ్మగార్ని తీసుకొచ్చేను. నా ప్రశ్న ఏమిటంటే నాకో మిలియన్ డాలర్లు రావాలంటే వస్తాయా?"

**ప్రా.చం:** "ఆ మిలియన్‌డాలర్లు ఈరాత్రే రావాలంటే రావు. అది గొంతెమ్మ కోరిక. కాని, తగినంత వ్యవధినిచ్చి దానికి కృషిచేస్తూ "positive affirmations" ప్రతిరోజు రాత్రి నిద్రపోయే ముందు, ఉదయం లేవగానే "repeat" చేస్తూ ఉంటే మీ message sub conscious mind లో store కావడం మూలాన కొద్దికాలంలో మీ కోరిక ఫలిస్తుంది.

తను మహామేధావి అనుకునే ఒక ముసలాయన - 'మనం ఈ బొంది వదిలింతర్వాత, ఈ కట్టెని దహనం చేస్తారు. ఆతర్వాత ప్రాణం ఎక్కడికి పోతుంది?' అని ప్రశ్నించేడు.

**ప్రా.చం:** "చాలా మంచి ప్రశ్న. నేను ఇక్కడా, అక్కడా చదివిన information బట్టి చెప్తున్నాను. శరీరాన్ని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు. 1. భౌతిక శరీరం (Physical body) 2. సూక్ష్మ శరీరం (Astral body) 3. కారణ శరీరం (causal body) 4. భావ శరీరం (ideational body). మీప్రశ్నకి జవాబు వెనక నుంచి వచ్చిచూద్దాం. దైవానికి ఒక జీవిని పుట్టించాలి అనే ఉద్దేశం (భావన) కలిగిందనుకోండి - అది భావ శరీరం. ఎటువంటి శరీరమిస్తే బాగుంటుంది - దానికో కారణం ఉండాలి. ఆ కారణం మన పూర్వజన్మ సుకృతం బట్టి ఉంటుంది. అది 'కారణశరీరం'. ఆకారణ శరీరపు తరంగాల అలల రేటుని కుదించడం వల్ల 'సూక్ష్మ శరీర' మవుతుంది. ఇంకా ఆతరంగాలు కుదించడంవల్ల స్థూలశరీరంగా జన్మిస్తుంది. కాబట్టి మనం మరణించిన తర్వాత మనలో నున్న ఆత్మ వెనక్కి పయనించి మళ్ళీ మూలస్థానమునకు వెళ్తుంది.

"ఇన్ని ప్రశ్నలకి సమాధానాలు చెపు_న్నారు కదా! మీ భౌతిక శరీరాన్ని వదిలి సూక్ష్మశరీరంతో మీశరీరాన్ని చూడ గలిగారా! అంటే "out of body experience" ఏమైనా ఉందా?" అని ఒకాయన ప్రశ్నించేడు.

**ప్రా.చం:** చూచాను. Spiritual Experiences చెప్పుకోకూడదు. కాని మీ కుతూహలం చూస్తుంటే చెప్పకుండా ఉండలేకున్నాను. ఇది చాలా కాలం క్రింద జరిగిన సంగతి. తెల్లవారు ఝాముున మూడున్నర గంటలయింది. ఉన్నట్లుండి నా శరీరం స్ఫటిక రూపంలో గాలిలో తేలి పోతోంది. నా భౌతిక శరీరం మంచం మీదే ఉంది. నేను నా శరీరాన్ని చూడ గలిగేను. ఎంత హాయిగా ఉందో చెప్పలేను. ఉన్నట్లుండి అలారం ప్రక్కగదిలోంచి మ్రోగిన శబ్దం. "అయ్యో! అలారం ఆపాలి" అని గబుక్కున నాశరీరం లోకి వచ్చేశాను. ఆ తర్వాత ఎన్ని రోజులు బాధపడ్డానో అలాగైనందుకు. సూక్ష్మ శరీరంలో ఉన్న హాయిని వర్ణించ లేను.

వెనకనించి సంపత్‌బాబు watch చూపిస్తున్నాడు. నాకీ సదవకాశం ఇచ్చిన మీకందరికీ నా ధన్యవాదాలు. ఇంతకీ నేను ఫలానా 'topic' మీద మాట్లాడాలని రాలేదు. కాని మీ ప్రశ్నలవల్ల కల్గిన ఆలోచనలు సంగ్రహంగా చెప్పాను.

మనమేది సాధించాలన్నా మన కృషితో వీలౌతుంది. మన ఆలోచనల బట్టి అవకాశాలు రావడం జరుగుతూ ఉంటుంది. మన ప్రయత్నముంటే దైవం సాయం చేస్తుంది. దైవమంటే ఎక్కడో ఆకాశంలో ఉన్న వ్యక్తి అనుకోనక్కరలేదు. మనం చేసే 'meditational exercises' మూలాన మన consciousness ని super consciousness గా మార్చవచ్చు. ఆ super conscious state చేరడంవల్ల మనం దైవంతో సమానమే. అందువల్ల మనకేది కావాలంటే అది లభ్యమవుతుంది. "యద్భావం తద్భవతి". కాబట్టి దేవుడు అనే శక్తి ఎక్కడో లేడు. మన మనసులోనే ఉంది ఆ మహత్తర శక్తి. ఆ

గుడిలో ఉన్నాడనుకునే దేవుడు మన మనస్సులోనే ఉన్నాడు. కాబట్టి నేను ఈ రోజున మాట్లాడిన topic ఏమిటంటే "మనసే మందిరం".

# ఆన్ లైన్

- నారాయణ స్వామి

నేను యెలా ఉంటానో
నీకు తెలుసా -
నీవు యెలా ఉంటావో
నాకు తెలుసా?

బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ జాలంలో
కనబడీ వినబడని
మాటలదొంతర్లే  ఆనవాళ్ళున్నీ .

కొంత ఉద్వేగం కొంత ఆవేశం
కొంత దుఃఖం కొంత  ఆనందం
వేలరంగులూ లెక్కలేనన్ని నీడలూ
మానిటర్ స్క్రీన్ మీద మెరిసే
నలుపు తెలుపుల గీతలు .

కళ్ళకింద నల్లని కాంతులు
పెదవులమీద తెల్లని మరకలు
ఆన్లైన్ లో క్షణికాలు.

సడలిన గుండె తీగల్ని సవరించడం
శరీరంపై వయసు పగుళ్ళని
ఆదుర్దాగా తడుముకోవటం
అంతా లిప్తపాటు

గిడసబారిన గోటికొసల సంభాషణలు
స్పృశించలేని గుండె చప్పుళ్ళు
ఇక మనమంతే

నేనెలా ఉంటావో
నీవెలావున్నానో
అంతుపట్టని అరమోడ్పు కళ్ళు

# మనం - మనదేవాలయాలు

- *యేలూరిపాటి ఆంజనేయశర్మ*

“ఇంటికంటే గుడి పదిలం“ అన్న సామెత మనమందరం ఎరిగున్నదే. అది సామెత మాత్రమే కాదు, నిజం కూడా. నేటికీ ప్రకృతి వైపరీత్యాలొచ్చినప్పుడు జనసామాన్యానికి నిలువనీడనిచ్చేవి బళ్ళు-గుళ్ళే.

మనదేశంలోని ప్రతీపల్లెలోనూ మిట్ట మధ్యాహ్నానికి మహానైవేద్యాన్ని సిద్ధంచేసి నివేదనచేసి, ఆ ప్రసాదాన్ని అందరికీ పంచటంకోసం, రండి! అంటూ భక్తుల్ని ఆహ్వానిస్తూ పెద్దగంటను మోగించేవారు అర్చకులు. ఆ ఘంటానాదంతో ఎక్కడో ఉన్నప్పటికీ విని వచ్చి ప్రసాదాన్ని స్వీకరించేవారు. ఇకదానితో ఆ ఊళ్ళో అన్నార్తుడు మిగిలేవాడుకాదు. ఏయింటా ఆతిథ్యం లభించని బాటసారులు, యాత్రికులు మాత్రమేకాదు, పనిచేసుకోలేని వృద్ధులు, ఉపాధిదొరకనివారు- అందరికీ ఆ ప్రసాదమే కూలంబన అయ్యేది. ఈ వ్యవస్థ నడవడానికై రాజులు-తరువాతి కాలంలో దాతలు అగ్రహారాలను, మాన్యాలను దానాలుగా ఇచ్చేవారు.

కాశీరామేశ్వరాలను కాలినడకన చూసే యాత్రికులకు ఎండవేళ-రాత్రిపూట విశ్రమించటానికి గుడిగోపురం అరుగులే ఆధారమయ్యేవి. గుడి గోపురంపై ఉన్న కలశాలు లోహనిర్మితాలు. పిడుగులు పడినపుడు విద్యుత్తును ఆకర్షించి భూమిలోనికి విలీనం చేస్తూ ఊళ్ళోని మరేయింటికి ఆపద వాటిల్లకుండా చూసేవి. గుడిగోపురంకంటే ఎత్తుగా గృహనిర్మాణం చేసికోరాదని వాస్తు నియమం! గుడినీడ ఇంటిపై పడరాదనటానికి కారణం, సమూహానికి అవసరమైన గుడిచుట్టూ తగినంత స్థలం మిగిల్చటానికి ఇల్లు గుడికి వీలైనంత దూరంగా నిర్మించుకోమని సలహా కావచ్చు.

గుడి, కోవెల, కోఇల్, కూలయం ఇలా ఎన్నో పేర్లతో వ్యవహరించబడుతున్న గుడి దేవుడుండే చోటు-దేవస్థానం-దేవాలయం.

అంతటా దేవుడున్నాడు, పిపీలికాది బ్రహ్మపర్యంతం అంతారామమయం, సర్వం ఖల్విదంబ్రహ్మ, సర్వం విష్ణుమయంజగత్ అంటూ ఎన్నోచెప్పుకునే మనకి అక్కడే-ఆలయంలోనే దేవుడున్నాడనేది వైరుధ్యం కాదా? కాదు వైవిధ్యం.

ఆదినుండీ మానవుడు తనపరిధిలో లేని పరిష్కారాలకు ‘భగవంతునిదే భారం‘ అనుకొంటూ, తన శక్తికి మించిన వ్యవహారాలకు అనంత శక్తివంతమైన భగవచ్ఛక్తిని నమ్ముకున్నాడు. వ్యక్తిగతమైన ఉపాసనకు - పూజా పునస్కారాలకు ఇలవేల్పులుంటే, సమూహానికి చెందిన పూజలకు సేవలకు కూలౌ స్థితుడైన భగవంతుడు ఆలంబన అవుతున్నాడు. అనంత శక్తి స్వరూపుడైన భగవంతుని శక్తిని మన శక్తిమేరకు కేంద్రీకరింపజేసికొని లబ్ధి పొందటమే ఆలయవ్యవస్థ.

మనం నిర్మించుకున్న దేవుడేకదా మనకు వరాలివ్వగలడా? అనిపించవచ్చు. మనం వెలిగించుకున్న దీపమే మనకు దారిచూపటంలేదా? ఇదీ అంతే. అనంతమైన ప్రాకృతికశక్తి సమీకరణమే ఆలయదైవం.

నిజానికి ఆలయాల ప్రస్తావన వేదకాలంలో లేదు. యజ్ఞయాగాదులే నాటి ఐహికాముష్మిక సాధనాలు. రామాయణకాలానికి కూడ “దేవతాయతనానిచ“ వంటి ప్రయోగాలు కనబడతాయి. బహుశా అవి ఇళ్ళలో ఉండే దైవమందిరాల సూచకాలే కావచ్చనిపిస్తుంది. పురాణాలలో క్షేత్రమహాత్మ్యాలున్నాయి. తీర్థక్షేత్ర సందర్శనల విశేషాలున్నాయి. మొత్తం మీద వేలాది సంవత్సరాలుగా ఆలయవ్యవస్థ కనబడుతోంది.

క్రీస్తుకి ఎడాపెడా మాత్రమే ప్రపంచచరిత్రను సర్దేస్తూ కుదించేసిన పాశ్చాత్యుల చరిత్ర ప్రకారం చూసినా, క్రీస్తు పూర్వం ౨వ శతాబ్దినాటికి ఆలయ నిర్మాణాలు సాగాయి. నాటినుండీ కూడ రాజులు ఆలయాలను సామాజిక ఉత్సవకేంద్రాలుగా, సాంస్కృతిక రంగ వేదికలుగా, సాంఘిక సమానత్వ సాధకాలుగా, సమాజ సంస్కరణా కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ నిర్వహిస్తూ వచ్చారు. అందుకే ఇంచుమించు ప్రతీ రాజవంశీకుడు ఏదో ఒక ఆలయాన్ని నిర్మించినట్లో, వృద్ధి చేసినట్లో మనకు కనబడుతుంది.

నేటిప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థిక సంక్షోభాది సందర్భాలు రాకుండా వినియోగ వస్తూత్పత్తికి అతీతమైన నిర్మాణాలతో ఆర్థిక చలన సామర్థ్య వృద్ధికి కారణమయ్యేలా, అనేకమందికి ఉపాధినిస్తూ ఆలయ నిర్మాణ-నిర్వహణలు జరగటాన్ని మనం గమనించవచ్చు. శిల్పులు-కళాకారులు-కార్మికులు-వ్యాపారులు-పండితులు-పాచకార్చక-పరిచారక-శకటకార-వాహక-వాద్యకారాదులు అనేక మందికి అవి ఉపాధికేంద్రాలు.

సార్వకాలిక-సార్వదేశిక ద్రవ్యవస్తు నిధి నిక్షేప నిలయాలు. రజతస్వర్ణరత్నాభరణ సంరక్షణ కేంద్రాలు. భయభక్తులతో చూచేవారాద్రవ్యాన్ని. అది సమాజాన్ని నిత్యవైభవోపేతంగా నిలిపి ఉంచే ద్రవ్యనిధి. కామన్ ప్రాపర్టి. పన్నులరూపంలో కట్టింది పాలనకుపయోగించేది. అది చెకింగ్ అక్కౌంటు లాటిది. భక్తిప్రపత్తులతో సమర్పించేది శాశ్వతనిధి. ఫిక్సెడ్ డిపాజిట్ లాటిది. అందుకే వేలాది సంవత్సరాలుగా భారతదేశం వైభవోపేతంగా నిలిచివుంది.

అందుకే అనేక దోపిడీదార్లకు లక్ష్యమయ్యిందనేది వేరేసంగతి. ఆలయాల లక్ష్యంగా దండయాత్రలు మనకు తెలుసు. మొత్తం మీద ఆలయాలు శాశ్వత ద్రవ్యకేంద్రాలు.

ఇలా బహుళ ప్రయోజన సాధకాలైన ఆలయాల నిర్మాణ-నిర్వహణలు మారిన కాలానికి అనుగుణంగా, కొంతమేరకు పద్ధతులను మార్చుకోవడం అనివార్యమైంది. ఉద్దేశ్యాలు పలుచన కావటం కూడా సంభవమే అయింది.

మారిన దేశకాల పరిస్థితులనుబట్టి దేశవిదేశాల్లో విస్తరిస్తున్న భారతీయుల అవకాశాలను అవసరాలను బట్టి - అన్ని వ్యవస్థలవలె ఆలయవ్యవస్థ కూడా మార్పు చేర్పులకు లోనవ్వటం సహజమే. అయితే ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా, మౌలిక ఆశయాల ఆధారంగా ఆలయవ్యవస్థను తీర్చిదిద్దుకునే ప్రయత్నం హర్షించ దగినది. ప్రస్తుత ప్రజాస్వామిక ప్రపంచంలో ప్రజలే ఏకమై, తామే ప్రభువులై ఆలయవ్యవస్థను పటిష్ఠ పరుచుకుంటూ సామాజిక సర్వతోముఖ వికాసానికి దోహదకారులయ్యే ప్రయత్నం ప్రశంసించదగ్గది.

శాస్త్రప్రకారంగా మానవనిర్మిత ఆలయాలది నాల్గవస్థానమైనా ఆశయాల సాధనలో మొదటి స్థానంగా పేర్కొనవచ్చు. దేవాలయాల్లో నాలుగు రకాలున్నాయి.

1. స్వయంభావులై వెలసిన దైవములున్నవి (ఉ: తిరుపతి, శ్రీ శైలం మొ॥)

2. దేవతలచే ప్రతిష్ఠింపబడిన మూర్తులు కలవి (ఉ:అమరావతి, ద్రాక్షారామము, పంచారామము మొ॥)

3. ఋషులు-మహాపురుషులు ప్రతిష్ఠించినవి- అగస్త్య వ్యాసాది నిర్మితాలేకాక ఆధునికకాలం పీఠాధిపతులచే ప్రతిష్ఠింపబడినవీ ఈ కోవలోకే వస్తాయి.

4. మానవనిర్మిత మందిరాలు- వీధి వీధిన ఉన్న రామమందిరాలీ కోవలోనివి.

సాధారణంగా అన్ని ప్రసిద్ధ ఆలయాల్లోనూ గర్భ గుడి, ముఖమండపం, విమానం, ధ్వజస్తంభం, ప్రాకారం, గోపురం, రథం, వాహనాలు, మూలవిరాట్టులు, ఉత్సవమూర్తులూ ఇలా ఎన్నో భాగాలుంటాయి. వాటివాటి స్థాపత్య విశేషాలు, ఆగమోక్త మహత్త్వాలు ఇప్పుడు వివరించుకోదల్చుకోలేదు. సామాజిక దృక్పథంతో ఆలయవ్యవస్థను స్పృశిస్తూ ఆలయాల్లో పాటించే ఆచారాల్లో సమాజాన్ని సంస్కరించే ఆంతర్యాలను స్థాలీపులాకంగా చూపటమే ఉద్దేశ్యం.

ఉదాహరణకు ప్రసాదాన్ని గ్రహించేటప్పుడు అందరం ఒక్కటే అన్న భావన కల్గుతుంది. అందరికీ ఆ ప్రసాదమే, ఆ దైవప్రసాదమే అందుతోందన్నదే మన భావన. సర్వం జగన్నాథం అనుకుంటూ సమూహంగా తీసికొనే పూరీజగన్నాధుని ప్రసాదాన్ని గుర్తు చేసికోవాలీ సందర్భంలో. తరతమభేదాల్లేకుండా అందరం దర్శించుకునే తిరుపతి వేంకటేశ్వరుడు, అందరం స్పృశించే కాశీవిశ్వేశరుడు, శ్రీ శైలం మల్లన్న ఇవన్నీ మనలోమనకి ఆత్మీయతను సమష్టి భావాన్ని పెంచుతాయి. గుళ్ళల్లో జరిగే ఊరేగింపులు (ఊరు ఏగుట) దేవాలయాలకు వెళ్ళలేని అశక్తులవద్దకు దైవమే వచ్చి దర్శనమిచ్చే ప్రయోజనాన్ని సాధిస్తాయి.

ఆలయంలో భయభక్తులతో పాటించే ఆచార వ్యవహారాలద్వారా అబ్బే క్రమశిక్షణ-సక్రమమైన మన వైయుక్తిక సామాజిక జీవనానికి దోహదకారి అవుతుంది. ఉదా: ఆలయంలో చెప్పులతో తిరగరాదనటం, ఆలయానికి శుచియై శుభ్రంగా వెళ్ళాలనటం, ఆడంబరంగా అలంకరించుకొని ఆలయాలకు వెళ్ళరాదనటం- ఇవన్నీ ఆలయపవిత్రతను కాపాడటానికి, వ్యవస్థపట్ల గౌరవం పెరగటానికి, అహం తగ్గి వినయం పెరగటానికి ఉపకరిస్తాయి.

బొట్టుపెట్టుకొని, సాంప్రదాయకంగా వెళ్ళటం, ఒంటినిండా బట్టను కప్పుకోవటం వంటివి తనకు సంస్కారకారకాలేకాక ఎదుటివారికి ఆరోగ్యకరమైన గౌరవాన్నిచ్చే వ్యవహారాలు. ఖాళీ చేతుల్తో వెళ్ళకూడదనటం త్యాగాన్ని, సమర్పణా భావాన్ని పెంచటానికి, ప్రసాదస్వీకరణ వినయాన్ని పెంచటానికి, తీర్థం ఆరోగ్యాన్ని పెంచటానికి ఉపయోగిస్తాయి. వ్యర్థ ప్రసంగాలు ఏకాగ్రతకు భంగకారకాలేకాక, దైవంనుండి మనల్ని దూరం చేస్తాయి. అహింస-అస్తేయాది

శమదమాది సాధనకవసరమైన శారీరక మానసిక సంసిద్ధతతో ఆలయప్రవేశం చేస్తే అవి సిద్ధిస్తాయి. దానితో మన సౌభాగ్యమేకాక జగత్కల్యాణం సాధ్యమౌతుంది.

వ్యక్తిని సంస్కారవంతునిగా తీర్చిదిద్దేకేంద్రం ఆలయం. వ్యష్టి సంస్కరణ ద్వారా సమిష్టి సంస్కరణ భారతీయ జీవనసిద్ధాంతసారం. ఒక్కొక్క వ్యక్తీ పద్ధతిగా మలచబడితే సమాజం దానంతట అదే ఆరోగ్యకరంగా జీవిస్తుంది. సంస్కారవంతులై నియమబద్ధంగా జీవించే వ్యక్తులు సమాజానికి ఆధారం. మన సమాజంలో ధర్మనిర్వహణకే తప్ప అధికారానుభవానికి చోటులేదు. మనదైన ధర్మాన్ని నిర్వచించుకోవటంలో మన వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంటుంది. ఈదశలోనే మనలోని 'అహం' తొంగిచూస్తూంటుంది. అహం పోయే ఉపాయం "సర్వాధికారి" సందర్శనమే. అల్పులమని తోస్తే అహం తగ్గుతుంది. అప్పుడే స్వధర్మ నిర్వహణ సులువౌతుంది. ధర్మనిర్వహణా సమర్థత పెరగటానికి ఆలయమే ప్రేరణ. దైవమే సహకారి.

పసితనంలో పెద్దలద్వారా పద్ధతులను తెలిసికొన్నా, పెద్దయ్యాక తనని తాను పద్ధతుల్లో ఇముడ్చుకోవాల్సిందే ఎవరైనా. ఇది నిరంతర ప్రక్రియ. దీనికి సహకరించే వ్యవస్థ సామూహిక శ్రద్ధాకేంద్రం- ఆలయం.

ఇంట్లో చేసికొనే ఆధ్యాత్మిక సాధన మనకి కొంత పరిపూర్ణతా సాధనకు సహకరించినా ఆలయాల్లో లభించే ఆధ్యాత్మిక సాధనావకాశాలు మనల్ని మరింత పరిపూర్ణులుగా తీర్చిదిద్దుతాయి.

మనం స్వచ్ఛందంగా ఆలయాలకు వెళతాం. భగవద్దర్శనంలో ఆనందాన్నీ, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పెంపొందించుకుంటాం. ఆదర్శమూర్తులైన పెద్దల సందర్శనం - వారి మార్గదర్శనం ప్రత్యక్షోదాహరణలుగా గమనిస్తాం. వారి అడుగుజాడల్లో నడిచే ప్రయత్నం చేస్తాం. వ్యక్తులమైన మనం మనదైన సమాజంలో సమష్టిలో మనమో భాగమని గుర్తించుకొంటూ ఇమిడిపోతాం. సామాజిక అవసరాలను మనవైన శక్తిసామర్థ్యాలతో తీరుస్తూ, మన శక్తిసామర్థ్యాలను మరింత బలోపేతం చేసికొంటాం.

దీనికై మనల్ని మనం భక్తి-భగవత్సేవ-దానం-ధర్మం-పుణ్యం-పురుషార్థం వంటి ప్రక్రియలతో మెరుగులు దిద్దుకుంటాం. ఈ భావజాలానికి, అభ్యాసానికి ఆలవాలం ఆలయం. మొత్తం మీద గుడి సామాజిక సంస్కరణాకేంద్రం. అది మొత్తం సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిబింబిస్తూ ఉంటుంది.

ముఖ్యంగా దేశవిదేశాల్లో ఉన్న ఆలయాలు మొత్తం భారతీయ సమాజం ఒకచోట చేరే వేదికలుగా ఉండటాన్ని మనం గమనించవచ్చు.

# అమెరికా నుంచి అమూల్య

*- మంథా భానుమతి*

తెల్లారకుండానే తెలివొచ్చేసింది. కానీ లేచి ఏం చెయ్యాలిలే అని అలాగే పడుక్కున్నాను. తలుపు చప్పుడు విని కూడా బద్ధకంగా ప్రక్కకి తిరిగిపోయాను. ఇంత పొద్దున్నే ఎవరయ్యుంటారూ? ఐనా పాలవాడైతే బెల్లు కొడ్తాడు కదా! ఇంక తప్పదనుకున్నారేమో బావ లేచి వెళ్ళారు. పెళ్ళి చేసుకున్నాక నా మూడ్స్‌కి అలవాటు పడక తప్పుతుందా!

బావ వెళ్ళేలోగానే పది సార్లు తలుపు చప్పుడు, ఆరు సార్లు ఆపకుండా బెల్లూ.

"సీతా ఎవరొచ్చారో చూడూ". బావ కేక! వింటుంటే మనసులో ఏదో ఉల్లాసం. ఆకాశంలో ఎగురుతున్న అనుభూతి.చటుక్కున మంచం దిగి తొందరగా అడుగు వెయ్యబోయాను. కుడి మోకాలు కలుక్కుమంది. మనస్సుని కిందికి దింపి నెమ్మదిగా అడుగులు వేశాను.

ఉగాది కదా! వాచ్‌మన్ వేప్పువ్వూ మామిడాకులూ తెచ్చుంటాడు. అంతకంటే పండుగపూట ఎవరొస్తారూ! కాళ్ళీడ్చుకుంటూ హాల్లోకి వెళ్తూండగానే కాళ్ళకడ్డంపడి బుజ్జి గాడు. "హాయ్ గ్రాండ్‌మా!" అంటూ ఆర్తిగా పట్టేసు కున్నాడు. వాడి వెనుకే అమూల్య చెయ్యి పట్టుకుని బుడిబుడి అడుగులు వేస్తూ పాప.

చేతిలో బాగ్ కింద పడేసి అమూల్య వచ్చి గట్టిగా కౌగలించుకుంది. ప్రశాంత్ అప్పుడే సూట్‌కేసులు దొర్లించుకుంటూ వస్తునాడు.

నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రెండేళ్ళయింది చూసి.

ఇప్పటికీ గుండెల్లో సన్నగా నొప్పి.. అప్పుడు వరుసగా జరిగిన సంఘటనలు తల్చుకుంటే.

...........

"అమ్మా పాప అచ్చు మీ లాగే ఉంది కదూ!" పాపకి స్నానం చేయించి బట్టలు వేస్తున్న అమూల్యని ముచ్చటగా చూశాను.

మూడు తరాల తర్వాత ఇంట్లో ఆడపిల్ల. అందరికీ ముచ్చటగా ఉంది. బుజ్జిక్కూడా నాలుగేళ్ళు నిండాయి. వాడి సంబరం చూడాల్సిందే. అమూల్య కూడా ఇంట్లోనే ఉంటోంది. నా పని పిల్లల్ని ఆడించడం. ఏవైనా చిన్న చిన్న పనులు చేయడం, వాకింగ్, ఎప్పుడో మూలపడేసిన పైంటింగ్, అప్పుడప్పుడు ఎవరింటికేనా వెళ్ళడం, పుస్తకాలు చదువుకోడం. బావ కూడ తన వ్యాపకాలతో విసుగు లేకుండా గడిపేస్తున్నారు.

ఎంతో ఆనందంగా నడుస్తున్న సంసారంలో అనుకోని అవాంతరం వచ్చి పడింది.. రెండు రూపాల్లో!

ఎప్పుడూ తలనొప్పి అని కూడా అనని బావకి స్ట్రోక్ వచ్చింది. బైపాస్ చేశారు. పల్లెలో పొలాల్లో తిరిగిన మనిషి కనుక తొందరగానే కోలుకున్నారు. క్రమం తప్పకుండా మందులు వ్యాయామం, తేలికైన ఆహారం తీసుకోవాలి. ఎంత మందినో బైపాస్ సర్జరీకి పంపాను కానీ నా మనిషికి వచ్చేసరికి తట్టుకోలేకపోయాను.

"అమ్మా!" కొంచెం ఆదుర్దాగా, కొంచెం నిష్టూరంగా పిలిచింది అమూల్య.

"మన ఆరోగ్యం బాగుంటేనే కదా పేషంటుని బాగా చూసుకోగలుగుతాం. మిమ్మల్ని మీరు చూసుకోవట్లేదు.. డాక్టరైయుండీ అనను కానీ.." గ్లాసులో బత్తాయి రసం ఇస్తూ అంది.

నిజమే. ఈ రెండు నెలల్లో బాగా నీరసించి పోయాను.

"మాం! ఏంటి చిన్న పిల్లలా. డాడీకి ఏంఫరవాలే దన్నారు. యు షుడ్ టేక్ కార్ ఆఫ్ యుర్సెల్ఫ్." ప్రశాంత్ కోపడ్డాడు. ఒక్కడే కొడుకని గారాబం ఎక్కువేం చేయలేదు మేము.. కానీ ఓదార్పు మాట కూడా కొట్టినట్టు చెప్పడం వాడి ప్రత్యేకత. నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నేను డాక్టరుగా పని చేసిన పల్లెలో చదువు సరిగ్గా లేదని వాణ్ణి పబ్లిక్ స్కూల్లో హాస్టల్లో ఉంచి చదివించడం. చదువు బాగా అబ్బింది కానీ వారం వారం ఇంటికొచ్చినా, "అమ్మా!" అనే పిలుపుకే మొహం వాచిపోయాను.

"మీకెందుకు.. కూతురు లేని లోటు నేను తీరుస్తా కదా!" అన్న అమూల్య వల్ల స్వాంతన పొందుతున్నాం ఇద్దరం.

"అదే నాజూగ్గా చెప్పచ్చు కదా.. మీద పడి కరవకపోతే.." మందలించింది అమూల్య.

"నాకింతకంటే రాదు." ప్రశాంత్ విసురుగా వెళ్ళిపోయాడు. బావకున్న విసుక్కి పదిరెట్లు వచ్చింది వీడికి. మనసులో ఎంత ప్రేమ, ఆప్యాయత ఉంటే ఏంలాభం? మనకి కనిపించదు కదా!

నెమ్మదిగా బావ ఆరోగ్యం మామూలు స్థితికి వచ్చింది.

"అమ్మా!" ఒక రోజు అమూల్య నా దగ్గఱికి వచ్చి మెల్లిగా పిలిచింది.

"ప్రశాంత్ కి అమెరికాలో ప్రాజెక్ట్ వచ్చింది. వెళ్తానని పట్టు పడ్తునాడు. మీకు చెప్పటానికి మొహమాటంగా ఉంది. అంటే తనకి సరిగ్గా చెప్పడం రాదు కదా అని". నా కొడుకు గుఱించి చెడ్డగా అనుకుంటానేమోనని నట్టుతూ చెప్తున్న అమూల్యని చూస్తుంటే, నాకు నవ్వూ కోపం ఒక్క సారే వచ్చాయి.

కళ్ళలో కోపం చూపిస్తూ నవ్వుతూ అన్నాను, "ఎందుకూ ఇక్కడ లేవా ప్రాజెక్ట్?"

"లేవని కాదు.. కొత్త ఎక్పీరియన్స్ కదా అని. పైగా.."

"అందరూ వెళ్తునారుకదా.. తను కూడా ఏదో ఉద్ధరిద్దామని.." ఉక్రోషంగా పూర్తి చేశాను.

"అది కాదమ్మా!"

"ఏది కాదు.. రిటైరయ్యాక మామానాన మేముంటా మంటే బలవంత పెట్టి తీసుకొచ్చావు. అంతా బాగానే ఉంది కదా అనుకుని ఉన్నవన్నీ అమ్మేసుకున్నాం మేం. ఇప్పుడు మీఱెంచక్కా రెక్కలు విప్పుకుని ఎగిరిపోతా మంటే.." ఏడుపుతో కంఠం పూడుకుపోయింది.

"నిజమే! కానీ రెండేళ్ళలో తిరిగి వచ్చేస్తాం. అట్లా అని కంపెనీ వాళ్ళే చెప్తున్నారు. ప్రశాంత్ సంగతి తెలుసు కదా. నేను ఎంత చెప్పినా వినటంలేదు. మీరు ఇక్కడ హాయిగా ఉండచ్చు. బాగా అలవాటైంది కదా!"

నాకు చిఱ్ఱెత్తుకొచ్చింది. "ఐతే అంతా నిర్ణయించు కుని మాకు తెలియపరుస్తున్నారా? కొంచెం ముందు తెలిసుంటే కనీసం ఇల్లైనా అమ్మకుండా ఉండే వాళ్ళం. ఎప్పుడు ప్రయాణం?"

"ప్రశాంత్ ఈ ఆదివారం ఫ్లైట్ కి వెళ్తున్నారు. మాకు పది రోజుల తరువాత. పోనీ నేనూ పిల్లలూ మానెయ్యమా? రెండేళ్ళు ఎంత లోకి గడిచిపోతాయి?" నాకేసి బెదురుగా చూస్తూ అంది అమూల్య.

ఎప్పుడూ దబాయిస్తున్నట్లుగా మాట్లాడే అమూల్య అంత బేలగా అడుగుతూంటే జాలేసింది. తనేంచేస్తుంది, మొగుడికీ మాకూ మధ్య నలిగిపోతోంది. అంత జబ్బు పడి లేచిన తండ్రినీ, ఎప్పుడూ ఇల్లూ, హాస్పిటలూ తప్ప ఎక్కడికీ వెళ్ళెరుగని నన్నూ వదిలేసి వెళ్ళడానికి వాడికి మనసెలా ఒప్పిందో!

"అలా ఏం అఖ్ఖర్లేదులే. మళ్ళీ మిమ్మల్నిద్దఱినీ విడదీసిన పాపం నాకెందుకు.. వెళ్ళి సామాన్లు సర్దుకోండి."

.........

"మాం! తప్పకుండా టూ ఇయర్స్‌లో వచ్చేస్తాం. నువ్వు నాన్నని చూసుకోగలవు. ఇక్కడ అన్ని అరేంజ్‌మెంట్స్ చేసివెళ్తాము కదా! పని వాళ్ళందరూ మమూలుగా వస్తూంటారు. రోజూ వెబ్‌కాంలో చూస్తూ పలకరిస్తూంటాం. ప్రామిస్." చాలా సౌమ్యంగా నా ప్రక్కన కూర్చుని అనునయించి వెళ్ళిపోయాడు ప్రశాంత్. అంతా ఒక వైపు నుంచే ఆలోచించి మాట్లాడే వాళ్ళతో ఏంచెప్తాం? చదువూ, పెళ్ళీ అవగానే వెళ్తే మేం కూడా అందర్లాగా సర్దుకునే వాళ్ళం. ఇన్నేళ్ళు మురిపించి బంధాలు పెంచుకున్నాక. అస్సలు తట్టుకోలేకపోయాను.

అమూల్యా పిల్లలూ కూడా వెళ్ళిపోయాక.. లంకంత ఫ్లాట్ బావురుమంటూంటే బావ బాగానే ఉన్నారు కానీ నేనే డిప్రెషన్ లోకి వెళ్ళిపోతున్నానేమో అనిపించింది. ఇద్దరు మనుషులకి ఏమవసరాలుంటాయి, ఏం పనుంటుంది. పని వాళ్ళు గంటలో పని ముగించుకుని వెళ్ళిపోతున్నారు.

బావ స్వతహాగా మితభాషి. సుడోకు పట్టుకు న్నాడంటే మిగిలిన ప్రపంచం ఏమైపోయినా అక్కర్లేదు.

ఆకలైనప్పుడు ఏదో కతకడం మిగిలిన సమయంలో పడుక్కోవడం. లేస్తే కాళ్ళూ కీళ్ళూ నొప్పులూ. అరవైలో ఎనభై లాగున్నాను. ప్రశాంత్ ఆఫీసులో పని చేసే అతను వచ్చి ఇంటర్నెట్, వెబ్‌కాం అమర్చి వెళ్ళాడు. అతను మాట్లాడించినప్పుడు మాట్లాడి పిల్లల్ని చూశానంతే. తర్వాత బావ ఎంత బ్రతిమాలినా అమూల్య ప్రశాంత్ ఎన్ని సార్లు పిలిచినా కంప్యూటర్ జోలికి వెళ్ళలేదు.

నాకెందుకో కంప్యూటర్ చూస్తుంటే పిచ్చి కోపం వచ్చేస్తుంది. దాని వల్లనే కదూ పిల్లలు దూరమై పోయింది. ఎన్ని కబుర్లు చెప్పింది అమూల్య. సన్నగా కడుపులో మంట. గుండె రేసు గుఱ్ఱంలా పరుగెడు తున్నట్లు భావన. అన్యాయం జఱిగిపోయిందన్న అవేదన.

కాంప్లెక్సులో ఎంతమందున్నా హాయ్, బై తప్పితే మూడో మాట మాట్లాడరు. అందరూ ప్రశాంత్ వయసు వాళ్ళు. వాళ్ళున్నప్పుడు వీకెండ్ పార్టీలూ అవి, వాళ్ళతో పాటు మేమూ. ఆ తరువాత రెండు మూడు సార్లు పిలిస్తే వెళ్ళాం కానీ మాకే ఎబ్బెట్టుగా అనిపించింది. అర్ధరాత్రి భోజనాలూ. గట్టి గట్టిగా గుండెలదిరేలా పాటలూ, మాటలూ, మాకర్థంగాని కంప్యూటర్ భాషలో

సంభాషణలూ! వెర్రి మొహాలేసుకుని చూడలేక మానేశాం. మరీ మంచిదనుకున్నారు కుర్రాళ్లు. అలా జనం మధ్యలో వంటరి బ్రతుకు. కొంత కాలానికి నాకూ ఇంట్లో సోఫాకీ తేడా తెలీకుండా పోతుందనుకున్నారేమో, బావ మా క్లాస్ మేట్ గౌరిని ఫోన్ జేసి పిలిచారు. తను సైకియాట్రిస్టు వస్తూనే బొకేతో బాటు చీవాట్లు కూడా తీసుకొచ్చింది.

"సీతా! ఇలా ఐపోయావేంటి! నాకు ఒక్క ఫోను చెయ్యలేకపోయావా? అందుకే అంటారు చదువుకున్న వాడికంటే చాకలాడు మేలని. అన్నేళ్ళు చదివిన చదువేమైంది? ఈ ఊళ్ళో నువ్వు కూడా ఎంతో మందికి కౌన్సిలింగ్ చేసుంటావు కదా!" ఆపకుండా అరగంట వాయించి, వెళ్తూ వెళ్తూ రోజూ తన క్లినిక్కి పొద్దున్న, సాయంత్రం రెండేసి గంటలు రమ్మంది.

"నాకూ వయసుతో పాటు పేషంట్స్ ఎక్కువై పోతున్నారు. కాస్త అసిస్ట్ చేద్దువు గాని. తప్పకుండా రా! రేపట్నించి కారు పంపిస్తాను"

"అక్కర్లేదు గౌరీ! మా డ్రైవర్ ఉత్తినే జీతం తీసుకుంటున్నాడు. నేనే వస్తాలే" కుంటుకుంటూ లేచి సాగనంపాను. అప్పట్నించీ కాస్త మనుషుల్లో పడ్డాను. గౌరి దగ్గరకొచ్చే పేషంట్స్‌ని చూస్తుంటే వాళ్ళ సమస్యల్ని వింటుంటే నాకు జరిగిందనుకుంటున్న అన్యాయం ఎంత చిన్నదో అర్థమైంది. పుట్టిన ఇద్దరూ డౌన్ సిండ్రోం (మానసికంగా భౌతికంగా ఎదగలేని) పిల్లలైతే పరిస్థితులు ఎదుర్కోడానికి కౌన్సిలింగ్‌కి వచ్చిందొక మాతృమూర్తి. దగ్గర దగ్గర ఇరవై సంవత్సరాల నుంచీ, భర్త అంతా తన తప్పే ఐనట్లు ప్రవర్తిస్తుంటే, ఒంటరిగా దేముడితో పోరాడి అలసి పోయింది. ఇద్దరూ మొగ పిల్లలవటం కొంత నయమే. కానీ బలం పెరిగి ఒక్కో సారి వాళ్ళు చేసే చేష్టలు అడ్డుకోలేక నిస్త్రాణతో పడిపోతుంది. డబ్బుకి లోటు లేదు కనుక బలమైన మేల్ నర్సుని పంపించి, ఆవిడకి బలానికి మందులిచ్చి, కొంత వేదాంతం బోధించి పంపించాం.

అప్పట్లో ఇంకా ఏమ్నియో సింథసిస్ పరీక్షలు ప్రాముఖ్యం వహించలేదు. ఇప్పుడైతే నెల తప్పగానే క్రోమోజోం పరీక్షల్లో తెలిసిపోతోంది. వెంటనే టెర్మినేట్ చేసేస్తున్నారు.

ఇంకో పేషంటు. ముగ్గురు పిల్లల్ని వదిలి భర్త వేరే అందమైన పిల్లతో వెళ్ళిపోతే దిక్కు తోచక, పిచ్చెక్కినంత పనై, పిల్లల కోసం మనసుని అదుపులో పెట్టుకోవాలని. పెట్టుకోలేక క్షోభతో వచ్చిన నడి వయసు అబల. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. తనని వుమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌కి పంపి కాంపెన్సేషన్‌గా భర్త జీతంలో సగం వచ్చేలాగా చేసి, మాకు తెలిసిన హాస్పిటల్లో రిసెప్షనిస్టుగా వేయించాం.

అలా ఎన్ని గాథలో. మా దగ్గరికి ఎక్కువ ఆడ పేషంట్లు వస్తారు. అందుకనే మొగవాళ్ళ కష్టాలు తెలియవు మాకు. వాళ్ళవి ఇంకా విచిత్రమైన ప్రాబ్లమ్సని చెప్తారు మా మంత్లీ డాక్టర్స్ మీటింగ్స్‌లో.

గౌరి చెప్పినట్లు ఆరునెలల్లో బాగా కోలుకున్నాను. కానీ మనసులో గాయం అలానే ఉండిపోయింది. ఎంత సర్ది చెప్పుకున్నా, బావ ఎన్ని సార్లు పిలిచినా కంప్యూటర్ దగ్గరికి మాత్రం వెళ్ళ లేదు. వారానికోసారి ఫోన్లో ముక్తసరిగా మాట్లాడుతున్నాను. అదీ తప్పనిసరిగా. అమూల్య పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉంది.

........

"అమ్మా! ఏంటిది?" కన్నీళ్ళతో తన భుజం తడిపేస్తున్న నన్ను మెల్లగా సోఫా దగ్గరికి నడిపించి తీసుకెళ్ళి కూర్చోపెట్టింది అమూల్య. వెక్కుతున్న నన్ను చూసి బుజ్జిగాడు బిత్తర పోయాడు. పాప వాళ్ళమ్మ ఒళ్ళో దూరి పోయి మమ్మల్నిద్దరినీ వింతగా చూస్తోంది.

"మాం! మేం వచ్చేశాం కదా. ఇంక ఎక్కడికీ వెళ్ళం. నిజం. మదర్ ప్రామిస్". ప్రశాంత్ నా కాళ్ళ దగ్గర కూర్చుని నా మోకాళ్ళ మీద తల ఆన్చాడు.

"అమ్మా! మీరిచ్చిన షాక్ ట్రీట్‌మెంట్ బాగా పని జేసింది. ప్రశాంత్ చాలా మారాడు. ఎంత సౌమ్యం. శాంతం వచ్చాయో మీరే చూస్తారుగా! అమెరికాలో అన్ని పనులూ మేమే చేసుకోవలసి రావడం, ఎవరూ పాంపర్ చేసే వాళ్ళు లేకపోవడం కొంత కారణమైతే. ఈ రెండేళ్ళూ మీరు మమ్మల్ని దూరంగా ఉంచడం" మాట రానట్లు ఆగిపోయింది అమూల్య.

"మమ్మల్ని ఎంత సతాయించావో అంతకి పది రెట్లు నువ్వు బాధ పడి ఉంటావని నాకు తెలుసమ్మా! అందుకే అమెరికా నుంచి నీకు మంచి గిఫ్టు తెచ్చాం. చూశావు కదా! ఈ సారి ట్విన్స్. నీ పేరూ, నాన్నగారి పేరూ నిర్ణయించేశాం." నిర్ణయం అని వత్తి పలుకుతూ అన్నాడు ప్రశాంత్ నవ్వుతూ.

భారంగా సోఫా లోంచి లేచి వంటింట్లోకి వెళ్తున్న అమూల్యని చూసి కళ్ళ నిండా నీళ్ళతో నవ్వాను.

.......

"అమ్మదొంగా! ఇవాళ వీళ్ళు వస్తున్నట్లు మీకు తెలుసు కదా!" రాత్రి బావ ప్రక్కన పడుక్కుని నిష్టూరంగా అన్నాను.

"నువ్వు వాళ్ళ గురించి ఏంచెప్పబోయినా వినట్లేదు కదా. ఏంచెయ్యను. ఇప్పుడు తృప్తిగా ఉందా నీకు. ఐనా నీ కళ్ళలో ఏదో సందేహం, సంకోచం కనిపిస్తున్నాయి" నా మొహంలోకి చూస్తూ అన్నారు.

"అదే అమూల్య గురించి. అమెరికా నుంచి" ఆపేశాను, బావ వడిలోకి ముడుచుకు పోతూ.

"ఊ! అమెరికా నుంచి".

"అంటే. నేను ఇన్నాళ్ళూ అందరినీ ఫామిలీ ప్లానింగు చేయమని, అందరికీ ఆపరేషన్లు చేయించి. ఇప్పుడు నా పిల్లలే."

"అదా? పరవాలేదులే. అంత గిల్టీగా ఫీలైపోక్కర్లేదు. నువ్వు ఒక్కణ్ణే కని ఆదర్శమయ్యావు కదా" బావ పకపకా నవ్వుతూ నా నుదురు చుంబించారు.

# ముని మాణిక్యం రచనల్లో హాస్యం, చమత్కారం

*- చింతపల్లి గిరిజా శంకర్*

హాస్యం అంటే నిర్వచనం పెద్దలు పలు రకాలుగా చెప్తారు. హాస్యం పుట్టించడం ఎన్ని రకాలుగా చెయ్యవచ్చో అలాగే హాస్యాన్ని వెల్లడించడం (Expression) కూడా రకరకాలు చెయ్యవచ్చు. కిందా మీదా పడి కడుపు పట్టుకుని నవ్వడం, పక్క వాడి వీపు చచ్చేటట్టు బాదడం దగ్గర్నుంచి, చిరు మందహాసం దాకా రకరకాలుగా వెల్లడించవచ్చు. అరవ సినిమాల్లో తంగవేలు వాళ్ళు హైరానా పడి మన్నల్ని అలసింప జేస్తారు. అలా కాకుండా verbal humour మాటల విరుపుడులో వచ్చే హాస్యం అంటే ముళ్ళపూడి వెంకట రమణ"వాడేవడో కారులోకి" భయ "పడ్డాడు" అంటాడు. అలా కాకుండా ఇంకో రకం audio visual హాస్యం, situation బట్టి తయారు చేసేది. పాతాళ భైరవి సినిమా లో రేలంగి రాజ కుమారి కోసం తపిస్తుంటే "మాంత్రికుడు విగ్రహం తేరా రాకుమారితో వివాహం చేయిస్తాను" అంటాడు. విగ్రహం వచ్చాక "తూర్పుగా తిరుగూ రాజ కుమారిని జపం చేయి" అంటాడు. అంటే "తూర్పుకి తిరిగి దండం పెట్టు" అనే నానుడిని ఒక situation comedyగా మార్చారు. ఇవెందుకు చెప్తునానంటే ఇలాంటి హాస్యాన్ని మాటలతో పుస్తకాల్లో చదువుకుని situation ఊహించుకుని enjoy చేసేటట్లు రాసిన కవులు కొంత మంది ఉన్నారు. అందులో ఇరవయ్యో శతాబ్దం పూర్వార్ధంలో వచ్చిన కవుల్లో ముని మాణిక్యం ముఖ్యులు.

హాస్యం నవరసాల్లో ఒకటైనప్పటికీ మన పురాతన తెలుగు సాహిత్యంలో దీనికి ప్రాముఖ్యత కనబడదు. భారతం భాగవతం రామాయణం ఇంకా ఇతర ప్రబంధాలూ పురాణాల్లో కరుణ వీర భయ భక్తి వగైరాలకున్న ప్రాముఖ్యత లేదు. ఈ రోజుల్లో కూడా మన పుస్తకాల్లో సినిమాల్లో tragedy కి ఉన్న weight (బరువు ) attraction హాస్య రసానికి లేదు. మన సినిమాల్లో హీరో కానీ హీరోయిన్ కాని చచ్చి పోతే జనం తండోపతండాలుగా చూస్తారు. ఇక దేవదాసు, పార్వతి యిద్దరూ చస్తే super hit. తెలుగు సాహిత్యంలో హాస్యం నా ఉద్దేశంలో "కన్యాశుల్కం" లో ప్రారంభ మైంది. ప్రతాపరుద్రీయంలో కూడా ఉంది. అంత దాకా ఈ హాస్య రసం కనబడదు. మన సామెతలు చూడండీ "నవ్వు నాలుగు విధాల చేటు", "నవ్వే ఆడదాన్ని నమ్మ రాదు",

నవ్వకుమీ సభ లోపల
నవ్వకుమీ తల్లి తండ్రి నాథుల తోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ

అన్నాడు సుమతీ శతక కారుడు.

అసలు నవ్వు పరిపరి విధాల ఆరోగ్యదాయకం అని scientists ప్రమాణ పూర్వకంగా ఋజువు చేశారు. నవ్వినప్పుడు తక్కువ muscles వాడ్తాము ఏడ్చి నప్పుడు కన్నా. Psychiatry లో నవ్వు మానసిక బాధలని తగ్గిస్తుందని laugh therapy వాడ్తారు. శారీరిక రోగాలను కూడా నయం చేస్తుందని Anatomy of an Illness అనే పుస్తకంలో Norman Cousins examples తో బలపరుస్తారు.

అటువంటి ఆరోగ్యకరమైన హస్యాన్ని మునిమాణిక్యం గారు ఆయన కథల్లో అందించారు. ముని మాణిక్యం నరసింహారావు గారినీ కాంతంగారినీ నేనెప్పుడూ చూడలేదు మాట్లాడలేదు - ఐనా వారు నాకు చిరపరిచితుల్లాగా బంధువుల్లాగా అనిపిస్తారు. అదీ - ఆయన రచనల్లో గొప్పతనం.

రోజువారీ దైనందిన జీవితంలో ఉండే కష్టాలు, నష్టాలు, పురుళ్ళు, పుణ్యాలు, ఇత్యాది రోజువారీ భవసాగర మధనంలో మధ్య తరగతి కుటుంబ జీవితా లలో రోజూ జరిగే రామాయణానికి నేపధ్య సంగీతలా అన్వయించి రాశారు. "కాంతం కథలు, నేనూ మా కాంతం, తిరు మాళిగ, రుక్కు తల్లి స్తుతి, ఆత్మ స్తుతి, దాంపత్యోపనిషత్, హాస్య కుసుమావళి, గృహప్రవేశం, దీక్షితులు" లాంటి ముని మాణిక్యం రచనలు ఎవ్వరైనా మరచి పోగలరా? కాంతం అయస్కాంతంలా ఎవరిని ఆకర్షించలేదూ? కాంతం పేరు తెలియని తెలుగు కథా పాఠకుడు ఎవ్వరైనా ఉంటారా?

కమ్మని కాపురం చేయడానికి భార్య వైజయంతీ మాల లాగానో వహీదారెహమాన్ లాగానో ఉండక్కర్లేదనీ సంసార పక్షంగా ఉండే సాధారణ స్త్రీలు కూడా ఆకర్షణా ఆత్మీయతా చెలాకీతనం చిలిపితనం సరస సల్లాపాలు వగైరా రసాలన్నీ రంగరించి సంసార జీవితం

స్వర్గమయం చేయగలరని నిరూపిస్తాయి ఈయన కథలు. అలాగే భర్త నలకూబరుడూ, అక్కినేని నాగేశ్వర రావూ కానక్కర్లేదనీ బడి పంతులు ఉద్యోగం చేస్తూ శృంగార వీరుడై Oscar అందుకోవచ్చునని నిరూపిస్తాయి. ఈయన కథలు చదువుతూంటే "అబ్బా పెళ్ళైతే ఇంత బాగుంటుంది కామోసు" అనుకుని పెళ్ళి చేసుకున్న యువకులు యవతులు లేకపోలేదు. పారిజాతాప హరణంలో కృష్ణుడు సత్యభామ చూపిన ప్రణయ కలహాలూ సమాధానాలూ అన్నీ కాంతం కథల్లో తేట తెనుగులో అందరికీ అర్ధమయ్యేలా కనిపిస్తాయి. అవి చదువుతూంటే కథ చదువుతున్నట్లు ఉండదు మనమే - అనుభూతిని ఆస్వాదిస్తున్నట్లు ఉంటుంది.

ముని మాణిక్యం కథల్లో ఆలు మొగల అనుబంధం ఒక ఎత్తు, Self effacing humour ఇంకొక ఎత్తు. ఇందులో మనం గుర్తు పెట్టుకోవాల్సిన అంశాలు రెండు. ఒకటి భర్త సాహిత్యాభిలాష కలిగిన స్కూలు టీచరు - నల్ల బ్రాహ్మడు. భార్య ఐదవ తరగతి కూడా చదవని బాల్య వివాహిత, సదరు సగటు గృహిణి, నలుగురు పిల్లల తల్లి.

ఉదాహరణకి ఒక రోజు కాంతం అమ్మలక్కలతో వరాండాలో కబుర్లు చెప్పతుంటుంది, ఇంతలో ఎవరో మగవాడు వస్తుంటాడు. అందరూ లేచి ఇంట్లోకి పోబోతుంటారు. అప్పుడు కాంతం ఆయన్ని పరీక్షగా చూసి, "అరే ఎవరో పెద్ద మనిషనుకున్నాను, మన చిట్టి ప్రైవేటు మాష్టారే" అని అందరూ కూర్చుని కబుర్లు.

ఇంకొక కథలో అర్ధరాత్రి పెరట్లో శబ్దమైతే ఇద్దరూ వెళ్తారు ఏమిటో చూదామని. పెరట్లో ఒక దొంగ గొయ్యి తవ్వుతూంటాడు. "ఏమైటి నాయనా తవ్వు తున్నావూ" అంటాడు బడి పంతులు. "నగల కోసం" అంటాడు దొంగ. బడిపంతులింట్లో నగలా? తవ్వు నాయనా తవ్వు ఏమైనా దొరికితే చెరి సగం పంచుకుందాం" అంటాడు. బతకలేక బడిపంతులైనా self effacing subtle humour కి ఒక తార్కాణం.

అలాగే తమ రంగు గురించి మన దేశంలో అందునా మదాంధ్రులకి (సవర్ణ దీర్ఘ సంధి) మన చర్మ సౌందర్యం ఎంత ముఖ్యమో చెప్పనక్కర్లేదు. ఐతే (by self report) ఈయన నల్లని వాడు. అందునా బ్రాహ్మణుడు (నల్ల బ్రాహ్మణ్ణి నమ్మ రాదు). ఒక సారి ఈయనా ఇంకో పంతులు గారూ నదిలో స్నానానికి వెళ్తారు. ఐతే ఆ రోజుల్లో కులరీత్యా స్నానఘట్టాలుండేవి. హెచ్చు కులాల వాళ్ళు చేసే చోట మిగిలిన కులాల వారు చేయకూడదు. ఇంతలోకి కొంత మంది ఆడా మగా బ్రాహ్మలు వచ్చి "ఇదిగో చూడబ్బాయి ఇది బ్రాహ్మలు చేసే గట్టు, అంటరాని వాళ్ళు ఇక్కడకు రాకూడదు" అంటారు.

అలాగే కాంతానికి తనమొగుడు తెలివి తక్కువ వాడనీ, బేరం తెలియదనీ ఏ వస్తువైనా నాసి రకం తెస్తాడనీ గట్టి నమ్మకం (చాలా మంది ఆడవాళ్ళ లాగా) ఒక రోజు దోసకాయలు తెస్తాడు మార్కెట్ నుంచి. "అబ్బే ఏమి దోసకాయలివి,ఇంత మెత్తగా ఉన్నాయి", అంటుంది కాంతం. "బేరం చేసి చవగ్గా కొన్నాను, ఎండబెట్టే గట్టి పడ్తాయంది పుల్లమ్మ" అంటాడు. ఇందులో ఈయన అమాయకత్వం, గడుసుతనం, చమత్కారం teasing ఇత్యాది ఎన్నో రసాలు చూడవచ్చు. అది కూడా ఆయన self effacing humour కి తార్కాణం.

అలాగే కాంతంలో చమత్కారం కనబడే కథ. ఇల్లు కట్టుకుందామని ఈయన ఊహాగానాల్లో ఉంటాడు. షరా మామూలే. ఆమె "చిల్లర కొట్టు బాకీ మూణ్ణెల్ల నుంచీ తీర్చలేదు మన బతుక్కి ఇల్లేంపెట్టి కొందామని" second opinion అడక్కుండానే వేయిస్తుంది. "బాంకులో అప్పు చేసి" అంటాడీయన. అప్పుడామె "వెనకటికొకాయన అన్నాట్ట తమలపాకులు కాసిని ఏ వెధవైనా ఇస్తే బాగుణ్ణు తాంబూలానికి, వక్కలకి ఏమి భాగ్యం ఏ వెధవనడిగినా రెండిస్తాడు, సున్నం గోడ గిల్లి రాసుకోవచ్చు" ఆవటా అంటుంది.

ఆయన హాస్యంలో ఒక ముఖ్య విషయం ఏమిటంటే అందులో ప్రయాగ సంగమంలో సరస్వతీ నది లాగా శృంగారం నిక్షిప్తమై ఉంటుంది. అందుకని కలహాలు అంత ఆహ్లాదకరంగా ఉంటాయి. ఉదాహరణకి ఒక చోట "మా ఆవిడ ముడిలోని ఎఱ్ఱి మందార పుష్పం ఒంటరిగా ఉండి నా వంక కొర కొరా చూసింది" ఆహా ఏమి వర్ణన! కాంతం యొక్క ప్రణయంతో కూడిన కోపాన్ని సూచించేందుకు ఎఱ్ఱని మందార పుష్పం తీసుకున్నాడు. అందులో పుష్పం కాంతం తలలో వంటరిగా ఉందట - అంటే కాంతం యొక్క కోపతీవ్రత తన మనస్సులో ఎంత వేదన కలిగిస్తూందో అని భావం.

అలాగే ఇంకొక రోజు తనూ ఇంకో తెలుగు మాష్టారూ ఊరెళ్దామని ప్లాట్‌ఫారమ్మీద పాసెంజరు బండి కోసం ఎదురు చూస్తుంటారు. ఆ ఊళ్ళో రైలు ఆగదు. ఆ రెండో పండితునికి కొంచెం అహంభావం

తను పండితుణ్ణని. ఇంతలో రైలు రయ్యిమని దూసుకు పోతుంది ఇక్కడ ఆగకుండా వీళ్ళ మొహాన బొగ్గూ గాలీ వెదజల్లి. అప్పుడా రెండో పంతులు "ఏంత పొగరు ఈ రైలుకీ" అంటాడు. ఆయన రచనలన్నీ శరద్రాత్రులే, అన్నీ ఆంధ్రా పకోడీలే. ఇలా చెప్పుకుంటూ పోతే మూడు రోజులు గూడా చాలదు. ఆయన రచనల్లో బాగు లేనివి లేవు.

చివరి ఉదాహరణ ఈయన పుస్తకాలు చదివి ఈయన దాంపత్య జీవితంలో expert అని భ్రమసి ఒక పెద్దాయన ఈయన్ని తన సంసార బాధలకి సలహా అడగడానికి వస్తాడు. అదే "బద్‌నసీహత్" అనే కథ. ఈయన కథలన్నీ ఎంత సజీవంగా ఉంటాయో ఎంత convincing గా ఉంటాయో అన్న విషయ నిర్ధారణకి ఈ కథ ఒక తార్కాణం.

ఆయన సంసారం ఎల్లప్పుడూ మల్లె పందిరి ఔనో కాదో మనకు తెలియదు. ఐతే ఆయన కాంతంల ప్రేమ మాత్రం అపురూపమైనదని తెలియపరచటానికి ఈ కింద వర్ణన చూడండి ఒక ప్రణయ కలహం చల్లారిన తరువాత.

"పదకొండు గంటలు కొట్టటంతోనే పట్టు బట్ట కట్టుకుని భోజనానికి తయారయ్యాను. ఇల్లు స్వర్గంలా ఉంది. కాంతం ముఖం కార్తీక జ్యోత్స్నలను వెదజల్లు తున్నది. దుఃఖమేఘములు పటాపంచలై పోయినాయి. చెంబులు తెల్ల బడి వెండి చెంబుల వలె మెరుస్తున్నై. బట్టలు పువ్వుల్లాగా ఉతికి పెట్టింది. ఇల్లు అద్దం లాగా ఉంది. దేవతా సహాయం వల్ల జరిగిందా ఇదంతా లేక మాయా అనిపించింది. వంట చక్కగా చేసింది. ముకుళిత కుసుమము వాయు చుంబనం చేత వికసించింది. చిరు కెరటాలను మలయ పవనుడు ముద్దెట్టుకుంటే అవి సంతోషంతో ఎగురుతున్నాయి. వసంతునిచే ముద్దిడబడి పుష్పచయమంతా వికసిస్తున్నై". అటువంటి భర్తని పొందిన కాంతం ధన్యురాలు.

"పరమాహ్లాదకరమైన కుటుంబ జీవితేతివృత్తాన్ని కథగా చెప్పిన మనస్విముని మాణిక్యం. రెండు ప్రపంచ యుద్ధాల నడిమి కాలంలో సాహిత్య సిద్ధాంతాల పేరిటా రాజకీయ ఉద్యమాల పేరిటా అస్తవ్యస్తంగా గందర గోళంగా ఉన్న తెలుగు సాహిత్యంలో ఒయాసిస్సు గానూ వెన్నెల రాత్రి గానూ ఆయన కథలు దర్శనమిస్తాయి. - ఆయన కథలన్నీ శరద్రాత్రులే" అని మానసా పబ్లికేషన్స్ వారు వారి పీఠికలో రాశారు.

ముని మాణిక్యం నిజంగా మన మాణిక్యం. తెలుగు కథా రచనాధుని మాణిక్యం. కాంతం గారి మణి మాణిక్యం. కర్మయోగిగా పరిపక్వం చెందిన "ముని" మాణిక్యం.